
'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి. దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 241

శుక్రవారం 22-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఎవరిదో శుభారంభం!

పెర్త్‌లో నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య తొలి టెస్టు - 17లో



అదానీ ప్రకంపనలు

ప్రాజెక్టుల కోసం లంచాలిచ్చినట్లు అమెరికాలో అభియోగాలు - 17లో



మోదీకి అరుదైన గౌరవం

మోదీకి అరుదైన గౌరవం దక్కింది. గయానా, డొమినికా దేశాలు ఆయనను తమ అత్యున్నత జాతీయ పురస్కారాలతో సత్కరించాయి.


- వివరాలు 6లో▶



ఈ అరటి పండు రూ.52 కోట్లు!

ఓ అరటిపండును ఒక ఫ్రేమ్‌కు గట్టి టేప్‌తో అతికిస్తే ఔత్సాహిక కళా ప్రేమికుడు దాన్ని ఏకంగా రూ.52 కోట్లు పెట్టి కొన్నాడు?!

- వివరాలు 6లో▶



సంజయ్‌మూర్తి ప్రమాణం

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)గా తెలుగు అధికారి కొండ్రు సంజయ్‌మూర్తి బాధ్యతలు స్వీకరించారు.

- వివరాలు 6లో▶



ఉక్రెయిన్‌పైకి ఖండాంతర క్షిపణి

ఉక్రెయిన్ ఊహించని దాడిని ఎదుర్కొంది. తొలిసారిగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ఉక్రెయిన్‌పైకి రష్యా ప్రయోగించింది.

- వివరాలు 6లో▶

మిల్లర్లపై ఉక్కుపాదం

ధాన్యం మిల్లింగ్ చేయబోమంటే కుదరదని స్పష్టం చేసిన సర్కారు

- కేటాయించిన ధాన్యం దించుకోవాల్సిందే.. మిల్లింగ్ చేయాల్సిందే
- బ్యాంక్ గ్యారంటీలు ఇచ్చేందుకు ససేమిరా అంటున్న మిల్లర్లకు సర్కార్ స్పష్టీకరణ.... మిల్లు సామర్థ్యంలో 50 శాతం మేర సీఎంఆర్ తప్పనిసరి.. లేదంటే మిల్లును సీజ్ చేసే అధికారం
- 2015 నాటి ప్రభుత్వ ఉత్తర్వులు, 2023లో వెలువడిన సవరణ జీవోలు తెరపైకి.. దిగివస్తున్న మిల్లర్లు.. బ్యాంకు గ్యారంటీలు ఇచ్చేందుకు 2,054 మంది సంసిద్ధత
- గతంలో రూ.602 కోట్ల విలువైన బియ్యాన్ని ఎగవేసిన 362 మంది మిల్లర్లు... రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ఆస్తుల జప్తుకు ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైస్ మిల్లర్లపై సర్కారు ఉక్కుపాదం మోపుతోంది. పైసా పెట్టుబడి లేకుండా ఏటా కోట్ల రూపాయలు సంపాదిస్తూ కూడా, సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్) చేసేందుకు వెనుకాడుతున్నారంటూ.. మిల్లులపై కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ప్రభుత్వం పెట్టే నిబంధనల మేరకు ప్రతి రైస్ మిల్లు పనిచేయాలని.. లేకుంటే మిల్లు సీజ్ చేయడానికి కూడా వెనకాడబోమని స్పష్టం చేసింది. ప్రతి మిల్లు సామర్థ్యంలో 50 శాతం మేరకు ధాన్యం అప్పగించి, తప్పనిసరిగా మిల్లింగ్ చేసేలా నిబంధన పెట్టింది. బ్యాంకు గ్యారంటీ ఇవ్వలేమంటూ తప్పించుకునే పరిస్థితి లేకుండా చర్యలు చేపట్టింది. కోట్ల రూపాయల విలువైన కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయిపడ్డ డిఫాల్ట్ మిల్లర్ల ఆస్తులను రెవెన్యూ రికవరీ చట్టం కింద జప్తు చేయాలని నిర్ణయించింది. ఆయా మిల్లుల ఆస్తులను ఇతరుల పేర్లపైకి బదలాయించే అవకాశం లేకుండా ముందు జాగ్రత్తగా రిజిస్ట్రేషన్ శాఖను అప్రమత్తం చేసింది.

మిల్లర్ల ఇష్టారాజ్యానికి చెక్!

రాష్ట్రంలో పెరిగిన ధాన్యం దిగుబడి, మిల్లింగ్ సదుపాయాల కొరతను ఆసరాగా చేసుకొని.. మిల్లర్లు కొన్నేళ్లుగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మిల్లింగ్ కెపాసిటీతో సంబంధం లేకుండా సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయింపులు, ఏళ్లకేళ్లు గడిచినా బియ్యాన్ని అప్పగించకపోవడం, మిల్లు ల్లో ధాన్యం లేకపోవడం.. వంటి అవకతవకలతో పౌర సరఫరాల సంస్థ తీవ్ర నష్టాలను చవిచూసింది. దీనితో 2014–15లో రూ.4,747 కోట్లుగా ఉన్న

మిగతా 12వ పేజీలో ▶

బ్యాంక్ గ్యారంటీ తీసుకునే ధాన్యం కేటాయింపులు

రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కొనుగోలు చేసి... కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం మిల్లులకు పంపుతుంది. మిల్లర్లు మూడు నుంచి ఆరు నెలల్లోగా ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి... వచ్చిన బియ్యాన్ని సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంటుంది. ఇలా ధాన్యం తీసుకున్న చాలా మిల్లులు ఏడాదిన్నర, రెండేళ్లయినా బియ్యం తిరిగివ్వని పరిస్థితి. 2022–23 రబీ సీజన్‌లో మిల్లులకు కేటాయించిన 65 లక్షల టన్నుల ధాన్యంలో.... సుమారు 30 లక్షల టన్నులను మిల్లింగ్ చేసి, బియ్యాన్ని మార్కెట్లో అమ్మేసుకున్నారు. అందులో 25 లక్షల టన్నుల మేర రికవరీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లు పిలిచినా ఫలితం లేకుండా పోయింది. ఆ బకాయిల విలువ రూ.7 వేల కోట్లుగా లెక్కగట్టగా.. ఇప్పటివరకు రూ.3 వేల కోట్ల వరకు మాత్రమే రికవరీ అయ్యాయి. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం కేటాయించే ధాన్యానికి సంబంధించి మిల్లర్ల నుంచి కొంత మేర బ్యాంకు గ్యారంటీలు తీసుకుంటోంది. మిల్లులకు వాటికి సామర్థ్యానికి తగిన మేరకే ధాన్యాన్ని కేటాయిస్తోంది.



భక్తి టీవీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తోన్న కోటి దీపోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం, పూరీ జగన్నాథుని కల్యాణంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. అంతకుముందు ఆమె పూరీ జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరికీ హారతి దర్శనం చేసిన అనంతరం అఖండజ్యోతి వెలిగించారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క తదితరులు ముర్ము వెంట ఉన్నారు.

ఇది అసత్యంపై సత్యం గెలిచిన వేడుక 2లో

మళ్లీ మూలాల్లోకి వెళ్లాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు

- సంప్రదాయాలను తిరిగి ఆచరించాలి.. మన భాషలను ప్రోత్సహించాలి
- 'లోక్‌మంథన్–2024'లో భాగంగా ఎగ్జిబిషన్ ప్రారంభం
- అన్ని అనర్థాలకు సంస్కృతి ధ్వంసమే కారణం: మంత్రి జూపల్లి కృష్ణారావు
- పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు
- నేడు 'లోక్ మంథన్ భాగ్యనగర్–2024' రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభం

2లో

న్యూస్‌రీల్

పీజీ మెడికల్ ప్రవేశాలకు 'స్థానికత' బ్రేక్



తెలంగాణ విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేస్తే వారు తెలంగాణలో జరిగే పీజీ మెడికల్ అడ్మిషన్లలో స్థానికేతరులు అవుతుండటంతో వివాదం నెలకొంది. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియకు బ్రేక్ పడింది.

- వివరాలు 12లో▶

స్థానిక సమరానికి సిద్ధంకండి



స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ యంత్రాంగం సిద్ధం కావాలని టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం పిలుపునిచ్చింది. ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా క్షేత్రస్థాయి నుంచి కేడర్ కార్యోన్ముఖులు కావాలని కోరింది.

- వివరాలు 2లో▶


లగచర్ల ఘటన ఆందోళనకరం



'లగచర్ల' ఘటనలో అరెస్టులపై జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధిత ఎస్టీలపై జరిగిన దాడి ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది.

- వివరాలు 5లో▶

ఎమ్మెల్యేల అనర్హత అప్పీళ్లపై తీర్పు నేడు



ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీళ్లపై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) ధర్మాసనం తీర్పు వెలువరించనుంది.

- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి



నాకెందుకో వాళ్లు మరో ఉద్దేశంతో ఇచ్చారేమోననిపిస్తుంది సార్!



హరీశ్‌రావు కొన్న భూములపై విచారణ

- కొండపోచమ్మసాగర్ కోసం తొలుత భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చారు
- హరీశ్ రైతుల్ని బెదిరించి భూములు కొన్నాక దాన్ని రద్దు చేశారు
- మీడియాతో మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ దగ్గర రైతులను బెదిరించి అప్పటి మంత్రి హరీశ్‌రావు భూములు కొనుగోలు చేశారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ రిజర్వాయర్ కోసం తొలుత భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేశారని.. దీనివల్ల రైతుల భూములు పోతాయని బెదిరించి హరీశ్ ఆ భూములు కొన్నారని ఆయన ఆరోపణలు గుప్పించారు. హరీశ్ భూములు కొన్నాక

మిగతా 12వ పేజీలో ▶



దమ్ముంటే కబ్జా నిరూపించు..

- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్
- కబ్జాల చరిత్ర రేవంత్ కుటుంబీకులదే
- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమని ధ్వజం

వట్‌పల్లి (అందోల్): రంగనాయక్ సాగర్ వద్ద ఇరిగేషన్ భూములను తాను ఆక్రమించలేదని, రైతుల వద్ద 13 ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. దమ్ముంటే కబ్జాలను నిరూపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. గురువారం అందోల్ మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు

మిగతా 12వ పేజీలో ▶

మళ్లీ పురుగుల అన్నమే..

మాగనూర్ ప్రభుత్వ స్కూల్‌లో మారని తీరు

- ఫుడ్ పాయిజన్ అయిన మరునాడే పురుగుల అన్నం
- విద్యార్థుల ఆందోళన.. అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- డీఈఓ, ఎంఈఓ, ఇన్‌చార్జి హెచ్‌ఎంలపై సస్పెన్షన్ వేటు
- ఆర్డీఓ, ఎంపీడీఓ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు

18లో



'నా విజయం నీదే'...



కానిస్టేబుల్‌గా శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా ఆత్మీయులతో ఆనందాన్ని పంచుకున్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 19 శిక్షణ కేంద్రాల్లో వివిధ విభాగాలకు చెందిన 8,047 మంది కానిస్టేబుళ్లు 9 నెలల శిక్షణ పూర్తి చేసుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్, వరంగల్‌లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన పరేడ్‌లో తన బంధువుతో ఆనందాన్ని పంచుకుంటున్న ఓ మహిళా కానిస్టేబుల్.

- వివరాలు 3లో

క్లుప్తంగా...

డిసెంబర్ 21న ఓయూలో కృతజ్ఞత సభ

పోస్టర్ ఆవిష్కరించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సంపత్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలన ప్రారంభమై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా.. డిసెంబర్ 21వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో కృతజ్ఞత సభ నిర్వహించనున్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ నేతృత్వంలో ఓయూ ఎన్ఎస్‌యూఐ కమిటీ సహకారంతో జరగనున్న ఈ సభ పోస్టర్‌ను గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన వచ్చిన తర్వాత 54వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్, ఓయూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మీడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 4 లేదా 5న కాంగ్రెస్ భారీ సభ

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక రాక?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 4 లేదా 5 తేదీల్లో భారీ సభ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. హైదరాబాద్ శివార్లలో నిర్వహించ తలపెట్టిన సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హాజరయ్యే అవకాశాలున్నాయని గాంధీభవన్ వర్గాల సమాచారం. సభ నిర్వహణ తేదీని త్వరలోనే ఖరారు చేస్తామని, రాహుల్, ప్రియాంకలలో ఒకరు సభకు హాజరయ్యే అవకాశముందని టీపీసీసీ ముఖ్య నేత ఒకరు 'సాక్షి'కి వెల్లడించారు.

ఢిల్లీ మద్యం కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. గురువారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి భవేజా కేసు విచారణ చేపట్టారు. ఎమ్మెల్సీ కవితతో పాటు, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా తదితరులు వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. కవిత తరఫున న్యాయవాది మోహిత్ రావు హాజరై.. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ సరిగ్గా లేదని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చార్జిషీట్ సరిచేసి మరోసారి న్యాయస్థానానికి, ప్రతివాదులకు అందజేయాలని సీబీఐని న్యాయమూర్తి ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు.

పంచాయతీల్లో 26న ప్రజా పాలన విజయోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా.. అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు.. ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,750 కోట్లతో వివిధ పనులు చేపట్టనున్నారు. పీఆర్ ఆర్డీ శాఖ ద్వారా ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా (పశువుల పాకలు, కంపోస్ట్ గుంతలు, కోళ్ల ఫారాలు), పొలం బాటలు (వ్యవసాయ పొలాలకు బాటలు), నర్సరీలు, జలనిధి (చెక్‌డ్యామ్‌లు, కుంటలు), గ్రామీణ మౌలిక వసతులు (సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు) తదితర పనులను చేపట్టనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ పనులను ప్రారంభించాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణ నిధులతో పనులు ప్రారంభించనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పనులను ప్రారంభించి మార్చి 2025 చివరికల్లా పూర్తి చేయనున్నారు. ఈ నేపథ్యంలో.. పనులను చేపట్టడంలో ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేలను భాగస్వాములను చేయనున్నారు.

డిసెంబర్ 7న ఆటోల బంద్

తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేత వెంకటేశం

కాచిగూడ: తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ డిసెంబర్ 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్ నిర్వహించనున్నట్లు జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం ప్రకటించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుండా మోసం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ఆలోచించటం లేదని విమర్శించారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇది అసత్యంపై సత్యం గెలిచిన వేడుక

కోటి దీపోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సాక్షి హైదరాబాద్: అసత్యంపై సత్యం గెలిచిన పండుగ దీపోత్సవం అని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. అజ్ఞాన తిమిరాలను పారద్రోలుతూ జ్ఞాన జ్యోతులను వెలిగించడమే దీపాల ఉత్సవమని చెప్పారు. భక్తి టీవీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవానికి విశిష్ట అతిథిగా రాష్ట్రపతి గురువారం తొలిసారి హాజరయ్యారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. భారీ భక్త జన సందోహం మధ్య అత్యంత కన్నుల పండువగా జరుగుతున్న కోటి దీపోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కార్తీక మాసంలో అందరూ శివుణ్ణి కొలుస్తారని, ఈ మాసంలో వేలాదిమంది భక్తుల సమక్షంలో తెలుగు నేలపై దేశంలోనే గొప్ప వేడుక జరుగుతోందని చెప్పారు. ప్రతి కార్యక్రమాన్ని, వేడుకను దీపాలు వెలిగించి ప్రారంభించడం మన సాంప్రదాయమని ముర్ము తెలిపారు. అందరూ ఒక్కటై దీపాలను వెలిగించడం ఏకత్వాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. కోటి దీపోత్సవంలో భాగంగా యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం, పూరీ జగన్నాథుని కల్యాణంలో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక పూజలు: రాత్రి 7.30 గంటలకు కోటి దీపోత్సవం వేదిక వద్దకు చేరుకున్న రాష్ట్రపతికి రచన టెలివిజన్ జాయింట్ డైరెక్టర్ రచనా చౌదరి తదితరులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల సమక్షంలో పూరీ జగన్నాథుడికి రాష్ట్రపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపారాధన అనంతరం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులందరికీ హారతి దర్శనం చేశారు. ఆ తర్వాత కార్తీక దీపాన్ని వెలిగించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎన్టీవీ అధినేత నరేంద్ర చౌదరి, రమాదేవి దంపతులు ఈ సందర్భంగా రాష్ట్రపతికి వెంకటేశ్వరుడి విగ్రహాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు.

సీఎం ప్రభృతుల ఘన స్వాగతం

ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రాజ్‌భవన్‌కు వెళ్లిన ముర్ము.. ఆ తర్వాత కోటి దీపోత్సవంలో పాల్గొన్నారు. రాత్రికి రాజ్‌భవన్‌లో బస చేశారు.





కోటి దీపోత్సవం కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతో కలిసి జ్యోతిప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో సీతక్క, కిషన్‌రెడ్డి, నరేంద్ర చౌదరి కుటుంబం

మళ్లీ మూలాల్లోకి వెళ్లాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

- సంప్రదాయాలను తిరిగి ఆచరించాలి.. మన భాషలను ప్రోత్సహించాలి
- 'లోక్‌మంథన్–2024'లో భాగంగా ఎగ్జిబిషన్ ప్రారంభం
- నేడు 'లోక్‌మంథన్'ను ప్రారంభించనున్న రాష్ట్రపతి ముర్ము



'లోక్‌మంథన్–2024' ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో డోలు వాయిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మంత్రి జూపల్లి. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: భారతీయులంతా మళ్లీ మూలాల్లోకి వెళ్లి సంప్రదాయాలను ఆచరించాల్సిన అవసరం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ దేశ సంస్కృతి, భాషలు, సాహిత్యం, సంగీతంతోపాటు మాటలు, వాయిద్యాలను మరిచిపోయి ఇంగ్లిష్ వైపు వెళ్లిపోయారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. భారతీయ సనాతన ధర్మం ఎంతో గొప్పదని.. మనతోపాటు జంతుజాలాలను కూడా బతికించుకొనే సంస్కృతి మనదని కొనియాడారు. అందువల్ల తిరిగి మూలాల్లోకి వెళ్లి భారతీయ భాషలను ప్రోత్సహించాలని సూచించారు. జాతీయవాద మేధావుల సమ్మేళనం లోక్‌మంథన్–2024లో భాగంగా హైదరాబాద్‌లోని శిల్పారామంలో ప్రజ్ఞా ప్రవాహ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు రోజుల ఎగ్జిబిషన్‌ను వెంకయ్య నాయుడు గురువారం ప్రారంభించారు. స్టాళ్లలోని పురాతన వాయిద్యాలు, గిరిజనులు ఉపయోగించే సంగీత పరికరాలను తిలకించారు. ఆయనకు ఆయా వాయిద్యాల విశిష్టతను ఆధ్యకళ నిపుణులు ప్రొ. జయధీర్ తిరుమలరావు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకయ్య మాట్లాడారు.

హిందువునని గర్వంగా ప్రకటించుకోవాలి..

చీమకు చక్కెర, పాముకు పాలు, చెట్టుకు బొట్టు పెట్టే పవిత్ర సంస్కృతి హిందువులదని వెంకయ్య నాయుడు తెలిపారు. కానీ బ్రిటిషర్లు సహా విదేశీయుల దండయాత్రలు, దోపిడీల అనంతరం భారతీయులంతా మన మూలాలను మరిచి పాశ్చాత్యం వైపు మళ్లారన్నారు. ఇకనైనా మాతృభాషను, సంస్కృతిని ఆచరించడంలో, హిందువునని ప్రకటించడంలో, మన ప్రాంతాన్ని చెప్పే విషయంలో సిగ్గుపడొద్దని.. అత్యంత గర్వంగా ప్రకటించుకోవాలని వెంకయ్య సూచించారు.

భిన్నత్వంలో ఏకత్వాన్ని తెలంగాణ గౌరవిస్తుంది: మంత్రి జూపల్లి

సకల రోగాలకు.. ఘోర ఘటనలకు కారణం దేశ సంస్కృతి ధ్వంసమేనని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వేష భాషలు వేరైనా భారతీయ ఆత్మ ఒకటేనన్నారు. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చెప్పినట్లు భిన్నత్వంలో ఏకత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు. తెలంగాణలో వివిధ సంస్కృతులు పరిఢవిల్లాయని తెలిపారు. మన సాంస్కృతిక సంప్రదాయాలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. శతావధాని మాడుగుల నాగఫణి శర్మ అనుగ్రహ భాషణం చేశారు. ప్రజ్ఞాభారతి వ్యవస్థాపకులు డా. టి.హనుమాన్ చౌదరి, ప్రజ్ఞా ప్రవాహ్ ప్రధాన కార్యదర్శి నందకుమార్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా 'లోక్ మంథన్'ప్రారంభం

లోక్ మంథన్ భాగ్యనగర్–2024 కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వచ్చే మూడు రోజులపాటు కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యత, సామాజిక సామరస్యం తదితర అంశాలపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ మార్గదర్శనం చేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 2,500 మంది ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

'కాళేశ్వరం'పై మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్

హైదరాబాద్‌కు చేరుకున్న జస్టిస్ పీసీ ఘోష్

- శని లేదా సోమవారం నుంచి ప్రారంభం!
- తొలుత ఐఏఎస్‌లు.. ఆ తర్వాత మాజీ సీఎం, మాజీ మంత్రి విచారణ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై తదుపరి విచారణ ప్రక్రియను నిర్దేశించనున్నారు. ఎవరెవరికి సమన్లు జారీ చేసి, క్రాస్ ఎగ్జామినేషన్‌కు పిలిపించాలో ఈ సమావేశంలో ఆదేశించనున్నట్టు తెలిసింది. శనివారం లేదా సోమవారం నుంచి మూడో విడత క్రాస్ ఎగ్జామినేషన్‌ను కమిషన్ ప్రారంభించే అవకాశం ఉందని చెపుతున్నారు. ఇప్పటికే రెండు విడతల క్రాస్ ఎగ్జామినేషన్‌లో నీటి పారుదల శాఖ రిటైర్డ్ ఈఎన్సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, బి.నాగేంద్రరావుతో పాటు పలువురు చీఫ్ ఇంజనీర్లు, ఇతర ఇంజనీర్లకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. మూడో విడతలో తొలుత ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను, ఆ తర్వాత మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావును కమిషన్ ప్రశ్నించనున్నట్టు తెలిసింది. నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఎస్‌కే జోషి, రజత్‌కుమార్, ఇన్‌చార్జి కార్యదర్శులుగా వ్యవహరించిన సోమేశ్‌కుమార్, వికాస్ రాజ్, గత ప్రభుత్వంలో సీఎం కార్యదర్శిగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పర్యవేక్షించిన స్మితా సబర్వాల్ తదితరులను కమిషన్ ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయని చెపుతున్నారు. ఇదిలా ఉండగా వీరి నుంచి సేకరించిన సాక్ష్యాల ఆధారంగా మాజీ సీఎం, మాజీ మంత్రిని ప్రశ్నించనుంది. ఇప్పటికే ఓసారి కమిషన్ అధికారులను విచారించి అఫిడవిట్ రూపంలో వారి నుంచి సమాధానాలను తీసుకుంది. ఆ అఫిడవిట్ల ఆధారంగానే క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తోంది. కాగా, డిసెంబర్ నెలాఖరులోగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు కమిషన్ కసరత్తు నిర్వహిస్తోంది.

కొత్త ట్రిబ్యునల్ వేస్తే ఓకే!

- గోదావరి జలాలపై కొత్త ట్రిబ్యునల్‌కు సమ్మతి తెలిపిన ఛత్తీస్‌గఢ్
- తమ రాష్ట్రాన్ని కక్షిదారుగా చేయాలని.. కేటాయింపులు మార్చొద్దని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) 1980లో జరిపిన జల కేటాయింపులను ఏకపక్షంగా మార్చడం ఆమోదయోగ్యం కాదని ఛత్తీస్‌గఢ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. గోదావరి పరీవాహకంలోని అన్ని రాష్ట్రాల వాటా హక్కులను సమగ్రంగా నిర్ణయించడానికి ఆ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారని గుర్తుచేసింది. ఏపీ విజ్ఞప్తి మేరకు అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం –1956లోని సెక్షన్–3 కింద ఏపీ, తెలంగాణ మధ్య గోదావరి జలాల పంపిణీకి కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తే తమకు అభ్యంతరం లేదని.. కానీ అందులో తమ రాష్ట్రాన్ని తప్పనిసరిగా ఒక పార్టీగా చేర్చాలని ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ టొప్పో ఇటీవల కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాశారు.

మా వాటాను మార్చొద్దు..

గోదావరిలో తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టులతో దిగువ రాష్ట్రమైన తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఏపీ గతేడాది నవంబర్ 6న కేంద్రానికి ఫిర్యాదు చేసింది. అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టం –1956లోని సెక్షన్–3 కింద కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరింది. ఏపీ విజ్ఞప్తిపై గోదావరి పరీవాహకంలోని ఇతర రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్ర జలశక్తి శాఖ కోరగా ఛత్తీస్‌గఢ్ అభిప్రాయాన్ని తెలియజేసింది. ఇంద్రావతి సబ్ బేసిన్‌లో 301 టీఎంసీలు, శబరి సబ్ బేసిన్‌లో 62 టీఎంసీలు, దిగువ గోదావరిలో 16 టీఎంసీలు కలిపి మొత్తం 379 టీఎంసీల గోదావరి జలాలను తమ రాష్ట్రానికి 1980లో గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిందని... ఈ కేటాయింపులను తమ రాష్ట్ర అవసరాల కోసం పరిరక్షించాలని సూచించింది. ఉమ్మడి ఏపీ వాట జలాలతోపాటు ఇంద్రావతి, శబరి, దిగువ గోదావరి బేసిన్‌లలో ఏదైనా మిగులు జలాల లభ్యత ఉంటే వాటి నుంచి ఏపీ, తెలంగాణ మధ్య పునఃపంపిణీ చేయాలని సూచించింది. కాగా, ఏపీ నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో గోదావరి నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకుంటాయని.. తమ నీటి లభ్యతపై ప్రభావం చూపుతుందని కేంద్ర జలశక్తి శాఖకు గతంలోనే తెలియజేశామని ఛత్తీస్‌గఢ్ తెలిపింది. తమ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు న్యాయబద్ధమైన నీటి పంపకాలకు ఒప్పందాలు అవసరమని అభిప్రాయపడింది.

చెరిపేయడానికి కేసీఆర్ పేరు చాక్‌పీస్ రాత కాదు: గంగుల



సాక్షి, హైదరాబాద్: ఎక్కడికెళ్లినా కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తాం అనే మాటలు తప్ప సీఎం రేవంత్ ప్రజలకు చేసేదేమీ లేదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. సీఎం హోదాలో రేవంత్ వేములవాడకు వస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఏవైనా ప్రకటిస్తారని ఆశించామని, అయితే ప్రజల ఆశలను అడియాసలు చేస్తూ కేసీఆర్‌ను విమర్శించి వెళ్లారని అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. చెరిపేయడానికి కేసీఆర్ పేరు బ్లాక్ బోర్డు మీద చాక్ పీస్ రాత కాదని, తెలంగాణ ప్రజల గుండెల్లో సువర్ణాక్షరాలతో లిఖించిన పేరని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు అతీగతీ లేదని విమర్శించారు. ఈ నెల 30న రేవంత్ మళ్లీ కరీంనగర్ వస్తానంటున్నారని, కనీసం అప్పుడైనా కరీంనగర్ జిల్లా పెండింగ్ పనుల పూర్తికి కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహారదీక్ష చేస్తూ 2009 నవంబర్ 29న అరెస్టయిన సందర్భంగా అల్గునూరు చౌరస్తాలో ఈనెల 29న దీక్షాదివస్ నిర్వహించనున్నట్లు గంగుల చెప్పారు. కేటీఆర్ హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తామని చెప్పారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ రేవంత్‌కు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఫోబియా పట్టుకుందన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఆనవాళ్లు తొలగించడం రేవంత్ వల్ల కాదని చెప్పారు. సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే కె.సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికి అరిష్టం

'ఎక్స్'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికే అరిష్టం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'వేదికగా విమర్శించారు. 'అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు, భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడు అదానీ'అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి దగాకోరుకు తెలంగాణలో పెట్టుబడులకోసం అనుమతులా? అని ప్రశ్నించారు. 'రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపాడో, మూసీలో అదానీ వాటా ఎంతో'! అని వ్యాఖ్యానించారు. తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులను రద్దు చేయాలని, అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలన్నీ బయట పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'తెలంగాణ ఆస్తులను కొల్లగొట్టే కుయుక్తులలో మీ బడే భాయ్ వాటాఎంత? మీ అదానీ భాయ్ వాటా ఎంత? మీ హైకమాండ్ వాటా ఎంత?'అని ట్వీట్ చేశారు.

29న దీక్షా దివస్: తెలంగాణ మలిదశ ఉద్యమ ప్రస్థానంలో కీలకమైన నవంబర్ 29ని దీక్షా దివస్‌గా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. 29న కరీంనగర్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా ఆ రోజు రాత్రి అల్గునూర్ చౌరస్తా వద్ద ఆయన్ను అరెస్టు చేసిన అప్పటి ప్రభుత్వం ఖమ్మం తరలించిందని కేటీఆర్ పేర్కొన్నారు. దీంతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తిన ఎగసిపడి స్వరాష్ట్ర సాధనకు పునాదులు వేసిందన్నారు.

ఎమ్మెల్యేల అనర్హత అప్పీళ్లపై తీర్పు నేడు

- సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేసిన అసెంబ్లీ కార్యదర్శి
- ఈ నెల 12న తీర్పు రిజర్వు చేసిన సీజే ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీళ్లపై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) ధర్మాసనం తీర్పు వెలువరించనుంది. రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడి ఉండటంతో సెప్టెంబర్ 30న అప్పీళ్లు దాఖలైన నాటి నుంచి ఇరుపక్షాల తరఫున ధర్మాసనం సుదీర్ఘ వాదనలు విన్నది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి తరఫున రవీంద్ర శ్రీవాస్తవ, ఫిరాయింపు ఎమ్మెల్యేల తరఫున న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి, జంధాల రవిశంకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున న్యాయవాది గండ్ర మోహన్‌రావు, బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తరఫున జె.ప్రభాకర్ వాదనలు వినిపించారు. ఈ నెల 12న వాదనలు ముగియడంతో సీజే ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి, కొత్తగూడెం నుంచి తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఖైరతాబాద్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్లు దాఖలు వేశారు. దానంను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఫిర్యాదుకు ప్రయత్నించినా.. స్పీకర్ సమయం ఇవ్వడం లేదంటూ మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. అనర్హత పిటిషన్లపై విచారణ షెడ్యూల్‌ను నాలుగు వారాల్లోగా ఖరారు చేయాలని సెప్టెంబర్ 9న సింగిల్ జడ్జి తీర్పునిచ్చారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ అసెంబ్లీ కార్యదర్శి అప్పీలు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

స్థానిక సమరానికి సిద్ధంకండి

ఏడాది పాలన ఫలితాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కుల గణనను విజయవంతం చేసే బాధ్యత కార్యకర్తలదే
- టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం పిలుపు
- హాజరైన భట్టి, పొంగులేటి, సీతక్క, తుమ్మల, ఇతర నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ యంత్రాంగం సిద్ధం కావాలని టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం పిలుపునిచ్చింది. ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా క్షేత్రస్థాయి నుంచి కేడర్ కార్యోన్ముఖులు కావాలని కోరింది. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, సీనియర్ నేతలు, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు, డీసీసీ అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సంబురాల నిర్వహణ, రాష్ట్రంలో జరుగుతున్న కులగణన, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే చేసి చూపించిందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి చేరవేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

గర్వంగా ప్రజలకు చెప్పండి: డిప్యూటీ సీఎం భట్టి

ప్రజా ప్రభుత్వం 10 నెలల కాలంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ శ్రేణులు సగర్వంగా ఇంటింటికీ తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నుంచి మహిళా స్వయం సహాయక సంఘాలకు విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించే వరకు.. రైతు రుణమాఫీతో పాటు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు లాంటి కార్యక్రమాలతో ప్రతి ఇంటికి కాంగ్రెస్ పార్టీ చేరువైందని అన్నారు. మూసీ పునరుజ్జీవం లాంటి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న వారెవరినీ బయటకు పంపబోమని, అందరినీ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని హామీ ఇచ్చారు.

సభలో వర్గీకరణ రచ్చ

టిపిసిసి విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై వాడివేడి చర్చ జరిగింది. ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తున్నవారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. వర్గీకరణకు ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ మద్దతు ఇచ్చారన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు. వారి నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు పార్టీ నేతలు సభలు నిర్వహించాలని ప్రయత్నిస్తున్నారని, ఆ ప్రయత్నాలు చేస్తున్న వారిని బహిష్కరించాలని కోరారు. సంపత్‌కుమార్ వాదనను కొందరు నేతలు వ్యతిరేకించినట్లు సమాచారం.

ప్రజాక్షేత్రంలోకి ఎమ్మెల్సీ కవిత

- నేడు భారత జాగృతి ముఖ్య నేతలతో భేటీ
- 26న డెడికేటెడ్ కమిషన్‌ను కలిసి వినతిపత్రం
- 29న పార్టీ పిలుపు మేరకు దీక్షా దివస్‌లో భాగస్వామ్యం



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో జైలు నుంచి విడుదలైన సుమారు మూడు నెలల తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగు పెట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. శుక్రవారం భారత జాగృతి ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈ ఏడాది మార్చి 15న అరెస్టయిన కవిత.. 164 రోజులు తీహార్ జైలులో ఉండి ఆగస్టు 27న బెయిల్‌పై విడుదలయ్యారు. అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న ఆమె.. సుదీర్ఘ కాలం తర్వాత సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో గురువారం ఓ పోస్టు పెట్టారు. సౌర విద్యుత్తు కాంట్రాక్టుల కోసం అధికారులకు గౌతమ్ అదానీ లంచాలు ఇవ్వజూపారని అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో.. ఈ అంశంపై కవిత స్పందించారు. 'అదానీకో న్యాయం ఆడబిడ్డకో న్యాయమా?'అని ప్రశ్నించారు.

వరుస కార్యక్రమాలు

కవిత శుక్రవారం తన నివాసంలో భారత జాగృతి ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. ఈ నెల 26న బీసీ కులగణన కోసం ఏర్పాటైన బీసీ డెడికేటెడ్ కమిటీని కూడా కలిసి పారదర్శకంగా గణన జరిగేలా చూడాలని కోరనున్నారు. ఈ నెల 29న పార్టీ పిలుపు మేరకు జరిగే దీక్షా దివస్‌లోనూ ఆమె పాల్గొంటారు. అయితే ఏ నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కవిత.. త్వరలో ఆ జిల్లా నేతలతో భేటీ అవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రాజకీయ ప్రేరేపిత హింసే

సరికొత్త సవాల్

సైబర్, డ్రగ్స్ నేరాలతోపాటు రాజకీయ హింసనూ అరికట్టాలి

- పోలీసుల్లో మహిళల సంఖ్య పెరగడం శుభ పరిణామం
- కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో డీజీపీ జితేందర్
- మహిళా పోలీసులు రాణీ రుద్రమ స్ఫూర్తితో సాగాలి: మంత్రి సీతక్క





తెలంగాణ పోలీస్ అకాడమీలో కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీపీ జితేందర్. కంద్లకోయలోని పోలీసు శిక్షణ కళాశాలలో జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఉత్తమ కానిస్టేబుల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ఖిలా వరంగల్: రాష్ట్రంలో ఇటీవలి కాలంలో రాజకీయ ప్రేరేపిత హింస పోలీసులకు సరికొత్త సవాల్‌గా మారిందని డీజీపీ జితేందర్ అన్నారు. సైబర్ నేరాలు, మత్తుపదార్థాల అక్రమ రవాణాతోపాటు రాజకీయ ప్రేరేపిత హింసను కూడా సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలీస్ సిబ్బంది సర్వదా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 2024 బ్యాచ్ సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్), ఐటీ అండ్ కమ్యూనికేషన్, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (పీటీఓ) విభాగాలకు చెందిన 8,047 మంది కానిస్టేబుల్ కేడెట్లు 9 నెలల శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మొత్తం 19 శిక్షణ కేంద్రాల్లో గురువారం పాసింగ్ అవుట్ పరేడ్‌లు నిర్వహించారు. హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకటరామి రెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో 1,211 మంది మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి డీజీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్‌తో కలిసి కానిస్టేబుళ్ల గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కేడెట్లకు ట్రోఫీలు, మెమెంటోలు అందించారు. అనంతరం కానిస్టేబుళ్లను ఉద్దేశించి ప్రసంగించారు.

మహిళా పోలీసులు పెరగటం శుభ పరిణామం

రాష్ట్ర పోలీస్‌శాఖలో మహిళా సిబ్బంది సంఖ్య పెరగడం శుభ పరిణామం అని డీజీపీ జితేందర్ అన్నారు. 2024 బ్యాచ్‌లో మొత్తం 2,338 మంది మహిళా పోలీసులు ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారని గుర్తుచేశారు. ఉన్నత విద్యావంతులు కానిస్టేబుల్స్‌గా చేరినందున పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచేలా పనిచేయాలని సూచించారు. వృత్తిగత జీవితంలోనూ కొత్త అంశాలను నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన యువకులను ఉత్తమ అధికారులుగా తీర్చిదిద్దడంలో తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఇతర సిబ్బంది కృషి అభినందనీయమని ప్రశంసించారు. ఉత్తమ శిక్షణ, వసతుల కల్పనకుగాను తెలంగాణ పోలీస్ అకాడమీకి ఎనర్జీ, ఫుడ్ సేఫ్టీ, హెల్త్ సహా ఐదు అంశాల్లో ఐఎస్ఓ సర్టిఫికెట్లు దక్కడంపై డీజీపీ సంతోషం వ్యక్తం చేశారు. కొత్త కానిస్టేబుళ్లతో ప్రమాణం చేయించిన తర్వాత అభిలాష బిస్త్ మాట్లాడుతూ సవాళ్లను అధిగమించి కొత్త సిబ్బందికి అత్యుత్తమ శిక్షణ ఇచ్చామని తెలిపారు. పరేడ్ కమాండర్‌గా ఏఆర్ కానిస్టేబుల్ ఉప్పునూతల సౌమ్య వ్యవహరించారు. కంద్లకోయలోని పోలీసు శిక్షణ కళాశాలలో జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేటగిరీ	మహిళలు	పురుషులు	మొత్తం
ఎస్‌సీటీపీసీ సివిల్	1,383	2,733	4,116
ఎస్‌సీటీపీసీ ఏఆర్	874	2,729	3,603
ఎస్‌సీటీపీసీ ఏఆర్ (సీపీఎల్)	82	82	
ఎస్‌సీటీపీసీ ఐటీ అండ్ సీ	81	147	228
ఎస్‌సీటీపీసీ పీటీవో మెకానికల్	18	18	
మొత్తం	2,338	5,709	8,047

రాణీ రుద్రమ స్ఫూర్తితో ముందుకు సాగండి: మంత్రి సీతక్క

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటే పోలీస్ వ్యవస్థను మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. వరంగల్ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తిచేసుకొన్న 1,127 మంది కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో గురువారం ఆమె పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహిళా కానిస్టేబుళ్లు రాణీ రుద్రమదేవి స్ఫూర్తితో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

నా తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చా



మాది హైదరాబాద్. మా నాన్న కారు డ్రైవర్. మా అమ్మానాన్నలకు ముగ్గురం కుమార్తెలమే. మేం పోలీసులం కావాలని మా తల్లిదండ్రుల ఆశయం. వారి కష్టాన్ని చూసి కష్టపడి చదువుకున్నాం. మొదటి ప్రయత్నంలోనే ఒకే కుటుంబం నుంచి ఇద్దరం కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాం.

– హరిణి సురేష్, రోషిణి సురేష్

ఓ మానవులారా! నిశ్చయంగా, అల్లాహ్ వాగ్దానం సత్యం! కావున ఈ ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసగించరాదు. మరియు ఆ మహా వంచకుణ్ణి (షైతాన్‌ను) కూడా మిమ్మల్ని అల్లాహ్ విషయంలో మోసగింపనివ్వకండి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 22 నవంబర్ 2024

బైడెన్ తప్పుడు నిర్ణయం

అధ్యక్షుడిగా ఉంటూ ఎన్నికల్లో ఓటమిపాలై ప్రత్యర్థికి అధికారం అప్పగించటం మినహా మరేమీ చేయలేని నిస్సహాయ స్థితిలోపడిన నేతను అమెరికా జనం 'లేమ్ డక్ ప్రెసిడెంట్' అంటారు. అధ్యక్షుడు జో బైడెన్ అంతకన్నా తక్కువ. ఎందుకంటే ఆయన కనీసం పోటీలో కూడా లేరు. ఎన్నికల ముహూర్తం దగ్గర పడుతుండగా అందరూ బలవంతంగా ఆయన్ను తప్పించి కమలా హారిస్‌ను బరిలో నిలిపారు. ఆ పార్టీ ఓటమి పాలైంది. ఇక అధికారం బదలాయింపు లాంఛనాలు తప్ప బైడెన్ చేయగలిగేదీ, చేసేదీ ఏమీ ఉండదు. కానీ ఆయన తగుదనమ్మా అంటూ ఉక్రెయిన్‌కు ఏడాదిన్నర క్రితం ఇచ్చిన అత్యంత శక్తిమంతమైన దీర్ఘశ్రేణి క్షిపణుల్ని వినియోగించటానికి అనుమతినిచ్చారు. దాంతోపాటు తాము సరఫరా చేసిన ప్రమాదకరమైన మందుపాతరలను కూడా వాడుకోవచ్చని ఉక్రెయిన్‌కు తెలిపారు. యుద్ధం మొదలై వేయిరోజులైన సందర్భంగా అమెరికా సరఫరా చేసిన క్షిపణులను ప్రయోగించి రష్యా భూభాగంలోని బ్రిన్స్‌క్ ప్రాంతంలోని కరచెవ్ భారీ ఆయుధ గిడ్డంగిని ఉక్రెయిన్ సైన్యం ధ్వంసం చేసింది. దీనికి ప్రతిగా అణ్వాయుధ వినియోగం ముసాయిదాను సవరించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. పర్యవసానంగా ప్రపంచం అణ్వస్త్ర యుద్ధం అంచులకు చేరింది. యుద్ధం మొదలయ్యాక కేవలం కొన్ని రోజుల్లో... మహా అయితే కొన్ని నెలల్లో రష్యా పాదాక్రాంతం కావటం ఖాయమన్న తప్పుడు అంచనాలతో ఉక్రెయిన్‌ను యుద్ధరంగంలోకి నెట్టింది అమెరికాయే. 2014లో పుతిన్ క్రిమియాను స్వాధీనం చేసుకున్నాక వరసగా ఎనిమిదేళ్లపాటు జరిగిన ఘర్షణలు నివారించటానికి 2022లో వాటి మధ్య శాంతి ఒప్పందం ముసాయిదాను అమెరికా, బ్రిటన్‌లే రూపొందించాయి. చిత్రమేమంటే, ఆ ఒప్పందాన్ని అటు రష్యా, ఇటు ఉక్రెయిన్ కూడా ఆమోదించాయి. ప్రాథమిక అవగాహన పత్రంపై ఇరు దేశాలూ సంతకాలు చేశాయి. కానీ ఆఖరి నిమిషంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ మనసు మార్చుకున్నారు. ఆ రెండు దేశాల సాయంతో అక్రమంగా అధికారంలోకొచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వారి ఒత్తిడికి లొంగి ఏకపక్షంగా ఒప్పందం నుంచి వైదొలగారు. ఆ తర్వాతే రష్యా దురాక్రమణ యుద్ధా నికి దిగింది.

అసలు రెండు నెలల క్రితం నాటి స్థితికీ, ఇప్పటికీ వచ్చిన మార్పేమిటో, ఎందుకు మూడో ప్రపంచయుద్ధం ముప్పు తీసుకొచ్చారో బైడెన్ చెప్పాలి. తాము సరఫరా చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులు స్టార్మ్ షాడోలను రష్యాపై ప్రయోగించటానికి బ్రిటన్ నిరుడు అనుమతించినప్పుడు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ బైడెన్‌ను తీవ్రంగా హెచ్చరించింది. దీన్ని ఆపనట్టయితే ఇది నాటో–రష్యా యుద్ధంగా పరిణమిస్తుందని వివరించింది. దాంతో బైడెన్‌కు తత్వం బోధపడి బ్రిటన్‌ను వారించారు. అంతక్రితం 2022 మార్చిలో రష్యా గగనతలంపై 'నో ఫ్లైజోన్' విధించటానికి తమ మిగ్–29 యుద్ధ విమానాలను వాడుకోవచ్చని విదేశాంగమంత్రి బ్లింకెన్ పోలెండ్‌ను అనుమతించినప్పుడు అమెరికా ప్రతినిధుల సభంతా ఏకమై పెంటగాన్ అభిప్రాయం తర్వాతే నిర్ణయం తీసుకోవాలని వారించారు. దాంతో బైడెన్ ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. 'నో ఫ్లైజోన్' విధించటమంటే మూడో ప్రపంచయుద్ధానికి అంకురార్పణ చేసినట్టేనని ఒప్పుకున్నారు. మరి ఇప్పుడేమైంది? తన పార్టీ చిత్తుగా ఓడి, కీలక నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో పడినప్పుడు అనుమతినీయటం అనైతికం, బాధ్యతారాహిత్యం మాత్రమే కాదు... నేరం కూడా. ఒకపక్క జనవరిలో అధ్యక్షుడిగా రానున్న డోనాల్డ్ ట్రంప్ తన మొదటి కర్తవ్యం రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఆపటమేనని ఇప్పటికే ప్రకటించారు. సరిగ్గా ఇలాంటి పనే రిపబ్లికన్ పార్టీకి చెందిన జార్జి బుష్ 1992లో చేశారు. ఎన్నికల్లో ఓటమిపాలై ఇక 11 నెలల్లో దిగిపోతాననగా సోమాలియా దురాక్రమణకు ఆయన ఆదేశాలిచ్చారు. దాంతో కొత్తగా అధికారంలోకొచ్చిన క్లింటన్ అన్నీ వదిలిపెట్టి దానిపైనే చాన్నాళ్లు దృష్టి సారించాల్సి వచ్చింది. బైడెన్‌కు సైతం కేవలం 11 వారాలే గడువుంది. కనీసం నిర్ణయం తీసుకునేముందు సెనేట్‌ను సమావేశపరిచి సలహా తీసుకోవాలన్న ఇంగితం కూడా లేకపోయింది. ఈ నిర్ణయాన్ని పెంటగాన్ సీనియర్ అధికారులు వ్యతిరేకించారంటున్నారు.

నిజానికి క్షిపణుల్ని వినియోగించే సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యం ఉక్రెయిన్‌కు లేవు. అమెరికా నిఘా ఉపగ్రహాలు నిర్దిష్ట సమాచారం ఇస్తేనే, దాని ఆధారంగా అమెరికా సైనికాధికారులు రష్యా ఆయుధ గిడ్డంగిని ధ్వంసం చేశారని సాధారణ పరిశీలకులకు సైతం సులభంగా తెలుస్తుంది. రష్యా గ్రహించదనుకోవటం, పాపభారమంతా ఉక్రెయిన్‌పైనే పడుతుందనుకోవటం తెలివితక్కువతనం. మందుపాతరల వినియోగాన్ని పూర్తిగా ఆపేస్తామని ఐక్యరాజ్యసమితిలోని 161 దేశాలు కుదుర్చుకున్న ఓస్లో ఒడంబడికను అమెరికా, రష్యాలు కాదన్నాయి. ఆ ఒడంబడికకు కారణమైన మందుపాతరల నిరోధ ప్రచార సంస్థకూ, దాని అధ్యక్షుడు జోడీ విలియమ్స్‌కూ 1997లో నోబెల్ శాంతి బహుమతి వచ్చింది. మందుపాతరలివ్వాలన్న బైడెన్ తాజా నిర్వాకంవల్ల ఆ ఒడంబడికపై సంతకం చేసిన ఉక్రెయిన్ అపరాధిగా మారినట్టయింది. మందుపాతరల వల్ల కీయూవ్‌లోకి చొచ్చుకొస్తున్న రష్యా బలగాల వేగాన్ని కొంతవరకూ నిరోధించవచ్చు. కానీ ఆపటం అసాధ్యం. యుద్ధం పూర్తయ్యాక సాధారణ పౌరులు వందలమంది ఏదో ఒక ప్రాంతంలో నిత్యం మందుపాతరలకు బలయ్యే ప్రమాదం ఉంటుంది. బైడెన్ తప్పుడు నిర్ణయాన్ని వెంటనే సరిదిద్దకపోతే ప్రపంచ ప్రజలముందు అమెరికా దోషిగా నిలబడాల్సివస్తుంది. ఆ పరిస్థితి తెచ్చుకోరాదని అక్కడి ప్రజానీకం తెలుసుకోవాలి. ప్రభుత్వాన్ని నిలదీయాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** బ.సప్తమి రా.9.07 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** ఆశ్లేష రా.8.47 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.9.05 నుండి 10.45 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.26 నుండి 9.14 వరకు తదుపరి ప.12.10 నుండి 12.58 వరకు, **అమృత ఘడియలు:** రా.7.09 నుండి 9.31 వరకు.

సూర్యోదయం: 6.12
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

మరపు ఓటరు సహజమా?

డోనాల్డ్ ట్రంప్ మీద ఎన్ని ఆరోపణలు, కేసులు ఉన్నప్పటికీ అధ్యక్షుడిగా ఆయనకు అనూహ్య విజయాన్ని కట్టబెట్టారు అమెరికా ఓటర్లు. సాధారణ ప్రజలు ఏ విషయాలకు ప్రభావితం అయ్యారు? ఎంతోమంది సాధారణ ప్రజలకు నిన్నా మొన్నటి విషయాలు తప్పితే, గతంలో జరిగిన విషయాలు మరపున పడతాయని భావించాలా? వారి చైతన్య స్థాయిని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ విజయపు తీరు ఇలావుంటే, ట్రంప్ మంత్రివర్గ ఎంపికలు ఇంకోతీరున ఉన్నాయి. దాదాపుగా అందరూ వివాదాస్పదులే. ఇలాంటివారితో ఆయన పాలన ఎలా సాగుతుంది? అత్యంత శక్తిమంతమైన దేశం గనక ప్రపంచమంతా ఆసక్తిగా గమనిస్తోంది.

ఓటర్లకు పట్టని గుణగణాలు

సందర్భం



జె.యు.బి.వి. ప్రసాద్

డోనాల్డ్ జాన్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక, చాలా వివరాలతో చాలా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. వాటి లోని ఎక్కువ విషయాలు మేధావులకు మాత్రమే అర్థం అయ్యేటట్టు వున్నాయనడంలో సందేహం లేదు. కానీ ఎక్కువ ఓట్లు వేసి గెలిపించింది సాధారణ మనుషులే గానీ, మేధావులు కాదు. ఈ సాధారణ మనుషులు ఏ విషయాలతో ప్రభావితం అయి ఓట్లు వేశారు? ఈ సాధారణ మనుషులకు పట్టని విషయాలు కూడా ఉన్నాయా?

(1) ట్రంపును స్త్రీల మీద అత్యాచారాలు చేసేవాడిగా ఒక సివిల్ కోర్టు జ్యూరీ నిర్ణయించి, తీర్పును ఇచ్చింది. ట్రంపు దాని మీద అపీల్ చేసుకున్నాడు కూడా. అయినా సరే, స్త్రీలతో సహా ఎంతో మంది తమ ఓటును ట్రంపుకు వేశారంటే, వారికి న్యాయ స్థానాల మీద నమ్మకం లేనట్టా? (2) ఒక అశ్లీల చిత్రాల నటీమణితో తనకున్న సంబంధాన్ని దాచి వుంచడానికి, ట్రంపు ఆమెకి డబ్బు ఇచ్చి, ఆ డబ్బును దొంగ లెక్కలలో చూపించాడని ఒక క్రిమినల్ కోర్టు జ్యూరీ నిర్ణయించి, తీర్పు ఇచ్చింది. జైలు శిక్షను ప్రకటించడం మాత్రం ఆలస్యం చేసింది రాజకీయ కారణాల వల్ల. శిక్షను ఇంకా ప్రకటించలేదు కాబట్టి, ట్రంప్ దీన్ని ఇంకా అపీల్ చేసుకోలేదు. ఇది కూడా సాధారణ ప్రజలకు పట్టలేదు. (3) 2020 ఎన్నికలలో ఓడిపోయాక, ట్రంప్, ఎన్నో గవర్నమెంటు రహస్య పత్రాలను చట్టవ్యతిరేకంగా సొంత ఇంటికి తీసుకుపోతే, అతని చేత నియామకమయిన జడ్జి ఒకావిడ, ఏదో కారణం చూపించి ఆ కేసును కొట్టివేసింది. (4) 2020 ఎన్నికలలో ఓడిపోయాక, ట్రంప్, తన అనుచరులను రెచ్చగొట్టి ప్రభుత్వ భవనం మీదకి ఉసిగొలిపాడు. ఆ అనుచరులు చేసిన విధ్వంసకాండ అంతా అన్ని టీవీలలోనూ వచ్చింది. ట్రంప్ అనుచరులను ఎంతో మందిని జైల్లో పెట్టారు. వారందరినీ బయటకు తీసుకు వస్తానని ట్రంప్, ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశాడు. ఈ విషయాలన్నీ తెలిసిన ప్రజలు, మళ్ళీ ఓట్లు వేశారు. (5) కోవిడ్ సమయంలో, ట్రంప్ అసమర్థత వల్ల ఎంతో మంది మరణించడం అనేది 2020 ఎన్నికల్లో అతను ఓడిపోయాడనడానికి ఒక కారణమని అందరికీ తెలుసు.



(6) డబ్బూ, ఖ్యాతీ వున్న మొగవాళ్ళు, ఆడవాళ్ల జననాంగాలని పట్టుకోవచ్చుననీ, ఆ ఆడవాళ్ళు ఏమీ అనరనీ, ట్రంప్ పబ్లిక్‌గా అన్నాడు. అయినా, ఎంతో మంది ఆడవాళ్ళు అతనికే ఓటు వేశారు! (7) స్త్రీలకి తమ శరీరం మీద తమకు హక్కు లేదనీ, అత్యాచారానికి గురయిన పదేళ్ళ బాలికయినా శిశువును కని తీరాల్సిందేననీ, తల్లి ప్రాణం మీదకి వచ్చినా సరే, ఆ తల్లికి అబార్షన్ చేయకూడదనీ చెప్పే ఈ ట్రంపుకు, ఆ స్త్రీలే ఎలా ఓట్లు వేశారు? (8) రాజకీయ శత్రువులందరినీ, తను నెగ్గాక జైళ్ళలో పడేస్తానని ట్రంప్ అన్నా, ఈ సాధారణ జనాలకి ఆ మాటలు పట్టలేదు. (9) 'అందమైన తన కూతురు నిజంగా తన కూతురు కాకపోతే, ఆమెతో డేటింగ్ చేసేవాడి'నన్న ఆ తండ్రిని ఈ సాధారణ జనాలు క్షమించేశారు. (10) రాజ్యాంగంలోని ఒక సూత్రాన్ని యాంత్రికంగా అన్వయించుకుని, చిన్న పిల్లలకి కూడా తుపాకీలు దొరికేలా వ్యాపార పరిస్థితులను నెలకొల్పి, ఎన్నో స్కూళ్ళలో జరిగిన కాల్పులకి ఏ మాత్రం బాధ్యత వహించని ట్రంపుని ఈ సాధారణ ప్రజలు ఎలా సహించారు?

(11) అనాదిగా వుండిన నేటివ్ అమెరికన్లని అణగగొట్టిన వలసదార్ల చేత ఏర్పడ్డది అమెరికా! ఇలాంటి దేశ ప్రతినిధిగా, పొట్టకూటి కోసం వలసవచ్చిన వారికి వ్యతిరేకంగా వుండే ట్రంపుకి ఈ సాధారణ ప్రజలు ఎలా ఓట్లు వేశారు? (12) సాధారణ ప్రజల సోషల్ సెక్యూరిటీ వసతులకీ, వారి మెడికల్ వసతులకీ భంగం కలిగిస్తానంటున్న ఈ రాజకీయ వేత్త ట్రంపుని ఎలా నమ్మారు? (13) బిలియనీర్ అయినా సరే, గవర్నమెంటుకి ఏవో నష్టాలు చూపించి ఎన్నో యేళ్ళు పన్నులు కట్టని ఈ ట్రంపుని ఈ ప్రజలు క్షమించేశారు, వారు పన్నులు కడుతూ!

ఈ విషయాల వల్ల మనకి ఏం అర్థమవుతుందీ? అమెరికాలో అత్యధిక సాధారణ ప్రజల చైతన్య స్థాయి ఇలా వుందీ – అని. ఈ అమెరికా సాధారణ ప్రజలు, ఇండియాలోని అత్యధిక సాధారణ ప్రజలతో పోల్చినప్పుడు, పేదరికంలోనూ, విద్యాలేమి తోనూ లేరు. అయినా సరే, వీరి చైతన్య స్థాయి ఇలాగే వుంది. మోసపోయే వాళ్ళున్నంత వరకూ మోసగించే వాళ్ళు వుంటారు. చెయ్యాల్సినది ఆ మోసపోయే వాళ్ళకి చైతన్యం కలిగించడం. ఆ పని ఎవరు చెయ్యాలి? ఎంత వరకూ సాధ్యం అనేది వేరే విషయం!

వ్యాసకర్త రచయిత (క్యూపెర్టినో, కాలిఫోర్నియా నుంచి)

పాలన ఎలా ఉండనుంది?

సందర్భం



డా॥ కొండి సుధాకర్ రెడ్డి

నవంబర్ 5న జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అనేక ఆరోపణలు ఎదుర్కొని ఇంకా విచారణ ఎదుర్కొంటున్న డోనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన విషయం మనకు తెలుసు. అన్ని ప్రజాస్వామిక దేశాల్లో జరిగే ఎన్నికలు ఒక ఎత్తయితే, అమెరికా ఎన్నికలు ప్రపంచ వ్యాప్తంగా చూపే ప్రభావం మరొక ఎత్తు. అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే మొదటి స్థానంలో వుంది. 80 దేశాల్లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకొంది. చీమ చిటుక్కుమన్నా తెలిసే పటిష్ఠమైన గూఢచార వ్యవస్థ ఉంది. రెండు దేశాల మధ్య ఎక్కడ యుద్ధం జరిగినా ప్రత్యక్షంగానో పరోక్షంగానో అమెరికా జోక్యం ఉంటుంది. అలాంటి అమెరికాలో మంత్రివర్గ కూర్పు ఎలా ఉండబోతుందన్న ఆసక్తి సహజం.

2025 జనవరి 20న అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న ట్రంప్ తన మంత్రి వర్గ కూర్పులో నిమగ్నమయ్యారు. అమెరికాలో మంత్రి అనకుండా సెక్రటరీ అంటారు. ఏ సెక్రటరీ ఆ యా శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తూ అధ్యక్షుడికి పాలనలో తోడుంటారు. అలాంటివారు సమర్థులుగా, మంచి నడవడి కలవారుగా ఉండాలని కోరుకుంటారు. కానీ ఇప్పుడు మంత్రులుగా ఎంపిక చేసుకున్న కొందరిపై సొంత పార్టీ వాళ్లే పెదవి విరుస్తున్నారు.

పీట్ హేగ్సేత్: ఫాక్స్ న్యూస్ ఛానల్ హోస్టుగా కనిపిస్తారు. ట్రంప్ విధేయుడు. అమెరికా మిలిటరీలో మధ్య తరగతి అధికారి. ప్రపంచ పోలీసుగా పిలువబడే అమెరికాకు ఎంతో ప్రాధాన్యం ఉన్న రక్షణ శాఖను ఈయనకు ఇస్తున్నారు. ఈయన తన ఒంటిపై 'దావూస్ ఉల్ట్'(లాటిన్‌లో 'దేవుడి ఇచ్ఛ' అని అర్థం) అని టాటూ వేయించుకున్నారు. మత యుద్ధాల్లో తెల్ల తీవ్రవాది తిరగబడాలనీ, అది దేవుని నిర్ణయమనీ భావన. ఈయన లైంగిక దాడి కేసును ఎదుర్కొన్నారు. ట్రంప్ 'కాపిటల్ దాడి'ని సమర్థిస్తారు. సైన్యంలో స్త్రీలు ఉండకూడదంటారు.

మ్యాట్ గేట్జ్: ఈయనను అటార్నీ జనరల్‌గా ప్రకటించారు. ఈయన ఒక పదిహేడేళ్ల అమ్మాయితో శృంగారంలో పాల్గొన్నారనీ, మాదక ద్రవ్యాలు వినియోగించారనీ కేసులు ఉన్నాయి. ఈయన రోజూ ట్రంప్‌తో టచ్‌లో ఉంటానని చెప్పుకొంటారు. ఎఫ్‌బీఐ, న్యాయ శాఖలనే రద్దు చేయాలంటారు. కాపిటల్ దాడిని సమర్థిస్తూ దానికి గర్వపడతానంటారు.

తులసి గబ్బార్డ్: ఈమెను డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటలిజెన్స్‌గా నియమించనున్నారు. ఈమె గతంలో డెమోక్రాట్. 2020 అధ్యక్ష స్థానం కోసం పోటీ పడాలనుకుని ప్రైమరీల్లో ఓడిపోయారు. సుమారు ఇరవై ఏళ్ళు మిలిటరీలో పనిచేశారు. రష్యా సానుభూతిపరురాలు అని పేరు. సిరియా ప్రజలను ఊచకోత కోసిన అధ్యక్షుడు బషర్‌ను సమర్థిస్తారు. బషర్‌కు రష్యా మద్దతుంది. ఈమె పేరు చూసి కొందరు ఇండియన్ అనుకుంటున్నారు. కానీ ఈమె తల్లి హిందూ మతాన్ని స్వీకరించారు.

క్రిస్టీ నోయెమ్: ఈమెను హోమ్ ల్యాండ్ సెక్రటరీగా ఎంపిక చేశారు. అంతర్గత భద్రత, సరిహద్దు భద్రత, వలసల నిరోధం లాంటివి పర్యవేక్షించాలి. ఈమె ట్రంప్ ప్రతిపాదించిన వలసవాదులను పంపించి వేయాలనే స్లోగన్‌ను బాగా సమర్థించారు. ఈమె రాసిన పుస్తకంలో– పెంపుడు కుక్క(పేరు క్రికెట్) తన ఆజ్ఞలను పాటించనందుకు చంపేయాల్సి వచ్చిందని రాస్తే పాఠకులు ఛీకొట్టారు. అవసరమైనప్పుడు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని అంటారామె.

రాబర్ట్ ఎఫ్. కెన్నెడీ జూనియర్: ఆరోగ్య మంత్రిగా ఎంపిక చేశారు. ఈయనకు టీకాలంటే అస్సలు గిట్టదు. ఔషధాల కంపెనీలంటే దురభిప్రాయం. పచ్చి ఆవుపాలు వాడటమే ఆరోగ్యమంటారు. పచ్చి పాలలో హానికరమైన బ్యాక్టీరియా ఉంటుందనీ, వేడి చేసి వాడాలనీ ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. ఆరోగ్య మంత్రిగా ఈయన పేరు ప్రకటించగానే ఫార్మా కంపెనీల షేర్లు పడిపోయాయి. ఈయన అధ్యక్ష ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి, మధ్యలో విరమించుకుని ట్రంప్‌కు మద్దతిచ్చారు.

ట్రంప్ తన మంత్రులుగా ఎంపిక చేసుకున్నవారిలో వీరు కొందరు. మరి ట్రంప్ పాలన ఎలా ఉండబోతున్నదో చూడాలి!

వ్యాసకర్త రిటైర్డ్ సీనియర్ లెక్చరర్ (అమెరికా నుంచి)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మతం ఒక్కటేనా?



మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో గనక బీజేపీ గెలిస్తే, ఒకటైతే స్పష్టం. 'హిందువులు ప్రమాదంలో ఉన్నారు' అని మత ప్రాతిపదికన విభజించడం ఒక్కటే పనిచేసినట్టు. కాలుష్యం, పన్నులు, పెట్రోల్ ధరలు, వైద్యం, విద్య ఏవీ జనానికి పట్టడం లేదు.

– సందీప్ థాపర్, ఆర్మీ వెటరన్

పుకారు కథనాలు



ఒక మతానికి చెందిన వ్యక్తులను ఉత్తరప్రదేశ్‌లో ఓటు వేయకుండా నిరోధించారని ఒకటే పుకార్లు. కానీ సాయంత్రం కల్లా ఆ జనాభా ఉన్న ప్రాంతాల్లోనే అత్యధిక పోలింగ్ నమోదైందని గణాంకాలు చాటాయి. మనదేశంలో ఏ కథనాన్నయినా తయారుచేయొచ్చు.

– దిలీప్ మండల్, మాజీ సంపాదకుడు

అదేనా గొప్ప?



సోకాల్డ్ హిజ్బుల్లా 'అమరవీరులు' అని పిలవబడే దుండగులు... గౌరవప్రదమైన జీవితాన్ని డిమాండ్ చేస్తూ 2019లో వీధుల్లోకి వచ్చిన లెబనీస్ ప్రజలను క్రూరంగా చితకబాదారు.

– ఇహాబ్ హసన్, మానవ హక్కుల కార్యకర్త

ఎంత దారుణం!



ఎన్‌సీఆర్‌బీ 2021 గణాంకాల ప్రకారం, భారతదేశంలో మహిళల మీద రోజుకు సగటున 86 అత్యాచారాలు, గంటకు 49 నేరాలు నమోదయ్యాయి. రాజస్థాన్ (6,337) అత్యధికం. తర్వాత మధ్యప్రదేశ్ (2,947), మహారాష్ట్ర (2,496), ఉత్తరప్రదేశ్ (2,845). ఇవి నమోదైన కేసులు మాత్రమే. సిగ్గుచేటు.

– సిల్వియా కర్పగం, వైద్యురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

కళల కాణాచి మన తెలంగాణ

అభిప్రాయం



డా॥ జి. వెన్నెల గద్దర్

తెలంగాణకు వేల సంవత్సరాల సాంస్కృతిక చరిత్ర ఉంది. కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అసఫ్ జాహీ రాజవంశాల పాలనలో ఈ ప్రాంతం భారత ఉపఖండంలో అగ్రశ్రేణి సంస్కృతికి కేంద్రంగా ఉద్భవించింది. కళలు, సంస్కృతి పట్ల పాలకుల ప్రోత్సాహం తెలంగాణను బహుళ–సాంస్కృతిక ప్రాంతంగా మార్చింది. ఇక్కడ విభిన్న సంస్కృతులు కలిసి ఉన్నాయి. హైదరాబాదీ వంటకాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. బోనాలు, బతుకమ్మ, దసరా, ఉగాది, సంక్రాంతి, మిలాద్ ఉన్ నబీ, రంజాన్ వంటి మతపరమైన పండుగలతో పాటుగా 'కాకతీయ ఫెస్టివల్', 'దక్కన్ ఫెస్టివల్' జరుపుకుంటున్నాం. చాలా కాలంగా విభిన్న భాషలు, సంస్కృతుల కలయిక ప్రదేశం ఇది. అందుకే దీనిని 'సౌత్ ఆఫ్ నార్త్, నార్త్ ఆఫ్ సౌత్' (ఉత్తరభారతానికి చెందిన దక్షిణం, దక్షిణ భారత్‌కు చెందిన ఉత్తరం) అని పిలుస్తారు. ఇది 'గంగా–జమున తెహజీబ్'గా కూడా ప్రసిద్ధి చెందింది.

చెరియాల్ స్క్రోల్ పెయింటింగ్... మహాభారతం, రామాయణం వంటి ఇతిహాసాల నుండి కథలను స్పష్టంగా వర్ణించే ఒక ప్రత్యేకమైన కథన కళారూపం. సహజ రంగులు, సంప్రదాయ మూలాంశాలతో రూపొందించబడిన ఈ స్క్రోళ్లు గ్రామీణ తెలంగాణలోని కథా సంప్రదాయాలలో అంతర్భాగంగా ఉన్నాయి. డోక్రా కళ సంప్రదాయ మెటల్–కాస్టింగ్, పురాతన మైనపు సాంకేతికతలను ఉపయోగిస్తుంది. గిరిజన కళాకారులు అభివృద్ధి చేసిన డోక్రా కళ ఈ ప్రాంత గొప్ప గిరిజన వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. బిద్రీ వేర్ మరో సాంస్కృతిక వ్యక్తీకరణ.

తెలంగాణ సాంస్కృతిక పరిణామం వివిధ రాజవంశాల పాలనతో ముడిపడి ఉంది. కాకతీయులు (11–14 శతాబ్దాలు) తెలంగాణ సాంస్కృతిని సుసంపన్నం చేశారు. వారు ఆలయ నిర్మాణ కళను పెంపొందించారు, శివునికి అంకితమైన 'యోధుల నృత్యం' అయిన పేరిణి శివతాండవం వంటి నృత్య రూపాల సృష్టి వారి కాలంలోనే జరిగింది. సామాన్యులు ఒగ్గు కథలు, గోత్రాలు వంటి సంప్రదాయాలను అభివృద్ధి చేశారు. అలాగే కుతుబ్ షాహీలు, నిజాం పాలకులు పర్షియన్ సంస్కృతిని ఈ ప్రాంతానికి తీసుకువచ్చారు, హైదరాబాద్‌ను సాంస్కృతిక కార్యక్రమాల కేంద్రంగా మార్చారు. కవ్వాలీలు, గజళ్లు, ముషాయిరాలు వంటి కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక సారాంశానికి ప్రతీకలయ్యాయి. ఆదివాసీల ధైర్య సాహసాలకు ప్రతీకగా భావించే సమ్మక్క– సారలమ్మలకు చేసే మేడారం జాతర ఆసియాలోనే అతి పెద్దది. బతుకమ్మ పాటలు, జానపద గీతాలతో సహా తెలంగాణ జానపద సంగీతం... జీవితం– సమాజ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. శారద వీణ వంటి వాయిద్యాలు విలక్షణమైన స్థానిక రుచిని అందిస్తాయి. రామప్ప దేవాలయం 'యునెస్కో' ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. గోల్కొండ కోట, చార్మినార్ వంటి నిర్మాణాలు భారతీయ– పర్షియా శైలి కలబోతకు నిదర్శనాలు. సంక్లిష్టమైన రేఖాగణిత నమూనాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇకత్ సంప్రదాయాన్ని చక్కదనంతో మిళితం చేసే ఒక నేత పద్ధతి.



కథా గ్రంథపు చుట్టల నుండి దాని గంభీరమైన దేవాలయాల వరకు, మనోహరమైన సంగీతం నుంచి రంగురంగుల పండుగల వరకు, తెలంగాణ ఒక డైనమిక్ సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చెందుతూనే ఉంది.

వ్యాసకర్త తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్

పునర్నిర్మాణం దిశగా యూనివర్సిటీలు

అభిప్రాయం



చనగాని దయాకర్

నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యంగా సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో తానే హీరోనని చెప్పి స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత గద్దెనెక్కారు కేసీఆర్. కొఠారి కమిషన్ సిఫార్సు ప్రకారం 20 శాతం బడ్జెట్ నిధులను విద్యారంగానికి కేటాయించాలి. కాని కేసీఆర్ మొదట 11 శాతం కేటాయించారు. తర్వాత 6% శాతానికి కుదించారు. తెలంగాణ సాధనోద్యమంలో అగ్రభూమిక పోషించిన ఉస్మానియా యూనివర్సిటీపై తన నిరాసక్తతను చూపించారు. ఇక్కడ జీతాల కోసమే 350 కోట్లు అవసరమవ్వగా కేవలం 300 కోట్లు మాత్రమే కేటాయించారు. అనంతరం అది కూడా కేటాయించకుండా సొంత ఆర్థిక స్థితిపై నిలబడాలి అన్నారు. పదేళ్ల కేసీఆర్ నిర్లక్ష్య పూరితమైన పాలన వల్ల గత వైభవం ధ్వంసమయ్యింది. దానిని పునర్నిర్మించి భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య అందించే ఉద్దేశంతో ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

మొదటగా యూనివర్సిటీల అభివృద్ధికై వైస్ ఛాన్సలర్ (వీసీ)ల ఎంపికకోసం సెర్చ్ కమిటీని నియమించారు. ఆ కమిటీ సామాజిక వర్గాల వారీగా కూడా క్షుణ్ణంగా ఆలోచించి వీసీలను ఎంపిక చేసింది. 107 ఏళ్ల చరిత్ర గలిగిన ఉస్మానియా యూనివర్సిటీకి మొదటిసారిగా దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ ఎం. కుమార్‌ను వీసీగా నియమించారు. నిగర్వి, నిజాయితీకి చిరునామా అయిన ఓయూ సైన్స్ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ ప్రతాపరెడ్డిని విశిష్ఠమైన కాకతీయ యూనివర్సిటీకి వీసీగా నియమించారు. తెలంగాణ తొలి మహిళా యూనివర్సిటీకి రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరును నామకరణం చేశారు. అదేవిధంగా గిరిజన సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ సూర్య ధనుంజయను వీసీగా నియమించారు.



వ్యవసాయ యూనివర్సిటీకి తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీగా పేరు మార్చారు. ఇట్లా ప్రజా ప్రభుత్వం తన మార్కును వేసుకుంది. అతి త్వరలోనే యూనివర్సిటీల్లో శాశ్వత ప్రాతిపదికన నియామకాల కోసం ఉన్నత విద్యా కమిషన్, ఆర్థిక శాఖ, విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

ఒకవైపు యూనివర్సిటీల పునర్నిర్మాణానికి అడుగులు వేస్తూనే, మరోవైపు స్కిల్ యూనివర్సిటీతో ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు సర్వం సిద్ధం చేశారు ముఖ్యమంత్రి. ఈ స్కిల్ యూనివర్సిటీకి వీసీగా కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ ఎకానమీ అడ్వైజర్‌గా పనిచేసిన వీఎల్‌వీఎస్‌ఎస్ సుబ్బారావును నియమించారు. ఈ విద్యా సంవత్సరంలోనే బోధన మొదలైంది.

ఉన్నత విద్యను పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకొనేలా నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రారంభించింది. కానీ కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా దాన్ని అమలు పరచలేదు. ఫీజులను పెంచినంతగా రీయింబర్స్‌మెంట్‌ను పెంచిన దాఖలాలు లేవు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని 7,65,705 మంది విద్యార్థులకు మేలు జరిగే విధంగా స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్‌ను పెంచి దీపావళి పండుగ వేళ విద్యార్థుల కళ్ళల్లో వెలుగులు నింపారు.

విద్యా వ్యవస్థ ప్రక్షాళన, యూనివర్సిటీల పునర్నిర్మాణం మొదలవ్వడంతో ఆలోచనాపరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ అభివృద్ధి పది కాలాలపాటు నిలబడాలని తెలంగాణ ప్రజానీకం ఆశాభావంతో ఉంది.

వ్యాసకర్త టీపీసీసీ అధికార ప్రతినిధి

25న గిరిజన రైతు ధర్నాకు గ్రీన్‌సిగ్నల్

- బీఆర్‌ఎస్‌కు పలు షరతులు విధించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్‌: మహబూబాబాద్‌లో బీఆర్‌ఎస్‌ తలపెట్టిన గిరిజన రైతు ధర్నాకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చింది. ఈ నెల 25న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా నిర్వహించుకోవాలని, వెయ్యి మందికి మించి పాల్గొనకూడదని పలు షరతులు విధించింది. ఇతరులను రెచ్చగొట్టేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని, నేర చరిత్ర ఉన్న వారు పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌ పార్టీని ఆదేశించింది. ఫార్మా పరిశ్రమల కోసం భూసేకరణను వ్యతిరేకిస్తున్న లగచర్ల గ్రామస్తులపై వికారాబాద్‌ పోలీసుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఈ నెల 21న మహబూబాబాద్‌ ఎమ్మార్వో కార్యాలయం ముందు గిరిజన రైతు ధర్నా నిర్వహించాలని బీఆర్‌ఎస్‌ నిర్ణయించింది. దీనికోసం అనుమతి కోరుతూ మహబూబాబాద్‌ సబ్‌ డివిజనల్‌ ఆఫీసర్‌కు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా నిరాకరించారు. అనుమతి నిరాకరించడాన్ని సవాల్‌ చేస్తూ బీఆర్‌ఎస్‌ యూత్‌ ప్రెసిడెంట్‌ యాళ్ల మురళీధర్‌ హైకోర్టులో లంచ్‌మోషన్‌ రూపంలో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్‌ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్‌ తరఫున న్యాయవాది ఎం.రూపేందర్‌ వాదనలు వినిపిస్తూ.. శాంతియుత నిరసనకు అనుమతి నిరాకరించడం చట్టవిరుద్ధమన్నారు. ఈ నెల 25న ధర్నా నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి అంగీకరించిన న్యాయమూర్తి.. పలు షరతులు విధిస్తూ అనుమతించారు.

కాంగ్రెస్‌ పార్టీలోనే బాంబు పేలింది

- ‘లగచర్ల’సంఘీభావ ర్యాలీలో మాజీ మంత్రి పువ్వాడ


ర్యాలీలో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ, బీఆర్‌ఎస్‌ శ్రేణులు, గిరిజనులు

ఖమ్మంమయూరిసెంటర్‌: ‘కొందరు మంత్రులు బాంబులు పేలుతాయని చెప్పారు.. కానీ లగచర్ల రూపంలో కాంగ్రెస్‌ పార్టీలోనే బాంబు పేలింది’అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌ కుమార్‌ ఎద్దేవా చేశారు. సీఎం సొంత నియోజకవర్గంలో భూసేకరణపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా గుర్తించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. లగచర్ల వాసులకు సంఘీభావంగా గురువారం ఖమ్మంలో బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించగా, పార్టీ శ్రేణులు, గిరిజనులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌ మాట్లాడుతూ సీఎంకు 1,100 ఎకరాలు పెద్ద విషయం కాకున్నా.. గిరిజన రైతులకు ఎకరం, రెండెకరాలే పెద్ద ఆస్తి అని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అల్లుడి ఫార్మా కంపెనీ కోసం బలవంతంగా గిరిజనుల నుంచి భూమి లాక్కోవాలని చూస్తే వారు తిరగబడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్మన్‌ లింగాల కమల్‌రాజు, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ‘ఎనిమీ ప్రాపర్టీస్‌’ లెక్క తేల్చండి

- సెపీ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో కస్టోడియన్‌ ప్రాపర్టీ ఆఫ్‌ ఇండియా (సెపీ) సంరక్షణలో ఉన్న శత్రు ఆస్తుల (ఎనిమీ ప్రాపర్టీస్‌) లెక్క తేల్చాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌, రంగారెడ్డి, కొత్తగూడెం, వికారాబాద్‌ జిల్లాల్లో శత్రు ఆస్తుల వివరాల విచారణను వచ్చే నెలాఖరుకు పూర్తి చేసి, జనవరి మొదటి వారంలో నివేదిక ఇవ్వాలని సూచించారు. తక్షణమే ఆయా ఆస్తుల రికార్డుల పరిశీలన, సర్వే నిర్వహణకు సెపీ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో కమిటీని నియమించాలని ఆదేశించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా శత్రు ఆస్తులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గురువారం ఓ స్టార్‌ హోటల్‌లో శత్రు ఆస్తులపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 234 శత్రు ఆస్తులన్నాయని పేర్కొన్న అధికారులు రంగారెడ్డిలో 180, హైదరాబాద్‌ లో 44, కొత్తగూడెంలో 7, వికారాబాద్‌ లో 3 శత్రు ఆస్తులున్నాయని వివరించారు. వీటిలో మెజారిటీ స్థలాలు అక్రమణకు గురయ్యాయని, నిర్మాణాలు కూడా ఉన్నాయని తెలిపారు. 1962లో చైనా దండయాత్ర, 1965 నుండి 1971 వరకు జరిగిన ఇండో–పాక్‌ యుద్ధం అనంతరం భారత్‌ నుంచి వెళ్లిపోయి పాకిస్తాన్‌, చైనాలో స్థిరపడి ఆయా దేశాల పౌరసత్వం తీసుకున్న వ్యక్తులకు సంబంధించి భారత్‌లో ఉన్న ఆస్తులను శత్రు ఆస్తులుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. దేశవ్యాప్తంగా 13 వేల వరకు శత్రు ఆస్తులున్నట్లు కేంద్రం వద్ద రికార్డులున్నాయి. వీటి మార్కెట్‌ విలువ వేల కోట్లు ఉన్నట్లు గుర్తించింది. ఈ ఆస్తులను విక్రయించే అధికారం కేంద్రానికి ఉంది.

‘లగచర్ల’ ఘటన ఆందోళనకరం

- రాష్ట్ర ప్రభుత్వంపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌ ఆగ్రహం
- బాధితులలో చాలా మంది షెడ్యూల్డ్‌ కులాలు, తెగల వారే
- ఆ ఘటనలో గాయపడిన వారికి వైద్యం అందించారా?
- లగచర్లలో పరిశీలనకు బృందాన్ని పంపుతామని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: ‘లగచర్ల’అరెస్టుల ఘటనకు సంబంధించి జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్సీ) రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితులు షెడ్యూల్డ్‌ కులాల వారని, వారిపై జరిగిన దాడి ఆందోళన కలిగించే ఘటన అని పేర్కొంది. ఈ అంశంలో ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేసింది. రెండు వారాల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు గురువారం నోటీసులు జారీ చేసింది. లగచర్లలో జాతీయ మానవ హక్కుల సంఘం బృందం పర్యటించి పరిశీలిస్తుందని పేర్కొంది.

ఇది చాలా తీవ్రమైన సమస్య..

లగచర్ల బాధిత కుటుంబాల మహిళలు 12 మంది ఈ నెల 18న బీఆర్‌ఎస్‌ ఎంపీలు కేఆర్‌ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావులతో కలిసి ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశారు. ‘‘ఫార్మా కంపెనీలకు భూములు ఇవ్వకుంటే కేసులు పెడతామంటున్నారు. జైలుకు పంపిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. మా జీవనాధారమైన భూములను ఇవ్వలేమని తేల్చి చెప్పినవారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారు’’అని పేర్కొన్నారు. కొడంగల్‌ నియోజకవర్గంలో ఫార్మా సిటీ ఏర్పాటు కోసం గత ప్రభుత్వం సేకరించిన 16 వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ.. ఇక్కడ 1,374 ఎకరాలు సేకరించి ఫార్మా విలేజ్‌ ఏర్పాటు చేయాలని నిర్ణయించారని ఆరోపించారు. ఈ అంశాలను ఎన్‌హెచ్‌ఆర్సీ పరిగణనలోకి తీసుకుంది. ఫిర్యాదులోని అంశాలు నిజమైతే మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లేనని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇది చాలా తీవ్రమైన సమస్య అని పేర్కొంది. ‘‘బాధితులు తమపై పోలీసులు హింసాత్మకంగా వ్యవహరించారని, తప్పుడు నేరారోపణలు మోపారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును ఎన్‌హెచ్‌ఆర్సీ పరిగణనలోకి తీసుకుంది. సరైన విధానాలను అనుసరించకుండా ప్రతిపాదిత ‘ఫార్మా విలేజ్‌’కోసం భూసేకరణ చేయడం, వ్యతిరేకించిన గ్రామస్తులపై దాడి చేయడం సరికాదు. తమపై దాడి జరిగిందని చెప్పినవారిలో ఎక్కువ మంది షెడ్యూల్డ్‌ కులాలు, షెడ్యూల్డ్‌ తెగలు, ఇతర వెనుకబడిన వర్గాలకు చెందిన వారే ఉన్నారు. పైగా బలవంతంగా భూసేకరణ చేసేందుకు అధికారులు ప్రయత్నించారని బాధితులు ఆరోపించారు. ఈ క్రమంలో గ్రామస్తులపై దాడి చేశారని.. గర్భిణులను కూడా వదల్లేదని.. సాయం కోసం ఎవరినైనా అడిగే పరిస్థితి లేదని.. ఇంటర్నెట్‌, విద్యుత్‌ సేవలు సైతం నిలిపేశారని ఫిర్యాదు చేశారు. కొందరు బాధితులు భయంతో ఇళ్లు వదిలి అడవులు, సాగు భూముల్లో తలదాచుకుంటున్నారని ఫిర్యాదు చేశారు..’’అంటూ ఎన్‌హెచ్‌ఆర్సీ పేర్కొంది.

రెండు వారాల్లో నివేదిక ఇవ్వండి

‘లగచర్ల’ఘటనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌తో పాటు జ్యుడీషియల్‌ కస్టడీలో ఉన్న గ్రామస్తుల వివరాలు తెలపాలని ప్రభుత్వాన్ని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది. భయంతో అటవీ ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేని దుస్థితిలో దాక్కున్న గ్రామస్తుల స్థితిగతులను నివేదికలో పొందుపరచాలని సూచించింది. బాధిత మహిళలకు ఏవైనా వైద్య పరీక్షలు చేశారా?, గాయపడిన గ్రామస్తులకు వైద్యం అందించారా? అని కమిషన్‌ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

రిజర్వేషన్లపై సర్కారుదే నిర్ణయం


- డెడికేటెడ్‌ బీసీ కమిషన్‌ చైర్మన్‌ వెంకటేశ్వర్‌రావు


బహిరంగ విచారణలో మాట్లాడుతున్న కమిషన్‌ చైర్మన్‌ వెంకటేశ్వర్‌ రావు

హనుమకొండ: బీసీ, కుల, వృత్తిదారుల సంఘాల నుంచి వచ్చిన వినతులు, అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామని, రిజర్వేషన్ల ఖరారుపై ప్రభుత్వానిదే తుది నిర్ణయమని డెడికేటెడ్‌ బీసీ కమిషన్‌ చైర్మన్‌ బూసాని వెంకటేశ్వర్‌రావు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల గుర్తింపునకు గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో డెడికేటెడ్‌ బీసీ కమిషన్‌ ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి బహిరంగ విచారణ చేపట్టింది. చైర్మన్‌ వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి, ఐఎఫ్‌ఎస్‌ అధికారి సైదులు బీసీల నుంచి అభిప్రాయాలు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషన్‌ చైర్మన్‌ బూసాని వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్‌ గుర్తింపుపై ఈ విచారణ చేపట్టామని, 105 అభ్యర్థనలు అందాయని తెలిపారు. కాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల్లోని అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం, అవకాశాలు లభించేలా కమిషన్‌ నిర్ణయం తీసుకోవాలని బీసీ సంఘాలు, కుల, వృత్తిదారుల సంఘాల ప్రతినిధులు కోరారు. బహిరంగ విచారణలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్‌ వెంకట్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డీడీ రాంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అరెస్టు నోటీసులు భార్యకు ఇవ్వకుండా.. సలీమ్‌కు ఎందుకు ఇచ్చారు?

- పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టుపై పోలీసులకు హైకోర్టు ప్రశ్న
- నిందితుల వాంగ్మూలాలను అనుమతిస్తూ.. తీర్పు రిజర్వు
- కేసీఆర్‌.. నరేందర్‌రెడ్డికి రూ.10 కోట్లు ఇచ్చారు: పీపీ



సాక్షి, హైదరాబాద్‌: ఇంటి వద్దే అరెస్టు చేస్తే పిటిషనర్‌ (నరేందర్‌రెడ్డి) భార్యకు నోటీసులు ఇవ్వకుండా, సలీమ్‌ అనే వ్యక్తికి ఎందుకు ఇచ్చారని హైకోర్టు పోలీసులను ప్రశ్నించింది. విచారణకు సహకరించని, పరారీలోని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు అరెస్టు చేయడం సరికాదని చెప్పింది. ఇతర నిందితుల వాంగ్మూలం, కాల్‌ డేటా ఆధారంగా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించింది. నరేందర్‌రెడ్డి పేరు వెల్లడించినట్లు చెబుతున్న లక్ష్మయ్య, దేవేందర్‌, హన్మంత్‌ వాంగ్మూలాల కాపీలను అనుమతిస్తున్నట్లు పేర్కొంటూ.. తీర్పు రిజర్వు చేసింది. లగచర్ల ఘటనలో తనను అరెస్టు చేసి రిమాండ్‌ చేయడాన్ని సవాల్‌ చేస్తూ నరేందర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్‌ పిటిషన్‌ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్‌ కె.లక్ష్మణ్‌ గురువారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్‌ తరఫున సీనియర్‌ న్యాయవాది గండ్ర మోహన్‌రావు, ప్రభుత్వం తరఫున పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ (పీపీ) పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు.

పిటిషన్‌ విచారణార్హం కాదు..

న్యాయమూర్తికి పెన్‌డ్రైవ్‌ అందజేసిన పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ వాదనలు వినిపిస్తూ.. ‘సీఎం రేవంత్‌రెడ్డి, కలెక్టర్‌ ఎవరొచ్చినా కూడా దాడి చేయాలని పిటిషనర్‌ (నరేందర్‌రెడ్డి) ప్రేరేపించారు. లగచర్లలో అధికారులపై దాడికి ముందు, తర్వాత ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియోల పెన్‌డ్రైవ్‌ ఉంది. పిటిషనర్‌ రెచ్చగొట్టకుంటే దాడి జరిగేదే కాదు. పిటిషనర్‌ జ్యుడీషియల్‌ రిమాండ్‌లో ఉన్నారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా, చట్టప్రకారం సాగుతోంది. వరుసగా పిటిషన్లు వేస్తూ విచారణను ముందుకు సాగకుండా చేస్తున్నారు. కేసీఆర్‌ నుంచి రూ.10 కోట్లు పిటిషనర్‌కు అందినట్లు తెలుస్తోంది. క్వాష్‌ పిటిషన్‌ విచారణార్హం కాదు.. కొట్టివేయాలి’అని అన్నారు. అయితే సెక్షన్‌ 482 కేసులో పెన్‌డ్రైవ్‌ ఎలా సమర్పిస్తారని న్యాయమూర్తి ప్రశ్నించారు. ముందస్తు పథకం ప్రకారం దాడి జరిగిందని చెప్పడానికి అందులోని వివరాలే సాక్ష్యమని పీపీ బదులిచ్చారు. అరెస్టు ఫొటోలను న్యాయమూర్తికి అందజేసిన గండ్ర వాదనలు వినిపిస్తూ.. ‘15 మంది సివిల్‌ డ్రెస్‌లో వచ్చి బలవంతంగా అరెస్టు చేశారు. రిమాండ్‌ రిపోర్టులో పోలీసులు ఒక్కోసారి ఒక్కో ప్రాంతంలో అరెస్టు చేశామన్నారు. పిటిషనర్‌తో పలు పేపర్లపై సంతకాలు తీసుకున్నారు. అందులో ఏముందో చూసుకునే అవకాశం ఇవ్వలేదు’ అని చెప్పారు.

సంతకాలు అభ్యంతరకరం

వాదనలు విన్న న్యాయమూర్తి.. ‘చట్టపరమైన అవకాశం ఉన్నప్పుడు పిటిషన్లు వేయకుండా అడ్డుకోవడం సాధ్యం కాదు. నివేదికలపై సంతకాలు కూడా అభ్యంతరకరం’అని అన్నారు. గాయపడిన వారి వివరాల్లో ప్రశ్నార్థకాలు ఎందుకున్నాయని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ప్రాథమిక సమాచారం తీసుకునే క్రమంలో అలా పేర్కొన్నారని పీపీ బదులిచ్చారు. ఈ సందర్భంగా విచారణ తీరుపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. వాదనలు పూర్తి కావడంతో తీర్పు రిజర్వు చేశారు. కాగా, లగచర్ల ఘటనపై మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం చటవిరుద్ధమంటూ నరేందర్‌రెడ్డి భార్య శ్రుతి హైకోర్టులో మరో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ నేడు జస్టిస్‌ కె.లక్ష్మణ్‌ ముందు విచారణకు రానుంది.

రేవంత్‌రెడ్డి ఏడో గ్యారంటీ.. భూములు లాక్కోవడమేనా?

- ఫార్మా కంపెనీల కోసం గిరిజనుల భూములే దొరికాయా: సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం


తమ్మినేనికి దాడి ఘటన గురించి వివరిస్తున్న బాధితురాలు


దుద్యాల్‌/బొంరాస్‌పేట: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల తర్వాత.. ఏడో గ్యారంటీ భూములు లాక్కోవడమేనా అని తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. కొడంగల్‌లోని పులిచర్లకుంటతండాలో గురువారం ఆయన ఫార్మా బాధితులతో మాట్లాడారు. కొడంగల్‌ ప్రాంతానికి సీఎం ప్రకటించిన నారాయణపేట– కొడంగల్‌ ఎత్తిపోతల ప్రాజెక్టు ఫార్మా కంపెనీల కోసమేనా అని నిలదీశారు. ఫార్మా భూముల విషయమై తాను సేకరించిన గిరిజనుల అభిప్రాయాలను సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తానన్నారు.

సంక్షేమం వదిలి..సంక్షోభం తేవొద్దు

‘సంక్షేమంతో పాలించిన ప్రభుత్వం.. సంక్షోభం తేవొద్దు.. రైతులను కన్నీళ్లు పెట్టించిన ఏ ప్రభుత్వమూ మనలేదు.. రెండు పంటలు పుష్కలంగా పండుతున్న పొలాల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటు చట్టవిరుద్ధం.. సాగుకు యోగ్యంగా లేని భూముల్లో కంపెనీలు ఏర్పాటు చేయాలి. గిరిజనుల భూముల్లో ఫార్మా ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసి, రైతులకు క్షమాపణ చెప్పాలి’అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. వికారాబాద్‌ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, రోటిబండతండాలకు చెందిన ఫార్మా బాధిత కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. ఫార్మా ఏర్పాటుపై గిరిజనుల కుటుంబ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. కొడంగల్‌లో దాదాపు 1,156 ఎకరాల సీలింగ్‌ భూములు ఉన్నా, వాటిని వదిలేసి అమాయక గిరిజనుల భూముల్లోనే ఫార్మా కంపెనీలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీలింగ్‌ భూముల విషయం సీఎం రేవంత్‌రెడ్డికి తెలుసన్నారు. వీటిని పేదలకు పంచాలని గతంలో ఆయనే పలుమార్లు డిమాండ్‌ చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పశ్య పద్మ, పాపన్న, గోవర్ధన్‌ రమ, అన్వేశ్‌, విజయలక్ష్మి, డీజీ నర్సింలు, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువనేతన్న ఆత్మహత్య

- సిరిసిల్లలో విషాద ఘటన


సంతోష్‌


సిరిసిల్లటౌన్‌: సిరిసిల్లలో మైక్రోఫైనాన్స్‌ ఉచ్చుకు యువనేతన్న బలయ్యాడు. జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌లో ఉండే దుంపేటి లలిత, భూమయ్య దంపతులకు స్వప్న, సంధ్య అనే కూతుళ్లు, సంతోష్‌ (25) అనే కొడుకు ఉన్నారు. భూమయ్య సాంచాలు నడుపుతుండగా భార్య బీడీలు చేస్తుంది. చేనేత పనుల్లో వైపని కార్మికుడిగా పని చేసే సంతోష్‌ సరైన పనుల్లేక జీవనోపాధికోసం ప్రస్తుతం ఎలక్ట్రీషియన్‌గా మారాడు. మూడు నెలల క్రితం రెండో అక్క సంధ్య పెళ్లికి, కుటుంబ అవసరాల కోసం సంతోష్‌ 4 మైక్రోఫైనాన్స్‌ సంస్థల్లో రూ.6 లక్షల వరకు అప్పు చేశాడు. బుధవారం ఓ మైక్రోఫైనాన్స్‌ సంస్థకు రూ.2,700 చెల్లించాలని తెలిసిన వాళ్లను అప్పు అడగ్గా, డబ్బులు సమకూరలేదు. దీంతో అతను అప్పులు తీర్చే దారి కనిపించక ఇంట్లోనే ఉరేసుకుని చనిపోయాడు.

ఈ అరటి పండు రూ. 52 కోట్లు

వీధుల్లో దొరికే పెద్ద సైజు అరటి పండు ఒకటి మహా అంటే ఐదారు రూపాయలు ఉంటుందేమో. అందులోనూ ఇంట్లో పిల్లాడు ఆడుకుంటూ ఒక అరటి పండును గోడకు ఒక గట్టి టేప్‌తో అతికించాక దాని విలువ ఎంత అంటే.. అనవసరంగా పండును పాడుచేశావని పిల్లాడిని అంతెత్తున కోప్పడతాం. అయితే అచ్చం అలాంటి అరటి పండునే, అలాగే ఒక ఫ్రేమ్‌కు గట్టి టేప్‌తో అతికిస్తే ఒక ఔత్సాహిక కళా ప్రేమికుడు ఏకంగా రూ.52 కోట్లు పెట్టి కొన్నారంటే నమ్మగలరా?. కానీ ఇది వంద శాతం వాస్తవం. అచ్చంగా అమెరికాలోని న్యూయార్క్ నగరంలో బుధవారం జరిగిన వేలంపాటలో ఇది 6.2 మిలియన్ అమెరికన్ డాలర్లకు అమ్ముడుపోయింది. చిత్రమైన కళాఖండాలు సృష్టించే ఇటలీ కళాకారుడు మారిజో కాటెలాన్ మనోఫలకం నుంచి జాలువారి ఫ్రేమ్‌కు అతుక్కున్న కళాఖండమిది అని అక్కడి కళాపోషకులు ఆయనను పొగడ్తల్లో ముంచెత్తడం విశేషం. పాశ్చాత్య కళాకారుల్లో చిలిపివాడిగా మారిజోకు పేరుంది. బుధవారం ప్రఖ్యాత 'సోత్‌బే' వేలం సంస్థ నిర్వహించిన వేలంపాటలో మరో ఆరుగురు బిడ్డర్లను వెనక్కినెట్టి మరీ చైనాకు చెందిన క్రిప్టోకరెన్సీ యువ వ్యాపారవేత్త జస్టిన్ సన్ ఈ కళాఖండాన్ని ఇన్ని డబ్బులు పోసిమరీ సొంతం చేసుకున్నారు. '' ఇలాంటి అపూర్వ కళాఖండాలంటే నాకెంతో ఇష్టం. ఈ అరటి పండును చూస్తుంటే తినాలనిపిస్తుంది. త్వరలో దీనిని అమాంతం ఆరగిస్తా' అని జస్టిన్ సన్ సరదాగా వ్యాఖ్యానించారు. అమెరికాలో అత్యున్నత శ్రేణి పండ్ల దుకాణంలో దాదాపు రూ.30 ఉండే ఈ ఒక్క అరటి పండు ఇంతటి ధర పలకడం ప్రపంచవ్యాప్తంగా కళాఖండాలను కొనే వ్యాపారులనూ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఊహించిన ధర కంటే నాలుగు రెట్లు అధిక ధరకు అమ్ముడుపోయిందని సోత్‌బే సంస్థ పేర్కొంది. వేలంపాటల చరిత్రలో ఒక ఫలం ఇంతటి ధర పలకడం ఇదే తొలిసారి అని వేలంపాట వర్గాలు వెల్లడించాయి. 2019లో మియామీ బీచ్‌లోని ఆర్ట్ బాసెల్ షోలో తొలిసారిగా 'కమేడియన్' పేరిట ఈ పండును ప్రదర్శించారు. దానిని చూసినవారంతా 'అసలు ఇదేం ఆర్ట్?. దీనిని కూడా ఆర్ట్ అంటారా?' అంటూ పలువురు విమర్శించారు. అయితే ఐదేళ్ల క్రితమే ఇది 1,20,000 డాలర్ల ధర పలికి ఔరా అనిపించింది. గతంలో వచ్చిన విమర్శలపై తాజాగా జస్టిన్ సన్ స్పందించారు. '' ఈ ఘటనను కేవలం కళగానే చూడకూడదు. ఇదొక సాంస్కృతిక ధోరణుల్లో మార్పుకు సంకేతం. కళలు, మీమ్స్, క్రిప్టో కరెన్సీ వర్గాల మధ్య వారధిగా దీనిని చూడొచ్చు. పండు ఇంతటి ధర పలకడం ఏంటబ్బా ? అని మనుషుల ఆలోచనలకు, చర్చలకు ఇది వేదికగా నిలుస్తుంది. చరిత్రలోనూ స్థానం సంపాదించుకుంటుంది' అని జస్టిన్ వ్యాఖ్యానించారు.

మారుతున్న పండు !

వాస్తవానికి 2019లో ప్రదర్శించిన పండు ఇది కాదు. 2019లో దీనిని ప్రదర్శించినపుడు అది



పాడయ్యేలోపే అక్కడి కళాకారుడు డేవిడ్ డట్యూనా తినేశాడు. ఆకలికి ఆగలేక గుటకాయ స్వాహా చేశానని చెప్పాడు. ''ప్రపంచంలో క్షుద్బాధతో ఎంతో మంది అల్లాడుతుంటే పోషకాల పండును ఇలా గోడకు అతికిస్తారా?. అయినా 20 సెంట్లు విలువచేసే పండు నుంచి కోట్లు కొల్లకొ డుతున్న ఈ కళాకారుడు నిజంగా మేధావి'' అని డేవిడ్ వ్యాఖ్యానించాడు. 1,20,000 డాలర్లకు అమ్ముడుపోయాక దీనిని ఆయన తిన్నారు. తర్వాత మరో పండును ప్రదర్శనకు పెట్టారు. దానిని గత ఏడాది దక్షిణకొరియాలోని సియోల్ సిటీలోని 'లీయిమ్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్'లో ప్రదర్శనకు ఉంచినపుడు నోహ్ హుయాన్ సో అనే విద్యార్థి తినేశాడు. ఇప్పుడు వేలంపాటలో అమ్ముడుపోయింది కొత్త పండు. అత్యంత గట్టిగా అతుక్కునే 'డక్ట్' టేప్‌తో ఫ్రేమ్‌కు ఈ పండును అతికించారు. ఈ కళాఖండాన్ని సృష్టించిన మారిజో కాటెలాన్ గతంలో ఇలాంటి వింత కళారూపాలను తయారుచేశారు. 18 క్యారెట్ల పుత్తడితో నిజమైన టాయిలెట్‌ను రూపొందించారు. దానికి 'అమెరికా' అని పేరు పెట్టారు. దీనిని ప్రదర్శనకు పెట్టుకుంటే అప్పుగా ఇస్తానని కాబోయే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఈయన గతంలో ఒక ఆఫర్ కూడా ఇచ్చాడట.

కొన్న వ్యక్తిపై గతంలో ఆరోపణలు

పండును కొనుగోలుచేసిన జస్టిన్ సన్ ప్రస్తుతం చైనాలో ట్రోన్ పేరిట బ్లాక్‌చైన్ నెట్‌వర్క్ వ్యాపారం చేస్తున్నారు. కొన్ని క్రిప్టోకరెన్సీల లావాదేవీలను పర్యవేక్షిస్తున్నారు. ట్రోన్ క్రిప్టో టోకెన్ అయిన టీఆర్‌ఎస్ విలువను కృత్రిమంగా అమాంతం పెంచేసి మోసానికి పాల్పడుతున్నాడని జస్టిన్‌పై అమెరికా ప్రభుత్వం ఆరోపించింది. ఈ మేరకు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ కేసు కూడా వేసింది. అయితే ఆ ఆరోపణలను జస్టిన్ తోసిపుచ్చారు. 2021–23లో ఈయన ప్రపంచ వాణిజ్య సంస్థలో గ్రెనడే దేశ శాశ్వత ప్రతినిధిగా ఉన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఉక్రెయిన్‌పైకి ఖండాంతర క్షిపణి

- ప్రయోగించిన రష్యా
- యుద్ధంలో తొలిసారిగా ఐసీబీఎంతో దాడి

కీవ్: అమెరికా తొలిసారిగా అందించిన శక్తివంత దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యా మీదకు ప్రయోగించిన ఉక్రెయిన్ ఊహించని దాడిని ఎదుర్కొంది. యుద్ధంలో ఎన్నడూలేని విధంగా తొలిసారిగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ఉక్రెయిన్ భూతలం మీదకు రష్యా ప్రయోగించింది. అభివృద్ధిచేశాక పరీక్ష కోసం పలుదేశాలు ఎన్నోసార్లు ఈ రకం క్షిపణులను ప్రయోగించినా యుద్ధంలో వినియోగించడం మాత్రం ఇదే తొలిసారికావడం గమనార్హం. మధ్యతూర్పు ఉక్రెయిన్‌లోని డినిప్రో నగరంపైకి బుధవారం రాత్రి ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్(ఐసీబీఎం) వచ్చి పడిందని ఉక్రెయిన్ టెలిగ్రామ్ మెసెంజింగ్ యాప్‌లో ప్రకటించింది. వేయి కిలోమీటర్ల దూరంలో రష్యాలో కాస్పియన్ సముద్రతీర ఆస్ట్రాఖన్ ప్రాంతం నుంచి అది దూసుకొచ్చిందని ఉక్రెయిన్ వాయుసేన పేర్కొంది. అయితే ఆ క్షిపణి సృష్టించిన విధ్వంసం, జరిగిన ఆస్తి, ప్రాణనష్టం వివరాలను ఉక్రెయిన్ వెల్లడించలేదు. '' ఐసీబీఎంతోపాటు కింజార్ హైపర్‌సోనిక్ క్షిపణి, ఏడు కేహెచ్–101 క్రూజ్ క్షిపణులు వచ్చిపడ్డాయి. వీటిలో ఆరింటిని గాల్లోనే ధ్వంసం



రష్యా క్షిపణి దాడి అనంతరం ఉక్రెయిన్‌లోని డినిప్రోలో మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చేశాం. ఈ దాడిలో ఇద్దరు ఉక్రేనియన్లు గాయపడ్డారు. ఒక కర్మాగారం దెబ్బతింది. వికలాంగుల కోసం ఏర్పాటుచేసిన పునరావాసన శిబిరం నాశనమైంది' అని స్థానిక యంత్రాంగం పేర్కొంది. అయితే ఆర్‌ఎస్–26 రూబెజ్ రకం ఐసీబీఎంను రష్యా ప్రయోగించి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆర్‌ఎస్–26 క్షిపణి ఏకంగా 800 కేజీల మందుగుండును మోసుకెళ్లగలదు. 5,800 కిలోమీటర్ల దూరం ప్రయాణించి అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించగలదు. ఈ క్షిపణితోపాటు మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ–ఎంట్రీ వెహికల్స్(ఎంఐఆర్‌వీ) సాంకేతికతనూ రష్యా వాడినట్లు తెలుస్తోంది. యుద్ధంలో ఎంఐఆర్‌వీ టెక్నాలజీని వాడటం ఇదే తొలిసారి.

క్షిపణితో హెచ్చరించారా?

సాధారణంగా ఐసీబీఎంలను అణ్వస్త్రాల వంటి భారీ బాంబులను ప్రయోగించడానికి వినియోగిస్తారు. సాధారణ మందుగుండుతో రష్యా గురువారం ఐసీబీఎంను ప్రయోగించడం వెనుక వేరే ఉద్దేశ్యం ఉందని రక్షణరంగ నిపుణులు చెబుతున్నారు. అమెరికా నుంచి అందుకున్న అత్యాధునిక దీర్ఘశ్రేణి క్షిపణుల అండ చూసుకుని విచక్షణారహితంగా తమపై దాడులకు తెగబడితే అణ్వాయుధం ప్రయోగించేందుకైనా వెనుకాడబోమని హెచ్చరించేందుకే రష్యా ఇలా ఐసీబీఎంను ప్రయోగించి ఉంటుందని భావిస్తున్నారు. అణ్వస్త్ర వినియోగానికి సంబంధించిన దస్త్రంపై సంతకం చేసిన రెండు రోజులకే రష్యా ఉక్రెయిన్‌పైకి తొలిసారిగా ఖండాంతర క్షిపణిని ప్రయోగించడం గమనార్హం. '' ఉక్రెయిన్ నుంచి దూసుకొచ్చిన రెండు బ్రిటన్ తయారీ స్టార్మ్ షాడో క్షిపణులు, ఆరు హిమార్స్ రాకెట్లు, 67 డ్రోన్లను నేలకూల్చాం'' అని గురువారం రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. స్టార్మ్‌షాడో క్షిపణులను తమ గగనతలరక్షణ వ్యవస్థలు కూల్చేశాయని రష్యా ప్రకటించడం ఇదే తొలిసారి. అయితే గురువారం ఉక్రెయిన్‌పై ఏ రకం ఖండాంతర క్షిపణిని ప్రయోగించారో, అసలు ప్రయోగించారో లేదో అన్న విషయాన్ని రష్యా వెల్లడించలేదు. ఇతర వివరాలు తెలిపేందుకు రష్యా రక్షణశాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా సాధారణ పత్రికా సమావేశంలో మాట్లాడుతుండగా ఆమెకు ఫోన్‌కాల్ వచ్చింది. '' మనం ప్రయోగించిన ఖండాంతర క్షిపణి గురించి పశ్చిమదేశాలు అప్పుడే మాట్లాడటం మొదలెట్టాయి. ఐసీబీఎంను వాడిన విషయాన్ని ప్రెస్‌మీట్‌లో ప్రస్తావించొద్దు'' అని సంబంధిత ఉన్నతాధికారులు ఆమెకు ఫోన్‌లో చెప్పారు. సంబంధిత వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

ఏమిటీ ఖండాంతర క్షిపణి?



సుదూరంలోనే శత్రుస్థావరాలను తుదముట్టించేందుకు ఖండాంతర క్షిపణి ఉపయోగపడుతుంది. 5,500 కిలోమీటర్లకు మించి ప్రయాణించగలవు. అణు, రసాయన, జీవాయుధాలను మోసుకెళ్లగలవు. సంప్రదాయక వార్‌హెడ్‌నూ మోస్తాయి. రష్యా వాడినట్లుగా చెబుతున్న ఆర్‌ఎస్26 రూబెజ్ క్షిపణి ఎంఐఆర్‌వీ టెక్నాలజీతో పనిచేసే ఘన ఇంధన మిస్సైల్. 2011 దీనిని అభివృద్ధిచేసి 2012లో తొలిసారి విజయవంతంగా పరీక్షించారు. అది ఆనాడు 5,800 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని తుత్తునియలు చేసింది. ద్రవ ఇంధనంతో పోలిస్తే ఘన ఇంధన క్షిపణులను వాడటం చాలా తేలిక. నేలమాళిగ, మొబైల్ లాంఛర్ నుంచి సులభంగా ప్రయోగించవచ్చు. ఇందులోని ఇంధనం, ఆక్సిడైజర్‌లను రబ్బర్‌లాంటి దానితో కలిపి మిశ్రమంగా తయారుచేసి ఒక గట్టి పెట్టెలో అమర్చుతారు. ప్రొపెలంట్ మండగానే ఇంధన ప్రజ్వలన రెప్పపాటులో భారీగా జరిగి క్షిపణి శరవేగంగా దూసుకుపోతుంది. ఇంద్రధనస్సులాగా అర్ధచంద్రాకృతిలో ప్రయాణిస్తుంది. దాదాపు 4,000 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లిన తర్వాత వేగంగా కిందకు పడపోవడం మొదలవుతుంది. ఈ దశలో ఇది ఏకంగా ధ్వని వేగానికి పది రెట్లు వేగంగా దూసుకొస్తుంది. ఎంఐఆర్‌వీ టెక్నాలజీతో ఒకే క్షిపణిలో వేర్వేరు వార్‌హెడ్‌లను ఒకేసారి ప్రయోగించవచ్చు. ఇవి వేర్వేరు లక్ష్యాలను ఛేదించగలవు. వందల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఇవి ఢీకొట్టగలవు. ఒకేసారి ప్రయోగించిన రెండు వార్‌హెడ్‌ల మధ్య దూరం 1,500 కిలోమీటర్ల దూరం ఉన్నాసరే వాటిని క్షిపణి ఖచ్చిత దిశలో జారవిడచగలదు.

తొలుత కనిపెట్టిన అమెరికా

ఎంఐఆర్‌వీ టెక్నాలజీని తొలుత అమెరికా అభివృద్ధిచేసింది. 1970లో ఐసీబీఎంను పరీక్షించింది. 1971లో జలాంతర్గామి వెర్షన్‌లో ఎస్‌సీబీఎంను పరీక్షించింది. ఈ సాంకేతికతను 1970 చివర్లో నాటి సోవియట్ రష్యా అభివృద్ధిచేసింది. దీని సాయంతో ఐసీబీఎం, జలాంతర్గామి వెర్షన్ ఎస్‌ఎల్‌బీఎంను రూపొందించింది. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంలో భాగంగా అమెరికా, రష్యాలు స్వల్ప, దీర్ఘ, ఖండాంతర క్షిపణులను ధ్వంసంచేశాయి. 1991 జూన్ ఒకటోతేదీలోపు మొత్తంగా 2,692 క్షిపణులను నాశనంచేశాయి. అయితే ఈ ఒప్పందం నుంచి 2019లో అమెరికా వైదొలగింది.

ప్రజాస్వామ్యం మానవత్వం ప్రథమం

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- స్వార్థం, విస్తరణవాదాన్ని భారత్ నమ్ముకోలేదని వెల్లడి
- గయానా ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ప్రసంగం

జార్జిటౌన్: ప్రపంచ శాంతి, సౌభాగ్యాలే లక్ష్యంగా 'ప్రజాస్వామ్యం ప్రథమం, మానవత్వం ప్రథమం ' అనే సరికొత్త పిలుపును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చారు. అంతరిక్షం, సముద్రం అనేవి అంతర్జాతీయంగా పరస్పర సహకారానికి, అభివృద్ధికి వేదికలు కావాలి తప్ప సంఘర్షణలు, యుద్ధాలకు కాదని తేల్చిచెప్పారు. గురువారం గయానా దేశ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. స్వార్థం, విస్తరణవాదం అనే సంకుచిత ధోరణిని భారత్ ఏనాడూ నమ్ముకోలేదని అన్నారు. విస్తరణవాదంతో ముందుకెళ్లాలన్న ఉద్దేశం తమకు లేదన్నారు. వనరుల దోపిడీ అనే ఆలోచనకు భారత్ దూరంగా ఉంటుందని వివరించారు. మూడు దేశాల పర్యటన భాగంగా ప్రధాని మోదీ గయానాలో పర్యటించారు. గయానా



పార్లమెంట్‌లో ఆయన ఇంకా ఏం చెప్పారంటే... ''ప్రపంచం ప్రగతి పథంలో ముందుకు సాగాలంటే 'ప్రజాస్వామ్యం ప్రథమం, మానవత్వం ప్రథమం' అనే సూత్రాన్ని అనుసరించాలి. అదే మనకు తారకమంత్రం. మనతోపాటు అందరినీ కలుపుకొని వెళ్లాలని, అందరి అభివృద్ధిలో మనం సైతం భాగస్వాములం కావాలని ప్రజాస్వామ్యం ప్రథమం స్ఫూర్తి బోధిస్తోంది. మనం నిర్ణయాలు తీసుకోవడంలో మానవత్వం ప్రథమం అనే ఉద్దేశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. మానవత్వానికి తొలి ప్రాధాన్యం ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటే వచ్చే ఫలితాలతో మొత్తం మానవాళికి మేలు జరుగుతుంది. గ్లోబల్ సౌత్ దేశాలు మేల్కోవాల్సిన సమయం వచ్చింది. మనమంతా క్రియాశీలకంగా పనిచేయాలి. మనం ఒక్కతాటిపైకి రావాలి. మనం కలిసికట్టుగా పని చేస్తూ నూతన ప్రపంచ క్రమాన్ని(గ్లోబల్ ఆర్డర్) సృష్టించాలి. ప్రపంచం విషయానికొస్తే యుద్ధాలు, ఘర్షణలకు ఇది సమయం కాదు. యుద్ధాలకు దారితీస్తున్న పరిస్థితులను గుర్తించి, వాటిని రూపుమాపాల్సిన సమయం ఇది. భారత్–గయానా మధ్య గత 150 ఏళ్లుగా స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయి. భారత్ దృష్టిలో ప్రతి దేశమూ కీలకమైనదే. ఏ ఒక్కటీ తక్కువ కాదు. ద్వీప దేశాలను చిన్న దేశాలుగా పరిగణించడం లేదు. వాటిని అతిపెద్ద సముద్ర దేశాలుగా భావిస్తున్నాం. 'ప్రజాస్వామ్యం ప్రథమం, మానవత్వం ప్రథమం' అనే స్ఫూర్తితో భారత్ 'విశ్వబంధు'గా తన బాధ్యతను నిర్వర్తిస్తోంది. ప్రపంచంలో ఎక్కడైనా సంక్షోభాలు తలెత్తితే అందరికంటే మొదట భారత్ స్పందిస్తోంది' అని ప్రధాని మోదీ వివరించారు.

మోదీకి గయానా, డొమినికా అత్యున్నత పురస్కారాలు

జార్జిటౌన్: భారత ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం దక్కింది. గయానా, డొమినికా దేశాలు ఆయనను తమ అత్యున్నత జాతీయ పురస్కారాలతో సత్కరించాయి. కోవిడ్–19 మహమ్మారి ఉధృతి సమయంలో అందించిన సహాయంతోపాటు ప్రపంచ సౌభాగ్యానికి, తమ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఆయన చేసిన కృషికి గాను అత్యున్నత పురస్కారాలను ప్రదానం చేశాయి. గయానా రాజధాని జార్జిటౌన్‌లో గయానా అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ బుధవారం మోదీకి 'ద ఆర్డర్ ఆఫ్ ఎక్సలెన్స్' అవార్డు అందజేశారు. అంతకంటే ముందు డొమినికా అధ్యక్షుడు సిల్వానీ బర్టన్ 'డొమినికా అవార్డు ఆఫ్ హానర్'తో మోదీని సన్మానించారు. రెండు కరీబియన్ దేశాల అత్యున్నత పురస్కారాలు తనకు లభించడం పట్ల ప్రధానమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఈ రెండు పురస్కారాలను 140 కోట్ల మంది భారతీయులకు, ఆయా దేశాలతో కొనసాగుతున్న చరిత్రాత్మక ద్వైపాక్షిక సంబంధాలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.



ప్రధాని మోదీకి అవార్డును బహూకరిస్తున్న డొమినికా అధ్యక్షురాలు సిల్వానీ బర్టన్

అదానీని వెంటనే అరెస్ట్ చేయాలి

రాహుల్ గాంధీ డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అదానీకి చట్టాలు వర్తించవా? అని ప్రశ్నించారు. ప్రాజెక్టులను చేజిక్కించుకునేందుకు భారతీయ అధికారులు, నేతలకు గౌతమ్ అదానీ దాదాపు రూ.2,100 కోట్ల ముడుపులు ఇవ్వజూపారని, మోసానికి పాల్పడ్డారని అమెరికాలో కేసులు నమోదైన విషయం తెల్సిందే. ఈ అంశంపై రాహుల్ గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ''ముఖ్యమంత్రిని జైలుకు పంపిన మోదీ.. అదానీ రూ.2,000 కోట్ల కుంభకోణం చేసినా కాపాడుతున్నారు. భారత, అమెరికా చట్టాలను అదానీ ఉల్లంఘించారని స్పష్టమైంది. అదానీ ప్రాజెక్టులపై అనేక దేశాల్లో విచారణ జరుగుతోంది. అవినీతికి పాల్పడుతూ అదానీ భారత ప్రతిష్టను దిగజార్చుతున్నారు. ఇంత అవినీతికి పాల్పడి అదానీ ఇప్పటికీ దేశంలో స్వేచ్ఛగా ఎలా తిరుగుతున్నారు?'' అని రాహుల్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా

''సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతా. ఈ అంశంలో విపక్షాలన్నీ ఐక్యంగా పోరాడతాయి. అదానీ ముడుపుల ఉదంతంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలనేదే విపక్షాల ప్రధాన డిమాండ్. అదానీ తమ దేశంలో నేరాలకు పాల్పడ్డాడని అమెరికా విచారణ చెబుతోంది. కానీ అదానీపై భారత్‌లో ఎలాంటి చర్యలు లేవు. ఐక్యంగా ఉంటే క్షేమంగా ఉంటామని మోదీ ఇటీవల ఒక నినాదమిచ్చారు. అది ఆయనకు, అదానీకే వర్తిస్తుందని ఇప్పుడు అర్థమైంది. ఐక్యంగా ఉంటూ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. ప్రధాని విశ్వసనీయత ఈ ఉదంతంలో ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోయింది. ప్రస్తుతం భారత్ అదానీ గుప్పిట్లో చిక్కుకుంది. ఇది రాజకీయ, ఆర్థిక, పాలనాయంత్రాంగాల విష వలయం. సెబీ చీఫ్ మాధబీ పురీ బుచ్‌ను వెంటనే ఆ పదవి నుంచి తప్పించి విచారణ జరిపించాలి. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఈ అంశాన్ని దేశ ప్రజల ముందు ఉంచడం నా బాధ్యత'' అని రాహుల్ డిమాండ్ చేశారు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా సంజయ్‌మూర్తి ప్రమాణ స్వీకారం

'కాగ్' బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు అధికారిగా రికార్డు

సాక్షి, న్యూఢిల్లీ: కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)గా తెలుగు అధికారి కొండ్రు సంజయ్‌మూర్తి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, పీయూష్ గోయల్ తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం తర్వాత సంజయ్‌మూర్తి సంబంధింత పత్రాలపై సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. 'కాగ్'గా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు అధికారిగా సంజయ్ మూర్తి రికార్డుకెక్కారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సంజయ్ మూర్తి 1964 డిసెంబర్ 24న జన్మించారు. మెకానికల్ ఇంజనీరింగ్ చదివారు. 1989 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్‌గా హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. తొలుత ఎక్కువ కాలం హిమాచల్ ప్రదేశ్‌లో, ఆ తర్వాత కేంద్ర సర్వీసుల్లో సేవలందించారు. 2021 సెప్టెంబర్‌లో జాతీయ ఉన్నత విద్యా మండలి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఐఏఎస్ అధికారిగా మరో నెల రోజుల్లో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది.



బాధ్యతలు స్వీకరిస్తున్న సంజయ్ మూర్తి

సంజయ్‌మూర్తి ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనను ప్రతిష్టాత్మక కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవిలో నియమించింది. ఈ పదవిలో నియమితులైన అధికారులు గరిష్టంగా ఆరేళ్ల వరకూ లేదా 65 ఏళ్ల వయసు వచ్చేదాకా పనిచేయవచ్చు. సంజయ్‌మూర్తి తండ్రి కె.ఎస్.ఆర్.మూర్తి గతంలో అమలాపురం ఎంపీగా పనిచేశారు.

నెతన్యాహుపై అరెస్టు వారెంట్

- జారీ చేసిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు
- ఇజ్రాయెల్ మాజీ రక్షణ మంత్రి, హమాస్ నేతలపైనా వారెంట్లు
- ఐసీసీ తీరును ఖండించిన నెతన్యాహు

ద హేగ్: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ) గురువారం అరెస్టు వారెంట్లు జారీ చేసింది. అలాగే ఇజ్రాయెల్ రక్షణ శాఖ మాజీ మంత్రి యోవ్ గల్లాంట్‌తోపాటు పలువురు హమాస్ నేతలపైనా వారెంట్లు జారీ చేసింది. బెంజమిన్, గల్లాంట్ గాజాలో మారణహోమం సాగించారని, మానవత్వంతో దాడి చేశారని ఐసీసీ ఆక్షేపించింది. హత్యలు చేయడం, సాధారణ ప్రజలను వేధించడం వంటి అమానవీయ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించింది. గాజాలో ప్రజలకు ఆహారం, నీరు, ఔషధాలు, విద్యుత్, ఇంధనం, ఇతర నిత్యావసరాలు అందకుండా ఆంక్షలు విధించారని, అమాయకుల మరణానికి కారకులయ్యారని మండిపడింది. నెతన్యాహు, గల్లాంట్ చర్యల వల్ల ఎంతోమంది మహిళలు, చిన్నారులు బలయ్యారని ఉద్ఘాటించింది. పౌష్టికాహారం, నీరు అందక, డీహైడ్రేషన్‌తో పసిబిడ్డలు మరణించారని పేర్కొంది. నెతన్యాహు, గల్లాంట్ ఉద్దేశపూర్వకంగానే సామాన్య ప్రజలపై వైమానిక దాడులు చేసినట్లు చెప్పడానికి సహేతుకమైన ఆధారాలను గుర్తించామని వివరించింది. గాజాలో నెలకొన్న మానవతా సంక్షోభానికి నెతన్యాహు, గల్లాంట్ బాధ్యత వహించాలని తేల్చిచెప్పింది. యుద్ధ నేరాల్లో నెతన్యాహు నిందితుడని స్పష్టం చేసింది. గాజాలో 2023 అక్టోబర్ 8 నుంచి 2024 మే 20వ తేదీ దాకా నెలకొన్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నెతన్యాహు, గల్లాంట్‌పై అరెస్టు వారెంట్లు జారీ చేసింది. అలాగే గాజాలో భీకర యుద్ధానికి, సంక్షోభానికి కారణమయ్యారంటూ హమాస్ నేతలపైనా అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. హమాస్ అగ్రనేతలు మొహమ్మద్ డెయిఫ్, యహ్యా సిన్వర్, ఇస్మాయిల్ హనియేను అరెస్టు చేయాలని ఐసీసీ స్పష్టంచేసింది. అయితే, యహ్యా సిన్వర్, ఇస్మాయిల్ హనియే ఇప్పటికే ఇజ్రాయెల్ దాడుల్లో మృతిచెందిన సంగతి తెలిసిందే.



ఇప్పుడేం జరగొచ్చు?

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి, రక్షణ శాఖ మాజీ మంత్రిపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్టు వారెంట్లు జారీ చేయడంతో ఇప్పుడేం జరుగుతుందన్న చర్చ మొదలైంది. ఐసీసీ అరెస్టు వారెంట్లు జారీ చేయడంతో నెతన్యాహు, గల్లాంట్ ఇప్పుడు అంతర్జాతీయంగా వాంటెడ్ నిందితులుగా మారారు. ప్రపంచ దేశాల అధినేతలు వారికి మద్దతు ఇవ్వడానికి వీల్లేదు. అదే జరిగితే అంతర్జాతీయంగా నెతన్యాహు, గల్లాంట్ ఒంటరవుతారు. చివరకు గాజాలో కాల్పుల విరమణ ప్రక్రియ ప్రారంభించే ప్రయత్నాలు మరింత సంక్లిష్టంగా మారుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వర్గపోరాటంలో అమాయకులు బలి

- వాహనాలపై విచక్షణారహితంగా కాల్పులు
- 50 మంది దుర్మరణం
- 20 మందికి గాయాలు
- పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులో దాడి

పెషావర్: షియా, సున్నీ గిరిజన వర్గాల మధ్య ఏడాదికాలంగా జరుగుతున్న పోరులో తాజాగా అమాయక ప్రజలు బలయ్యారు. గురువారం ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని కుర్రం జిల్లాలో పర్వతమయ ప్రాంతాల గుండా వెళ్తున్న సాధారణ ప్రయాణికుల వాహన శ్రేణిపై సాయుధ మిలిటెంట్లు రోడ్డుకు ఇరువైపులా నిలబడి బుల్లెట్ల వర్షం కురిపించారు. దీంతో 50 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 20 మంది గాయపడ్డారు. ప్రాణభయంతో కొందరు వాహనాల సీట్ల కింద దాక్కుని ప్రాణాలు కాపాడుకున్నారు. మృతులంతా మైనారిటీ షియా వర్గానికి చెందిన వాళ్లేనని స్థానికులు చెబుతున్నారు. గత కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో షియా, సున్నీ గిరిజన సాయుధ ముఠాల మధ్య పరస్పర దాడులు, ఘర్షణలు జరుగుతున్నాయి. తాజాగా గిరిజన మండలి ఒకటి కాల్పుల విరమణకు పిలుపునిచ్చాక ఈ మార్గంలో ఇటీవల పౌరుల రాకపోకలు మొదలయ్యాయి. పౌర వాహనాలకు రక్షణగా పోలీసు వాహనం ముందుగా ఎస్కార్ట్‌గా బయల్దేరగా దానిపై తొలుత మిలిటెంట్లు కాల్పులు జరిపారు. కాల్పులు జరిపింది తామేనని ఇంతవరకు ఏ ముఠా ప్రకటించుకోలేదు. అయితే తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్ ఉగ్రసంస్థే ఈ కాల్పులకు పాల్పడి ఉంటుందని స్థానిక పాత్రికేయులు చెబుతున్నారు. పరాచినార్ నుంచి పెషావర్‌కు కాన్వాయ్‌గా వెళ్తున్న 50 వాహనాలపై ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఒకే దాడిలో ఇంతమంది మరణించడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి.



ప్రముఖులకు గగనతల దాడుల ముప్పు

ముష్కర మూకలు తెలివి మీరుతున్నాయి... ఓ పక్క ఉగ్రవాదులు, మరోపక్క తీవ్రవాదులు గగనతల దాడులకు కుట్ర పన్నుతున్నారు. -8లో



కుట్టు.. ఫొటో ఆకట్టు..

బ్లాక్ అండ్ వైట్ ఫొటోలకు ఎంబ్రాయిడరీ వర్క్‌తో కొత్త లుక్ తీసుకొస్తున్నారు. ఫొటోలకు ఎంబ్రాయిడరీ ఏంటని ఆశ్చర్యపోయేలా వర్క్ చేస్తున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/15.0

నగరంలో శుక్రవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 29, కనిష్టంగా 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

5 నెలల్లో 1,884 ఫైళ్లు క్లియర్

హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణాలు, లే అవుట్ అనుమతుల్లో వేగం పెంచినట్లు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి అక్టోబర్ వరకు 1,884 ఫైళ్లను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. గత ఏడాది ఇదే కాలంలో 1,356 ఫైళ్లను పరిష్కరించగా ఈసారి 14.4 శాతం అదనంగా పరిష్కారం అయ్యాయన్నారు. 39 శాతం ఫైళ్లు అదనంగా వచ్చాయన్నారు. గత సంవత్సరం ఇదే కాలంలో దరఖాస్తుదారులు టీజీబీపాస్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎలాంటి జాప్యానికి తావు లేకుండా 10 రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. ఏ రోజుకారోజు ఫైళ్ల పురోగతిని సమీక్షిస్తున్నట్లు చెప్పారు. వారానికోసారి పెండింగ్ ఫైళ్లపై సమీక్ష నిర్వహించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

పెరిగిన చలి

సాక్షి, సిటీబ్యూరో: నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో చలి పెరిగింది. తెల్లవారుజామున పొగ మంచు కమ్మేస్తోంది. పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. రాత్రి వేళ కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గురువారం రాత్రి చలి తీవ్రత పెరిగింది. సగటున కనిష్ఠ ఉష్ణోగ్రత 15.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. శివార్లలో మాత్రం అత్యల్పంగా సగటున 12.4 డిగ్రీల సెల్సియస్ రికార్డు అయింది. గురువారం పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రత 28.8 డిగ్రీలుగా నమోదైంది.

'స్మార్ట్' కళ్లద్దాలతో ఆత్మవిశ్వాసం: గవర్నర్



స్మార్ట్ కళ్లద్దాలు అందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


రాంగోపాల్‌పేట్: కంటిచూపు కరువైనవారి జీవితాల్లో వెలుగులు నింపాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ఏఐ బేస్డ్ స్మార్ట్ విజన్ గ్లాసెస్ (దృష్టి) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అంధుల జీవితాల్లో వెలుగులు నింపేలా స్మార్ట్ కళ్లద్దాలు ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. స్మార్ట్ గ్లాసులు అంధుల రోజువారీ జీవితాల్లోనూ ఎంతో ఉపయోగంగా ఉంటాయని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. స్మార్ట్ కళ్లద్దాలు రూపొందించడంలో పాలు పంచుకున్న శాస్త్రవేత్తలను గవర్నర్ అభినందించారు. వ్యక్తుల ముఖాల గుర్తింపుతో పాటు వారితో ధైర్యంగా మాట్లాడేందుకు ఈ కళ్లద్దాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ రూపొందించిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్మార్ట్ కళ్లద్దాలతో అంధులు తమచుట్టు పక్కల ప్రాంతాల్లో సులభంగా తిరగడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కేఏఫ్ఆర్‌సీ చైర్మన్ డాక్టర్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌మంథన్‌లో కళా కాంతులు





మాదాపూర్‌లోని శిల్పారామంలో గురువారం ప్రారంభమైన లోక్‌మంథన్‌లో సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, ఆహారం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత, సమాలోచనలు ఆకట్టుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల సంప్రదాయ క్రీడలు, అల్లికలు, వివిధ కళలను ప్రదర్శించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవంలో చర్మ వాయిద్యాల ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాదాపు 350కి పైగా పురాతన సంప్రదాయ సంగీత వాద్యాలు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. సందర్శకులతో పాటు నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు వీటిని ఉత్సాహంగా తిలకించారు. - మాదాపూర్



సందర్శకులను ఆకట్టుకున్న ఆవుదూడల ఫొటో స్టాల్

ఇదేం వి'చిత్ర'మో'

రూ.150 కోట్లతో రంగుల బొమ్మలు



ఫుట్‌పాత్ లేకపోవడంతో రోడ్డు పక్కనుంచి వెళ్తున్న ఓ పాదచారి



నగరంలో సక్రమంగా లేని నడక మార్గాలు

- పలుచోట్ల పాదచారులకు ప్రమాదాలు
- జంక్షన్ల సుందరీకరణతోనే సరిపెట్టొద్దు
- ఫుట్‌పాత్‌లకూ ప్రాధాన్యం ఇవ్వాలి
- గ్రేటర్‌లో 9 వేల కి.మీ పైగా రోడ్లు
- 900 కి.మీ. మేరనైనా కనిపించని కాలిబాటలు

గత అయిదేళ్లలో రోడ్డు ప్రమాదాల్లో మరణించిన పాదచారులు ఇలా..

సంవత్సరం	మరణాలు
2019	95
2020	72
2021	94
2022	123
2023	121

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో పలు జంక్షన్లు, రోడ్ల పక్కన గోడలు, ఫ్లై ఓవర్ల స్తంభాలు తదితర ప్రాంతాల్లో చూడచక్కని బొమ్మలు రంగుల హంగులతో చూపరులను కట్టి పడేస్తున్నాయి. నగరం అందంగా కనిపించేందుకు ఈ పనులు చేస్తుండటంపై ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ.. వీటితో పాటు పాదచారులు నడిచేందుకు నడక మార్గాలను ఏర్పాటు చేయాల్సిందిగా డిమాండ్లు వెలువడుతున్నాయి. గ్రేటర్ నగరంలో 9 వేల కిలోమీటర్లకు పైగా రోడ్లున్నప్పటికీ కనీసం 900 కిలోమీటర్ల మేరనైనా పాదచారులు నడిచేందుకు కాలిబాటలు (ఫుట్‌పాత్‌లు) లేవు. నగర అందాన్ని మాత్రం పట్టించుకుంటున్న అధికారులు, సంబంధిత యంత్రాంగం దాంతో పాటు ప్రజల సదుపాయాల్ని కూడా పట్టించుకుంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సుందరీకరణల కోసమే 224 ప్రాంతాల్లో దాదాపు రూ. 150 కోట్లతో పనులు చేపట్టారు. వీటిల్లో రూ.5.35 కోట్ల విలువైన రంగుల హంగుల సుందరీకరణ పనులు పూర్తికాగా, 209 ప్రాంతాల్లో పనులు పురోగతిలో ఉన్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నారు. ప్రజలను ఆకట్టుకునేలా ప్రత్యేకమైన థీమ్‌లతో చిత్రాలు వేస్తున్నామని, జంక్షన్లు, సెంట్రల్ మీడియన్లలో ప్రత్యేక ఆకర్షణగా శిల్పాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సీఆర్ఎంపీ మార్గాల్లోనూ లేవు..

సమగ్ర రోడ్డు నిర్వహణ ప్రాజెక్ట్ (సీఆర్ఎంపీ) కింద ప్రైవేటు ఏజెన్సీలకు రోడ్ల నిర్వహణ బాధ్యతలప్పగించిన ప్రాంతాల్లో అన్ని రోడ్లకూ ఫుట్‌పాత్‌లు కూడా ఉండాల్సినప్పటికీ.. ఆయా మార్గాల్లో సైతం ఇవి లేకుండాపోయాయి. అంతేకాదు.. సంబంధిత మార్గాల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం పనుల బాధ్యతలు కూడా సదరు ఏజెన్సీలవే. కానీ.. సదరు ఏజెన్సీలు ఆ పనులు చేయకున్నా, జీహెచ్ఎంసీ అధికారులు కూడా పట్టించుకోవడంలేదు. వచ్చే నెలాఖరుతో ఆయా ఏజెన్సీల నిర్వహణ గడువు తీరిపోనుంది. తిరిగి మళ్లీ సమగ్ర నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు సిద్ధమవుతున్న యంత్రాంగం.. గడువు ముగిసిపోతున్నా చేయని పనుల్ని మాత్రం పట్టించుకోలేదు.

◆ సీఆర్ఎంపీ పరిధిలో 525 మార్గాల్లో 812 కిలోమీటర్ల మేర రోడ్లు ఉండగా, వాటిలో 650 కిలోమీటర్ల మేర నడిచేందుకు సదుపాయంగా ఫుట్‌పాత్‌లు నిర్మించలేదు. ఇలా ఇటు సీఆర్ఎంపీ మార్గాల్లో కాంట్రాక్టు ఏజెన్సీలు కానీ, మిగతా ప్రాంతాల్లో అటు జీహెచ్ఎంసీ కానీ ఫుట్‌పాత్‌లు నిర్మించలేదు. పాదచారులను గురించి పట్టించుకోలేదు. నడకదారులు లేక పాదచారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలో రోడ్డు ప్రమాదాల బాధితుల్లో 40 శాతానికి పైగా పాదచారులే ఉండటం గమనార్హం. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినవారూ ఉన్నారు.

జూ పార్కుకు అయిదోసారి ఐఎస్ఓ సర్టిఫికెట్



బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కు వరుసగా అయిదోసారి ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) గుర్తింపు సర్టిఫికెట్ గుర్తింపు పొందింది. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శివయ్య ఐఎస్ఓ-9001:2015 సర్టిఫికెట్ 2024-2025ను గురువారం జూపార్కు కార్యాలయంలో తెలంగాణ జూపార్కుల డైరెక్టర్ డాక్టర్ సునీల్ హిరేమత్, జూపార్కు క్యూరేటర్ జె.వసంత బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా క్యూరేటర్ వసంత మాట్లాడుతూ.. మెరుగైన నిర్వహణ, ప్రణాళికాబద్ధమైన పెంపకం, సహకార పరిశోధన సామర్థ్యంతో పాటు వన్యప్రాణుల సంతానోత్పత్తి వంటివి తనిఖీ చేసిన అనంతరం ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను అందజేస్తారని తెలిపారు. వీటన్నింటిపై జూ పార్కు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో కనబర్చడంతో అయిదోసారి కూడా ఈ గౌరవం జూ పార్కుకు దక్కిందన్నారు.

నయా సాల్.. చలో టూర్

సరికొత్త పర్యాటక ప్రాంతాలపై నగర వాసుల ఆసక్తి

- విదేశాల్లో న్యూ ఇయర్ వేడుకలకు ప్రణాళికలు
- టర్కీ, కెన్యా, అజర్ బైజాన్ దేశాల ఎంపిక
- బ్యాంకాక్, సింగపూర్, మలేషియా, దుబాయ్‌లకూ డిమాండ్
- భారీగా పెరిగిన విమాన చార్జీలు

సాక్షి, సిటీబ్యూరో: నయా సాల్ జోష్ వచ్చేసింది. కొత్త సంవత్సర వేడుకల కోసం నగర వాసులు సరికొత్త పర్యాటక ప్రాంతాలపై ఆసక్తి చూపుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ పర్యటనల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. వీరి అభిరుచికి అనుగుణంగా పలు ట్రావెల్స్ సంస్థలు సైతంటూరిస్ట్ డెస్టినేషన్స్‌తో ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా ప్రతీ ఏటా ఎక్కువ మంది పర్యాటకులు సందర్శించే ప్రాంతాలతో పాటు ఈసారి టర్కీ, కెన్యా, అజర్ బైజాన్, మాల్దీవులు వంటి విదేశాలకు, గోవాతో పాటు కొచ్చిన్, కశ్మీర్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మరోవైపు ఆన్‌లైన్ అరైవల్ వీసా ఉన్న దేశాలకు కూడా పర్యాటకులు వెళ్తున్నారు. దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలు సైతంసిటీ టూరిస్టుల జాబితాలో చేరాయి.

ఇప్పటినుంచే బుకింగ్‌లు షురూ..

హైదరాబాద్ నుంచి ఏటా డిసెంబర్ చివరి వారంలో ఏదో ఒక నచ్చిన ప్రదేశానికి వెళ్లి కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికే సిటీజనులు.. ఈ ఏడాది కూడా న్యూ ఇయర్ వేడుకలకు 'చలో టూర్' అంటున్నారు. డిసెంబర్ చివరి వారంలో రానున్న వరుస సెలవులను దృష్టిలో ఉంచుకొని ఇప్పటినుంచే టూర్ బుకింగ్ చేసుకుంటున్నారు. ఈసారి గోవాతో పాటు కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లను సైతం ఎంపిక చేసుకుంటున్నారు. మరోవైపు విదేశీ టూర్‌లలో బ్యాంకాక్, మలేసియా, మాల్దీవులు, సింగపూర్, దుబాయ్ తదితర దేశాలకు యథావిధిగా డిమాండ్ ఉంది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సుమారు లక్ష మందికి పైగా ప్రయాణికులు బయలుదేరి వెళ్లనున్నట్లు అంచనా. దీంతో చార్జీలు బాగా పెరగనున్నాయి.

చార్జీలు తడిసి మోపెడు..

సాధారణంగా హైదరాబాద్ నుంచి బ్యాంకాక్‌కు వెళ్లి వచ్చేందుకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. కానీ ఇప్పుడు ఏకంగా రూ.60 వేలు దాటినట్లు ట్రావెల్స్ ఏజెన్సీలు చెబుతున్నాయి. వారం, పది రోజులు నుంచే బ్యాంకాక్‌కు బుకింగ్‌లు బాగా పెరిగినట్లు బంజారాహిల్స్‌కు చెందిన ఒక సంస్థ ప్రతినిధి తెలిపారు. 'కౌలాలంపూర్ పెట్రోనాట్స్ దగ్గర ఏటా నూతన సంవత్సర వేడుకలు అద్భుతంగా జరుగుతాయి. రంగు రంగుల బాణసంచా కాల్చుతారు. దీంతో ఆకాశమంతా హరివిల్లులు విరబూస్తాయి. ఆ వేడుకలను చూసేందుకు ఇంటిల్లిపాది వెళ్తున్నాం' అని కుషాయిగూడ ప్రాంతానికి చెందిన రాఘవ చెప్పారు. ప్రస్తుతం మలేసియాకు రూ.12,000 నుంచి ఏకంగా రూ.25,000 వరకు చార్జీలు పెరిగాయి. హైదరాబాద్ నుంచి దుబాయ్‌కు కూడా పెద్ద సంఖ్యలోనే వెళ్తున్నారు. దుబాయ్‌కు సాధారణంగా రూ.16,000 వరకు ఉంటుంది. ఇప్పుడు రూ.36,000 వరకు పెరిగిందని ట్రావెల్స్ సంస్థలు పేర్కొంటున్నాయి.



సోలో అయితేనే సో బెటర్

మరోవైపు నగరం నుంచి వివిధ దేశాలకు వెళ్లే ఒంటరి పర్యాటకుల సంఖ్య ఈ ఏడాది బాగా పెరగనుంది. సుమారు 28 శాతం ఒంటరిగా విదేశీ టూర్‌లకు వెళ్లనున్నట్లు అంచనా. తమకు నచ్చిన పర్యాటక ప్రాంతాల్లో ఏకాంతంగా గడపాలనే కోరిక, ఎలాంటి బాదరాబందీ లేకుండా ఎక్కడి నుంచి ఎక్కడికైనా తేలిగ్గా ప్రయాణించేందుకు అవకాశం ఉండడం వల్ల చాలా మంది సోలో జర్నీయే సో బెటర్ అనుకుంటున్నారు.

ఎట్టకేలకు కదలిక

పాతబస్తీ సీవరేజీ నెట్‌వర్క్ పనులు చకచకా

- రెండున్నరేళ్లుగా నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టు
- స్థానికుల అభ్యంతరాలతో నిలిచిపోయిన పనులు
- ప్రజాప్రతినిధులతో చర్చించిన అనంతరం పరిష్కారం
- వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తాం: జలమండలి ఎండీ

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ సీవరేజీ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చింది. మూసీ నదికి ఉత్తరం వైపున మురుగు నీటి పారుదల వ్యవస్థ ఆధునీకీకరణ కోసం చేపట్టిన జోన్- 3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనులు రెండున్నరేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. తాజాగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులపై దృష్టి సారించి చర్యలకు ఉపక్రమించారు. పాతబస్తీలోని గోషామహల్, నాంపల్లి, కార్వాన్‌తో పాటు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గాల్లో సీవరేజీ వ్యవస్థను ఆధునికీకరించడానికి మురుగు నీటి పారుదల ప్రాజెక్టును జలమండలి చేపట్టింది. దాదాపు రూ.297 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులో మొత్తం 129.32 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. కొంత మేరకు పనులు సాగిన అనంతరం స్థానిక సమస్యల కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

మూడు ప్రాంతాల్లో..

ఓల్డ్‌సిటీ ప్రాజెక్టులో మూడు ప్రాంతాల్లో దాదాపు 2.1 కిలోమీటర్ల మేరకు స్థానిక అభ్యంతరాలు, ఇతరత్రా సమస్యలతో పనులు నిలిచిపోయాయి. స్థానికులు, ప్రజాప్రతినిధులతో చర్చించి పనులు చేపట్టేలా తాజాగా జలమండలి ఎండీ ఆదేశాలు జారీ చేశారు. మరో 7 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులను వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని సూచించారు.

ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే ప్రాంతాలు..

పాతబస్తీ పరిధిలోని టోలిచౌకి, గోల్కొండ, లంగర్ హౌస్, సెవెన్ టూంబ్స్, జూబ్లీహిల్ (కొంత భాగం), మెహిదీపట్నం, నానల్‌నగర్, ఆసిఫ్‌నగర్, విజయనగర్ కాలనీ, ఎన్ఎండీసీ కాలనీ, మాసబ్ ట్యాంక్, రెడ్‌హిల్స్, లక్డీకాపూల్, బజార్‌ఘాట్, నాంపల్లి మల్లేపల్లి, బేగం బజార్ ప్రాంతాలు. పాతబస్తీలో ప్రస్తుతం సీవరేజీ ఔట్ లెట్ లేని లైన్లను జోన్-3 సీవరేజీ నెట్‌వర్క్‌కు అనుసంధానం చేసేలా జలమండలి ప్రణాళికలు రూపొందిస్తోంది.



పాతబస్తీలో సీవరేజీ పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

ప్రాజెక్టు స్వరూపం

- ◆ జోన్-3 మురుగు నీటిపారుదల వ్యవస్థలో తొమ్మిది పరీవాహక ప్రాంతాలు ఉన్నాయి.
- ◆ జోన్ పరిధిలోకి మొత్తం 33.50 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం కలిగిన ఎన్-1 నుంచి ఎన్-7 వరకు ఎన్-11 ,ఎన్-31 పరీవాహక ప్రాంతాలు వస్తాయి.
- ◆ ప్రస్తుతం 355.78 కిలోమీటర్ల పొడవైన సీవరేజీ నెట్‌వర్క్ కలిగి ఉంది.
- ◆ మొత్తం కొత్త నెట్‌వర్క్: 129.32 కిలోమీటర్లు
- ◆ ఆర్‌సీసీ ట్రంక్ సీవర్స్ పైపులైన్ 400-1200 ఎంఎం డయా: 36.14 కి.మీ
- ◆ ఎస్‌డబ్ల్యూజీ నెట్‌వర్క్ 200-300 ఎంఎం డయా: 93.18 కి. మీ
- ◆ మురుగు ప్రవాహం అంచనా: 2036 నాటికి 127.42 ఎంఎల్‌డీ
- ◆ 2051 నాటికి 153.81 ఎంఎల్‌డీ

గన్ మిస్ ఫైర్

అమెరికాలో ఉప్పల్ యువకుడి మృతి

- పుట్టిన రోజు నాడే విషాద ఘటన
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు



అరుణ్ రెడ్డి (ఫైల్)

ఉప్పల్: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఉప్పల్ బ్యాంక్ కాలనీకి చెందిన యువకుడు తన హంటింగ్ లైసెన్స్‌డ్ గన్ మిస్ ఫైర్ కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యార్థి పుట్టిన రోజే ఈ విషాద ఘటన చోటు చేసుకోవడంతో మృతుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమారుడు ఇక తిరిగిరాడనే విషయాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీనగర్ పోచంపల్లి మండలం పెద్దరావుల పల్లి గ్రామానికి చెందిన వ్యాపారి పాల్వాయి సుదర్శన్ రెడ్డి, దీప దంపతులు ఉప్పల్ బ్యాంక్ కాలనీలో నివాసముంటున్నారు. వీరి ఒక్కగానొక్క కుమారుడు పాల్వాయి అరుణ్ రెడ్డి (24) గత ఏడాది డిసెంబర్‌లో అమెరికాలోని జార్జియా స్టేట్ అట్లాంటా పట్టణంలోని కెనిస్సా యూనివర్సిటీలో ఉన్నత విద్య కోసం వెళ్లాడు.

ఈ నెల 13న తన గదిలోనే స్నేహితుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకొన్నాడు. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అరుణ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదే రోజు ఉదయం 10 గంటల సమయంలో తన హంటింగ్ లైసెన్స్‌డ్ గన్‌ను శుభ్రం చేస్తుండగా మిస్ ఫైర్ కావడంతో తూటా అరుణ్ ఛాతీలోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తండ్రి సుదర్శన్ రెడ్డి తెలిపారు. తన కుమారుడికి ఆర్మీలో చేరాలనే కోరిక ఉండేదని, అందులో భాగంగానే గన్ పేల్చడంలో శిక్షణ కూడా పొందుతున్నాడన్నారు. అమెరికాలో గన్ కొనుగోలు చేసిన విషయం తనకు తెలియదన్నారు. సాధారణంగా తర్ఫీదు పొందిన వారికి హంటింగ్ కోసం గన్ కొనడానికి లైసెన్స్ ఇస్తారని తెలిపారు. అలా లైసెన్స్ ఇవ్వడం వల్లే తన కుమారుడు అసువులు బాశాడని సుదర్శన్ విలపించారు. గురువారం రాత్రి మృతదేహాన్ని అమెరికా నుంచి ఉప్పల్‌లోని స్వగృహానికి తీసుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు.

సిల్ట్ చాంబర్లు లేకుంటే కనెక్షన్ లైన్ కట్..!



- సిల్ట్ చాంబర్ల ఏర్పాటు తప్పనిసరి
- డీ-సిల్టింగ్ స్పెషల్ డ్రైవ్ పనుల పరిశీలన
- జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: వాణిజ్య భవన సముదాయాలు సిల్ట్ చాంబర్లు తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని లేనిపక్షంలో సీవ రేజ్ పైప్‌లైన్ కనెక్షన్లను తొలగిం చాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన 90 రోజుల స్పెషల్ డ్రైవ్ లో భాగంగా మోహిదీపట్నం, లంగర్ హౌస్ తదితర ప్రాంతాల్లో డీ-సిల్టింగ్ పనులను పరిశీలించారు. మెహిదీపట్నం అం బా థియేటర్ వద్ద ప్రధాన రహదారిపై తరచూ పొంగుతున్న మ్యాన్ హోళ్లను పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని హోటళ్ల యాజమానులు తమ సీవరేజ్ పైప్ లైన్లను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్‌వర్క్ కు అనుసంధానం చేసినం దునే వాటి నుంచి వచ్చే ఆహార, వ్యర్థ పదార్థాలు మ్యాన్ హోళ్లలో చేరి సమస్య ఎదురవుతుందన్నారు. ఈ నేపథ్యంలో హోటళ్లు, బేకరీలు, ఫుడ్ కోర్టులు, వాణిజ్య భవనాల యజమానులకు సిల్ట్ చాంబర్లు నిర్మించుకోవాలని నోటీ సులు జారీ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే వారి సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీజీఎం వినోద్ భార్గవ, జీఎం, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రముఖులకు గగనతల దాడుల ముప్పు

- రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో నిఘా హెచ్చరికలు
- నగరంలో డ్రోన్లు, పారాగ్లైడర్ల సంచారంపై నిషేధం
- పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు



సాక్షి, సిటీబ్యూరో: ముష్కరమూకలు తెలివి మీరుతు న్నాయి.. ఓ పక్క ఉగ్రవాదులు, మరోపక్క తీవ్రవాదులు గగనతల దాడులకు కుట్రలు పన్నుతు న్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో పారాగ్‌లెడ్డర్లు, డ్రోన్లతో పాటు అనధికారికం గా వినియోగించే అన్ని రకాలైన ఎగిరే వస్తువులపై నిషేధం విధించాల్సిందిగా కేంద్ర నిఘా వర్గాలు స్పష్ట మైన ఆదేశాలు జారీ చేశాయి. ఈ హెచ్చరిక వెనుక అనేక కారణాలున్నాయి. దేశ వ్యాప్తంగా పోలీసులకు పట్టుబడిన ఉగ్రవాదుల విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలతో పాటు అంతర్జాతీయంగా చోటు చేసుకున్న పరిణామాలపై నిఘా వర్గాలు ఆధారాలు సేకరిం చాయి. ఈ నేపథ్యంలో ముష్కర సంస్థల గగనతల దాడుల వ్యూహం వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్‌కు చెందిన కొన్ని ఉగ్రవాద సంస్థలు ప్రత్యేకంగా ఎంపిక చేసిన క్యాడర్‌కు గగనతల దాడుల్లో శిక్షణ ఇస్తున్నట్లు వీరు వెల్లడించారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐకి చెందిన ఓ వింగ్ ఈ ఉగ్రవాదులకు పారాచూట్ జంపింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. పాక్ కేంద్రంగా పని చేస్తున్న కొన్ని ఉగ్రవాద సంస్థలు చైనా, యూఏఈకి చెం దిన కంపెనీల నుంచి పారాగ్‌లెడ్డర్ల తయారీకి ఉపకరిం చే ఉపకరణాలు, పాకిస్థాన్‌కు చెందిన ఓ కంపెనీ నుంచి డ్రోన్లు ఖరీదు చేసినట్లు కేంద్ర నిఘా వర్గాలు గుర్తిం చాయి. వీటికి తోడు గతంలో స్పెయిన్‌లో జరిగిన గగ నతల పరికరాలు, ఉపకరణాల కొనుగోళ్లకు సంబంధిం చి నిఘా వర్గాలు సేకరించిన ఆధారాలు మరింత కలవరపాటుకు గురి చేస్తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన కొందరు వ్యక్తులు 10 లక్షల పాక్ రూపీలను వెచ్చించి స్పెయిన్‌లో పారాగ్‌లెడ్డర్ ఉపకరణాలను ఖరీదు చేసినట్లు నిఘా వర్గాలకు ఆధారాలు లభిం చాయి. వీటిలో ఇద్దరు ప్రయాణించే సౌకర్యం ఉందని, ఇవి దాదాపు 150 కేజీల బరువును 70 కిమీ మేర నిర్వి రామంగా మోసుకుపోయే సామర్థ్యం కలిగి ఉన్నట్లు గుర్తించాయి. వీరు ఈ ఉపకరణాలను వివిధ మార్గాల్లో భారత్‌కు తరలించే ప్రమాదం లేకపోలేదని హెచ్చ రిస్తున్నాయి. వీటిని వినియోగించి టార్గెట్లపై గగనతల దాడులు చేయడంతో పాటు పేలుడు పదార్థాలు, ఆయుధాల రవాణాకూ వినియోగించే అవకాశం ఉం దని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే అనధికారిక పారా గ్లెడ్డర్లు, డ్రోన్లు, రిమోట్ కంట్రోల్ ద్వారా పని చేసే తేలి కపాటి ఎయిర్‌క్రాఫ్ట్‌లు, చిన్న పరిమాణం కలిగిన మాన వరహిత విమానాలను పూర్తి స్థాయిలో నిషేధించాలని, అనుమతి ఉన్న వాటినీ సాధ్యమైనంత వరకు నియం త్రించాలని అన్ని రాష్ట్రాలనూ హెచ్చరించాయి. మరో పక్క మావోయిస్టులు మినీ హెలీకాప్టర్ల తయారీపై దృష్టి పెట్టినట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఛత్తీస్ గఢ్, బీహార్, కేరళలో జరిగిన ఆపరేషన్ల సందర్భంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న పత్రాల ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తక్కువ బరువు, సామర్థ్యం కలిగినవి రూపొందించి వినియోగించడా నికి మావోయిస్టులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు న్నట్లు వెల్లడైంది. వీటికి సంబంధించిన ఓ డిజైన్ బీహా ర్‌లోని గయ ప్రాంతంలో సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ (సీఆర్పీఎఫ్) అధికారులకు లభించింది. ఇప్పటి వరకు విధ్వంసాల కోసం మావోయిస్టులు ఎక్కువగా మందుపాతరలనే ప్రయోగిస్తున్నారు. వీటికి భిన్నంగా రిమోట్ కంట్రోల్ బాంబుల తయారీకీ ప్రయత్నిస్తు న్నారని నిఘా వర్గాలు గుర్తించాయి. వీటినీ గగనతలం ద్వారా వినియోగించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

నేటి సాయంత్రం వరకు అత్యంత అప్రమత్తం...

రాజధానిలో రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో కొత్వాల్ సీవీ ఆనంద్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర నిఘా వర్గాలు కీలక హెచ్చరికలను పరిగణలోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖలోని ఐఎస్ఐ డివిజన్ బుధవారం నగర పోలీసులకు ఓ వర్త మానం పంపింది. రాష్ట్ర సచివాలయానికి మూడు కిలోమీ టర్ల పరిధిలో, సున్నిత విభాగాలకు కార్యాలయాలకు 2 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్లు, పారా గ్లెడ్డర్లు, రిమోట్ కం ట్రోల్డ్ మైక్రో లైట్ ఎయిర్‌క్రాఫ్ట్స్ ఎగరడంపై నిషేధం విధించాలని స్పష్టం చేసింది. వీటిని పరిగణలోకి తీసు కున్న సీపీ గగనతలంలో ఎగిరే వాటిపై నిషేధం విధిం చారు. శుక్రవారం సాయంత్రం వరకు ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫొటోలు, వీడియోల చిత్రీకరణ కోసమూ వీటిని వాడకూ డదని స్పష్టం చేశారు. రాష్ట్రపతి పర్యటన ముగిసే వరకు గగనతలంపైనా పటిష్ట నిఘా ఉంచాలని నిర్ణయించారు. దీనికోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

రూ.22 లక్షల హవాలా నగదు పట్టివేత

ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

సుల్తాన్‌బజార్: అక్రమంగా తరలిస్తున్న రూ.22 లక్షల హవాలా నగదును స్వాధీనం చేసుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివ రాలిలా ఉన్నాయి. కోఠి గుజరాతి గల్లీలో ముగ్గురు వ్యక్తులు రూ.22 లక్షల నగదు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆర్‌కే.కాంప్లెక్స్ వద్ద మాటు వేసిన పోలీసులు యాక్టివాపై నగదు తీసుకెళుతున్న మొగల్‌పురాకు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖయ్యూమ్, గుజరాతీ గల్లీకి చెందిన ఉత్తమ్‌కుమార్, హను మాన్‌టేక్డీకి చెందిన లలిత్‌సింగ్‌లను అదుపులోకి తీసుకున్నారు. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా న్యూస్‌రీడర్‌కు వేధింపులు

నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: తనను వెంటాడి వేధింపులకు గురిచేస్తున్నాడని, తన ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసు కోవాలని మహిళా న్యూస్ రీడర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీ హిల్స్ పోలీసులు ఓ యువకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఓ టీవీ చానల్‌లో న్యూస్ రీడర్‌గా పనిచేస్తున్న యువతికి ఐదేళ్ల క్రితం హరీష్ అనే యువకుడితో పరిచయం ఏర్ప డింది. ఏడాది క్రితం హరీష్ మరో యువతిని వివాహం చేసుకోవ డంతో బాధితురాలు అతడితో మాట్లాడటం ఆపేసింది. అయితే హరీష్ కొంతకాలంగా ఆమెను వెంబడిస్తూ అసభ్యకరంగా ప్రవ ర్తిస్తున్నాడని, తన సహోద్యోగుల ఎదుట దుర్భాషలాడుతూ తన ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరిస్తున్నాడంటూ బాధితురాలు జూబ్లీ హిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం తన కార్యాలయానికి వచ్చిన హరీష్ కిందికి వెళ్లి మాట్లాడుకుందా మంటూ బలవంతంగా బయటికి తీసుకువచ్చి లిఫ్ట్‌లో ఎక్కిన తర్వాత కొట్టడమే కాకుండా కారు రెడీగా ఉంచండి..అంటూ తన స్నేహితులకు చెప్పాడన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా నిం దితుడు తన వెంట పడుతున్నాడని, వేధింపులకు గురిచేస్తున్నాడ ని, ఫోన్ చేస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని ఆరోపిం చారు. ఈ మేరకు పోలీసులు నిందితుడు హరీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

దుండిగల్: బైక్ అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ జిల్లా, సముద్రాల గ్రామానికి చెందిన దేవేం దర్‌రెడ్డి- శ్రీలత దంపతులు నగరానికి వలస వచ్చి డి.పోచంపల్లి సారెగూడెంలో నివాసమం టున్నారు. వారి కుమారుడు చంద్రశేఖర్‌రె డ్డి(23) మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి అతను విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా స్థానిక డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలోని సర్వీస్ రోడ్డులో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు సూరారంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య



మహ్మద్ మోహిత్ ఖాన్ (ఫైల్)

సంతోష్‌నగర్: పాత గొడవల కారణంగా ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘ టన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ కథనం మేరకు వివరా లిలా ఉన్నాయి. బుధవారం రాత్రి ఓవైసీ కాలనీ ఫజల్ కేఫ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు సంతోష్‌నగర్ ఎంబీ హట్స్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సాబేర్ ఖాన్ కుమారుడు మహ్మద్ మోహిత్ ఖాన్ (18)పై కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఓవైసీ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృ తి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పాత గొడవల కారణంగానే ఈ హత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ సంఘ టనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'నూతన జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ భేష్'

సాక్షి, సిటీబ్యూరో: భారతీయ విద్యా రంగం వేగంగా అభివృద్ధి చెందుతోం దని, ప్రభుత్వ ఆధ్వర్యంలోని కొత్త జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ ఈ మార్పునకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని ప్రముఖ బ్రిటిష్ రచయి త్రి, విద్యావేత్త క్లైర్ హార్స్‌బర్గ్ అన్నారు. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్‌కు చెం దిన క్లైర్ ప్రస్తుతం భారత్‌లోని ప్రధానమైన 9 నగరాల్లో సరళంగా ఆంగ్ల భాషా బోధన అనే అంశంపై వర్క్ షాప్‌లను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆమె గురువారం విద్యా మంత్రిత్వ శాఖ నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా నగరంలో ఉపాధ్యాయులకు వర్క్ షాప్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా క్లైర్ హార్స్‌బర్గ్ మాట్లాడుతూ., భారత్‌లోని ఉపాధ్యా యులకు వారి తరగతి గదులను ఆనందంగా, ఆకర్షణీయంగా మార్చడానికి వినూత్న పద్ధతులపై శిక్షణ ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బాష ఒక విద్యావేత్త, రచయితగా అనేక అవకాశాలను అందిస్తుందని, సంస్కృతు లను అనుసంధానం చేసే వేదికగానూ పనిచేస్తుందన్నారు. ఈ వేదిక 21వ శతాబ్దపు నైపుణ్యాలు, ఉన్నత స్థాయి ఆలోచలను (హాట్స్) అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ వర్క్ షాప్‌లో భాగంగా నూతన ఆక్స్ ఫర్డ్ మోడ్రన్ ఇంగ్లిష్ 2025 ఎడిషన్‌ను ప్రారంభించారు. ఆక్స్ ఫర్డ్ యూనివ ర్సిటీ ప్రెస్ ఇండియా రీజినల్ సేల్స్ డైరెక్టర్ సంత్యేంద్ర భదౌరియా మాట్లా డుతూ., 1478 నాటి అతిగొప్ప చరిత్రతో 'ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ఎడ్యుకేషనల్' పబ్లిషింగ్‌లో గ్లోబల్ లీడర్‌గా పేరు తెచ్చుకుందన్నారు.

ఫుడ్ ఫెస్టివల్స్‌తో మత్స్యకారులకు ప్రోత్సాహం

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్



ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ తదితరులు

ఖైరతాబాద్: ఫుడ్‌ఫెస్టివల్స్ ఏర్పాటుతో మత్స్యకారులకు ప్రోత్సాహం దక్కుతుందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా గురువారం తెలంగాణ ఫిషరీస్ ఫెడరే షన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో ఐమాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ మైదానం లో ఏర్పాటు చేసిన ఫుడ్‌ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రభుత్వం మత్స్యకారులను ప్రోత్సహిం చేందుకు ఇలాంటి ఫెస్టివల్స్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫిషర్మెన్ కాంగ్రెస్ జాతీయ చైర్మన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఫెర్నాండో, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ సీనియర్ నేత హన్మంతరావు, నాయకులు అన్వేష్‌రెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి, బెల్లయ్య నాయక్, ప్రీతం నాగరికరీ, ముత్తినేని వీరయ్య పాల్గొన్నారు.

18న ఓయూలో కృతజ్ఞత మహాసభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ ఎదుట డిసెం బర్ 18న కృతజ్ఞత మహాసభను నిర్వహించనున్నట్లు తెలంగాణ విద్యా ర్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవత రాయ్ తెలిపారు. గురు వారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభ విజయవంతం కోసం రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిందన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి రాగానే ఉద్యోగాల భర్తీతో పాటు విద్యార్థులకు 40 శాతం కాస్మొ టిక్, డైట్ చార్జీల పెంపు, స్కిల్ వర్సిటీ ఏర్పాటు స్పోర్ట్స్ వర్సిటీ స్థాపనకు చర్యలు తీసుకుందన్నారు. విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరి స్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బైరి నాగరాజుగౌడ్, రెడ్డి శ్రీను, భీమ్‌రావ్ నాయక్, పట్ల నాగరాజు, క్రాంతి, నగేష్ పాల్గొన్నారు.

సభను అడ్డుకుంటాం: బీఆర్ఎస్వీ

ఓయూ ఆర్ట్స్ కాలేజీ వేదికగా డిసెంబరు 18, 21 తేదీల్లో నిర్వహించనున్న కృతజ్ఞత మహాసభలను అడ్డుకుంటామని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.గదరాజు చందు పేర్కొన్నారు. గురువారం ఓయూలో ఆయన మాట్లాడుతూ కాం గ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించలేదన్నారు. విద్యా ర్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కాలేజీల మూతపడుతున్నాయ న్నారు. ఉద్యోగాల భర్తీ పేరుతో మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి పాలనపై రాష్ట్రంలో ఎక్కడ కృతజ్ఞత సభ పెట్టినా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్ర మంలో జీడీ అనిల్, జంగయ్య, రవి, కొంపెల్లి నరేష్, మిథున్ ప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఆర్టీఓ ఆటకట్టు

- కారులో తిరుగుతూ దందాలు
- నాలుగు నెలలుగా సెంట్రింగ్ మిల్లర్లను బెదిరించి వసూళ్లు



నిందితుడు ప్రేమ్ కుమార్ రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ పోలీసులు నకిలీ ఆర్టీఓ ఆట కట్టించారు. కారులో తిరుగుతూ సెం ట్రింగ్ మిల్లర్లను భయపెట్టి వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీ సులు అరెస్ట్ చేశారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివ రాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ హనుమసాయినగర్ ప్రాంతానికి చెం దిన ప్రేమ్ కుమార్ రెడ్డి స్థానికంగా కట్టెల మిషన్ నడుపుతున్నాడు. నాలుగు నెలలుగా అతను ప్రతి రోజు తెల్లవారుజామున ఆర్టీఓ అవతారం ఎత్తేవాడు. కారులో తిరుగుతూ రోడ్డుపై వెళుతున్న సెం ట్రింగ్ మిల్లర్లను అడ్డగించి తాను ఆర్టీఓనని కాగితాలు చూపిం చాలంటూ, బండి ఓవర్ లోడ్ ఉందంటూ పలు రకాలు బెదిరించి అందిన కాడికి వసూలు చేస్తున్నాడు. ఉప్పల్, బోడుప్పల్, చం గిచర్ల, మేడిపల్లి, నాగోల్ తదితర ప్రాంతాల్లో మాటు వేసి వసూళ్ల దందాకు తెరలేపాడు. ఒకసారి తానే ఆర్టీఓను అంటూ..మరోసారి సార్ కారులో ఉన్నాడంటూ బెదిరింపులకు పాల్పడేవాడు. అతడి వైఖరిపై అనుమానం వచ్చిన సెంట్రింగ్ మిల్లర్ల యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నిఘా ఉంచిన ఉప్పల్ పోలీసులు గురువారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. బ్రెజా కారు స్వాధీనం చేసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నకిలీ ఆర్టీఓను అరెస్టు చేసినట్లు సమాచారం అందడంతో బాధితులు పెద్ద సంఖ్యలో ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు తరలి వచ్చారు. గతంలో ఆర్టీఓ అధికారులు తనకు చలానా వేసి వేధించడంతోనే తానూ రంగంలోకి దిగినట్లు నిందితుడు పేర్కొనడం గమనార్హం.

డ్రైనేజీ సమస్యలపై నివేదికలివ్వండి

- సమస్య పరిష్కారం కోసం నిధులు ఇస్తాం
- పరిసరాల్లో చెత్త, చెదారం, పిచ్చి మొక్కలు తొలగించాలి
- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలు



దారుల్ షిఫా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి,సిటీబ్యూరో: డ్రైనేజీల కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. డీఈవో, డిప్యూటీ ఈఓ, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, ఈఈ ఐడీసీ, హెచ్ఎండ బ్ల్యూఎస్, తహసీల్దార్లు పాఠశాలలను తనిఖీ చేసి చేపట్టాల్సిన పనులపై శుక్రవారం సాయంత్రంలోగా నివేదిక సమర్పించాలని సూచించారు. గురువారం ఆయన పాతబస్తీలోని పలు పాఠశాల లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, చెట్లు తొలగించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల అసంపూర్తి పనులను పూర్తిచేయాలని, అందుకు అవస రమైన నిధులపై ప్రతిపాదనలు అందజేయాలన్నారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు, డ్రైనేజీ నీరు నిల్వ ఉండకుండా వారం రోజుల్లోగా చర్యలు తీసుకోవాలన్నారు. బహదూర్‌పుర లోని దారుల్ షిఫా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పాఠశాల ఆవరణలో మురికి నీరు నిల్వ ఉండకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ నీళ్లు పాఠశాలలోకి రాకుండా వెంటనే తగు చర్యలు చేప ట్టాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ను ఆదేశించారు అనం తరం అంధుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లా డారు. ఆయన వెంట డీఈవో రోహిణి తదితరులు ఉన్నారు.

రైళ్లలో దోపిడీలకు పాల్పడుతున్న ముఠా నాయకుడి అరెస్టు


- పరారీలో మరో నలుగురు నిందితులు
- 216 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్: రైళ్లలో ప్రయాణిస్తూ విలువైన బంగారు ఆభర ణాలు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును సికిం ద్రాబాద్ రైల్వే పోలీసులు రట్టు చేశారు. గురువారం ముఠా నాయకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పరారీలో ఉన్న మరో నలుగురు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. జీఆర్పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్లు బీ.సాయీశ్వర్‌గౌడ్, బీఎస్ సారస్వత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... నార్త్‌వెస్ట్ ఢిల్లీకి చెందిన రణ్‌బీర్‌సింగ్ డ్రైవర్‌గా పని చేసేవాడు. మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసైన అతను రైళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు. ఢిల్లీ రైల్వేస్టేషన్ పరిధిలో పలు దొంగతనాలు చేసిన అతను అక్కడి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చాడు. జైలులో పరి చయమైన మరి కొందరితో కలిసి ముఠాగా ఏర్పడిన అతను సికిం ద్రాబాద్ రైల్వేస్టేషన్ కేంద్రంగా చోరీలు చేస్తున్నాడు. ఈనెల 21న ఉదయం తన బృందంతో కలిసి దొంగతనాలు చేసేందుకు సికిం ద్రాబాద్ రైల్వేస్టేషన్ 10వ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న రణ్‌బీర్‌సింగ్ అనూహ్యంగా పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసుల విచారణలో ఇక్కడ నాలుగు దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. చోరీ సొత్తును కరిగించి బంగారాన్ని ముఠా సభ్యులందరూ సమా నంగా పంచుకునేవారమని నిందితుడు పోలీసుల విచారణలో పేర్కొన్నాడు. అతడి నుంచి రూ. 21 లక్షల విలువైన 216 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. జట్టు సభ్యులైన హరియాణాకు చెందిన షంషేర్, సుమిత్, సత్బీర్, జగదీశ్ పరా రీలో ఉన్నట్లు తెలిపారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి



మహ్మద్ తయామ్ మియా (ఫైల్)

ఫిలింనగర్: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన సం ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బీహార్‌కు చెందిన మహ్మద్ తయా మ్‌మియా (36) రెండేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి షేక్‌పేట బృందావన్ కాల నీలో తన గ్రామానికే చెందిన మహ్మద్ ఖయూమ్ మియా వద్ద ఉంటున్నాడు. గురువారం అతను ఎస్‌పీ కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంలో ముఖేష్ అనే వ్యక్తితో కలిసి ఐదో అంతస్తులో రూఫ్ వర్క్ చేస్తుం డగా ప్రమాదవశాత్తూ ఇద్దరూ జారి లిఫ్ట్ గుంతలో పడ్డారు. తీవ్రం గా గాయపడిన వారిని అత్తాపూర్‌లోని జర్మెంటైన్ ఆస్పత్రికి తర లించగా చికిత్స పొందుతూ తయామ్‌మియా మృతి చెందాడు. ముఖేష్ పరిస్థితి విషమంగా ఉంది. మృతుడి సోదరుడు ఖయూ మ్‌మియా ఫిర్యాదు మేరకు పోలీసులు బిల్డర్, కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారులకు కొరవడిన ప్రోత్సాహం

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌



మాట్లాడుతున్న ఈటల రాజేందర్‌

పంజగుట్ట: జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న మత్స్యకారులు అన్ని రంగాల్లో రాణించేందుకు ఏ పార్టీ ప్రోత్సహించడం లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మన ముదిరాజ్‌ మహాసభ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్‌ ముదిరాజ్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల మాట్లాడుతూ... ముదిరాజ్‌, బంటు, ముత్తరాసి, గంగపుత్ర, బెస్త, గోండు ఇలా కులాల పేర్లు ఏదైనా నీళ్లని నమ్ముకుని చేపలు పట్టే వృత్తిని నమ్ముకుని బతికే కులాలు అన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని, ఎదుగుదలను, తెలివితేటలను ఇచ్చేది మత్స్య సంపద అని కోటానుకోట్ల మంది ప్రజలకు మంచి ఆహారాన్ని అందించే వారు మత్స్యకారులన్నారు. యాదవులకు, గీత కార్మికులకు, చేనేత కార్మికులకు వృత్తిలో ఉంటే సభ్యత్వం వస్తుందని, కాని వృత్తిలో ఉండి కూడా సభ్యత్వం పొందని జాతి మత్స్యకారుల జాతి మాత్రమే అన్నారు పార్లమెంట్‌ స్టాండింగ్‌ కమిటీలో ఎంపీలకు సభ్యత్వం ఉంటుందని, యానిమల్‌, హస్బెండ్రీ అండ్‌ ఫిషరీస్‌లో తాను సభ్యత్వం అడిగి తీసుకున్నానని తెలిపారు. చొప్పరి శంకర్‌ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులకు రక్షణ చట్టం తీసుకొచ్చి మత్స్యకారులకు రక్షణ కల్పించాలని డిమాండ్‌ చేశారు. మహాసభ ప్రధాన కార్యదర్శి శివయ్య ముదిరాజ్‌, మద్దెల సంతోష్‌, కరుణాకర్‌, వి.కె.మహేష్‌ ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లినికల్‌ రీసెర్చ్‌లలో ఏఐ పాత్ర కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న ఆస్టర్‌ డీఎం హెల్త్‌కేర్‌ రీజనల్‌ సీఈవో దేవానంద్‌

బంజారాహిల్స్‌: రానున్న కాలంలో క్లినికల్‌ రీసెర్చ్‌ రంగంలో ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌ పాత్ర ఎంతో కీలకంగా మారబోతున్నదని ఆస్టర్‌ డీఎం హెల్త్‌కేర్‌ రీజినల్‌ సీఈవో దేవానంద్‌.కె అన్నారు. బంజారాహిల్స్‌ లోనం సుల్తాన్‌ ఉల్‌ ఉలూం ఫార్మసీ కాలేజీలో నాలుగు రోజులుగా జరుగుతున్న క్లినికల్‌ రీసెర్చ్‌, ఆర్టిఫిషియల్‌ ఇంటిలిజెన్స్‌ సర్టిఫికెట్‌ కోర్సు గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సర్టిఫికెట్‌ కోర్సులో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ అనుపమ కోనేరు కలిసి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఫార్మసీ విద్యార్థులకు ఇలాంటి టెక్నికల్‌ సర్టిఫికెట్‌ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఫార్మసీ రంగంలో వస్తున్న నూతన మార్పులను విద్యార్థులు తెలుసుకోగలుగతారని అన్నారు. సర్టిఫికెట్‌ కోర్సులో అడ్వాన్స్‌డ్‌ టెక్నాలజీలతో పాటు ప్రాక్టికల్‌ స్కిల్స్‌ను విద్యార్థులకు నేర్పించినట్లు క్లినియన్‌ డైరెక్టర్‌ మితేష్‌రెడ్డి, సేప్‌విగ్‌ సీఈవో శ్రీ దివ్య తెలిపారు. ఈ సందర్భంగా క్లినికల్‌ రీసెర్చ్‌తో పాటు గుడ్‌ క్లినికల్‌ ప్రాక్టీస్‌, ఆర్టిఫిషియల్‌ ఇంటిలిజెన్స్‌, మెషిన్‌ లెర్నింగ్‌, క్లినికల్‌ డాటా మేనేజ్‌మెంట్‌ అంశాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కినోసోల్‌ ఫౌండర్‌ ముజీబుద్దీన్‌ షేక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



మురళితాంత్రిక్‌ స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే దానం

పంజగుట్ట: స్వామియే శరణం అయ్యప్పా అనే శరణుఘోషలతో సోమాజిగూడలోని అయ్యప్ప స్వామి దేవాలయం మారుమోగిపోయింది. రామాపురం శ్రీనివాస్‌ గౌడ్‌ గురుస్వామి ఆధ్వర్యంలో 33వ పడి పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. శబరిమలైలో సంవత్సరం పాటు ప్రధాన పూజారిగా ఉన్న మురళి తాంత్రిక్‌ స్వామి పర్యవేక్షణలో స్వామి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ వివిధ పార్టీలకు చెందిన నాయకులు, స్థానికులు పెద్దెత్తున హాజరై స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సర్వే సిబ్బందికి వివరాలు అందించాలి



సర్వేలో పాల్గొన్న ఫసియుద్దీన్‌, డీఎంసీ జకియాసుల్తానా

రహమత్‌నగర్‌: కులగణన సర్వేలో భాగంగా ఇళ్ల వద్దకు వచ్చే ప్రభుత్వ సిబ్బందిచే ప్రతి ఒక్కరూ తమ వివరాలను తప్పని సరిగా నమోదు చేయించాలని బోరబండ కార్పొరేటర్‌ బాబాఫసియుద్దీన్‌ కోరారు. వినాయకరావునగర్‌లో గురువారం డీఎంసీ జకియాసుల్తానాతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు సర్వే అవశ్యకతను ఆయన వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వేతో ప్రజలకు ఎన్నో ప్రజయోజనాలు చేకూరుతాయని చెప్పారు. డీపీఓ వెంకటకిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణమ్మ కాలేజీలో డేటా ఎంట్రీ సెంటర్‌



సర్వే ఫారాలను భద్రపరుస్తున్న అధికారులు

బంజారాహిల్స్‌: జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–18 పరిధిలో సమగ్ర కుటుంబ కుల గణన సర్వే ముమ్మరంగా సాగుతుంది. మొత్తం 55 వేల గృహాలను లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 35 వేల ఇళ్లను సందర్శించి యజమానుల నుంచి కుటుంబ వివరాలను నమోదు చేస్తున్నారు. సర్కిల్‌–18 పరిధిలోని బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో సర్వే పూర్తి చేసిన తర్వాత ఆయా ఫారాలను బండిల్స్‌గా మార్చి పెట్టెల్లో ఉంచి షేక్‌పేట నారాయణమ్మ కాలేజీలో ప్రత్యేకంగా తీసుకున్న గదిలో భద్రపరుస్తున్నారు. డేటా ఎంట్రీ సెంటర్‌ను ఇక్కడే ఏర్పాటుచేశారు. రెండు రోజుల్లో డేటా ఎంట్రీ ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

మురుగు సమస్య పరిష్కారానికి కృషి

శ్రీనగర్‌కాలనీ: మసీదు వద్ద డ్రైనేజీ నీరు పొంగుతుందని, డ్రైనేజీకి కొత్త లైన్‌ వేయాలని ఎల్లారెడ్డిగూడ మసీదు పెద్దలు కార్పొరేటర్‌ వనం సంగీత దృష్టికి తీసుకువచ్చారు. గురువారం కార్పొరేటర్‌ సంగీత, సీనియర్‌ నేత వనం శ్రీనివాసయాదవ్‌ అంబేడ్కర్‌నగర్‌లో నూతనంగా వేస్తున్న రోడ్డు, సీవరేజీ పనులను పరిశీలించారు. మసీదు పెద్దలు డ్రైనేజీ సమస్యను దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో కొత్త లైన్‌ను వేస్తామని హామీ ఇచ్చారు. నేతలు మాజిద్‌, షాబుద్దీన్‌ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్‌ నేతలు

ఎస్‌ఎఫ్‌ఏల వసూళ్ల దందా..!

- హోటళ్లలో అపరిశుభ్రత పేరిట వసూళ్లు
- పరిధిని దాటి దందాలకు తెగిస్తున్న ఎస్‌ఎఫ్‌ఏలు
- నియంత్రణ కోల్పోయిన అధికారులు
- ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని దుస్థితి
- తాజాగా ఏసీబీకి పట్టుబడ్డ ఎస్‌ఎఫ్‌ఏలు



పేరుకుపోయిన చెత్త కుప్పలు

బంజారాహిల్స్‌: చెత్తపై దృష్టి సారించి పేరుకుపోతున్న చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తరలించడం.. స్వీపర్లు సక్రమంగా ఊడ్చుతున్నారో లేదో తనిఖీలు చేయడం శానిటరీ ఫీల్డ్‌ అసిస్టెంట్ల (ఎస్‌ఎఫ్‌ఏ) విధి. రోజూ తెల్లవారుజామునే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ చెత్తను ఎప్పటికప్పుడు లారీల్లోనూ తరలించడంలో, ఊడ్చిన చెత్తను కుప్పలుగా పేరుకుపోకుండా నల్లబ్యాగుల్లోకి ఎత్తించేలా మీరు నియంత్రించాలి. అయితే తాము చేయాల్సిన పనిని పక్కనబెట్టి వసూళ్లపై దృష్టిపెట్టారు. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్‌ సర్కిల్‌–18 పరిధిలో ఉన్న 33 మంది ఎస్‌ఎఫ్‌ఏల్లో 25 మంది వరకు ఇలా వసూల్‌ రాజాలుగా అవతారమెత్తారు.

- ఉన్నతాధికారులకు నిత్యం ఫిర్యాదులు అందుతున్నా చూసీచూడనట్లు పోతుండటంతో ఆరు నెలలుగా వసూళ్ల పర్వం శృతి మించింది. తాజాగా ఓ కాఫీషాప్‌లో అపరిశుభ్రత నెలకొందంటూ జరిమానా విధిస్తామని సలీంఖాన్‌, రమేష్‌ అనే ఇద్దరు ఎస్‌ఎఫ్‌ఏలు రూ. 60 వేలు డిమాండ్‌ చేసి ఏసీబీకి అడ్డంగా బుక్‌ అయ్యారు. ఏసీబీకి పట్టుబడ్డ రమేష్‌ నాలుగు నెలల క్రితం జూబ్లీహిల్స్‌ రోడ్డు నెంబర్‌–5లోని మెట్రోస్టేషన్‌ కింద ఓ హోటల్‌ యజమానిని ఇదే ప్రాంతానికి చెందిన మరో ఎస్‌ఎఫ్‌ఏలతో కలిసి బెదిరించగా ఆయన ఓ ప్రజాప్రతినిధికి ఫిర్యాదు చేశారు. సర్కిల్‌–18 అధికారులు ఈ నలుగురు ఎస్‌ఎఫ్‌ఏలను సస్పెండ్‌ చేయాలని భావించగా కొందరు ప్రజాప్రతినిధులు ఈ నలుగురికి అండగా నిలిచి యధాస్థానంలో కొనసాగేలా అడ్డుపడ్డారు.
- ఆ నలుగురిలో ఒకరే ఏసీబీకి పట్టుబడ్డ రమేష్‌, గత ఏడాది కాలంగా రమేష్‌ అక్రమాలు తారాస్థాయికి చేరారు. 10 నెలల క్రితం ఈయనను సస్పెండ్‌ కూడా చేశారు.
- మళ్లీ పోస్ట్‌ తెచ్చుకుని సర్కిల్‌–18లోనే తిష్ట వేశారు. తమకు కావలసిన వారికి ముడుపులు ఇచ్చుకుంటూ పబ్బం గడుపుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్‌ఎఫ్‌ఏలు తాము చేయాల్సిన పనులు కాకుండా అడ్డదారుల్లో వసూళ్లకు తెగిస్తున్నారు.
- సర్కిల్‌–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో పబ్‌లు, క్లబ్‌లు, బార్‌ అండ్‌ రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్‌ సెంటర్లు, మాల్స్‌ అధికంగా ఉన్నాయి. ఇవే ఎస్‌ఎఫ్‌ఏలకు వరంగా మారుతున్నాయి.

ఫుడ్‌సేఫ్టీ అధికారులుగా ఎస్‌ఎఫ్‌ఏలు...

ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారులు అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లపై దాడులు చేస్తూ హడావిడి చేస్తుండటంతో దీనిని అడ్డుపెట్టుకుని ఎస్‌ఎఫ్‌ఏలు తామే ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్ల అవతారమెత్తి హోటళ్ల వద్దకు వెళ్లి ట్రేడ్‌ లైసెన్స్‌ ఉందా..? అపరిశుభ్రత ఉంది..? అంటూ హడావిడి చేస్తూ అందిన కాడికి నొక్కేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- జూబ్లీహిల్స్‌, బంజారాహిల్స్‌ డివిజన్ల పరిధిలోని ఎస్‌ఎఫ్‌ఏలు రోజూ హోటళ్ల వద్దకు వెళ్లడం, తనిఖీల పేరిట హడావిడి చేయడం, రూ. 50 వేలు నుంచి రూ. లక్ష దాకా వసూలు చేయడం తంతుగా మారింది. దీనిని నియంత్రించాల్సిన అధికారి గతంలో ఇదే ఆరోపణలు రావడంతో కుత్బుల్లాపూర్‌కు బదిలీ అయ్యారు.
- మళ్లీ బడా నేత సిఫారసు లేఖతో సర్కిల్‌–18లో అదే పోస్టులో తిష్టవేశారు. ఆయనకు అసిస్టెంట్‌కు పనిచేస్తున్న శానిటరీ సూపర్‌వైజర్లు సైతం ఎస్‌ఎఫ్‌ఏలతో కలిసి ఇదే తరహా దందాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- రోజూ ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోతుండటంతో స్వీపర్ల హాజరులోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. 33 మంది ఎస్‌ఎఫ్‌ఏల కింద 600 మందికి పైగా స్వీపర్లు ఉండాల్సి ఉండగా రోజూ 400 మంది కూడా విధులకు హాజరుకావడం లేదని, నెలనెలా జీతాలు మాత్రం 100 శాతం విడుదలవుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి.
- ఎప్పటికప్పుడు ఈ ఎస్‌ఎఫ్‌ఏలపై నిఘా ఉంచాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

ముఖ్యమంత్రి నివాసిత సర్కిల్‌లోనే...

జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–18 పరిధిలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ తదితరులు నివాసం ఉంటున్నారు. ఇంతటి కీలకమైన సర్కిల్‌లోనే చెత్త ముసుగులో ఎస్‌ఎఫ్‌ఏలు వసూళ్ల దందాకు తెగిస్తున్నారు. ఇప్పటికే ఎస్‌ఎఫ్‌ఏలపై ఉన్నతాధికారులకు వందలాదిగా ఫిర్యాదులు అందాయి. మొన్నటివరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పనిచేసిన ఆమ్రపాలి, అంతకముందు పనిచేసిన రోనాల్డ్‌రోస్‌కు కూడా సర్కిల్‌–18 పరిధిలో పారిశుద్ధ్య లొసుగులు, నిర్వాకం, ఎస్‌ఎఫ్‌ఏల వసూళ్లపై భారీగా ఫిర్యాదులు అందాయి.

23న పుస్తకావిష్కరణ

లిబర్టీ: 'విజయ గాథ నిశబ్ద శబ్ద తరంగం' పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు బొజ్జ తారకం బోయి విజయభారతి స్మారక సంచిక కమిటీ కన్వీనర్‌ సజియ, ట్రస్ట్‌ కో కన్వీనర్‌ గనుముల జ్ఞానేశ్వర్‌ తెలిపారు. శనివారం సాయంత్రం తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్‌ సమావేశం మందిరంలో ఆవిష్కరణ సభ జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్‌ అధికారి కాకి మాధవరావు, ప్రొఫెసర్‌ రమా మెల్కోటి విశిష్ట అతిథులుగా జస్టిస్‌ చంద్రయ్య, ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్‌చందర్‌, డాక్టర్‌ సునీత, రాణి, జోష్న, ప్రొఫెసర్‌ మహితా బొజ్జ గడ్డం ఝాన్సీ తదితరులు పాల్గొంటారన్నారు. సభకు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ మెమోరియల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ డాక్టర్‌ లింగయ్య అధ్యక్షత వహిస్తారని వివరించారు.

మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి వివరాల సేకరణ



బంజారాహిల్స్‌: సమగ్ర కుటుంబ కుల గణన సర్వేలో భాగంగా జూబ్లీహిల్స్‌ రోడ్డు నెంబర్‌–10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నివసించే చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి నివాసంలో ఎన్యూమరేటర్లు కుటుంబ వివరాలు సేకరించారు. సమగ్ర సర్వే సూపర్‌వైజర్‌ గంగాధర్‌ ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్లు రమేష్‌కుమార్‌, వెంకటప్రసాద్‌లు సమాచారాన్ని నమోదు చేశారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

వెంగళరావునగర్‌: మైనర్‌ బాలికను వేధిస్తున్న యువకుడిపై మధురానగర్‌ పీఎస్‌లో పోక్సో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్‌ నియోజకవర్గంలోని ఓ ప్రాంతంలో 15 ఏళ్ల బాలిక తన పేరెంట్స్‌తో కలిసి ఉంటుంది. కొంతకాలం కిందట ప్రవీణ్‌ అనే యువకుడు రహమత్‌నగర్‌లో నివాసం ఉండేవాడు. ఆ సమయంలో యువకుడికి ఆ బాలిక ఇన్‌స్టాగాంలో పరిచయం అయింది. స్నేహంగా ఉంటూ ఇన్‌స్టాగాం అకౌంట్‌, ఫోన్‌ నెంబర్‌ తీసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని బాలికను వేధించడం ప్రారంభించాడు. ఇటీవల అతను కర్నూలు జిల్లాకు వెళ్లాడు. అయినా ఆ బాలికను వేధిస్తూనే ఉన్నాడు. ప్రవీణ్‌ వేధింపులు తాళలేక బాలిక మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

కిరాయి ఇస్తానంటూ కార్లు తీసుకుని ఘరానా మోసం

వెంగళరావునగర్‌: కిరాయి ఇస్తానంటూ కార్లు తీసుకుని ఘరానా మోసానికి పాల్పడిన ఇరువురిపై మధురానగర్‌ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... కోనసీమ జిల్లాకు చెందిన జి.సూర్యతేజ ఆరేళ్లుగా తమ జిల్లాలో ప్రైవేట్‌ జాబ్‌ చేస్తున్నాడు. ఇటీవల తన స్నేహితుడు శ్రీను అతని స్నేహితుడైన అరవింద్‌కు పరిచయం చేశాడు. అరవింద్‌ తన స్నేహితుడు మధు కార్లు అద్దెకు తీసుకుని ప్రతినెల పెద్ద మొత్తంలో కిరాయి ఇస్తుంటాడని తెలిపారు. దాంతో సూర్యతేజ తన కారును మధుకు ఇచ్చి అగ్రిమెంట్‌ రాయించుకున్నాడు. అతనికి మూడు నెలలు కిరాయి అందించాడు. ఇంకా కార్లు ఉంటే చెప్పాలని వారికి కూడా రూ. 40 వేల చొప్పున చెల్లిస్తానని అనగా సూర్యతేజ తనకు తెలిసిన దాదాపు 10 మంది స్నేహితులకు చెప్పి వారి కార్లను మధుకు ఇప్పించాడు. ఒకటి రెండు నెలలు బాగానే ఉన్నప్పటికీ తర్వాత కిరాయి ఇవ్వలేదు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట కారు ఇచ్చిన ఓ మహిళ నగరానికి వచ్చి తన కారు లొకేషన్‌ శంషాబాద్‌లో ఉన్నట్టుగా గుర్తించి అక్కడకు వెళ్లింది. ఆమె కారు బేకరీ షాపు ముందు ఉండగా అక్కడకు వెళ్లి ఆరా తీసింది. బేకరీ షాపు యజమాని ఈ కారును మధు అనే వ్యక్తి రూ. 1.20 లక్షలకు మార్టిగేజ్‌ చేసి తనకు ఇచ్చాడని తెలిపాడు. దాంతో ఆమెతోపాటు బాధితులు మధుకు ఫోన్‌ చేసి వివరణ కోరగా అతను ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ చేసుకున్నాడు. తమను మోసం చేసిన మధు, అరవింద్‌లపై చర్యలు తీసుకోవాలని బాధితులు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాళీపట్నం రామారావు నేటి రచయితలకు స్ఫూర్తి

చిక్కడపల్లి: జీవితం చివరి వరకూ తెలుగు కథ ఉన్నతి తెలిపేందుకు తపించిన కాళీపట్నం రామారావు నేటి రచయితలకు స్ఫూర్తి అని ప్రముఖ కళాకారుడు రోసిరెడ్డి అన్నారు. ఆయన నిరంతర కృషి జాతీయ స్థాయిలో తెలుగు కథను నిలిపిందన్నారు. గురువారం త్యాగరాయ గానసభలో ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావు శత జయంతి సమావేశం జరిగింది. గానసభ అధ్యక్షుడు వీఎస్‌ కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆయన రాసిన 'యజ్ఞం'కథ దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసిందన్నారు.

పోలీసుల అదుపులో గిరిజన నేతలు



పోలీసుల అదుపులో విష్ణునాయక్‌

బంజారాహిల్స్‌: లగచర్ల తండాలో బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న జూబ్లీహిల్స్‌, బంజారాహిల్స్‌కు చెందిన పలువురు గిరిజన నేతలను పోలీసులు మార్గమధ్యంలోనే అదుపులోకి తీసుకున్నారు. ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి విష్ణునాయక్‌తో పాటు సంఘం ప్రతినిధులు ప్రకాష్‌, శ్రీను, రాజు తదితరులను పరిగి పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేసి విడుదల చేశారు. జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌–5లోని దుర్గాభవానీనగర్‌ బస్తీకి చెందిన విష్ణునాయక్‌తో పాటు ఫిలింనగర్‌, బంజారాహిల్స్‌లకు చెందిన మరో ముగ్గురు నేతలు ఉదయం లగచర్లకు బయలుదేరారు. సమాచారం అందుకున్న పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విష్ణునాయక్‌ మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి తాము లగచర్లకు వెళ్లి అక్కడి బాధితులతో మాట్లాడానికి ప్రయత్నిస్తున్నామని, పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. తమకు ప్రశాంతంగా తిరిగి హక్కు లేదా? అని నిలదీశారు.

కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి ఎస్టీపీల్లో పనిచేసే కార్మికులకు రామానుజ సేవా ట్రస్ట్‌, జనహిత సేవా ట్రస్ట్‌ సంయుక్త ఆధ్వర్యంలో కిమ్స్‌ ఆసుపత్రి సహకారంతో అంబర్‌పేట్‌ ఎస్టీపీ ప్రాంగణంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గురువారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్‌ మిట్టల్‌ ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ మాట్లాడుతూ... కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించిన ట్రస్టులను ఆయన అభినందించారు. ఈ శిబిరంలో దాదాపు 300 మంది కార్మికులకు బీపీ, షుగర్‌, హిమోగ్లోబిన్‌, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఎస్టీపీ ప్రాంగణంలో ఎండీ, ఈడీలు కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రామానుజ సేవా ట్రస్ట్‌ చైర్మన్‌ డాక్టర్‌ జీవీ ధనుంజయ్‌, జీఎంలు సుబ్రమణ్యం, సంతోష్‌కుమార్‌, డీజీఎంలు రాజ్‌కుమార్‌, నాగేశ్వరరావు, వినోద్‌కుమార్‌, మేనేజర్‌లు కల్యాణి, భాను చందర్‌ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్‌: అల్లాడిన్‌ కోటి, బీకే గూడ 11కేవీ ఫీడర్లు, లోధ, ఈఎస్‌ఐ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సనత్‌నగర్‌ ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌, అల్లాడిన్‌కోటి, లిక్కర్‌ కంపెనీ, జయభారతి స్కూల్‌, శ్రీరామ్‌నగర్‌, దాసారం బస్తీ, సి–టైప్‌ క్వార్టర్స్‌లలో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ తెలిపారు. పొల్యూషన్‌ కంట్రోల్‌బోర్డు, ట్రాన్సిస్ట్‌ హాస్టల్‌ 11కేవీ ఫీడర్లు ఆల్విన్‌, కుందన్‌బాగ్‌ సబ్‌స్టేషన్ల పరిధిల్లోని సనత్‌నగర్‌ మెయిన్‌రోడ్డు, ఫైర్‌ స్టేషన్‌, పోలీసుక్వార్టర్స్‌, 3 ఆర్‌టీ, ఉమానగర్‌, వైట్‌హౌస్‌, కుందన్‌బాగ్‌బస్తీ, ట్రాన్సిస్ట్‌ హాస్టల్‌ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ ఉండదన్నారు.

ఉపయోగంలో లేని వస్తువుల సేకరణ రేపు

బంజారాహిల్స్‌: ఉపయోగంలో లేని వస్తువుల సేకరణకు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్‌ సర్కిల్‌–18 డీఎంసీ ప్రశాంతి తెలిపారు. ఈ నెల 23వ తేదీన ఉదయం 9 గంటల నుంచి షేక్‌పేట లక్ష్మీనగర్‌లో, వెంకటేశ్వరకాలనీ డివిజన్‌ కమలాపురికాలనీలో, బంజారాహిల్స్‌ డివిజన్‌ ఎమ్మెల్యేకాలనీలో ప్రత్యేక బృందాలు వాహనాలు ఏర్పాటుచేసుకుని అందుబాటులో ఉంటాయన్నారు. తమ ఇళ్లల్లో ఉపయోగంలో లేని వస్తువులను నాలాల్లో, రోడ్ల పక్కన పడేస్తున్నారని, దీని వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని వెల్లడించారు. దీని నివారణ కోసం ప్రత్యేకంగా ఆయా ప్రాంతాల్లో స్వచ్ఛ ఆటోలు ఏర్పాటుచేసి పనికిరాని దిండ్లు, పరుపులు, విరిగిపోయిన కుర్చీలు ఇతరత్రా వేస్ట్‌ మెటీరియల్‌ను స్వీకరిస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పుస్తక పఠనంతో ఉజ్వల భవిత



లైబ్రేరియన్‌ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సీఎన్‌ రెడ్డి

రహమత్‌నగర్‌: తాను చదువుకునే రోజుల్లో క్రమం తప్పకుండా లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు చదువుకునే వాడినని కార్పొరేటర్‌ సి.ఎన్‌. రెడ్డి పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా సంపూర్ణ విజ్ఞానాన్ని పొందవచ్చని.. తద్వారా ఉజ్వల భవితను సొంతం చేసుకోవచ్చని ఆయన అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రహమత్‌నగర్‌ గ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించి లైబ్రేరియన్‌ శ్రీనివాస్‌ను సన్మానించారు. రహమత్‌నగర్‌ గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్‌ హామీ ఇచ్చారు.

రేపు కులగణనపై ప్రత్యేక సమావేశం

రహమత్‌నగర్‌: హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో కులగణన సర్వేపై ఈ నెల 23న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారని ఖైరతాబాద్‌ మండల తహసీల్దార్‌ నయూమోద్దీన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. కులగణన పై ప్రజలు తమ అభిప్రాయాలు, సందేహాలను సమావేశంలో అధికారులకు తెలియజేయవచ్చన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సమావేశం కొనసాగుతుందన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర బీసీ కమిషన్‌ ప్రతినిధులు సమావేశంలో పాల్గొంటారని తహసీల్దార్‌ వివరించారు.

యూసుఫ్‌గూడలో భారీ అగ్నిప్రమాదం

- కాలి బూడిదైన ఆటోమొబైల్‌ షాప్‌
- రూ. కోటి నష్టం.. ఆదుకోవాలని బాధితుడి వేడుకోలు



కాలిపోతున్న ఆటోమొబైల్‌ షాపు

వెంగళరావునగర్‌: యూసుఫ్‌గూడ ప్రధాన రహదారిలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో దాదాపు కోటి రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాలివీ... యూసుఫ్‌గూడ ప్రధాన రహదారిలోని హైదరాబాద్‌ బిర్యానీ పాయింట్‌ పక్కనే ఉన్న ఆటోమొబైల్‌ షాపులో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. చూస్తుండగానే మంటలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దాంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న ప్రజలు తమ ఇళ్లను వదిలి పారిపోయారు. షాపు మూసి వేసి ఉండటం, లోపల నుంచి పెద్ద శబ్దాలు రావడం, మంటలు పెరిగిపోవడంతో ఆందోళన చెందిన స్థానికులు జూబ్లీహిల్స్‌ పోలీసులకు, ఫిల్మ్‌నగర్‌ ఫైర్‌ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అగ్ని మాపక సిబ్బంది రెండు గంటల పైగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్ని ప్రమాదంలో షాపులోని సామగ్రి కాలి బూడిదైంది. షాపులో యజమానితో పాటు సిబ్బంది సైతం ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. అగ్ని ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న షాపు నిర్వాహకులు మహ్మద్‌ షఫీ సంఘటనా స్థలానికి వచ్చి బోరున విలపించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ అగ్ని ప్రమాదంలో కోటి రూపాయలకు పైగా ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా షార్ట్‌ సర్క్యూట్‌ వల్లనే భారీ ఎత్తున అగ్ని ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో నేడు

- భారతదేశ సాంస్కృతిక అతిపెద్ద ఉత్సవం లోక్ మంథన్ భాగ్యనగర్–2024లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉమ్మడి కుటుంబాల సమ్మేళనం ఉంటుంది.
- కార్తీక సమాసాన్ని పురస్కరించుకుని భక్తి టీవీ కోటీ దీపోత్సవం ఇందిరాపార్క్ సమీపంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుంది.
- అపోలో మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.86 ఎమ్మెల్యే కాలనీలో లోటస్‌పాండ్ రోడ్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో మధ్యాహ్నం 1.45 గంటలకు వైట్ కోట్ వేడుక జరుగుతుంది.
- లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వెనుకబడిన తరగతుల స్థితిగతులపై బహిరంగ విచారణ జరుగుతుంది.
- సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత ములాయం సింగ్ యాదవ్ జయంతి సందర్భంగా భారత రాజ్యాంగం–పీడీఏ సాధికారిత అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు మధ్యాహ్నం 3 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కొనసాగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

30 ఏళ్ల తర్వాత కూడా..
యూనిఫాం సైజు మారొద్దు
పాసింగ్ అవుట్ పరేడ్‌లో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్


గౌరవ వందనం స్వీకరిస్తున్న సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

చార్మినార్: పోలీస్ ఉద్యోగం అనేది ఒక పవిత్రమైన ఉద్యోగం, పోలీస్ ఏ ఒక్కరోజు పనిచేయకున్నా.. సమాజం నడవదు.. అటువంటి పోలీసులు నిరంతరం సమాజం కోసం శ్రమిస్తూ ఉండే ఈ తరుణంలో వారికి కుటుంబ సభ్యుల సహకారం ఖచ్చితంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్, 'దీక్షాంత్ పరేడ్' పాసింగ్ అవుట్ పరేడ్ పేట్లబుర్జు సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ హాజరై శిక్షణ పొందిన వారికి అభినందనలతో పాటు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు శిక్షణ పొందిన వారు అకుంఠిత దీక్షతో పని చేయాలని, పోలీసులు రాజ్యాంగానికి విధేయత చూపాలని, పోలీసులు నిజాయితీగా, న్యాయంగా పనిచేయాలని, ప్రజల మాన, ప్రాణాలు కాపాడటంలో కర్తవ్యం నెరవేర్చాలని తెలిపారు. మిమ్మల్ని చూస్తే నా అనుభవాలు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. 1992లో నేను ఐపీఎస్ శిక్షణ పొందాను.. 80 మందితో మా పాసింగ్ అవుట్ పరేడ్ వర్షంలో జరిగింది. నేను పోలీస్ శాఖలో శిక్షణ పొంది 33 ఏళ్లు గడిచిపోయాయని చెప్పారు. నేను పోలీస్ సర్వీస్‌లో 75–76 కేజీల మధ్యలో ఉన్నాను.. నా ఫిట్‌నెస్ కూడా అలాగే ఉండేందుకు చాలా శ్రమిస్తాను అని ఆయన చెప్పారు. విధి నిర్వహణలో ఒత్తిడితో చెడు అలవాట్లు నేర్చుకుంటారని, వాటికి దూరంగా ఉండాలని ఆయన కోరారు. మీరు ఇప్పుడు ఉన్న ఫిజికల్ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ రాబోయే 30 ఏళ్ల తర్వాత కూడా ఇప్పుడు వేసుకున్న యూనిఫారం ధరించే విధంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అవినీతికి పాల్పడవద్దని అన్నారు. కార్యక్రమంలో సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, అడిషనల్ డీసీపీ మద్దిపాటి శ్రీనివాసరావు, రక్షిత కృష్ణమూర్తి, ఇతర అధికారులు, కేడెట్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ పోలీస్ అకాడమీలో..


తెలంగాణ పోలీస్ అకాడమీలో కానిస్టేబుళ్లకు ట్రోఫీ అందజేస్తున్న తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్

బండ్లగూడ: రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో గురువారం కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ హాజరయ్యారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, డీజీపీ అభిలాష బిస్త్ ప్రమాణం చేయించారు. కానిస్టేబుళ్లు చేసిన 9 నెలల శిక్షణ కోసం ప్రిన్సిపాల్, పీటీసీ, అడిషనల్ ఎస్పీ వేమా శ్రీనివాస్‌రెడ్డి శిక్షణ నివేదికను అందించారు. ఎస్‌సీటీ పీసీలు(సివిల్), టీజీపీఏ నుంచి 560, ఎస్‌సీటీ పీసీలు(ఏఆర్) టీజీపీఏ 278, ఎస్‌సీటీ పీసీలు(ఏఆర్) చెల్లాపూర్ 292, ఎస్‌సీటీ పీసీలు (ఐటీఅండ్‌సీ) బేగంపేట్ 81 మందికి శిక్షణ పూర్తి చేసుకున్నారు. 2024 బ్యాచ్ స్టైపెండియరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ ఈ అకాడమీ పరేడ్‌లో 1,211 మంది క్యాడెట్‌లు(అందరూ మహిళలు) ఉన్నారు. ఈ బ్యాచ్‌లో తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ట్రైనీలు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన పలువురికి జ్ఞాపికలను అందజేశారు.

యూనిఫాం గౌరవాన్ని కాపాడుకోవాలి
- సీఐడీ డీజీపీ శిఖాగోయల్


అంబర్‌పేట పీటీసీలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఐడీ డీజీపీ శిఖాగోయల్

అంబర్‌పేట: పోలీస్ యూనిఫాంను చూసి ప్రజలు గౌరవిస్తారని, గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పోలీస్‌పై ఉండాలని డీజీపీ(సీఐడీ) శిఖాగోయల్ అన్నారు. పోలీస్ యూనిఫాం క్రమశిక్షణకు మారుపేరు అని, దాన్ని గౌరవిస్తూ విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు. అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రంలో 2024 బ్యాచ్ కానిస్టేబుళ్ల శిక్షణ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. సమాజంలో పోలీస్ ఉద్యోగ విధులు అత్యవసరంగా ఉంటాయని, దానికి కుటుంబం మద్దతు ఇవ్వాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పరవస్తు మధుకర్‌స్వామి, ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, పీటీసీ, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యంత పారదర్శకంగా నియామక ప్రక్రియ


ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అదనపు డీజీ శ్రీనివాస్‌రావు

సాక్షి, సిటీబ్యూరో: 9 నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 2023–24కు చెందిన స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్(ఎస్సీటీపీసీ– ఆర్మ్‌డ్ రిజర్వ్) 7వ బ్యాచ్ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్ సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డీజీ శ్రీనివాస్‌రావు పరేడ్‌ను పరిశీలించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని, 18 వేల పోస్టుల భర్తీకి 8 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వృత్తి నైపుణ్యం, అంకితభావంతో చట్టం అమలులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు కేడెట్లు కఠోర శిక్షణ పొందారని గుర్తుచేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టి, కెరీర్‌లో రాణించాలని సూచించారు. సమగ్రత, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యం ఈ మూడే పోలీసు బలగానికి మూల స్తంభాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. గచ్చిబౌలిలోని కమిషనరేట్ ట్రైనింగ్ సెంటర్‌లో 270 మంది కేడెట్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. సీటీసీ ప్రిన్సిపాల్ డీసీపీ ఎస్సీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన సేవలు అందించాలి
రాచకొండ సీపీ సుధీర్ బాబు


గౌరవ వందనం స్వీకరిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సాక్షి, సిటీబ్యూరో: అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు సూచించారు. నల్లగొండ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో 265 మంది ట్రైనీ(ఏఆర్) కానిస్టేబుళ్ల 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ విజయవంతంగా పూర్తయ్యింది. ఈ సందర్భంగా జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ.. నూతన ఉత్సాహంతో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ ప్రాణవాయువులా పనిచేయాలన్నారు. శిక్షణ అనంతరం కూడా రోజూ వ్యాయామం చేసి ఫిట్‌గా ఉండాలన్నారు. పోలీసుశాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు అని, అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అడిషనల్ ఎస్పీ డీటీసీ రమేష్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు వన్నె తేవాలి
ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి


కండ్లకోయలో మాట్లాడుతున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: పోలీస్ శిక్షణ పూర్తి చేసుకుని సమాజంలో అడుగు పెడుతున్న కానిస్టేబుళ్లు ఉత్తమ సేవలందించి పోలీస్ శాఖకు వన్నె తేవాలని రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో ఉన్న పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో ఎస్‌సీటీపీసీ కానిస్టేబుళ్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థుల పాసింగ్ అవుట్ పరేడ్ గురువారం నిర్వహించారు. మొదట అభ్యర్థుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన శిక్షణ పూర్తి చేసుకున్న 526 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పొందిన వారిలో ఎక్కువ మంది గ్రాడ్యుయేట్లు ఉండటం సంతోషకరమని, నాలెడ్జ్ ఉన్న వీరు పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్పీ మధుకర్ స్వామి, వైస్ ప్రిన్సిపాల్ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరబాబు, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, మేడ్చల్, పేట్‌బషీరాబాద్ ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ పాల్గొన్నారు.

హిమాయత్‌సాగర్ బఫర్ జోన్‌లోని నిర్మాణాల కూల్చివేత


హిమాయత్‌సాగర్ బఫర్‌జోన్‌లోని నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

శంషాబాద్: పట్టణంలోని కొత్వాల్‌గూడ పరిధిలోని హిమాయత్‌సాగర్ బఫర్ జోన్‌లో నిర్మాణం చేసిన ప్రహరీలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సాగర్ పరిధిలోని బఫర్ జోన్‌లో కొంతకాలం క్రితం కొందరు వ్యక్తులు పునాదుల నిర్మాణంతో పాటు ప్రహరీల నిర్మాణం చేశారు. మెట్రోవాటర్ బోర్డుతో పాటు రెవెన్యూ అధికారులు సాగర్ బఫర్ జోన్‌లోనే ప్రహరీలు, పునాదులు ఉన్నట్లు గుర్తించారు. తహసీల్దార్ రవీందర్ దత్ ఆదేశాలతో ఆర్ఐ కృష్ణ రెవెన్యూ సిబ్బందితో వాటిని కూల్చివేయించారు. బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు సెల్ఫ్ సపోర్టింగ్ ఫీజు చెల్లింపు సీట్ల భర్తీ

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 2024–25వ విద్యా సంవత్సరానికి సంబంధించి సెల్ఫ్ సపోర్టింగ్ కింద ఆయా కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ.జర్నలిజం అండ్ మాస్ కమ్యూకేషన్, ఎంఏ.తెలుగు(బాచుపల్లి ప్రాంగణం), ఎంఏ.హిస్టరీ కల్చర్ అండ్ టూరిజం కోర్సుల్లో పది సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. సెల్ఫ్ సపోర్టింగ్ ఫీజును చెల్లించి ప్రవేశాలు పొందవచ్చని కోరారు. ఎంఏ.జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ కోర్సులోని ప్రవేశాలకు వర్కింగ్ జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎన్‌సీసీ, పీహెచ్‌సీ, స్పోర్ట్స్ కోటాలో ప్రవేశం పొందడానికి సంబంధిత సర్టిఫికెట్లతో ఆయా శాఖల్లో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు బాచుపల్లిలోని తెలుగు వర్సిటీ ప్రాంగణంలోని సంబంధిత శాఖల్లో విద్యార్హతలకు సంబంధించి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్ ప్రతులతో సంప్రదించాలని కోరారు. ఈ సీట్లలో ప్రవేశం పొందిన వారికి హాస్టల్ సౌకర్యం ఉండదని తెలిపారు. ఎంఏ.జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ కోర్సుకు రూ.22వేలు, ఎంఏ.తెలుగు కోర్సుకు రూ.15వేలు, ఎంఏ.హిస్టరీ కల్చర్ అండ్ టూరిజం కోర్సుకు రూ.22వేల సెల్ఫ్ సపోర్టింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

వేయి మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు

- అవసరమైనవారికి కళ్లద్దాల పంపిణీ
- ఐఆర్‌బీ గోల్కొండ ఆధ్వర్యంలో నిర్వహణ


కార్యక్రమంలో ముఖ్య అతిథులు

సాక్షి, సిటీబ్యూరో: ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ఆధ్వర్యంలో ఔటర్ రింగ్ రోడ్డుపై భారీ వాహనాలు నడిపే డ్రైవర్లకు గురువారం ఉచిత కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. టాటా గ్రూప్ సంస్థ టైటాన్ ఐ ప్లస్, హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్(హెచ్‌జీటీఏ)లతో కలిసి ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో సుమారు వెయ్యి మంది డ్రైవర్లు పాల్గొన్నారు. వనస్థలిపురం ఆటో నగర్‌లోని ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి మాట్లాడుతూ.. ఎక్కువ గంటలు డ్రైవింగ్ చేయడం, సరైన పరిశుభ్రత లేకపోవడం వంటి కారణాల వల్ల కంటి సమస్యలకు దారితీస్తుందన్నారు. 60 ఏళ్లు పైబడిన చాలామంది డ్రైవర్లు కంటి శుక్లం లేదా గ్లకోమాతో బాధపడుతున్నారని చెప్పారు. భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని, కళ్లు సరిగా కనిపించనప్పుడు కళ్ల జోడు ధరించడానికి మొహమాటం పడొద్దని డీసీపీ ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే సంస్థను అభినందించారు. గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు వనస్థలిపురం ఆటోనగర్‌లో ఈ శిబిరాన్ని నిర్వహించనున్నారు. డ్రైవర్లకు కంటి చూపును పరీక్షించడంతో పాటు అవసరమైనవారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు.

అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన


నిరసన ప్రదర్శనలో వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలం జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు గురువారం నిరసన కొనసాగించారు. ప్రభుత్వం తన ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు, ఉద్యోగులు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ఎదుట నిరసన కొనసాగించారు. ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 27న విశ్వవిద్యాలయంలో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమీల కేతావత్, రజని, యాకేష్‌దైద, ఉదయిని, కాంతం ప్రేమ్‌కుమార్, కిషోర్, రాఘవేంద్ర, పాండు, షబ్బీర్, రాములు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైం స్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

జల వనరుల పరిరక్షణే ధ్యేయం

- నీటి అనుకూల నగరాల్లో హైదరాబాద్ ఒకటి
- 30వ ఇండియన్ ప్లంబింగ్ కాన్ఫరెన్స్ ప్రారంభం
- ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

సాక్షి, సిటీబ్యూరో: సహజ సిద్ధమైన వనరుల్లో అత్యంత కీలకమైన నీటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. మూడు రోజుల 30వ ఇండియన్ ప్లంబింగ్ కాన్ఫరెన్స్ హైటెక్స్‌లో గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. జలవనరుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రజావ్యతిరేకంగా కనిపిస్తున్నా.. అది నిజం కాదని, ప్రస్తుత, భవిష్యత్తు తరాల కోసం కఠిన నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పేదలు, బలహీన వర్గాలకు ముందుగా పునరావాసం కల్పించి, ఆయా చర్యలు తీసుకుంటున్నామని గుర్తుచేశారు. మూసీ పునరుజ్జీవంతో భాగ్యనగర వారసత్వ శోభ మరింత పెరగడంతో పాటు భవిష్యత్తు పట్టణ జీవన నాణ్యత మెరుగవుతుందన్నారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం తాగు, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు సరిపడా నీరు ఉందని, అలాగని అలసత్వం ప్రదర్శిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. చెరువుల పునరుద్ధరణ, బోరు బావుల నియంత్రణ వంటి సమగ్రమైన నీటి సంరక్షణ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గృహ, వాణిజ్య, పారిశ్రామిక మురుగు నీటిని శుద్ధి చేసిన తర్వాతే విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నీటి సంరక్షణలో డెన్మార్క్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని, వ్యక్తిగత రోజు వారీ నీటి వినియోగాన్ని సగానికి తగ్గించారని భారతదేశంలో డెన్మార్క్ రాయబారి సోరెన్ నార్రెలుండ్ కన్నిక్ మార్కార్డ్‌సెన్ అన్నారు. ప్రస్తుతం దేశంలో డయేరియా కారణంగా రోజుకు 3 వేల మంది చనిపోతున్నారని ఇండియన్ ప్లంబింగ్ అసోసియేషన్(ఐపీఏ) జాతీయ అధ్యక్షుడు గుర్మిత్‌సింగ్ అరోరా అన్నారు.

నీటి విలువ తెలుసుకోవాలి: ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మాదాపూర్: నీరు భూమిపై అత్యంత విలువైన సహజ వనరులో ఒకటని, ఇది అన్ని రకాల జీవులకు అవసరమని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో వాటర్ కరెన్సీ థీమ్‌తో ఏర్పాటు చేసిన 30వ ఇండియన్ ప్లంబింగ్ కాన్ఫరెన్స్‌లో వర్చువల్‌గా ప్రసంగించారు. నీటి సంరక్షణలో డెన్మార్క్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందన్నారు. నీటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీటి సంరక్షణను ప్రోత్సహించడం, ప్రతి చుక్కను లెక్కించడం, భవిష్యత్ కోసం నీటిని ఆదా చేయడం గురించి సమాజానికి కనీస అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టు మరింత పురోగమిస్తే నగరం కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందుతుందన్నారు.

ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు


మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు రాజేంద్రబాబు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పెన్షనర్ల కమ్యూటేషన్ మొత్తాన్ని తిరిగి చెల్లించే విషయంలో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సత్వరమే అమలు చేయాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.రాజేంద్రబాబు అధ్యక్షతన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్రబాబు, ఎస్వీ నర్సింహరావు మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పటిష్టపరిచి పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత చికిత్స అందించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. బకాయిపడ్డ డీఆర్‌లను విడుదల చేయాలని, పెన్షనర్ల మెడికల్ బిల్లులను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి బి.నర్సయ్యతో పాటు 25 జిల్లాలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి


వాటర్ బోర్డు జీఎంతో కార్మికుల సమస్యపై చర్చిస్తున్న ప్రతినిధుల బృందం

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వాటర్ బోర్డు గుర్తింపు కార్మిక సంఘం విజ్ఞప్తి చేసింది. సంఘం అధ్యక్షుడు రాంబాబుయాదవ్ ఆధ్వర్యంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎల్లమ్మయ్య, లక్ష్మీనారాయణ, మేడ్చల్ శ్రీనివాస్‌లు రెడ్‌హిల్స్ డివిజన్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్‌ను గురువారం కలిసి పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు, తెలంగాణ ఇంక్రిమెంట్ రికవరీ, ఈపీఎఫ్, పరస్పర బదిలీలు తదితర అంశాలను చర్చించారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు. యూనియన్ అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఏ ఉద్యోగికి చిన్నసమస్య వచ్చినా యూనియన్ దృష్టికి తీసుకురావాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ముఖ్య నాయకులు కొమురయ్య, సంతోష్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, శివారెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణకు ఆర్టికల్ 341ని సవరిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపజేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి చైర్మన్ పోకల కిరణ్‌కుమార్ గురువారం బర్కత్‌పురలోని సామాజిక భవన్‌లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్రంలో ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు అమలు పరిచే వరకు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందని ఆయన తెలిపారు. 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం నేత బాలకిషన్‌రావు, కేంద్ర కార్మిక సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి దయానంద్, సంగీతం రాజలింగం, అంబటి కృష్ణమూర్తి, నల్ల సూర్యప్రకాష్, కూసపాటి శ్రీనివాస్, బిషప్ స్వామిదాస్, ఆర్.మోజెస్, సనవుల్లాఖాన్, పుట్ట జంగన్నగౌడ్, కళ్యాణ్ ప్రేమ్‌రాజ్, సుంచు లింగయ్య, రాయకంటి రామదాసు, సింగిరెడ్డి పరమేష్, సుజియ, మహేష్ యాదవ్, సుధాకర్ మాదిగ తదితరులు సంఘీభావం ప్రకటించారు.


దేవాలయాల్లో ప్రభుత్వ పెత్తనం ఎందుకు..?

ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం


మాట్లాడుతున్న ఎల్వీ సుబ్రహ్మణ్యం

పంజగుట్ట: ప్రభుత్వాలు గౌరవప్రదంగా దేవాలయాల నుంచి తప్పుకుని, కేవలం అవసరమైనప్పుడు సాయం చేయాలని రిటైర్డ్ ఐఏఎస్, ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్.వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాల్లో ప్రభుత్వ పెత్తనం ఎందుకో అర్థం కావడంలేదని, ప్రభుత్వానికి దేవాలయాలపై పెత్తనం చెలాయించే సామర్థ్యం ఉందా అని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉన్న అధికారి నాస్తికుడో, వారు వేరే విశ్వాసాన్ని నమ్మేవారు ఉంటే అప్పుడు హిందూ దేవాలయాల పరిస్థితి ఏమిటని, అలాంటి అధికారులు శ్రద్ధతో ఎలా సేవలు అందిస్తారని అన్నారు. 200 సంవత్సరాలకు పూర్వం దేవాలయాలను ప్రజలే చూసుకునే వారని, ఇప్పటికైనా ప్రభుత్వాలు తప్పుకుని దేవాలయాలను భక్తులకు అప్పగించాలన్నారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి నాగేశ్వరరావు, భగవత్‌గీత ఫౌండేషన్ చైర్మన్ ఎల్.వీ.గంగాధరశాస్త్రి, గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెలగపూడి ప్రకాష్‌రావు, బీజేపీ నాయకురాలు పంకజ్ శ్రీనివాసన్, వేదిక స్కాలర్ అవధానులు, వేణుగోపాల్, అర్జున్‌సింగ్, శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌ । శుక్రవారం । 22 । నవంబర్‌ । 2024





బహుమతులకు పర్‌ఫెక్ట్‌..



ఫొటో ఎంబ్రాయిడరీ కాన్సెప్ట్‌ నగరంలో కొత్తగా వచ్చింది. ఎంబోజ్, గ్లిట్టర్‌ వంటి ఫొటో ప్రింటింగ్‌ టెక్నాలజీని ఆల్బమ్‌లు రూపొందించేందుకు ఎక్కువగా వాడుతుంటాం. వీటితో ఆల్బమ్‌కు, ఫొటోలకు మంచి లుక్‌ వస్తుంటుంది. అయితే ఫొటో ఎంబ్రాయిడరీని ఆల్బమ్‌లో పెట్టడం కాస్త కష్టం. అందుకే చాలా మంది ఫొటో ఫ్రేమ్స్‌ చేయించుకునేందుకు ఫొటో ఎంబ్రాయిడరీ గురించి అడుగుతున్నారు. ముఖ్యంగా ఏదైనా ఫంక్షన్, పెళ్లి వంటి శుభకార్యాల్లో గిఫ్ట్‌గా ఇచ్చేందుకు దీన్ని ఎంచుకుంటున్నారు. చూసేందుకు బాగుండటమే కాకుండా రిచ్‌గా, సరికొత్తగా ఉంటోందని చెబుతున్నారు.


– బీసు విష్ణుప్రసాద్, ఫొటోగ్రాఫర్‌

మనలో చాలా మంది జీవితంలో మరపురాని సందర్భాలను పదిలపరుచుకుంటారు. కొందరు వీడియోల రూపంలో దాచుకుంటే మరికొందరు ఫొటోల రూపంలో భద్రపరుచుకుంటారు. పుట్టిన పిల్లలకు సంబంధించి ప్రతి నెలా, ప్రతి సంవత్సరం విభిన్నంగా ఫొటో షూట్స్‌ చేసుకుంటున్నారు. అందరిలాగే మనం ఎందుకు ఉండాలని కొందరు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. ఒకప్పుడు బ్లాక్‌ అండ్‌ వైట్‌ ఫొటోలు ఉండేవి కదా.. మళ్లీ ఆ రోజుల్లోకి వెళ్తున్నారు. అలా సాధారణ బ్లాక్‌ అండ్‌ వైట్‌ ఫొటోలకు కొత్త సొబగులు అద్దుతూ సరికొత్తగా ప్రజెంట్‌ చేస్తున్నారు. బ్లాక్‌ అండ్‌ వైట్‌ ఫొటోలకు చేతులతో ఎంబ్రాయిడరీ వర్క్‌ చేస్తూ కొత్త లుక్‌ తీసుకొస్తారు. చీరలకు, జాకెట్లకు, డ్రెస్‌లకు ఎంబ్రాయిడరీ వర్క్స్‌ తరహాలోనే.. ఫొటోలకు ఎంబ్రాయిడరీ ఏంటని ఆశ్చర్యపోయేలా వర్క్‌ చేస్తున్నారు. అవును ఈ సరికొత్త ట్రెండ్‌ గురించే ఈ కథనం... – సాక్షి, సిటీబ్యూరో



కుట్టు.. ఫొటో ఆకట్టు..

ఫొటోలపై హ్యాండ్‌ ఎంబ్రాయిడరీ ట్రెండ్‌





ఫొటోలపై హ్యాండ్‌ ఎంబ్రాయిడరీ ఇటీవల నగరంలో ఫేమస్‌ అవుతోంది. చాలా ఏళ్ల నుంచి ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో ఈ పనితీరు ట్రెండింగ్‌లో ఉండగా, తాజాగా మన నగరంలోకి వచ్చింది. పెళ్లి ఫొటోలు, బర్త్‌డే ఫొటోలు, బేబీ బంప్‌ సందర్భంగా తీసిన ఫొటోలను ఫ్రేమ్స్‌ రూపంలో ఇంట్లో పెట్టుకోవాలనుకునే వారు.. నార్మల్‌గా కాకుండా ఇలా ఎంబ్రాయిడరీ వర్క్‌తో ఫొటోలకు డిఫరెంట్‌ లుక్‌ తీసుకొచ్చి తగిలించుకోవాలని అనుకుంటున్నారు. దీంతో ఫొటోలకే కాకుండా ఇంటికి కూడా సరికొత్త కళ వస్తోందని కస్టమర్లు అంటున్నారని నగరానికి చెందిన ఓ ఫొటోగ్రాఫర్‌ చెబుతున్నాడు. ఎంబోజ్‌ వంటి ప్రింటింగ్‌తో కూడా ఇలాంటి ఎఫెక్ట్‌ తీసుకురావొచ్చని, అయితే దానికన్నా ఎంబ్రాయిడరీకే కస్టమర్లు మొగ్గు చూపుతున్నారని తెలిపాడు. ముఖ్యంగా ఇంట్లో తగిలించుకునే ఫొటో ఫ్రేమ్స్‌ విషయంలో ఎక్కువ మంది ఇలాగే అడుగుతున్నారని పేర్కొన్నాడు.

కాస్త సమయం పట్టినా..

సాధారణంగా ఫొటో ఎడిటింగ్, ప్రింటింగ్‌ నిమిషాల్లో అయిపోతుంది. కానీ ఎంబ్రాయిడరీకి కాస్త ఎక్కువ సమయమే పడుతుంది. సైజును బట్టి.. ఫొటోపై కుట్టాల్సిన ఎంబ్రాయిడరీని బట్టి సమయం తీసుకుంటున్నారు. ఒక్క ఫొటో పూర్తి చేసేందుకు కనీసం నాలుగైదు గంటల సమయం పడుతుందని ఓ షాప్‌ నిర్వాహకుడు వివరించాడు. సాధారణ ఫొటోలతో పోలిస్తే కాస్త ఖరీదు ఎక్కువ అయినా గిఫ్టులు ఇచ్చేందుకు ఫొటో ఎంబ్రాయిడరీని ఎంచుకుంటున్నారని చెబుతున్నాడు.

ఎలా చేస్తారు..?

సాధారణంగా పెళ్లి ఫొటోలు లేదా ప్రత్యేక అకేషన్లలో దిగిన ఫొటోలను బ్లాక్‌ అండ్‌ వైట్‌ లేదా కలర్‌లో ప్రింట్‌ చేస్తారు. మనకు కావాల్సిన పరిమాణంలో ప్రింట్‌ తీసుకున్నాక.. మనకు కావాల్సిన మోడల్‌లో ఎంబ్రాయిడరీ చేయించుకోవచ్చు. కలర్‌ ఫొటోల వెనుక తెలుపు రంగులో ఫొటో పేపర్‌ను అతికించి, దానిపై ఫ్రేమ్‌ మాదిరిగా, ఫ్లవర్స్‌ లేదా మరేదైనా మనకు కావాల్సిన డిజైన్‌ హ్యాండ్‌తో ఎంబ్రాయిడరీ చేస్తుంటారు. లేదంటే బ్లాక్‌ అండ్‌ వైట్‌ ఫొటోలపై వేసుకున్న డ్రెస్‌ కానీ, ధరించిన పూల దండలు, నగలను మాత్రమే హైలైట్‌ చేస్తూ రంగురంగుల దారాలతో అల్లుతారు. దీంతో ఫొటోకు సరికొత్త కళ వస్తుందని చెబుతున్నారు.

- బ్లాక్‌ అండ్‌ వైట్‌ ఫొటోలకు సొబగుల అల్లిక
- ముంబై, బెంగళూరు నుంచి ఇటీవలే హైదరాబాద్‌కు
- ఎంబ్రాయిడరీతో ఫ్రేమ్స్‌ చేయిస్తున్న ఔత్సాహికులు
- ఫొటోలతో పాటు ఇంటికి కూడా కొత్త కళ

ఆరు పదులకు అందాల కిరీటం



విజేతగా విజయ శారదరెడ్డి, రన్నరప్‌గా రత్న మెహరా

బంజారాహిల్స్‌: వయసు శరీరానికి మాత్రమే.. మనసుకు కాదని ప్రతి మహిళకూ తెలియజేయాలనే లక్ష్యంతో తాను అందాల పోటీలో పాల్గొన్నానని, అందులో విజయం సాధించానని నగరానికి చెందిన విద్యావేత్త డాక్టర్‌ విజయ శారదరెడ్డి తెలిపారు. బ్యాంకాక్‌లో జరిగిన మిస్సెస్‌ ఆసియా ఇంటర్నేషనల్‌ పోటీల్లో క్లాసిక్‌ మిసెస్‌ ఇంటర్నేషనల్‌ 2024 కిరీటాన్ని ఆమె కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని ప్రసాద్‌ ల్యాబ్స్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆరు పదుల వయసు దాటినా, తాను ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నానని, అపరిమిత శక్తి సామర్థ్యాలు ఉండి కూడా బలహీనులమని భావిస్తూ ఇంటికే పరిమితమవుతున్న మహిళలను ప్రోత్సహించేందుకు, స్ఫూర్తి నింపేందుకు తాను ప్రయత్నిస్తున్నానని తెలిపారు.

మణికొండ : బ్యాంకాక్‌లో జరిగిన పోటీల్లో రత్న మెహరా మిసెస్‌ ఆసియా రన్నరప్, మిసెస్‌ ఎలిగాన్స్, మిసెస్‌ పాపులారిటీ విభాగంలో పతకాలను సాధించారు. మణికొండలో మీట్‌–గ్రీట్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర, దేశ స్థాయిలో విజయం సాధించిన తాను ఈ సంవత్సరం ఆసియా స్థాయిలో పోటీ పడి ఒకే వేదికపై మూడు పతకాలు సాధించటం ఆనందంగా ఉందన్నారు. ఆసియా స్థాయిలో 18 మందితో పోటీ పడి విజేతగా నిలిచానన్నారు. పేద పిల్లల విద్య, వికాసానికి సేవా చేస్తున్నానని, చేనేత కార్మికులకు తోడుగా నిలుస్తున్నానని అన్నారు.

సహజ ఆహారమే.. హెల్త్‌ సీక్రెట్‌



అధునాతన జీవనశైలిలో న్యూట్రిషన్‌ వెల్‌నెస్‌ పై సినీతార వాణీ భోజన్‌

సాక్షి, సిటీబ్యూరో : చిన్నప్పుడు అమ్మ పెట్టిన పోషకాహారమే తన హెల్త్‌ సీక్రెట్‌ అని ప్రముఖ సినీతార వాణీ భోజన్‌ తెలిపారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్య స్పృహ చాలా అవసరమని ఆమె సూచించారు. ఆల్మండ్‌ బోర్డ్‌ ఆఫ్‌ కాలిఫోర్నియా ఆధ్వర్యంలో నగరంలోని తాజ్‌ డెక్కన్‌ వేదికగా నేటి వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యానికి సహాయపడే సహజ విధానం, బాదంపప్పుల వంటి పోషకాల ప్రాధాన్యతపై న్యూట్రిషన్, వెల్‌నెస్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రముఖ నటి వాణీ భోజన్, న్యూట్రిషన్, వెల్‌నెస్‌ కన్సల్టెంట్‌ షీలా కృష్ణస్వామి, ఆర్‌జె ప్రతీకలు ప్యానలిస్టులుగా పాల్గొని చర్చించారు. ఆరోగ్య, మానసిక సంరక్షణకు 'నా ప్రయాణంలో సహజ ఆహారాలు, బాదంపప్పులు, వ్యాయామం కీలకంగా పనిచేశాయి' అని వాణీ తెలిపారు. ఆహారం కల్తీ అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అల్ట్రా–ప్రాసెస్‌ చేయబడిన ఆహారాల కన్నా నేచురల్‌ ఫుడ్, బాదాం వంటి పోషకాలను తీసుకోవడం ఉత్తమమని షీలా కృష్ణస్వామి అన్నారు.

సంస్కృతి ప్రతిబింబాలు..

సంగీత సాధనాలు







మధురమైన సంగీతాన్ని పలికే వాయిద్య పరికరాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో లోక్‌మంథన్‌ పేరిట ఏర్పాటు చేసిన ఉత్సవంలో భాగంగా సంగీత వాయిద్యాల ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. పూర్వ కాలంలో గిరిజనులు, గ్రామాల్లో ఉండే వారు రోజువారీ పనిలో అలసిపోయి దాని నుంచి సేదతీరేందుకు, వివిధ రకాల సంగీత వాయిద్యాలను ఉపయోగించి కథలను, పాటలను పాడి వినిపించే వారు. నేడు అలాంటి సంప్రదాయ సంగీత కళాకారులు అంతరించిపోతున్నారు. వారు ఉపయోగించిన సంగీత వాయిద్యాలను అందరికీ తెలియాలనే ఉద్దేశ్యంతో ఎగ్జిబిషన్‌ ఏర్పాటు చేసినట్టు తెలిపారు ప్రొఫెసర్‌ జయదేవ్‌ తిరుమలరావు. ఆ ప్రదర్శన విశేషాలు.. - మాదాపూర్‌

- » సందర్శకులను ఆకట్టుకుంటున్న చర్మ వాయిద్యాలు
- » దాదాపు 350కి పైగా సంగీత పరికరాలు
- » ఆకట్టుకుంటున్న గొండిడోలు, కొయ్యిడోలు, తాటిడోలు, ప్రాచీన తబలా
- » ఉదయం 10గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ప్రదర్శన

ఈ ప్రదర్శన కోసం దాదాపు 50 సంవత్సరాల నుంచి అందుబాటులో ఉన్న సంగీత పరికరాలను సేకరించారు. దాదాపు 350కు పైగా సంగీత చర్మ వాయిద్యాలను ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. ఈ వాయిద్యాలు సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే సంపద అని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో, కొండ ప్రాంతాల్లో సంతోషంగా ఉండే విధంగా సంగీతాన్ని సధనాలను ఉపయోగించి దానికి అనుగుణంగా జానపదాలు ఆలపించి సరదాగా గడిపేవారు. సంగీతం మనిషికి, ఆనందాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తుంది. అలాంటి సంగీత వాయిద్యాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం సంతోషించదగ్గ విషయం.



అలనాటి ఆకర్షణ..

ఉంజా వాయిద్యం, విశ్వబ్రాహ్మణులు ఉపయోగించే వాయిద్య పరికరం 32 రకాలుగా ప్లే చేయగలరు. దీనిని ఉపయోగించే విధానం ఎవరికీ తెలియదు. నేర్చుకోవాలని ఆసక్తి కనబరచడం లేదు. దీనిని ఉపయోగించే కళాకారుడు ఒక్కడే ఉన్నాడు. కడ్డి వాయిద్యాలు, గొండి సంగీతవాయిద్యం, తాటిడోలు, ప్రాచీన తబలా, కొయ్యిడోలు, జానపద కొమ్ము, పశువుల మెడలో కట్టే కొయ్య చెక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కనకదుర్గ ఊయల, వీరణాలు ఆకట్టుకుంటున్నాయి.

భావితరాలు గుర్తించేలా..



ప్రతి ప్రాంతానికీ ఓ గుర్తింపు ఉంటుంది.. అయితే దేశంలోని అన్ని ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను తెలిపేలా సంగీత పరికరాల ప్రదర్శన ఏర్పాటు సంతోషకరం. భావితరాలు గుర్తించేలా ప్రాచీన కళ, కళాకారులు ప్రతిభను విద్యార్థులు తెలుసుకోవడం మంచి పరిణామం.

- రమాదేవి, టీచర్‌

ఇదే మొదటిసారి..



వివిధ రకాల వాయిద్యాలు, వాటి ప్రత్యేకత తెలుసుకోవడం ఇదే మొదటిసారి. ప్రస్తుత తరం వారు ఈ ఎగ్జిబిషన్‌ను తప్పక సందర్శించాలి. అప్పటి కళాకారుల గొప్పతనాన్ని తెలుసుకోవాలి.

- గీతిక, విద్యార్థిని

గెట్‌ రెడీ ఫర్‌ 'సోషల్‌ తడ్కా'..!

సాక్షి, సిటీబ్యూరో: నగరం మరో నైట్‌ పార్టీకి రెడీ అవుతోంది. బాలీవుడ్‌ ఫ్యాన్స్‌కు మాంచి కిక్‌ ఇచ్చేలా పార్టీ ఉండబోతోంది. అదే సోషల్‌ తడ్కా.. గ్లామర్, మ్యూజిక్‌ అండ్‌ వాట్‌ నాట్‌ అంటూ యువతను ఉర్రూతలూగించనుంది. ఇంతకీ సోషల్‌ లుక్‌తో ఫుల్లీ లోడెడ్‌గా రానున్న సోషల్‌ తడ్కా ఎక్కడ జరగబోతోందో తెలుసా..? శుక్రవారం రాత్రి 8 గంటలకు మైండ్‌స్పేస్‌ సోషల్‌లో జరగనుంది. గెట్‌ రెడీ గయ్స్‌.

విజువల్‌ 'వింటర్‌ ఉత్సవ్‌'

నగరం నడి మధ్యన కశ్మీర్‌ అందాలు

ప్రత్యేక ఆకర్షణగా స్నోఫాల్‌

ఖైరతాబాద్‌: ప్రతి ఒక్కరూ వారి జీవితంలో ఒక్కసారైనా కశ్మీర్‌ అందాలను చూడాలనుకుంటారు. ముఖ్యంగా చలికాలంలో కురిసే మంచు అందాలను చూడాలంటే మాత్రం తప్పకుండా కశ్మీర్‌ వెళ్లాల్సిందే. అయితే హైదరాబాద్‌ నడి ఒడ్డున పీపుల్స్‌ ప్లాజా వేదికగా వింటర్‌ ఉత్సవ్‌ మేళా– 2024 ఔత్సాహికులకు కశ్మీర్‌ అందాలను కళ్లముందు ఉంచుతోంది. గత 15 రోజులుగా తమిళనాడు, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర నుంచి ప్రతి రోజూ 200 మంది కార్మికులు పనిచేసి కశ్మీర్‌ అందాలకు ప్రాణం పోసినట్లు నిర్వాహకుడు మిర్జా రఫీక్‌ బేగ్‌ తెలిపారు.

సెల్ఫీలతో చిల్‌..

మైనస్‌ 5 డిగ్రీల్లో మంచు కురిస్తుంటే.. ఎగ్జిబిషన్‌ లోపలికి వెళ్లే విధంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ అందాల అనుభూతిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ కుటుంబ సమేతంగా కశ్మీర్‌ వెళ్లిన అనుభూతిని పొందుతూ చిల్‌ అవుతున్నారు. గురువారం ఈ మేళాను ప్రారంభించిన ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ ఈ అనుభూతిని పిల్లలకు తప్పక చూపించాలన్నారు.






200కు పైగా స్టాల్స్‌..

ఈ మేళాలో 200 స్టాల్స్‌లో కాస్మోటిక్స్, తినుబండారాలు, గృహోపకరణ వస్తువులు, వివిధ రకాల దుస్తులు, ముఖ్యంగా చలికాలంలో ధరించే స్వెటర్స్, గ్లౌస్‌ ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు ఆహ్లాదంగా గడిపేందుకు ఎమ్యూజ్మెంట్‌ రైడ్స్‌ ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ సందర్శకుల కోసం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

పీజీ మెడికల్ ప్రవేశాలకు 'స్థానికత' బ్రేక్

ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చదివిన తెలంగాణ విద్యార్థులు స్థానికేతరులే అంటున్న కాళోజీ వర్సిటీ



సాక్షి, హైదరాబాద్: పీజీ మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. స్థానికత వివాదంపై విద్యార్థులు కోర్టుకు ఎక్కడంతో కౌన్సెలింగ్ ప్రక్రియకు బ్రేక్ పడింది. కోర్టు కేసు తేలాకే ప్రవేశాలుంటాయని కాళోజీ వర్సిటీ స్పష్టం చేసింది. తెలంగాణకు చెందిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేస్తే వారు తెలంగాణలో జరిగే పీజీ మెడికల్ అడ్మిషన్లలో స్థానికేతరులు అవుతుండటంతో వివాదం నెలకొంది. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించిన పీజీ మెడికల్ నోటిఫికేషన్ ప్రకారం స్థానిక అభ్యర్థి అంటే వరుసగా నాలుగు సంవత్సరాలకు తక్కువ కాకుండా తెలంగాణలో చదివి ఉండాలి. విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో చదివిన రాష్ట్ర విద్యార్థులు కూడా స్థానికులే అవుతారని వర్సిటీ పేర్కొంది. ఈ విధానం వల్ల తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని.. వారు ఎక్కడా స్థానికులు కాని పరిస్థితి నెలకొంటోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల్లో టాప్ ర్యాంకర్లు ఎక్కువగా జాతీయస్థాయి విద్యాసంస్థల్లో ఎంబీబీఎస్‌లో చేరుతున్నారు. అలా జాతీయ విద్యాసంస్థల్లో చదివిన వారు రాష్ట్రంలో పీజీ మెడికల్ అడ్మిషన్లలో అన్యాయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వారు కోర్టును ఆశ్రయించారు.

ప్రతిష్టాత్మక ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదివినా స్థానిక పీజీ అడ్మిషన్లలో స్థానికేతరులే!

కోర్టును ఆశ్రయించిన విద్యార్థులు.. నిలిచిపోయిన కౌన్సెలింగ్

ఇక కౌన్సెలింగ్ తరువాయి అనగా..

ఈ ఏడాది పీజీ మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియ బాగా ఆలస్యమైంది. ఎట్టకేలకు గత నెలాఖరున 2024–25 సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి వర్సిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. కాళోజీ వర్సిటీకి, నిమ్స్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో సీట్ల భర్తీకి ఈ నోటిఫికేషన్ జారీ చేశారు. నీట్ పీజీ–2024లో అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి గత నెల 31 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. వెంటనే కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా.. 'స్థానికత' నిబంధనపై అభ్యర్థులు కోర్టుకు ఎక్కడంతో నిలిచిపోయింది. కోర్టు కేసు తేలాకే తదుపరి ప్రక్రియ జరుగుతుందని కాళోజీ వర్గాలు చెబుతున్నాయి. ఈ జాప్యం కేవలం ప్రవేశాలు పొందే విద్యార్థులకే కాకుండా... ప్రస్తుతం మొదటి సంవత్సరం కోర్సు పూర్తి చేసిన పీజీ విద్యార్థులకు సైతం ఇబ్బందికర పరిస్థితులను తెచ్చిపెట్టింది. జూనియర్లు ప్రవేశాలు పొందితే తప్ప వారు అక్కడ్నుంచి రిలీవ్ అయ్యే పరిస్థితి లేకుండా పోయింది.

50% జాతీయ కోటాతోనూ అన్యాయం!

స్థానిక కోటాతోపాటు తెలంగాణ విద్యార్థులకు నేషనల్ పూల్ కింద జాతీయ స్థాయికి వెళ్లే సీట్లలోనూ అన్యాయం జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో 26 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 2,800 పీజీ మెడికల్ సీట్లున్నాయి. అందులో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లలో 50 శాతం జాతీయ కోటా కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు. మిగిలిన వాటిని తెలంగాణ వాసులకు కేటాయిస్తారు. ఈ క్రమంలో జాతీయ కోటా కిందకు దాదాపు 600 సీట్లు వెళ్తాయి. ఇంత పెద్ద సంఖ్యలో సీట్లను జాతీయ కోటా నింపుతుండటంపై రాష్ట్ర విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ఇక్కడ ఎక్కువగా అవకాశం పొందుతున్నారని వారంటున్నారు. ఎంబీబీఎస్‌లో నేషనల్ పూల్ కింద ప్రభుత్వ సీట్లలో 15 శాతం జాతీయ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తుండగా, పీజీ మెడికల్ సీట్లలో మాత్రం ఏకంగా సగం కేటాయించడంపై విమర్శలు వస్తున్నాయి. జాతీయ కోటాలో నింపే మన రాష్ట్రంలోని 600 పీజీ మెడికల్ సీట్లలో దాదాపు 300 ఇతర రాష్ట్రాల వారే దక్కించుకుంటున్నారని కాళోజీ వర్సిటీ వర్గాలు సైతం చెబుతున్నాయి.

క్లుప్తంగా...

ఇంజనీరింగ్ సెట్‌పై విద్యామండలి కసరత్తు

సాక్షి, హైదరాబాద్: గత ఏడాదికన్నా ముందే ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిర్వహణకు గల అవకాశాలపై టీసీఎస్ సంస్థతో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి గురువారం చర్చించారు. వీలైనంత త్వరగా తేదీలను తెలియజేయాలని కోరారు. ఇంటర్ పరీక్షలు, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని టీజీ ఈఏపీ సెట్ నిర్వహణకు తేదీలను గుర్తిస్తుంది. దీంతోపాటు ఇంటర్ పరీక్షలకు ఈఏపీసెట్‌కు మధ్య సమయాన్ని దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈసారి అకడమిక్ ఇయర్‌ను ముందుకు తీసుకురావాలని మండలి నిర్ణయించింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పరీక్షల తేదీలను ఖరారు చేసే కసరత్తు ప్రారంభించింది. త్వరలో తేదీలను గుర్తించి, తెలియజేస్తామని టీసీఎస్ అధికారులు తెలిపారు. దీని తర్వాత ఉమ్మడి ప్రవేశ పరీక్షలను ఏయే యూనివర్సిటీలకు అప్పగించాలనేది మండలి నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు నవంబర్ నెలాఖరుకల్లా ఓ స్పష్టత వచ్చే వీలుందని, డిసెంబర్‌లో ప్రవేశ పరీక్షల తేదీలను ప్రకటించే ప్రయత్నం చేస్తామని అధికారులు చెబుతున్నారు.

వికలాంగుల సాధికారత అవార్డులకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: వికలాంగుల సాధికారత అవార్డు–2024 కోసం అర్హులైన వ్యక్తులు/సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సాధికారత శాఖ సంచాలకురాలు బి.శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఇచ్చే అవార్డు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారు www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారాలను పొంది ఈనెల 29 లోపు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు శాఖ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

అధిక హోంవర్క్‌తో అనర్థాలు

విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యార్థుల నిరంతర సమగ్ర మూల్యాంకన విధానంలో మార్పులు తేవలసిన అవసరం ఉందని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై పాఠశాల విద్య నిపుణులు, సీనియర్ ఉపాధ్యాయులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. అన్ని తరగతుల విద్యార్థులకు హోంవర్క్ ఎక్కువ ఇవ్వడం వల్ల వారిలో సృజనాత్మకత దెబ్బ తింటోందన్న ఫిర్యాదులు వస్తున్నాయని మురళి పేర్కొన్నారు. సామాజిక అవగాహన పెంచే రీతిలో విద్యా విధానం ఉండాలన్న అభిప్రాయం అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతోందని తెలిపారు. విద్యార్థులకు ఏ విధంగా పాఠాలు అర్థమవుతున్నాయనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ తరహాలో బోధన విధానంలో మార్పు తీసుకురావాలని ఆయన కోరారు. ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం పెంచేందుకు తీసుకోవలసిన విధానాలపై ఈ సందర్భంగా చర్చించారు.

ఫుడ్‌సేఫ్టీపై తప్పుడు ప్రచారం నమ్మొద్దు

కమిషనర్ కర్ణన్

సాక్షి, హైదరాబాద్: ఫుడ్ సేఫ్టీలో హైదరాబాద్ చివర్లో ఉందంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 సంవత్సరంలో ఫుడ్ సేఫ్టీకి సంబంధించి నమోదైన కేసుల ఆధారంగా, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2023 డిసెంబర్‌లో ఒక నివేదిక విడుదల చేసిందని తెలిపారు. దాని ప్రకారం 2022లో హైదరాబాద్‌లో ఫుడ్ కల్తీపై 246 కేసులు నమోదయ్యాయని వివరించారు. ఇదే విషయాన్ని 2023 చివరలో విడుదలైన 'క్రైం ఇన్ ఇండియా –2022' నివేదికలో పొందుపరిచినట్లు స్పష్టం చేశారు. అప్పటి సమాచారంతో, ఇప్పుడు సోషల్ మీడియాలో 'ఫుడ్ సేఫ్టీలో హైదరాబాద్ లాస్ట్' అంటూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


అనుమతిచ్చే ముందు అడగండి

రాష్ట్రాన్ని సంప్రదించాకే వర్సిటీలకు 'అటానమస్, డీమ్డ్' పర్మిషన్ ఇవ్వాలి

యూజీసీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

- ఇష్టానుసారం అనుమతులిస్తే స్థానికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెల్లడి
- చిన్న కాలేజీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన

ఏ సంవత్సరంలో ఎన్ని కాలేజీలు ఉన్నాయి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీలకు అటానమస్, డీమ్డ్ హోదా ఇచ్చేప్పుడు తమను సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌ను కోరింది. ఇష్టానుసారం అనుమతులిస్తే స్థానికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో కాలేజీలకు భద్రతా పరమైన సమస్యలు ఎదురైనా, ఇతరత్రా సమస్యలు వచ్చినా పరిష్కరించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని స్పష్టం చేసింది. కొన్ని ప్రైవేటు కాలేజీలు అడ్డగోలుగా అనుమతులు పొందుతుంటే, రాష్ట్రంలోని ఇతర కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల పరిస్థితి ప్రశ్నార్థకంగా తయారైందని పేర్కొంది. మల్లారెడ్డి సంస్థలకు ఇటీవల కేంద్రం డీమ్డ్ హోదా ఇచ్చింది. మహేంద్ర యూనివర్సిటీకి కూడా ఇచ్చే యోచనలో ఉంది. ఈ నేపథ్యంలో యూజీసీతో పాటు ఏఐసీటీఈకి రాష్ట్ర విద్యాశాఖ లేఖ రాసింది.

చిన్న కాలేజీలు విలవిల

డీమ్డ్, అటానమ్ కాలేజీలు పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో చిన్న ఇంజనీరింగ్ కాలేజీల పరిస్థితి దయనీయంగా తయారైందని ఉన్నత విద్యా మండలి గుర్తించింది. 2016 నాటికి రాష్ట్రంలో 248 ఇంజనీరింగ్ కాలేజీలుంటే, ప్రస్తుతం వాటి సంఖ్య 159కి తగ్గింది. గ్రామీణ ప్రాంతాలకు చేరువగా ఉండే కాలేజీలే ఎక్కువగా మూతపడుతున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 48 కాలేజీలుంటే, ఇప్పుడు వాటి సంఖ్య 11కు తగ్గింది. ఖమ్మం జిల్లాలో 28 ఉంటే, ఇప్పుడు 8 మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 11 ఉంటే, ప్రస్తుతం రెండు మాత్రమే మిగిలాయి. ప్రతి జిల్లాలోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. చివరకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనూ 2015లో 74 కాలేజీలుంటే, 20 కాలేజీలు మాయమై 54 మిగిలాయి. ఇటీవల ఉన్నతాధికారులు ప్రభుత్వానికి అందించిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరికొన్ని కాలేజీలు కనుమరుగయ్యే అవకాశం లేకపోలేదని ఉన్నత విద్యా మండలి వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అటానమస్, డీమ్డ్ వర్సిటీలు వస్తే మరికొన్ని కాలేజీలు మూతపడే అవకాశం ఉందని, దీనివల్ల పేద వర్గాలకు ఇంజనీరింగ్ విద్య మరింత ఖరీదయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నాయి. ప్రస్తుతం సీఎస్ఈ, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి కోర్సుల వైపే విద్యార్థులు వెళ్తున్నారు. కొత్తగా వచ్చే కాలేజీలు ఈ కోర్సులనే ఆఫర్ చేయడం, భారీగా సీట్లు అమ్ముకునేందుకు డీమ్డ్ హోదా తెచ్చుకోవడం సరైన విధానం కాదని మండలి పేర్కొంటోంది.

విదేశీ వర్సిటీలొస్తే మరింత ముప్పు!

దేశంలో యూనివర్సిటీల ఏర్పాటుకు అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీలోని వర్సిటీలు ముందుకొస్తున్నాయి. వాటి బ్రాంచీలను భారత్‌లో ఏర్పాటు చేసేందుకు అనుమతి కోరుతున్నాయి. విదేశాల్లో విద్యపై ఆసక్తి చూపించే విద్యార్థులను ఇవి ఆకట్టుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇదే జరిగితే రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీలు తట్టుకునే అవకాశం తక్కువని, కొన్ని కాలేజీల మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందనే వాదన విన్పిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని 80 శాతం ఇంజనీరింగ్ కాలేజీల నాణ్యత పెంచాలని ఏఐసీటీఈ.. రాష్ట్రానికి సూచించింది. మరోవైపు ఇంజనీరింగ్ విద్యలో మార్పులు వస్తున్నాయి. బోధన ప్రణాళికను అంతర్జాతీయ స్థాయిలో రూపొందించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవన్నీ భవిష్యత్తులో మరికొన్ని కాలేజీలు మూతపడేందుకు కారణాలవుతాయని అంటున్నారు.

ముందే తెలియజేస్తే బాగుంటుంది



డీమ్డ్, అటానమస్ హోదా ఇచ్చేప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని, ముందే తెలియజేయాలని కోరుతూ యూజీసీకి లేఖ రాశాం. మా విజ్ఞప్తిని యూజీసీ పరిగణనలోనికి తీసుకుంటుందని ఆశిస్తున్నాం. రాష్ట్ర ప్రమేయం లేకుండా అనుమతి ఇవ్వడం వల్ల అనేక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

–ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

విదేశీ విద్యకు సాయమందించండి

- డిప్యూటీ సీఎంకు పలువురు తల్లిదండ్రుల విజ్ఞప్తి
- వీలున్నంత త్వరగా నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చిన భట్టి
- జూనియర్ లెక్చరర్ల పోస్టింగులు ఇప్పించాలని అభ్యర్థన
- మంత్రితో ముఖాముఖిలో 300 దరఖాస్తులు



గురువారం గాంధీభవన్‌లో ప్రజల సమస్యలు వింటున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: తమ పిల్లలు చదువుకునేందుకు విదేశాలకు వెళ్లారని, వారికి అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం కింద సాయమందించాలని పలువురు తల్లిదండ్రులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీభవన్‌లో 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన మల్లు భట్టి విక్రమార్కను సామాన్య ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున కలిసి తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. విదేశీ విద్యానిధి పథకం కింద పెద్ద చదువులు చదువుకునే విద్యార్థులకు ప్రజాప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పిన భట్టి.. వీలున్నంత త్వరగా ఆ నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు.

→ తన తల్లి బ్రెస్ట్ కేన్సర్‌తో బాధపడుతున్నారని, ఆమె ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకునేందుకు అవసరమైన సాయం అందించాలని మహేశ్ కోరగా, భట్టి వెంటనే స్పందించి ఇప్పటివరకు అయిన ఆస్పత్రి బిల్లులకు ఎల్‌ఓసీ ఇప్పించాలని తన పీఏను ఆదేశించారు. స్వయంగా తన నంబరు ఆ యువకుడికి ఇచ్చి ఎలాంటి సమస్య ఉన్నా తనకు తెలియజేయాలని సూచించారు.

→ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించి ఫలితాలు వచ్చిన తర్వాత కూడా తమకు పోస్టింగులు ఇవ్వలేదంటూ పెద్ద ఎత్తున నిరుద్యోగులు భట్టికి విజ్ఞప్తి చేయగా, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

→ ట్రాన్స్‌కో, జెన్‌కోలలో ఖాళీగా ఉన్న డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, ఇంజనీర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సంబంధిత శాఖ సిబ్బంది కూడా విజ్ఞప్తి చేశారు.

→ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల కోసం పలువురు విజ్ఞప్తి చేశారు. మంత్రితో ముఖాముఖిలో భాగంగా మొత్తం 300 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే శంకర్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

భట్టి దృష్టికి పటాన్‌చెరు పంచాయితీ

పటాన్‌చెరు నియోజకవర్గంలో పాత కాంగ్రెస్ నేతలు, ప్రస్తుత ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిల మధ్య నెలకొన్న రాజకీయ పంచాయితీ భట్టి దృష్టికి వచ్చింది. పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో వచ్చిన నేతలంతా తమపై మహిపాల్‌రెడ్డి పెత్తనం చేస్తున్నారని, మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి అన్యాయం చేస్తున్నారని, తద్వారా నియోజకవర్గంలో పార్టీకి నష్టం జరుగుతోందని వివరించారు. ఆ తర్వాత కాట శ్రీనివాస్‌గౌడ్ కూడా టీపీసీసీ అధ్యక్షుడి చాంబర్‌లో భట్టితో పాటు మహేశ్‌గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

మిల్లర్లపై ఉక్కుపాదం

▶ మొదటి పేజీ తరువాయి

సంస్థ అప్పులు.. 2023–24 నాటికి రూ. 58,623 కోట్లకు చేరాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు, మిల్లర్ల మాయాజాలంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. కొన్ని మార్గదర్శకాలను రూపొందించి... ఖరీఫ్ సీజన్ నుంచే నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా చర్యలు చేపట్టింది.

కచ్చితంగా మిల్లింగ్ చేసేలా..

మిల్లులు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించకుండా మార్కెట్లో అమ్ముకుని సొమ్ము చేసుకోవడం, ఏళ్లకేళ్లు బకాయిలు అలానే ఉండటం వంటి సమస్యలకు చెక్ పెట్టేలా.. ప్రభుత్వం ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ నిబంధన తెచ్చింది. ఈ నిబంధన వల్ల కస్టమ్ మిల్లింగ్ (సీఎంఆర్) చేయలేమంటూ మొండికేస్తున్న మిల్లర్లను దారికి తెచ్చేలా చర్యలు చేపట్టింది. ధాన్యం సేకరణ, కస్టమ్ మిల్లింగ్‌కు సంబంధించి... 2015, 2016లలో విడుదలైన 18, 36 జీవోలు, వాటికి సవరణ చేస్తూ 2023 అక్టోబర్‌లో జారీ చేసిన జీవో నంబర్ 25ను ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఈ జీవో ప్రకారం రాష్ట్రంలోని ప్రతి రైస్ మిల్లు దాని కెపాసిటీలో కనీసం 50శాతం మేర ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని సీఎంఆర్ చేయాల్సి ఉంటుంది.



లేదంటే మిల్లు లైసెన్స్ రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. దీనితో కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని దించుకోమని మిల్లర్లు మొండికేసే పరిస్థితి తప్పనుంది.

డీఫాల్టర్ల విషయంలో ప్రత్యేక చర్యలు

మూడు విడతల కన్నా ఎక్కువగా సీఎంఆర్ ఇవ్వకుండా ఎగవేసిన మిల్లర్లను డీఫాల్టర్లుగా గుర్తించి ధాన్యం కేటాయించకూడదని, లేదా షరతులతో కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా 1,777 డీఫాల్టర్లను గుర్తించగా.. అందులో 362 మంది మిల్లర్లు కొన్నేళ్లుగా వరుసగా సీఎంఆర్ ఎగవేస్తూ వస్తున్నారు. వారికి ఈ ఖరీఫ్ సీజన్ ధాన్యం కేటాయించడం లేదు. మిగతావారు మొత్తం బకాయి మొత్తం బియ్యాన్ని, అపరాధ రుసుముతో సహా అప్పగించి... దీనితోపాటు కొత్తగా ఇచ్చే ధాన్యానికి సంబంధించి 25 శాతం బ్యాంకు గ్యారంటీ ఇస్తే ధాన్యం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పూర్తి ఎగవేతదారులుగా గుర్తించిన 362 మంది మిల్లర్లలో.. కేవలం 10 మంది మిల్లర్లే ఏకంగా రూ.605 కోట్ల విలువైన 1.67 లక్షల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. వీరిలో ఆరుగురు సూర్యాపేట జిల్లావారుకాగా, ఇద్దరు కరీంనగర్ వారు నాగర్‌కర్నూల్, నిజామాబాద్‌ల నుంచి ఒక్కొక్కరు ఉన్నట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ రికవరీ యాక్టుతో వారి ఆస్తులను జప్తు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరిస్తున్నారు. వారు ఆస్తులు అమ్ముకోకుండా, వేరేవారి పేరిట బదిలీ చేయకుండా రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేసినట్లు పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు.

2,054 మిల్లులు 'గ్యారంటీ'కి రెడీ

రాష్ట్రంలోని సుమారు 3,500 మిల్లులకుగాను.. 2,054 రైస్‌మిల్లులు బ్యాంక్ గ్యారంటీలు ఇచ్చి ధాన్యాన్ని తీసుకునేందుకు అంగీకరించాయి. ఇందులో 1,274 రా రైస్ (ముడి బియ్యం) మిల్లులు కాగా.. 780 బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం) మిల్లులు. ఇప్పటివరకు 1,669 మిల్లులు (992 రా రైస్, 677 బాయిల్డ్ మిల్స్) బ్యాంకు గ్యారంటీలు ఇస్తామని అండర్ టేకింగ్ ఇచ్చాయి. అండర్ టేకింగ్ ఇచ్చిన మిల్లుల సామర్థ్యం 57.76 లక్షల మెట్రిక్ టన్నులు.

ప్రతీ 35 కి.మీ.కు ఓ ట్రామా కేర్ సెంటర్

- వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- మంచిర్యాలలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ



ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రధాన రహదారుల్లో ప్రతీ 35 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 74 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రంలో ప్రతీ పేదవాడికి విద్య, వైద్యం అందించే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. గురువారం ఆయన మంచిర్యాల పట్టణం ఐబీ ఆవరణలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలసి 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మాతాశిశు సంరక్షణ భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, ప్రతీ మండలానికి ఒకటి, గిరిజన ప్రాంతాల్లో రెండు చొప్పున 150 వరకు అంబులెన్సులను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, వైద్యాధికారి హరీశ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న పట్టణాల్లో పెట్టుబడికి భారీ ప్రోత్సాహకాలు అందిస్తాం

నూతన ఎంఎస్‌ఎంఈ పాలసీ ప్రకారం వసతులు

- ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి
- శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లో రఘువంశీ సంస్థకు శంకుస్థాపన
- ఈ సంస్థ విస్తరణతో 1,200 కొత్త ఉద్యోగాలు వస్తాయని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కంపెనీలు స్థాపించే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన ఎంఎస్‌ఎంఈ విధానం ప్రకారం పెట్టుబడులు పెట్టే సంస్థలకు అన్ని రకాల వసతులు, ప్రోత్సాహకాలు కల్పిస్తామని తెలిపారు. విమాన ఇంజిన్ల కీలక విడిభాగాలు, రక్షణరంగ ఉత్పత్తుల తయారీ సంస్థ రఘువంశీ ఏరోస్పేస్ శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లో రూ. 300 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కర్మాగారాన్ని నెలకొల్పుతోంది. ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి మంత్రి శ్రీధర్‌బాబు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పరిశ్రమ రానున్న మూడేళ్లలో 1,200 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని తెలిపారు. రఘువంశీ ఏరోస్పేస్ చేతిలో ఉన్న రూ.2 వేల కోట్ల ఆర్డర్లకు సంబంధించిన పరికరాలు కొత్త కర్మాగారంలో ఉత్పత్తి అవుతాయని చెప్పారు. ఎయిర్‌బస్ ఏ 320, బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల ఇంజిన్లతోపాటు జీఈ ఏరోస్పేస్, రోల్స్ రాయిస్, ప్రాట్ అండ్ విట్నీ, సఫ్రాన్, హనీవెల్ ఇంజిన్లను తయారు చేసే సంస్థలకు రఘువంశీ కీలక విడిభాగాలను సరఫరా చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రఘువంశీ ఏరోస్పేస్ డైరెక్టర్ వంశీ వికాస్, డీఆర్‌డీఓ క్షిపణి, వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ రాజబాబు, సీఐఐ చైర్మన్ డా.సాయి ప్రసాద్, టీజీఐఐసీ ఎండీ ఇ.విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర ఏరోస్పేస్, డిఫెన్స్ విభాగం డైరెక్టర్ పీఏ ప్రవీణ్, టీజీఐఐసీ సీఈఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు కొన్న భూములపై విచారణ

▶ మొదటి పేజీ తరువాయి

భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేశారని దుయ్యబట్టారు. రైతుల నుంచి చట్టబద్ధంగా భూములు కొన్నానని... ధరణిలో రికార్డు కోసం ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లాలని చెబుతున్న హరీశ్‌రావు.. భూసేకరణ నోటిఫికేషన్ విషయాన్ని ఎందుకు ప్రస్తావించట్లేదని పొంగులేటి ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో పొంగులేటి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఒకసారి నోటిఫికేషన్ జారీ అయ్యాక దాన్ని రద్దు చేయలేరని.. గతంలో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్ శివార్లలో భూసేకరణ కోసం జారీ చేసిన నోటిఫికేషన్ ఇప్పటికీ మనుగడలో ఉందని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయట్లేదంటూ ప్రశ్నిస్తున్న కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి.. అందుకు వీలుగా గవర్నర్ చేత అనుమతి ఇప్పించాలని సూచించారు. పక్కా ఆధారాలతోనే ముందుకు వెళ్తున్నామని, తొందరపడి ఏదో ఒకటి చేయాలన్న ఆలోచన తమకు లేదని మంత్రి చెప్పారు.

డిసెంబర్ 9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు..

అసెంబ్లీ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 9 నుంచి ప్రారంభం అవుతాయని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ సమావేశాల్లో రికార్డ్స్ ఆఫ్ రైట్స్(ఆర్‌వోఆర్) చట్టాన్ని తీసుకొస్తామన్నారు. అలాగే కులగణన, రైతు రుణమాఫీ, మూసీ పునరుజ్జీవం తదితర అంశాలను చర్చించే అవకాశం ఉందని చెప్పారు. డిసెంబర్ 9న అసెంబ్లీ సమావేశాల అనంతరం సచివాలయంలో తెలుగుతల్లి విగ్రహావిష్కరణ, సోనియాగాంధీ జన్మదిన వేడుకలతోపాటు బహిరంగ సభను నిర్వహించనున్నట్లు వివరించారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌తో నాటి ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందంతోపాటు యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి జస్టిస్ మదన్ బి. లోకూర్ ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి చర్చించనున్నట్లు సమాచారం.

కేంద్రం స్పష్టత ఇస్తే ఇందిరమ్మ ఇళ్లలో వేగం..

ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనలు కాస్త అస్పష్టంగా ఉన్నాయని, వాటిపై స్పష్టత కోరుతున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. కేంద్రం నుంచి స్పష్టత వస్తే ఇందిరమ్మ ఇళ్లలో వేగం పెరుగుతుందన్నారు. ఒకసారి లబ్ధిదారుల ఎంపిక ప్రారంభమైతే పథకం వేగం పుంజుకుంటుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లోగా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

మంత్రివర్గ విస్తరణ!

మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాల తర్వాత రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. మంత్రులుగా ఎవరెవరికి అవకాశం ఉంటుందన్న ప్రశ్నకు ఆయన నేరుగా స్పందించలేదు. తాను మంత్రిని మాత్రమేనని, మంత్రి పదవులు ఇప్పించే స్థాయిలో లేనని వ్యాఖ్యానించారు.

దమ్ముంటే కబ్జా నిరూపించు..

▶ మొదటి పేజీ తరువాయి

విలేకరులతో మాట్లాడారు. పేదల భూములను, ప్రభుత్వ భూములను కబ్జా చేసే అలవాటు తమకు లేదని, అటువంటి చరిత్ర రేవంత్‌దేనన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించగా, పౌరసరఫరాల శాఖ కమిషనర్ మాత్రం 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారని, దీంతో మిగతా 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దళారుల పాలైందని అన్నారు. ఈ సీజన్‌లో 40 నుంచి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసే పరిస్థితిలేదన్నారు. బోనస్ మాట దేవుడెరుగు మద్దతు ధర కంటే రూ.500 తక్కువకు రైతులు ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, గిరిజనుల భూములను కంపెనీల పేరుమీద కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ ప్రశ్నించేవారి గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీల అమలు జరిగేదాకా కేసీఆర్ నాయకత్వంలో ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, టీజీటీపీసీ మాజీ చైర్మన్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీలు



ఏపీ ప్రయోజనాలే పరమావధి

ఎంపీలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా రాజీ పడకుండా లోక్‌సభ, రాజ్యసభల్లో పోరాటం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీలకు ఆ పార్టీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం వైఎస్ జగన్ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న తరుణంలో.. ఆ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అన్ని కీలక అంశాలను పార్లమెంటు ఉభయ సభల్లో లేవనెత్తాలని వైఎస్ జగన్ ఆదేశించారు. ప్రధానంగా రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలన్న నిర్ణయం వల్ల కలిగే నష్టాన్ని సభలో ప్రస్తావించాలని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని అడ్డుకోవాలని సూచించారు. ఈ విషయమై ఉభయ సభల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో పాటు ఢిల్లీలో ధర్నా కూడా చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వక్ఫ్ బిల్లును ఆమోదించకూడదని, దీనిపైనా ఆందోళన చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, ఆస్తుల విధ్వంసం, హత్యలు, హత్యా యత్నాలు జరుగుతూనే ఉన్నాయని, వీటన్నింటి గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించాలని పార్టీ ఎంపీలకు వైఎస్ జగన్ సూచించారు.

సెకీతోనే ఒప్పందం.. ప్రభుత్వానికి అదానీతో ఏం సంబంధం?

కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఏపీ విద్యుత్ కొనుగోలు ఒప్పందం

అత్యంత తక్కువగా యూనిట్ రూ.2.49తో సరఫరా చేసేలా..

ఆ సమయంలో బహిరంగ మార్కెట్లో సగటు యూనిట్ ధర రూ.5.10

దీంతో రాష్ట్ర ఖజానాపై ఏటా తగ్గనున్న ఆర్థిక భారం రూ.3,700 కోట్లు

అత్యంత పారదర్శకంగా ఒప్పందం చేసుకుంటే ఆరోపణలేంటి?

అదానీ సంస్థలతో ఎటువంటి విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోలేదు

ఈ లెక్కన 7,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలులో లంచమనే ప్రశ్న ఎక్కడ?

వివిధ రాష్ట్రాల విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో అదానీ లంచాలు ఇచ్చారంటూ అమెరికా ఫెడరల్ కోర్టులో కేసు.. తప్పుడు ఆరోపణలతో అభియోగాలు మోపారన్న అదానీ సంస్థ



సాక్షి, అమరావతి : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఎవరికైనా లంచాలు ఇస్తాయా? ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదు. కానీ.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)తో రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంటే లంచాలు చేతులు మారాయని ఆరోపణలు చేస్తుండటాన్ని ఏమనుకోవాలి? అవన్నీ ఊహాజనితమైన ఆరోపణలే అని అర్థం. ఇక అదానీ గ్రూప్‌తో విద్యుత్ కొనుగోలు చేస్తూ డిస్కమ్‌లు(విద్యుత్ పంపిణీ సంస్థలు) ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు. చేసుకోని ఒప్పందాలకు అదానీ గ్రూప్.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోపాటు వివిధ రాష్ట్రాలకు లంచాలు ఇచ్చిందని అమెరికా ఫెడరల్ కోర్టులో యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ కేసు దాఖలు చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఎవరైనా చేసుకోని ఒప్పందాలకు లంచాలు ఇస్తారా? ఇవ్వరు కదా.. అంటే అవన్నీ ఊహాజనితమైన ఆరోపణలన్నది స్పష్టమవుతోంది. కార్పొరేట్ ప్రపంచంలో పదే పదే అదానీ గ్రూపుపై యుద్ధం ప్రకటిస్తున్న అమెరికా ఇన్వెస్టర్లు.. తాజాగా అదానీ గ్రూపు విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో వివిధ రాష్ట్రాలకు లంచాలు ఇచ్చిందంటూ ఆరోపణలు చేశారు. అదానీ గ్రూపు అమెరికా మార్కెట్ నుంచి డాలర్ల రూపంలో నిధులు సేకరిస్తున్న తరుణంలో పెట్టుబడుదారుల రక్షణ పేరిట అమెరికా బ్రూక్లిన్ ఫెడరల్ కోర్టులో అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలతోపాటు ఏడుగురిపై అభియోగాలు నమోదయ్యాయి. ఈ అభియోగాల్లో ఆంధ్రప్రదేశ్‌తోపాటు తమిళనాడు, ఒడిశా, చత్తీస్‌ఘడ్, జమ్ము కాశ్మీర్ రాష్ట్రాలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అదానీ గ్రూపు భారీ ఎత్తున లంచాలు ఎర చూపిదంటూ ఆరోపించారు.

ఆరోపణల వెనుక భారీ కుట్ర!

రానున్న 25 ఏళ్లలో అన్నదాతలకు ఎలాంటి విద్యుత్ కష్టాలు లేకుండా నిరంతరాయంగా 9 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేయడం కోసం సౌర విద్యుత్‌ను సమకూర్చేందుకు వంద శాతం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) నుంచి 7 వేల మెగావాట్లు కొనుగోలు చేసేలా గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒప్పందం కుదర్చుకుంది. ఈ ఒప్పందానికి అదానీ గ్రూపు లంచాలు ఇవ్వచూపిందంటూ ఆరోపణలు చేయడం వెనుక భారీ కుట్ర ఉందన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. అది కూడా ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి ఒప్పందం చేసుకుంటే లంచాలకు ఆస్కారం ఎక్కడ ఉంటుంది? ఒప్పందం కుదుర్చుకున్న సమయంలో సరాసరి విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్ రూ.5.10 ఉంటే కేవలం రూ.2.49 (రూ.2.6 తక్కువగా)కే.. అది కూడా రవాణా వ్యయం లేకుండా ఎక్కడికి కావాలంటే అక్కడికి సరఫరా చేసే విధంగా సెకీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాల ధరలు యూనిట్‌కు రూ.4.63–రూ.6.76తో పోల్చినా చాలా చౌకగా విద్యుత్ లభిస్తుంది. ఏపీకి ఎన్టీపీసీ సరఫరా చేస్తున్న సౌర విద్యుత్ ధర యూనిట్ రూ.2.79 (ట్రేడింగ్ మార్జిన్ కలిపి) కన్నా ఇది తక్కువ. ఎక్కడైనా ప్రస్తుత మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తే లంచాలు ఇచ్చారని ఆరోపణలు వస్తాయి. కానీ ప్రస్తుత సగటు యూనిట్ ధర కంటే రూ.2.61 తక్కువకే కొనుగోలు చేస్తే లంచాల ప్రస్తావన ఎక్కడి నుంచి వస్తుందని విద్యుత్ రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. అసలు విద్యుత్‌ను కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ నుంచి కొనుగోలు చేస్తుంటే.. అదానీ గ్రూపు లంచాలు ఎందుకు ఇవ్వజూపుతుందనే ప్రశ్న సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ ఒప్పందాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే అమెరికా ఫెడరల్ కోర్టు అభియోగ పత్రంలో ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఎవరైనా చెబుతారు. కాగా, అదానీ గ్రీన్ డైరెక్టర్లపై యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ చేసిన ఆరోపణలను అదానీ గ్రూపు ఖండించింది. అమెరికా ప్రాసిక్యూటర్లు ఎటువంటి ఆధారాలు లేకుండా తమ సంస్థపై తప్పుడు ఆరోపణలతో అభియోగాలు మోపారని చెప్పింది.

అదానీ గ్రూప్ సంస్థలతో ఏపీ ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు

- 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు సెకీతో ఒప్పందం
- తేల్చిచెప్పిన వైఎస్సార్‌సీపీ.. భారం మోపింది గత చంద్రబాబు సర్కారే

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. సెకీ (సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో మాత్రమే ఒప్పందం చేసుకుందని, అదానీ గ్రూప్‌తో ఏపీ డిస్కమ్‌లు ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని వైఎస్సార్‌సీపీ స్పష్టం చేసింది. విద్యుత్ కొనుగోలుకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణల్లో వీసమెత్తు వాస్తవం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు గురువారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను రైతులకు హక్కుగా కల్పించాలనే లక్ష్యంతో 7 వేల మెగావాట్ల విద్యుత్‌ను అత్యంత చౌకగా యూనిట్ రూ.2.49 చొప్పున కొనుగోలుకు సెకీతో 2021 డిసెంబర్ 1న ఏపీ డిస్కమ్‌లు ఒప్పందం చేసుకున్నాయని వెల్లడించింది. రాష్ట్రంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ రూపంలో ఏటా సుమారు 12,500 మిలియన్ యూనిట్లను డిస్కమ్‌లు సరఫరా చేస్తాయని తెలిపింది. ఈ ఛార్జీలను డిస్కమ్‌లకు రాయితీ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పింది.

- గత చంద్రబాబు ప్రభుత్వం అనాలోచిత విధానాలతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల విద్యుత్ సరఫరా ధర యూనిట్‌కు రూ.5.10కి చేరింది. ఇది డిస్కమ్‌లపై తీవ్ర భారం పడటానికి దారి తీసింది. దీని వల్ల ప్రభుత్వంపై రాయితీ భారం కూడా పెరిగింది.
- ఈ సమస్యను పరిష్కరించేందుకు పది వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సోలార్ పార్క్‌లను అభివృద్ధి చేయాలని 2020లో ప్రభుత్వం ప్రతిపాదించింది.
- ఈ క్రమంలో 2020 నవంబర్‌లో 6,400 మెవాగాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ఏపీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ టెండర్లు పిలిచింది. యూనిట్ రూ.2.49–రూ.2.58 చొప్పున సరఫరా చేసేందుకు ముందుకొస్తూ 24 బిడ్లు దాఖలయ్యాయి. అయితే న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నమవడం వల్ల ఆ టెండర్ ప్రక్రియ రద్దయింది.
- అంతరాష్ట్ర విద్యుత్ సరఫరా ఛార్జీలు (ఐఎస్‌టీఎస్) మినహాయించి యూనిట్ రూ.2.49 చొప్పున విద్యుత్‌ను సరఫరా చేస్తామంటూ సెకీ ప్రతిపాదించింది. కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ పర్యవేక్షణలో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థ.. సెకీ. 2019 జూన్ 25న నిర్వహించిన టెండర్ల ద్వారా ఏర్పాటైన సౌర విద్యుత్ కేంద్రాల నుంచి సెకీ విద్యుత్ కొనుగోలు చేస్తుంది.
- ఈ నేపథ్యంలోనే యూనిట్ రూ.2.49 చొప్పున ఏడు వేల మెగావాట్ల విద్యుత్‌ను 25 ఏళ్లపాటు సరఫరా చేసేలా సెకీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఇందులో 2024–25లో మూడు వేలు, 2025–26లో మూడు వేలు, 2026–27లో వెయ్యి మెగావాట్లను అంతర్రాష్ట్ర విద్యుత్ సరఫరా ఛార్జీలను మినహాయించుని సరఫరా చేయడానికి సెకీ అంగీకరించింది. ఈ ఒప్పందాన్ని 2021 నవంబర్ 11న ఏపీఈఆర్‌సీ ఆమోదించింది. ఆ తర్వాత 2021 డిసెంబర్ 1న విద్యుత్ కొనుగోలుకు సెకీతో డిస్కమ్‌లు ఒప్పందం చేసుకున్నాయి.
- సెకీతో ఒప్పందం వల్ల రాష్ట్రానికి అత్యంత చౌకగా విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. దీని వల్ల ప్రభుత్వానికి ఏటా రూ.3,700 కోట్ల మేర ఆదా అవుతుంది. 25 ఏళ్లపాటు ఈ ఒప్పందం అమల్లో ఉండటం వల్ల రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదా అవుతుంది.

శిల్పారామంలో ఇందిర మహిళాశక్తి బజార్

- పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు చర్యలు వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిర మహిళా శక్తి కార్యక్రమ అమలుపై గురువారం సచివాలయంలో సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల ద్వారా తయారవుతున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు హైటెక్ సిటీలోని శిల్పారామంలో ఇందిర మహిళాశక్తి బజార్‌ను ఏర్పాటు చేస్తు న్నట్టు తెలిపారు. దాదాపు 106 దుకాణాలతో ఏర్పాటు చేస్తున్న ఈ బజార్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, వచ్చేనెల మొదటి వారంలోగా ఈ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందిర మహిళాశక్తి బజార్‌లో నిత్యం వివిధ సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు, మహిళలకు ఆర్థిక చేయూతకై ఐటీ సంస్థలు, ఇతర వాణిజ్య, వ్యాపార సంస్థలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమావేశంలో రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియల్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్, ఎండోమెంట్స్ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, పర్యావరణ, అటవీశాఖ కార్యదర్శి అహ్మద్ నదీమ్, నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయత్‌రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, సెర్ప్ సీఈవో దివ్య పాల్గొన్నారు.

ముగిసిన టీఓఏ ఎన్నికలు

- సిటీసివిల్ కోర్టు ఉత్తర్వుల మేరకు ఫలితాలు నిలిపివేత


సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) ఎన్నికల్లో విజేతలెవరో తేలేందుకు మరికొంత సమయం పట్టనుంది. ఎన్నికలు ముగిసినా ఫలితాలను నిలిపి వేయాలంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. టీఓఏ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి పదవుల కోసం గురువారం ఒలింపిక్ భవన్‌లో ఎన్నికలు జరిగాయి. మిగిలిన పదవుల కోసం ఎంపిక ఏకగ్రీవం కాగా... ఈ మూడు స్థానాల కోసమే పోటీ నెలకొంది. మొత్తం 65 ఓట్లలో 59 మంది తమ ఓటును వినియోగించుకోగా.. ఆరుగురు గైర్హాజరయ్యారు. అయితే ఎన్నికలు ముగిసినా.. ఫలితాలను ప్రకటించవద్దని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది. ఓటర్ల జాబితాలో అవకతవకలు, తదితర అంశాలను ప్రస్తావిస్తూ ఎన్నికలను నిలిపి వేయాల్సిందిగా బాక్సింగ్ సంఘం ప్రతినిధి బాబూరావు గతంలోనే హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆ కేసు పెండింగ్‌లో ఉండగానే ఈ నెల 12న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సహా పలువురిని ప్రతివాదులుగా చేరుస్తూ బాబూరావు మళ్లీ సిటీ సివిల్ కోర్టులో కేసు వేశారు. దీనిపై అడిషనల్ చీఫ్ జడ్జి ఉదయ్‌కుమార్ తీర్పునిచ్చారు. ఎన్నికల ప్రక్రియను ఈ దశలో నిలిపివేయడం సాధ్యం కాదని స్పష్టం చేసిన న్యాయమూర్తి.. ఫలితాలను ప్రకటించరాదని ఆదేశించారు. ఫలితాల ప్రకటన కేసు తుది తీర్పుకు లోబడి ఉంటుందన్న ఆయన కేసును వచ్చే నెల 19కి వాయిదా వేశారు. టీఓఏ అధ్యక్ష పదవి కోసం ఏపీ జితేందర్‌రెడ్డి, వి.చాముండేశ్వరనాథ్ పోటీ పడ్డారు.

ఆదర్శ రైతుల నియామకాన్ని పరిశీలించండి

వ్యవసాయ కమిటీ చైర్మన్ కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఆదర్శ రైతుల నియామకాన్ని పరిశీలించాలని వ్యవసాయ కమిటీ చైర్మన్ కోదండరెడ్డి.. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కోరారు. ఆయన గురువారం వ్యవసాయ కమిటీ సభ్యులతో సచివాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. వ్యవసాయ పనులకు ఉపాధి హామీని అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ పరికరాలు, యంత్రాలపై జీఎస్టీ ఎత్తివేసేలా కేంద్రాన్ని అభ్యర్థించాలని విజ్ఞప్తి చేశారు. కోదండరెడ్డి సూచనలపై మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారు. ఇదివరకే విత్తన చట్టం, జీఎస్టీ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మిగతా అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

'గ్రాడ్యుయేట్ ఎస్‌జీటీలకు ఓటు హక్కు ఎందుకు ఇవ్వలేదు?'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ)కు ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించకుండా ప్రజాప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 27ను తీసుకురావడాన్ని సవాల్ చేస్తూ బీమనబోయిన కృష్ణమూర్తి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం విచారించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు చట్టబద్ధమే అయినా ఆర్టికల్ 19 1(ఏ) ప్రకారం ఈసీ నిర్ణయం సరికాదన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం: కృష్ణయ్య



కుషాయిగూడ (హైదరాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తవుతున్నా విద్యార్థుల ఉపకార వేతనాల బకాయిలు చెల్లించకుండా తాత్సారం చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటోందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలు నడపలేమంటూ యాజమాన్యాలు చేతులెత్తేసే పరిస్థితులు దాపురించినా రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధిరావడం లేదన్నారు. ప్రభుత్వ తీరు మారకపోతే కళాశాలల నిరవధిక బంద్ తప్పదని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల ఉపకార వేతనాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈసీఐఎల్‌లో గురువారం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో వేలమంది విద్యార్థులతో కలిసి భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణయ్య హాజరై మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేయాలనే కొంతమంది ప్రభుత్వ పెద్దలు ఈ పథకాన్ని నీరుగార్చేందుకు ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు. ఉపకార వేతనాలు రాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నాయన్నారు. 12 సంవత్సరాల క్రితం ఆనాటి ధరల ప్రకారం నిర్ణయించిన స్కాలర్‌షిప్‌లే నేటికీ ఇవ్వడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతి గ్రామానికి ఓ ఆదర్శ రైతు ఎంపిక

మంత్రి తుమ్మలకు వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి ఓ ఆదర్శ రైతును ఎంపిక చేసేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి వ్యవసాయ కమిషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఇతర సభ్యులు కలిశారు. వ్యవసాయ సంబంధిత అంశాలపై సమావేశంలో చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయం, రైతు సంక్షేమం విషయంలో అనేకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన విషయాన్ని మంత్రి తుమ్మల వివరించారు. రైతులకు ఆర్థిక సాయం అందిస్తూనే.. వారి ఆదాయం పెంచడానికి వ్యవసాయ విధానంలో మార్పు తెస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ తొలి సమావేశంలో రెవెన్యూ గ్రామం ప్రాతిపదికగా వెయ్యి ఎకరాలకు ఒక ఆదర్శ రైతు ఉండాలని కమిషన్ అభిప్రాయపడిందని కోదండరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆదర్శ రైతు నియామకం, విధివిధానాలు, ముసాయిదా ప్రతిపాదన అంశాలను కమిషన్ రూపొందించిందన్నారు.

తుదిదశకు 'సమగ్ర' సర్వే

ములుగు, జనగామ జిల్లాల్లో వంద శాతం పూర్తి



సాక్షి, హైదరాబాద్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే తుది దశకు చేరింది. జనగామ, ములుగు జిల్లాల్లో గురువారం నాటికి సర్వే ప్రక్రియ నూరుశాతం పూర్తయింది. నల్లగొండ జిల్లాలో 99.7 శాతం పూర్తి కాగా, కామారెడ్డి, మంచిర్యాల, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జోగుళాంబ గద్వాల్, మహబూబ్‌నగర్, మెదక్, మహబూబాబాద్, పెద్దపల్లి, కొమురం భీం ఆసిఫాబాద్, నారాయణ్ పేట్, జయశంకర్ భూపాల పల్లి, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలలో 90 శాతానికి పైబడి సర్వే పూర్తయినట్లు ప్రభుత్వం తెలిపింది. హనుమకొండ జిల్లా (75.7%), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా (71.2%) చివరి వరుసలో ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లో 80 శాతానికిపైగా పూర్తయింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇంకా 10 లక్షల ఇళ్లలో సర్వే చేయాల్సి ఉంది. మొత్తంగా 25,05,517 నివాసాలను గుర్తించగా, ఇప్పటివరకు 15,17,410 నివాసాల్లో సర్వే పూర్తయి, 60.60 శాతం లక్ష్యసాధన జరిగినట్లు అధికారులు తెలిపారు.

కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

- నాగార్జున తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి.. తదుపరి విచారణ ఈనెల 28కి వాయిదా

సిటీ కోర్టులు: తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన పరువు నష్టం కేసులో వాదనలు జరిగాయి. నాగచైతన్య-సమంత విడాకుల విషయంలో మంత్రి అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, ఆమె చేసిన వ్యాఖ్యలతో తన కుటుంబం పరువుపోయిందని నాగార్జున పరువు నష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అక్కినేని కుటుంబం పరువుపోయేలా నాగచైతన్య వ్యక్తిగత జీవితం గురించి ఎలాంటి ఆధారాలు లేకుండానే అక్టోబర్ 2న ఆమె అసాధారణ వ్యాఖ్యలు చేశారని, ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన పిటిషన్‌లో కోరారు. ఈ కేసులో గత విచారణలో నాగార్జునతోపాటు సాక్షుల వాంగ్మూలం కోర్టు రికార్డు చేసుకోగా, కొండా సురేఖ కౌంటర్ కూడా దాఖలు చేశారు. గురువారం ఇరువురి తరపు న్యాయవాదులు నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఎక్సైజ్ కోర్టులో వాదనలు వినిపించారు. నాగార్జున తరఫున న్యాయవాది అశోక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆమెపై చట్టరీత్యా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. మంత్రి తరఫున న్యాయవాది గుర్మీత్ సింగ్ వాదనలు వినిపిస్తూ ఆమె కావాలని ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, వెంటనే క్షమాపణ చెప్పినప్పటికీ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇరువురి వాదనలు విన్న జడ్జి తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేశారు.

కేటీఆర్ పరువు నష్టం కేసు విచారణ

- పలువురు ప్రతివాదులకు నోటీసులు-తదుపరి విచారణ డిసెంబర్ 13కి వాయిదా

సిటీ కోర్టులు: కేటీఆర్ కొండా సురేఖపై దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం కేసు విచారణ గురువారం హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో జరిగింది. తనపై మంత్రి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని, ఎలాంటి ఆధారాలు లేకుండా ఆమె అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయడంతో తన పరువుకు భంగం కలిగిందని, అందుకు ఆమె రూ.100 కోట్లు చెల్లించాలని కేటీఆర్ పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. సమాజంలో ఎంతో గౌరవంగా జీవిస్తున్న తనపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో చాలా బాధపడ్డానని, తన పరువుకు నష్టం కలిగించేందుకే ఆమె అలాంటి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ కేసు విచారణ గురువారం సిటీ సివిల్ 25వ అదనపు చీఫ్ జడ్జి కోర్టులో జరిగింది. ఇప్పటికే ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న మంత్రి కొండా సురేఖతోపాటు మరో 15 టీవీ చానళ్లు, పత్రికలకు నోటీసులు జారీ చేయగా, పలు టీవీ చానళ్ల తరుపున న్యాయవాదులు వకాలత్‌లు దాఖలు చేశారు. మిగతా పత్రికలు, చానళ్లకు సంబంధించి వకాలత్‌లు దాఖలు చేయాల్సి ఉండటంతో విచారణను డిసెంబర్ 13కు వాయిదా వేస్తున్నట్లు జడ్జి ప్రకటించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 22-11-2024

'అమ్మా... ఆ చెట్టును నువ్వొకసారి తాకి రావాలి' అని కోరాడు ఆమె తాత చనిపోయే ముందు.
అమ్మమ్మలు, తాతయ్యల మాటల్ని చాదస్తంగా తీసి పారేసేవారు ఉన్న ఈరోజుల్లో ఆ మనవరాలు తాత చివరి కోరిక నెరవేర్చడానికి పాకిస్తాన్‌కు వెళ్లింది.
దేశ విభజనకు ముందు తన తాత ఏ చెట్టునైతే పొలంలో తన నీడగా చేసుకున్నాడో ఆ చెట్టును తాకింది.
తన పూర్వీకుల స్వగ్రామంలోని మట్టిని మూట గట్టుకుంది.
ఇంకా అక్కడే ఉన్న తన వాళ్లను చూసి ఆనందబాష్పాలు రాల్చింది.
పెద్దవాళ్ల గుండెల్లో గాఢంగా కొన్ని కోరికలు ఉంటాయి.
వాటిని వారు జీవించి ఉండగానే నెరవేరిస్తే ఆనందం.
మరణించాక నెరవేరిస్తే మనశ్శాంతి.


తాతతో కరమ్‌జిత్ కౌర్

● పేగు బంధం

తాతయ్య చివరి కోరిక కోసం..

'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డు వచ్చి, ఇంత పేరు గడించినా సినీ కవి గుల్జార్‌కి గుండెలో ఒక కోరిక ఉండిపోయింది. అది పాకిస్తాన్‌లోని తన పూర్వీకుల సొంత ఊరిని చూసి రావాలనేది. ఒకటి రెండుసార్లు ప్రయత్నించినా అతనికి అనుమతి దొరకలేదు. చనిపోయేలోపు చూస్తానో లేదో అంటాడాయన. దేశ విభజన వల్ల రాత్రికి రాత్రి కుటుంబాలు చెదిరిపోయి కొందరు ఇండియా చేరారు... కొందరు పాకిస్తాన్‌లోనే ఉండిపోయారు. ఇరు దేశాలలో సెటిల్ అయిన వారి తలపోతల గురించి ఎంతో సాహిత్యం వచ్చింది. రాకపోకలు జటిలం అయ్యాక ఇక బంధాలు ఫోన్లకు పరిమితం అయ్యాయి. పంజాబీలు అధికంగా ఈ ఎడబాటును భరించారు. రెండేళ్ల క్రితం 90 ఏళ్ల వయసున్న రీనా చిబ్బేర్ అనే ఆమె 'రావల్పిండిలో మా పూర్వీకుల ఇల్లు చూసి రావడానికి అనుమతి ఇవ్వండి' అని వేడుకుంటే ప్రభుత్వం అనుమతి ఇస్తే ఆమె ఎంతో సంబరంగా వెళ్లడం ప్రధాన వార్తాంశం అయ్యింది.

అయితే దేశ విభజన సమయంలో జలంధర్‌కు వచ్చి స్థిరపడిన బహదూర్ సింగ్‌కి మాత్రం అలాంటి కోరిక నెరవేరలేదు. 1947లో అతను తన చిన్న తమ్ముణ్ణి తీసుకుని ఇండియా వచ్చేశాడు. నడిమి తమ్ముడు అక్కడే ఉండిపోయాడు. 'మా తాత చనిపోయే వరకూ కూడా పాకిస్తాన్‌లో ఉన్న తమ్ముణ్ణి గుర్తు చేసుకుని ఏడ్చేవాడు. ఆ అన్నదమ్ములు మళ్లీ జీవితంలో కలవకుండానే కన్ను మూశారు' అని తెలిపింది కరమ్‌జిత్ కౌర్. ఆమె ఇటీవలే తాత కోరిక నెరవేర్చడానికి పాకిస్తాన్‌లోని సియోల్‌కోట్‌కు దగ్గరగా ఉన్న తమ పల్లెను దర్శించింది.

ఆ ఇల్లు... ఆ చెట్టు

'మా తాతది సియోల్‌కోట్ దగ్గర ఉన్న పల్లెటూరు. ఆయన పొలంలో పెద్ద రావిచెట్టు ఉంది. ఆ ఇంటిని, చెట్టును ఆయన ఎప్పుడూ గుర్తు చేసుకునేవారు. వాటి గురించి కథలు కథలు చెప్పేవారు. ఆ చెట్టును ఒకసారి తాకి రావాలి. తల్లీ అనేవారు నాతో. జలంధర్ వచ్చేశాక ఆయన తన తమ్ముడికి ఎన్నో ఉత్తరాలు రాశారు. కానీ 1986లో గాని వాటికి జవాబు రాలేదు. అప్పటికే మా తాత నడిమి తమ్ముడు ఇస్లాంలోకి మారాడు. అయితే మా ఇంటి పేరును 'గుమర్'ని వదలకుండా తన పేరు గులామ్ ముహమ్మద్ గుమర్ అని పెట్టుకున్నాడు. ఆ ఇంటిని ఆ చెట్టును అలాగే కాపాడుకుంటూ వచ్చాడు. ఆయన చనిపోయాక ఆయన కొడుకు కుటుంబం మా జ్ఞాపకాలను పదిలంగా ఉంచిందని అర్థమయ్యాక ఎలాగైనా వెళ్లాలని తాతయ్య కోరిక నెరవేర్చాలని నిశ్చయించుకున్నాను' అంది కరమ్‌జిత్ కౌర్.


స్వగ్రామంలోని మట్టిని మూట గట్టుకుంటున్న కరమ్‌జిత్ కౌర్


తమ పొలంలోని రావిచెట్టు దగ్గర బంధువులతో కరమ్‌జిత్ కౌర్

కుటుంబాలు కలిపే సంస్థ

తాత మరణించాక లండన్‌లో స్థిరపడిన కరమ్‌జిత్‌కు... కఠినమైన వీసా నియమాల వల్ల పాకిస్తాన్‌కు వెళ్లడం అంత సులువు కాలేదు. అయితే దేశ విభజన సమయంలో విడిపోయిన పంజాబీ కుటుంబాలను తిరిగి కలిపేందుకు 'జీవే సంఝా పంజాబ్' పేరుతో ఒక సంస్థ పని చేస్తోంది. ఆ సంస్థ ప్రయత్నంతో వాఘా బోర్డర్ మీదుగా పాకిస్తాన్‌లోకి అడుగు పెట్టేందుకు కరమ్‌జిత్ కౌర్‌కు అనుమతి లభించింది. 'నేను పాకిస్తాన్‌కు వెళుతున్నానని తెలిసి మా చిన్నతాత కుమారుడు తనని కూడా తీసుకెళ్లమని ఎంతో ఏడ్చారు. కాని ఆయన వయసు రీత్యా వీల్‌చైర్‌లో ఉన్నారు. నీ కోసం మన ఊరి మట్టి తీసుకొస్తానులే పెదనాన్నా అని చెప్పి వచ్చాను' అంటుందామె భావోద్వేగంతో.

ఘన స్వాగతం

'నేను పాకిస్తాన్ వెళుతున్నానంటే మా అత్తగారి కుటుంబం వద్దంటే వద్దంది. నాక్కూడా చాలా భయాలు కలిగాయి. కాని అక్కడ నేను అడుగు పెట్టగానే మా నడిమి తాత కుమారుడు నన్ను పట్టుకుని గట్టిగా ఏడ్చేశాడు. నా పెళ్లి కార్డు జాగ్రత్తగా దాచుకుని ఉన్నారు. మా తాత రాసిన ఉత్తరాలు ఉన్నాయి. అప్పట్లో మా ఇంట్లో వాడిన తిరగలి అలాగే ఉంది. మా పొలంలో రావిచెట్టు సంగతి చెప్పనక్కర్లేదు. కళకళలాడుతోంది. మా బంధువులు, రక్త సంబంధీకులు అందరూ కన్నీటి పర్యంతం అయ్యి మర్యాదలు చేశారు. మా వూరి మట్టి తీసుకుని తిరిగి వస్తున్నాను' అని తెలిపింది కరమ్‌జిత్ కౌర్.

కష్టసాధ్యమైన తాత కోరికను కొద్దిగా అయినా తీర్చిందీ మనవరాలు. 'ఒరేయ్... కాశీ చూపించరా', 'మా ఊరు చూపించరా', 'ఫలానా బంధువు ఇంటికి తీసుకెళ్లరా' అని పెద్దవాళ్లు కోరితే కాదనవద్దు. ఆ కోరిక లోతు మనకు తెలియదు. చెప్పినా అర్థం కాదు. చేయవలసిందల్లా కోరింది తీర్చడమే.

ఫ్యాషన్ ట్రెండ్స్‌లాగానే ఆహారంలో కూడా కొంతకాలం పాటు ఒక్కో ట్రెండ్ నడుస్తుంటుంది. ప్రతి సందర్భంలోనూ ఆ ట్రెండ్ ఎవరికి మంచిది, ఎవరికి హానికరం అనే వివరాలను తన బ్లాగ్‌లో రాస్తూ సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నారు బెంగళూరుకు చెందిన న్యూట్రిషనిస్ట్, వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి. హెల్త్ ప్రమోషన్‌లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న షీలా కృష్ణస్వామి ఈ వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యసంరక్షణ గురించి 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

ట్రెండ్ మారింది ఫుడ్ మారాలి

న్యూట్రిషన్, వెల్‌నెస్ రంగంలో నలభై ఏళ్ల అనుభవం ఉన్న షీలా కృష్ణస్వామి రోజూ 30 గ్రాముల నట్స్, సీడ్స్ తీసుకోవాలని చెప్పారు. ముప్పై గ్రాములంటే ఎన్ని అని తూకం వేసుకోవాల్సిన అవసరం లేదు, ఓ గుప్పెడు చాలు. రోజూ గ్లాసు నీరు, గుప్పెడు బాదం పప్పులతో తన రోజు మొదలవుతుందన్నారు. ఉదయం ఇలాంటి శక్తినిచ్చే సహజాహారం తీసుకుంటే రోజంతా నీరసం రాదు. విటమిన్‌లు, ప్రొటీన్‌లతో కూడిన ఆహారం కోసం మన డైట్‌లో పప్పులు, ధాన్యాలు, పీచు, పాలు, పండ్లను తీసుకుంటున్నాం. బాదం, గుమ్మడి విత్తనాలను కూడా తప్పనిసరిగా చేర్చుకోవాలి. సమయానికి భోజనం చేయడం కుదరనప్పుడు కూడా బాదం తింటే దేహానికి దాదాపుగా సంపూర్ణ ఆహారం అందినట్లే.



ఎలాగైనా తినండి!

పరిపూర్ణ ఆరోగ్యానికి, దీర్ఘకాలం యవ్వనంగా ఉండడానికి దోహదం చేసే బాదం పప్పులను ఇలాగే తినాలనే నియమం ఏదీ అవసరం లేదు. పచ్చిగా లేదా నానబెట్టి తినవచ్చు, డ్రై రోస్ట్, నానిన వాటిని వేయించి, పోపు పెట్టి చాట్ మసాలా చల్లి తినవచ్చు. బాదం పప్పులను రాత్రి నానబెట్టి ఉదయం తినేటప్పుడు పొట్టు వలిచేస్తుంటారు. కానీ పొట్టు తీయాల్సిన అవసరం లేదు. ఆ ఫైబర్ కూడా దేహానికి అవసరమే. వృద్ధులకు పొట్టుతోపాటు తినడం ఇబ్బందవుతుంది. పొట్టు తీసి తినాల్సింది దంతాలు సరిగా లేని వాళ్లు మాత్రమే.

– షీలా కృష్ణస్వామి, న్యూట్రిషనిస్ట్, వెల్‌నెస్ కన్సల్టెంట్, బెంగళూరు

జంక్ బదులు గింజలు!

వందేళ్ల కిందట ఇప్పుడున్న అనారోగ్యాలు లేవు. గడచిన తరాలు ఆహారం విషయంలో ఇంత ప్రత్యేకంగా దృష్టి పెట్టలేదు. ఏం తినాలనిపిస్తే అది తిన్నారు. ఏం పండితే వాటినే తిన్నారు. ఊబకాయం, గుండె వ్యాధులు, డయాబెటిస్ వంటి అనారోగ్యాల్లేవు. అందుకు కారణం వారికి ఆహారం ద్వారా అందిన శక్తిని కరిగించేటంతటి వ్యాయామం ఉండేది. తగినంత వ్యాయామం ఉండడంతో మంచి నిద్ర ఉండేది. ఈ రెండింటి వల్ల దేహక్రియలు చక్కగా జరిగేవి. గట్ హెల్త్ అంటే అదే. ఆ గట్ హెల్త్ కోసం ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సి వస్తోంది. 'బెంగళూరులో నా కళ్లారా చూస్తుంటాను. ఉద్యోగం నుంచి ఇంటికి వెళ్లడానికి పదుల కిలోమీటర్లు ప్రయాణిస్తుంటారు. ఇంటికి వెళ్లేలోపు ఆకలి వేస్తుంటుంది. కారులో వెళ్తూ చిప్స్, ఫ్రెంచ్ ఫ్రై, సమోసాలు, బేకరీ ఫుడ్ వంటి జంక్ తింటూ ఉంటారు. నేనేం చెప్తానంటే జంక్ స్థానంలో సహజ ఆహారాన్ని తీసుకోండి. ఆఫీసుకెళ్లేటప్పుడు పండ్లను బ్యాగ్‌లో తీసుకెళ్లడం కొన్నిసార్లు సాధ్యంకాకపోవచ్చు. బాదం వంటి నట్స్ ఒక చిన్న బాక్సులో పెట్టుకుంటే మధ్యలో ఆకలి అనిపించినప్పుడు పది గింజలు తింటే చాలు' అన్నారు షీలా కృష్ణస్వామి. అరవై నాలుగేళ్ల వయసులో ఇంత చురుగ్గా ఉండడానికి సరైన ఆహారమే కారణమన్నారు. 'అందంగా ఉండడానికి రహస్యం ఏమీ లేదు, ఆరోగ్యంగా ఉండడమే'నని నవ్వారామె.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటో : టి.దయాకర్

ఊరికే కూర్చోకు భయపడకు

దట్టమైన పొగ, ధారాళమైన దుర్భాషలతో నిండి ఉండే మగ రూప కాఫీ రెస్టారెంట్‌లే ఈ ప్రపంచం నిండా! ఇండోనేషియా కూడా అందుకు భిన్నంగా ఏమీ ఉండదు. అయితే అక్కడి ఏసా ప్రావిన్సు రాజధాని పట్టణమైన బాందా ఏసాలో ఒక మహిళ పొగలు కక్కే మంచి కాఫీని తప్ప.. సిగరెట్ పొగలకు, చెత్త మాటలకు స్థానం లేని కేఫ్‌ను నడుపుతున్నారు! అది పూర్తిగా ఆడవాళ్ల అడ్డా. అక్కడ వాళ్లు కాఫీ తాగొచ్చు. కబుర్లు చెప్పుకోవచ్చు. చర్చలు పెట్టుకోవచ్చు. మగవాళ్లు కూడా వచ్చి కాఫీ తాగి వెళ్లిపోవచ్చు కానీ, అక్కడ కూర్చోటానికి లేదు. ఆ కాఫీ కేఫ్ పేరు 'మార్నింగ్ మామా'. ఆ కేఫ్ యజమాని ఖుర్రేటా అయుని. 28 ఏళ్ల ముస్లిం యువతి. ఆమె దగ్గర పనిచేసే నలుగురు 'బరిస్టా'లు (కాఫీ తయారు చేసి, సర్వ్ చేసేవారు) కూడా మహిళలే.

పూర్తిగా మహిళలే నడిపే 'మార్నింగ్ మామా' వంటి కాఫీ కేఫ్‌లు ఏ దేశంలో అయినా ఉండేవే. అందులో కొత్తేమీ లేదు. ప్రపంచంలోనే అత్యధికంగా ముస్లిం జనాభా ఉండే ఇండోనేషియాలో కూడా 'ఓన్లీ ఉమన్' కాఫీ కేఫ్‌లు అరకొరగానైనా లేకుండా పోవు. అయితే ఏసా ప్రావిన్సులో ఒక మహిళ బయటికి రావటం, బిజినెస్ చేయటం అన్నది కలకలం రేపే విషయం. కొరడా దెబ్బలకు దారి తీసే సాహసం. ఇండోనేషియాలోని మొత్తం 38 ప్రావిన్సులలో ఏసా ప్రావిన్సు ఒక్కటే ఇప్పటికీ మారకుండా నియమాల శిలలా ఉండిపోయింది. మహిళల పట్ల నేటికీ కఠినమైన ఆంక్షలు, సంప్రదాయాలు కొనసాగుతున్న ప్రదేశం అది. అలాంటి చోట కాఫీ కేఫ్ తెరిచారు ఖుర్రేటా! అయితే అందుకోసం ఆమె సంప్రదాయాలను ధిక్కరించలేదు. ఆంక్షల్ని కాస్త సడలింపజేసుకుని, హిజాబ్‌ను ధరించి, ఇతర మతపరమైన కట్టుబాట్లకు లోబడి కేఫ్‌ను నిర్వహిస్తున్నారు.


కస్టమర్ల కోసం కాఫీ తయారు చేస్తున్న ఖుర్రేటా (కుడి వైపు)


మార్నింగ్ మామా కాఫీ కేఫ్

ఖుర్రేటా కాఫీ కేఫ్ ప్రారంభించిన ఏసా ప్రావిన్సు రాజధాని పట్టణం బాందా ఏసాకు '1001 కాఫీ షాపులున్న పట్టణం'గా పేరు. వాటికి ఇప్పుడు 'మార్నింగ్ మామా'కూడా జత కలిసింది. ఆడవాళ్లు బయటికి వచ్చి మగవాళ్లలా పని చేయటం అనే 'దైవ దూషణ వంటి' ఆ ధిక్కారాన్ని చూసి మొదట్లో కన్నెర్ర చేసిన స్థానిక పురుషులు.. మెల్లమెల్లగా ఇప్పుడు ఆమె కేఫ్‌కే ప్రత్యేకమైన నురగలు కక్కే చిక్కని పాల శాంగర్ 'లాటే' కాఫీకి అలవాటు పడుతున్నారు. పొగ, శబ్దం లేకుండా హాయిగా, ప్రశాంతంగా ఉండే అక్కడి వాతావరణాన్ని మరింతగా ఇష్టపడుతున్నారు.

'మహిళలు సైతం సొంతంగా వ్యాపారాలు చేసుకోవచ్చు. నిర్ణయాలు తీసుకోవచ్చు. నాయకత్వం వహించవచ్చు' అని ఖుర్రేటా ఇస్తున్న స్టేట్‌మెంట్‌కు ప్రతీక ఆమె కాఫీ కేఫ్.

ఫ్యాషన్ ఎప్పుడూ సీజన్‌కి తగినట్టు మార్పులు చేసుకుంటుంది.
సౌకర్యానికి పెద్ద పీట వేస్తుంది.
ఓల్డ్ స్టైల్‌నే కొత్తగా పరిచయం చేస్తుంది.
చలిని తట్టుకునేలా...
సంప్రదాయ వేడుకకి ఎంబ్రాయిడరీ చేసిన లాంగ్ ఓవర్ కోట్స్,
క్యాజువల్ వేర్ అయితే డెనిమ్ ప్యాచ్ వర్క్ సూట్స్
శాలువా స్టైల్స్... శారీస్‌కు లాంగ్ వెల్వెట్ జాకెట్స్..
వింటర్ సీజన్‌ని బ్రైట్‌గా మార్చేస్తాయి.

వింటర్... వింటేజ్

ఫ్యాషన్ బ్యూటీ



శాలువాలు ఉన్నితో డిజైన్ చేసినవి ఎంచుకోవాలి. వెస్ట్రన్ వేర్ మీద బటన్ శాలువాను సెట్ చేసుకోవాలి. స్టైలిష్‌గానూ, చలిని తట్టుకునేలా ఉంటుంది.

ఉపయోగంలో లేని పాత డెనిమ్ డ్రెస్సులను శుభ్రపరిచి, రీ యూజ్ మెథడ్స్‌తో ప్యాచ్ వర్క్ చేసి తిరిగి వాడుకోవచ్చు. ఈ డిజైన్స్ ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. ప్యాచ్ వర్క్ డెనిమ్ లాంగ్‌జాకెట్స్, ప్యాంట్స్ ఈ వింటర్‌కి క్యాజువల్ వేర్‌గా స్పెషల్ లుక్‌తో ఆకట్టుకుంటాయి.

* * *

ఫ్యాన్సీ, సిల్క్ శారీస్ మీదకైనా ఉలెన్ కోట్స్, స్వెట్ షర్ట్స్ మంచి ఎంపిక అవుతాయి. బ్రైడల్ వేర్ అయితే వెల్వెట్ క్లాత్‌తో డిజైన్ చేసి లాంగ్ జాకెట్స్ ఎంచుకోవాలి.

ప్లాజో, ధోతీ ప్యాంట్స్‌కు సందర్భాన్ని బట్టి ప్రింటెడ్ లేదా ఎంబ్రాయిడరీ ఓవర్ కోట్స్ మంచి లుక్‌ని ఇస్తాయి.


జుట్టుకు రంగేస్తున్నారా?!

తెల్ల జుట్టు నల్లగా అవ్వాలంటే.. ఈ రోజుల్లో ఉన్న అతి పెద్ద సమస్యలలో ఇదొకటి. వయసు పైబడిన వారికే కాదు యువతలోనూ జుట్టు తెల్లబడటం గమనిస్తున్నాం. ఇలాంటప్పుడు జుట్టును నల్లబరచడానికి సాధారణంగా కలర్స్ వాడుతుంటారు. కొందరు స్టైల్ కోసం వివిధ రకాల రంగులను ఉపయోగిస్తుంటారు. అవగాహన ఉంటే హెయిర్ కలర్స్ వల్ల వచ్చే సమస్యలను గుర్తించి.. ముందే సరైన జాగ్రత్తలు తీసుకోవచ్చు.

ప్రాచీన కాలంలో తెల్లజుట్టు రంగు మార్చడానికి గోరింటాకును ఉపయోగించేవారని కొన్ని కథనాల ద్వారా తెలుస్తోంది. సింథటిక్ హెయిర్ డై లు మాత్రం వందేళ్ల క్రితం పుట్టుకొచ్చాయి. నాటినుంచి వివిధ రకాల హెయిర్ కలర్స్ జుట్టును నల్లబరచడానికి వివిధ మోడల్స్‌లో మార్కెట్లోకి వచ్చి చేరుతున్నాయి.

తీవ్ర ప్రభావం

షాడో కలర్స్‌తో పాటు ఎక్కువగా వినే మాట బ్లాక్ హెన్నా. ఇది కూడా కలరే. హెయిర్‌ని బ్లాక్ చేసే షాంపూలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ కలర్స్‌లో అమ్మోనియా ఫ్రీ అని మార్కెటింగ్ చేస్తుంటారు. ఇక పారాటోలిన్, డయమిన్ కెమికల్స్ బ్లాక్ కలర్ రావడానికి ఉపయోగిస్తారు. వీటివల్ల రియాక్షన్స్ వస్తాయి. కొందరికి వెంటనే రియాక్షన్ ప్రభావం చూపుతుంది. వెంటనే మాడుపైన దురద పుడుతుంది. కొందరికి తల, కళ్లు, ముఖం వాస్తాయి. దీర్ఘకాలంలో అయితే పిగ్మెంటేషన్ సమస్య వస్తుంది. మొటిమలు, యాక్నె బాధిస్తాయి. ఈ సమస్యలు రాకుండా ఉండాలంటే మెడికేటెడ్ హెయిర్ కలర్ వాడుకోవాలి. బ్లాక్ హెన్నా సేఫ్ అని చాలా మంది అనుకుంటారు. కానీ, ఇది కూడా హెయిర్ కలరే. మిగతా వాటితో పోల్చితే రెడ్ హెన్నా కొంతవరకు సేఫ్.



మాయిశ్చరైజర్ రాసుకోవాలి...

హెయిర్ కలర్ వేసుకునేవారు ముందుగా చెవి వెనక జుట్టుకి కొద్దిగా వేసి, ఒకరోజు అలాగే ఉంచి, చెక్ చేసుకోవాలి. కలర్ వేసుకునే ముందు ముఖానికి, మాడుకు కూడా మాయిశ్చరైజర్ అప్లై చేసి, తర్వాత డై వేసుకోవాలి. అప్పుడు కలర్ చర్మానికి అంటినా, డార్క్ అవదు. డై వేసుకోవడానికి ఎవరికి వారుగా కాకుండా మరొకరి సాయం తీసుకోవడం ఉత్తమం.


వాష్ చేసుకునేటప్పుడు...

కలర్ వేసుకున్న తర్వాత శుభ్రపరిచేటప్పుడు ముఖం మీదుగా కాకుండా తల వెనక నుంచే కడగాలి. దీంతో ముఖంపైన కలర్ పడకుండా ఉంటుంది.

మెడికేటెడ్ హెయిర్ కలర్స్ మార్కెట్లో దొరికేటంత డార్క్ కలర్‌ని ఇవ్వవు. త్వరగా కలర్ పోతుంది. అందుకే, మార్కెట్లో లభించే వాటికే వెళతారు. కానీ, డై కి ఇచ్చిన ప్రాముఖ్యం మన ఆరోగ్యానికి కూడా ఇవ్వాలనేది గుర్తుంచుకోవాలి. జుట్టు తెల్లబడకుండా ఉండేందుకు మార్గాలేవీ లేవు కనుక ప్రొటెక్టివ్ మెడికేటెడ్ కలర్స్, షాంపూలను ఉపయోగించడం మేలు.

పొడిబారడం ప్రధాన సమస్య...

సోరియాసిస్ సమస్య ఉన్నవాళ్లు హెయిర్‌కలర్స్ వేసుకునే ముందు మెడికేషన్ తీసుకోవాలి. కలర్ సమస్యతో పాటు ఈ కాలం చలి వల్ల చాలా మంది తల స్నానం చేయరు. లేదంటే స్నానానికి వేడిగా ఉండే నీటిని ఉపయోగిస్తారు. దీంతో చర్మం, వెంట్రుకలు కూడా పొడి బారుతాయి. కలర్స్ వల్ల కూడా మాడు దురద పెడుతుంది. పొడిబారిన మాడు చుండ్రును పెంచుతుంది. యువతలో ఈ సమస్య అధికం. అందుకని, వారానికి రెండు సార్లు ఆయిల్ మసాజ్ చేసుకొని, మెడికేటెడ్ లేదా యాంటీ డాండ్రఫ్ షాంపూతో తల స్నానం చేయాలి. చుండ్రు సమస్య ఉన్న వాళ్లు నూనె రాసి, అలాగే ఉంచకూడదు. వెంట్రుకల మృదుత్వానికి, కలర్‌కి హెన్నా, అలోవెరా... వంటివి తలకు ప్యాక్స్ వేస్తుంటారు. వీటిని రాత్రంతా అలాగే ఉంచి, మరునటి రోజు స్నానం చేస్తుంటారు. దీనివల్ల సైనస్ సమస్యలు రావచ్చు. తలకు నేచురల్ ప్యాక్స్ వేసుకున్నా గంటలోపు తలను శుభ్రపరుచుకోవడం మంచిది.



– డాక్టర్ స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్

● టెక్.. టాక్

మోటోరోలా ఎడ్జ్ 50



డిస్‌ప్లే: 6.7 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జెడ్
మెమోరీ: 256 జీబి 8జీబి ర్యామ్/256 జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12 జీబి ర్యామ్ రిజల్యూషన్: 1220×2712 పిక్సెల్స్ బరువు: 180 గ్రా.
వోఎస్: ఆండ్రాయిడ్ 14 బ్యాటరీ: 5000 ఎంఏహెచ్

హానర్ మ్యాజిక్ పాడ్



డిస్‌ప్లే: 12.30 బరువు: 555 గ్రా. రిజల్యూషన్: 1920×3000 పిక్సెల్స్ మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్/256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 16జీబి ర్యామ్ ఫ్రంట్ కెమెరా: 9 ఎంపీ బ్యాటరీ: 10050 ఎంఏహెచ్

ఏసర్ మల్టీఫంక్షన్ మానిటర్



బ్రాండ్: ఏసర్ కలర్: వైట్ మెటీరియల్: ప్లాస్టిక్
కంపేటబుల్ డివైజ్‌లు: హెడ్‌ఫోన్స్,స్మార్ట్‌ఫోన్స్, డెస్క్‌టాప్, లాప్‌టాప్స్, స్పీకర్స్ ప్రాడక్ట్ డైమెన్షన్స్: 20.5×55×7 సీఎం
బరువు: 1.05 కేజీ

బ్లూస్కైలో మ్యూట్ వర్డ్స్



సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'బ్లూస్కై' ట్విట్టర్‌కు గట్టి పోటీ ఇచ్చేలా దూసుకుపోతుంది. దీనికి 15 మిలియన్‌లకు పైగా యూజర్‌లు ఉన్నట్లు చెబుతున్నారు. ట్విట్టర్ ఫౌండర్‌లలో ఒకరైన జాక్ డోర్సె దీన్ని స్థాపించాడు. బ్లూస్కైను 'డిసెంట్రలైజ్డ్ సోషల్ నెట్‌వర్క్‌'గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

'బ్లూస్కై' ఫీచర్‌ల విషయానికి వస్తే....

'మ్యూట్ వర్డ్స్' అనే ఫీచర్ ఉంది. దీని ద్వారా నిర్దిష్టమైన పదాన్ని ఫీడ్ నుంచి మ్యూట్ చేయవచ్చు. ఉదాహరణకు 'ట్విట్టర్' అనే పదాన్ని బ్లాక్ చేస్తే ఆ పదం మాత్రమే మ్యూట్ అవుతుంది. 'ట్వీట్'లాంటి సిమిలర్ పదాలు మ్యూట్ కావు.

సోషల్ మీడియాలో ఇతరుల పోస్ట్‌లను ఉటంకించడం(కోట్ చేయడం) అనేది సాధారణమే. అయితే ఇది కొన్ని సార్లు సమస్యలు తెస్తుంది. కొన్ని సార్లు ఆన్‌లైన్ బుల్లింగ్‌కు కారణం కావచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పోస్ట్‌ల కోట్‌ను నిరోధించే ఫీచర్ 'బ్లూస్కై'లో అందుబాటులో ఉంది.

'కోట్ పోస్ట్స్ ఎనేబుల్డ్' ఆప్షన్‌ను ఆఫ్ చేయడం ద్వారా ప్లాట్‌ఫామ్‌లో ఎవరూ మీ పోస్ట్‌లను కోట్ చేయకుండా చేయవచ్చు.

● మ్యూజిక్ వరల్డ్

విష్ జోష్



రియా దుగ్గల్(రి), సిమ్రాన్ దుగ్గల్ (సిమ్), జో సిద్దార్థ్ (జో), సుచితా షిర్కే(సుచి)లతో కూడిన 'విష్' మ్యూజిక్ బ్యాండ్ కొత్త తరం ఆకాంక్షలు, ప్రతిభ, కలలకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

'ప్రపంచ వేదికపై మన టాలెంట్ ఏమిటో చూపాలి' అనే లక్ష్యంతో దూసుకుపోతుంది.

పాపులర్ కె–పాప్ స్ఫూర్తితో ప్రయాణం ప్రారంభించిన 'విష్' తనదైన స్టైల్‌ను క్రియేట్ చేసుకోవడంలో సక్సెస్ అయింది. 'విష్' సభ్యులలో ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. సంగీతానికి సంబంధించి తమదైన ప్రత్యేక శైలి ఉంది. చెన్నైకి చెందిన 'జో' తన హస్కీ వాయిస్‌తో సౌత్ ఫ్లేవర్‌ను వినుల విందు చేస్తుంది. ముంబైకి చెందిన రి, సిమ్ సిస్టర్స్ వాయిస్ 'మాకు మాత్రమే ప్రత్యేకం' అనేలా ఉంటుంది. ఈ బ్యాండ్‌లో అతి పిన్న వయస్కురాలైన సుచీ స్వీట్ వాయిస్‌కు మరోపేరు. ఈ బ్యాండ్ ఫస్ట్ సింగిల్ 'లాజీజ్' 'లాజీజ్' అంటే ఉర్దూలో 'రుచికరమైనది' అని అర్థం. స్త్రీ సాధికారత, స్త్రీ స్వాతంత్ర్యం.... మొదలైన అంశాలను ప్రస్తావించే 'లాజీజ్'కు మంచి స్పందన వచ్చింది.

● సక్సెస్ స్టోరీ



● సానియా జేహ్రా

తీయటి విజయం

రెండు సంవత్సరాల క్రితం మెడికల్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పింది సానియ. 'ఇప్పుడు ఏంచేయబోతున్నావు?' అని అడిగితే.... 'తేనెటీగల పెంపకం' అని జవాబు చెప్పింది. అమితంగా ఆశ్చర్యపోవడం తప్ప ఎవరూ రెండు ముక్కలు కూడా ప్రోత్సాహకంగా మాట్లాడలేదు. 'ఈ ఉత్సాహం చల్లారడానికి, వెనక్కి వెళ్లడానికి ఎంతో కాలం పట్టదు' అని కూడా అనుకున్నారు. కాని వారు అనుకున్నట్లు జరగలేదు....

కశ్మీర్‌లోని బల్గమాకు చెందిన 22 ఏళ్ల సానియా జేహ్రా తేనెటీగల పెంపకంలో ఛాంపియన్‌గా పేరు తెచ్చుకుంది. చిన్న వయసులోనే తన కుటుంబ వ్యాపారానికి వెన్నముకగా మారింది. తాత నుంచి తండ్రికి ఆయన నుంచి వారసత్వంగా తేనెటీగల పెంపకాన్ని స్వీకరించింది.

మొదట్లో తండ్రికి సహాయంగా ఈ వ్యాపారంలోకి వచ్చింది. అయితే తనకు పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. విసుగుగా అనిపించేది. అలాంటి అమ్మాయి కాస్తా వ్యాపారంపై ఆసక్తి పెంచుకోవడమే కాదు తేనెటీగల పెంపకం నుంచి మార్కెటింగ్ వరకు ఎన్నో ప్రక్రియలలో తన సత్తా చాటుతోంది.

ఇంపోర్ట్–ఎక్స్‌పోర్ట్ బిజినెస్‌లో కూడా రాణిస్తోంది.

> **విజయానికి మొదటి మెట్టు ఆసక్తి. ఆ తరువాత అధ్యయనం. ఆ తరువాత కష్టం. కష్టం ఎప్పుడూ వృథా పోదు. తీయటి ఫలాలు ఇస్తుంది. 'నేను చేయగలను' అనే గట్టి నమ్మకం ఉన్నప్పుడే వ్యాపారంలోకి అడుగు పెట్టాలి.**
> **- సానియా జేహ్రా**

సంప్రదాయ తేనె ఉత్పత్తికి ఆధునిక సాంకేతికతను జోడిస్తున్న సానియ తేనె ఉత్పత్తిపై మాత్రమే కాదు మార్కెట్‌పై కూడా దృష్టి పెడుతుంది.

'ఈ వ్యాపారం ద్వారా వచ్చిన లాభాలు మరింత ఎదగడానికి ఉపయోగపడ్డాయి. తేనెటీగల పెంపకం అనేది ఒక గౌరవపదమైన వృత్తి. వైద్యానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. కశ్మీర్‌లో వ్యాపారానికి సంబంధించి మహిళల ప్రయాణం సులభం కాకపోయినా అసాధ్యం మాత్రం కాదు. నా విషయానికి వస్తే....మొదట్లో దగ్గరి బంధువుల నుంచి కూడా వెక్కిరింపులు ఎదుర్కోవలసి వచ్చింది. అయినప్పటికీ ఎప్పుడూ మనోధైర్యం కోల్పోలేదు. ఎప్పుడూ నా పని పైనే దృష్టి పెట్టేదాన్ని. వ్యాపారంలో నా విజయం పట్ల నేను ఎంతో సంతోషంగా ఉన్నాను. కష్టపడే సామర్థ్యమే విజయానికి చిరునామా' అంటుంది సానియ.

తేనెటీగల పెంపకం నుంచి సౌందర్య ఉత్పత్తులు, మైనం...మొదలైన వ్యాపారాల్లోకి కూడా అడుగు పెట్టింది. 'మనం చేసే పని చిన్నదా పెద్దదా అని ఎప్పుడూ ఆలోచించవద్దు. అంకితభావం, నిజాయితీతో పనిచేయడమే ముఖ్యం' అంటుంది సానియా జేహ్రా.

● ఇంగ్లీష్ ఇడియమ్స్

డౌటింగ్ థామస్



ఎప్పుడూ సందేహించే వ్యక్తుల విషయంలో వాడే మాట.....డౌటింగ్ థామస్. **ఉదా:** డోన్ట్ వేస్ట్ యువర్ టైమ్ ఆన్ ఎక్స్‌ప్లెనేషన్స్. హీ ఈజ్ ఏ డౌటింగ్ థామస్

మేక్ ఏ కిల్లింగ్

తక్కువ కష్టంతో, చాలా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించే సందర్భంలో వాడే మాట...మేక్ ఏ కిల్లింగ్. **ఉదా:** దే మేడ్ ఏ కిల్లింగ్ వెన్ దే సోల్డ్ దెయిర్ స్టార్టప్ టు ఏ మేజర్ కార్పోరేషన్

అవును...ఇది నిజమే!

1927 నుంచి 1934 మధ్య కాలాన్ని 'ప్రీ–కోడ్ హాలివుడ్' అని పిలిచేవారు. ఈ కాలంలో హాలివుడ్ తెరపై అభ్యంతరకరమైన దృశ్యాలు ఎన్నో కనిపించేవి. వీటికి అడ్డుకట్ట వేయడానికి 'హేస్ కోడ్' అమల్లోకి వచ్చింది.

'నైతిక ప్రమాణాలను ఉల్లంఘించకూడదు' అంటూ వచ్చిన ఈ కోడ్ నిర్మాతలకు ఎన్నో నిబంధనలు విధించింది. 'హేస్ కోడ్' జాబితాలోని నిషేధాలలో నగ్నత్వం, అనవసరంగా మద్యం సేవించడం, మతాన్ని అపహాస్యం చేయడం....ఇలా ఎన్నో ఉన్నాయి.

● గేమింగ్

నీడ కాదు....పీడ!



చెట్టు అని ముట్టుకుంటే అస్థిపంజరమై వికటాట్టహాసం చేస్తుంది. నది అని నీళ్లు తాగబోతే రక్తపు అల ఎగిసిపడుతుంది. ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియదు. ఏ మూల నుంచి ఏ ప్రమాదం దూసుకు వస్తుందో తెలియదు. 'అయినా సరే నేను రెడీ' అని మీరు ధైర్యం ప్రదర్శిస్తే 'స్లిట్టర్‌హెడ్' మీకు స్వాగతం పలుకుతుంది.

యాక్షన్–అడ్వెంచర్ గేమ్ స్లిట్టర్ హెడ్. 'గ్రావిటీ రష్' 'సైరన్' గేమ్స్ ఆధారంగా రూపొందించిన గేమ్ ఇది. 1990వ దశకంలో కౌలూన్‌లోని భయానక వీధుల్లో జరిగే ఈ గేమ్‌లో 'స్లిట్టర్ హెడ్స్' అనే రాక్షసుడితో ప్లేయర్స్ ఫైట్ చేయాల్సి ఉంటుంది. 'స్లిట్లర్ హెడ్స్' బారి నుంచి జూలీ అనే అమ్మాయిని రక్షించాల్సి ఉంటుంది. భౌతిక రూపంలో కనిపించకుండా ఒక సంస్థను నియంత్రించాలి. జపనీస్ హారర్ ప్రభావంతో రూపొందించిన గేమ్ ఇది.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లే స్టేషన్ 5, విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్: యాక్షన్–అడ్వెంచర్ **మోడ్:** సింగిల్ ప్లేయర్.

మోహన్‌బాబు@50



నటుడు–నిర్మాత మంచు మోహన్‌బాబు సినీ జర్నీ గోల్డెన్ జూబ్లీ ఇయర్‌లోకి అడుగుపెట్టింది. యాభై ఏళ్ల కెరీర్లో ప్రతినాయకుడిగా, కథానాయకుడిగా, సహాయ నటుడిగా, నిర్మాతగా ఎన్నో ఘనవిజయాలను చూశారు మోహన్‌బాబు. నేటితో సినీ పరిశ్రమలో హీరోగా 50వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. సినిమాల్లోకి రాక ముందు ఆయన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా చేశారు. అయితే సినీ పరిశ్రమపై ఎనలేని ఆసక్తితో మద్రాస్ వెళ్లి, అవకాశాల కోసం ఎంతో శ్రమించారు మోహన్‌బాబు. అలా ఒకట్రెండు సినిమాల్లో చిన్న పాత్రలో కనిపించిన మోహన్‌బాబు హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' (1975). డా. దాసరి నారాయణరావు ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. నవంబరు 22న విడుదలైన ఈ సినిమాకు విశేష ప్రేక్షకాదరణ దక్కింది. ఈ సినిమా విడుదలై, గురువారంతో నలభైతొమ్మిది సంవత్సరాలు పూర్తయ్యాయి. 'స్వర్గం నరకం'తో హీరోగా వెండితెరకు పరిచయమైన మోహన్‌బాబు కెరీర్ మొదట్లో ఎక్కువగా విలన్ పాత్రలనే పోషించారు. 1975–1990 సమయంలో విలన్‌గా విజృంభించారు. హీరోగా 'అల్లుడుగారు, అసెంబ్లీ రౌడీ, పెదరాయుడు, మేజర్ చంద్రకాంత్' వంటి బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్నారు. 75 సినిమాలను నిర్మించారు. ప్రస్తుతం 'కన్నప్ప' సినిమాలో మహాదేవ శాస్త్రిగా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు మోహన్‌బాబు. విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత రానుంది.

ఫీల్ గుడ్ షురూ



● హను రాఘవపూడి, రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే

రామ్ పోతినేని హీరోగా పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ మూవీలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి దర్శకుడు గోపీచంద్ మలినేని కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు హను రాఘవపూడి క్లాప్ ఇచ్చారు. దర్శకుడు వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించారు. నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, సీఈవో చెర్రీ, దర్శకులు గోపీచంద్ మలినేని, హను రాఘవపూడి, వెంకీ కుడుముల, శివ నిర్వాణ, పవన్ సాధినేనిలు దర్శకుడు మహేశ్‌కు స్క్రిప్ట్ అందజేశారు. ''యూత్‌ను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కనున్న సినిమా ఇది'' అన్నారు దర్శక–నిర్మాతలు.

సినిమా

సందడి సందడిగా...



● నాగచైతన్య, శోభిత, నాగార్జున, అమల



● సైకత శిల్పం



● రానా, ఖుష్బూ, వాణి త్రిపాఠి, ఇంతియాజ్ అలీ, సుహాసిని, భూమీ ఫెడ్నేకర్

భారతదేశపు అంతర్జాతీయ చిత్రోత్సవం (ఇఫీ) సందడి సందడిగా జరుగుతోంది. ఈ నెల 20న ఈ చిత్రోత్సవం ఆరంభమైన విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల్లో భాగంగా జరిగిన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు శతాబ్ది వేడుకలకు నాగార్జున హాజరయ్యారు. తొలి రోజు నాగార్జున–అమల పాల్గొనగా, రెండో రోజు కాబోయే దంపతులు నాగచైతన్య–శోభిత ధూళిపాళ్ల కూడా సందడి చేశారు. ఈ వేడుకలో 'భారత్ హై హమ్' పేరిట దూరదర్శన్‌లో ప్రసారం కానున్న యానిమేషన్ సిరీస్ పోస్టర్‌ను నాగార్జున విడుదల చేశారు. రానా హోస్ట్ చేయనున్న సెలబ్రిటీ టీవీ టాక్ షో 'ది రానా దగ్గుబాటి' ప్రీమియర్ జరిగింది. ఈ సందర్భంగా రానా 'ఇఫీ' ఉత్సవాలకు హాజరై, చర్చా వేదికలో పాల్గొన్నారు. అలాగే సినీ పరిశ్రమలో మహిళల భద్రతకు సంబంధించిన చర్చా వేదికలో నటీమణులు సుహాసిని, ఖుష్బూ, భూమీ ఫెడ్నేకర్, బాలీవుడ్ దర్శకుడు ఇంతియాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు. అలానే సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ తయారు చేసిన నటులు ఏఎన్నార్, రాజ్ కపూర్, గాయకుడు మహమ్మద్ రఫీ, దర్శకుడు తపన్ సిన్హాల సైకత శిల్పం అక్కడి లా మెర్ బీచ్‌లో సందర్శకులను ఆకట్టుకుంది.

– గోవా నుంచి 'సాక్షి' ప్రతినిధి

జాతకాలు ఎంత నిజమో నాకు తెలియదు

- విజయ్ దేవరకొండ

ప్రియదర్శి పులికొండ, రూపా కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 20న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ను హీరో విజయ్ దేవరకొండ షేర్ చేసి, మాట్లాడుతూ– ''నా బ్రదర్ దర్శి (ప్రియదర్శి) తోనే నా కెరీర్‌ను స్టార్ట్ చేశాను. జాతకాలు ఎంత నిజం అనేది నాకు తెలియదు. డెస్టినీ మమ్మల్ని ఇక్కడికి తీసుకు వచ్చింది. దర్శి జర్నీ చూడటం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు.



● విజయ్ దేవరకొండ, కృష్ణప్రసాద్, ప్రియదర్శి

కేసీఆర్‌కి టికెట్ ధరలు తగ్గించాం

- రాకింగ్ రాకేష్



''ఈరోజు చాలా సినిమాలు విడుదలవుతున్నాయి. కానీ మా 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్)లో మాజీ సీఎం కేసీఆర్‌గారు నటించారు. అదే నా చిత్రానికి ఓపెనింగ్స్ తీసుకొస్తుంది. ఆయనకి తెలియకుండా ఆయన సన్నివేశాలు తీశాను. నేడు రిలీజ్ అవుతున్న అన్ని సినిమాలు చూడండి. అందులో నా ప్రయత్నాన్ని కూడా ఆశీర్వదించాలని వేడుకుంటున్నాను. మా సినిమాకి టికెట్ ధరలు కూడా తగ్గించాం. రూ. 50 నుంచి వంద రూపాయలు మాత్రమే'' అన్నారు రాకింగ్ రాకేష్. 'గరుడ వేగ' అంజి దర్శకత్వం వహించిన చిత్రం 'కేసీఆర్'. రాకింగ్ రాకేష్ హీరోగా నటించి, నిర్మించారు. అనన్య కృష్ణన్ హీరోయిన్. ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా రాకింగ్ రాకేష్ మాట్లాడుతూ– ''లంబాడీ కుటుంబంలో పుట్టిన ఒక కుర్రాడు తన ఊర్లో జరుగుతున్న దారుణానికి చలించి, హైదరాబాదులో అడుగు పెట్టి, తన ఊరు కోసం ఏం చేశాడు? అవమానాలు పడ్డ ఊర్లో తను ఓ స్టార్‌గా ఎలా అయ్యాడు? అనేది కథ. వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ కథ రాశాను. ఒక కమెడియన్ ఏ పాత్రనైనా చేయగలడు. 'కేసీఆర్' కథే నన్ను నటించేలా, నిర్మించేలా చేసింది. ఇది ఒక పార్టీని, ఒక వ్యక్తిని ఉద్దేశించి తీసిన సినిమా కాదు. ఈ మూవీలో గోరటి వెంకన్నగారు రాసిన ఓ పాట నన్ను కేసీఆర్‌గారి దగ్గరికి తీసుకెళ్లింది. ఆయనకి మా సినిమా చూపించాలనేది నా ప్రయత్నం. నా భార్య జోర్దార్ సుజాత సహకారం లేకపోతే ఈ సినిమా పూర్తయ్యేది కాదు. నా కథని వంద రెట్లు అద్భుతంగా తెరకెక్కించారు అంజిగారు'' అని తెలిపారు.

లక్కీ భాస్కర్‌తో సంబంధం లేదు

- సత్యదేవ్




''బ్లాక్ మనీ, వైట్ మనీ చుట్టూ జరిగే కథే 'జీబ్రా'. ఇప్పుడు బ్యాంకింగ్ రంగం అంతా డిజిటల్ కావడంతో క్రైమ్ చేయడం అంత సులభం కాదు. బ్యాంక్‌లో జరిగే తప్పిదాలు అక్కడి ఉద్యోగులకు మినహా సామాన్యులకు తెలియవు. దర్శకుడు ఈశ్వర్ గతంలో బ్యాంక్‌లో పని చేశారు. ఆయన చూసిన ఘటనలతో పాటు ఇంకొన్ని వాస్తవ సంఘటనలతో ఈ కథని రాసి, అద్భుతంగా తీశారు'' అని హీరో సత్యదేవ్ చెప్పారు. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో సత్యదేవ్, డాలీ ధనంజయ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'జీబ్రా'. ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించిన ఈ సినిమా నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా సత్యదేవ్ మాట్లాడుతూ– ''తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతున్న సినిమా ఇది.

ఏటీఎంలో డబ్బులు డ్రా చేసినప్పుడు ఓ సౌండ్‌తో డబ్బులు బయటికి వస్తాయి. ఆ సౌండ్ వెనక ఏం జరుగుతుంది? అనేదే ఈ సినిమా. ఇందులో బ్యాంక్ ఉద్యోగిగా చేశాను. బ్యాంకర్ అనే క్యారెక్టర్ తప్పితే 'లక్కీ భాస్కర్' చిత్రానికి, మా 'జీబ్రా'కి ఎలాంటి సంబంధం లేదు. ఈ సినిమా రిలీజైన తర్వాత ఈశ్వర్ కార్తీక్ రైటింగ్, డైరెక్షన్‌కి మంచి పేరు వస్తుంది. ఇప్పటి వరకూ నేను దాదాపు సీరియస్ రోల్స్ చేశాను. 'జీబ్రా'లో కొత్త సత్యదేవ్‌ని చూస్తారు. ప్రస్తుతం 'ఫుల్ బాటిల్' సినిమా చేస్తున్నాను. వెంకటేశ్ మహా దర్శకత్వంలో ఓ సినిమా ఉంటుంది'' అన్నారు.

ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు

- అశోక్ గల్లా



''దేవకీ నందన వాసుదేవ' సినిమా పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్. భక్తి అంశాలు, ట్విస్ట్‌లు అదిరిపోతాయి. ఫైనల్ ఔట్‌పుట్ చూసిన తర్వాత సినిమాపై చాలా నమ్మకంగా ఉన్నాం. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు అశోక్ గల్లా. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కథ అందించిన చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహించారు. అశోక్ గల్లా, మానస వారణాసి జంటగా నటించారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశోక్ గల్లా మాట్లాడుతూ– ''దేవకీ నందన వాసుదేవ'లో హీరో పేరు కృష్ణ, హీరోయిన్ పేరు సత్యభామ, విలన్ కంసరాజు.. ఇలా మైథాలజీ టచ్ ఉంటుంది. ప్రశాంత్‌గారి టచ్‌తో బోయపాటి శ్రీనుగారు సినిమా తీస్తే ఎలా ఉంటుందో అలా అర్జున్ జంధ్యాల ఈ మూవీ తీశారు. సోమినేని బాలకృష్ణగారు కథని నమ్మి రాజీపడకుండా నిర్మించారు. మా సినిమా చూశాక మహేశ్‌బాబు మావయ్య ఎలా స్పందిస్తారా? అని ఎదురు చూస్తున్నా. ప్రస్తుతం సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్నాను'' అని చెప్పారు.

ఆఫీసర్ రూనీస్



● లక్ష్మీ రాయ్

లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో గురుప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'రూనీస్ ఐపీఎస్'. ఈ సినిమా తెలుగు వెర్షన్‌ను ఆర్‌కే ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ ఈ నెల 29న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''ఈ సినిమాలో లక్ష్మీ రాయ్ పాత్రలో మూడు డిఫరెంట్ షేడ్స్ కనిపిస్తాయి. యువత భవిష్యత్‌ను పెడదారి పట్టించే డ్రగ్స్ ముఠా ఆగడాలను ఐపీఎస్ ఆఫీసర్ రూనీస్ ఎలా అరికట్టింది అన్నదే కథాంశం'' అన్నారు.

కాస్త ఆలస్యంగా...



● 'రోటి కపడా రొమాన్స్'లో...

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘ లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించిన మూవీ 'రోటి కపడా రొమాన్స్'. సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి బెక్కెం వేణుగోపాల్ నిర్మించారు. ఈ శుక్రవారం విడుదల కావాల్సిన ఈ చిత్రం కాస్త ఆలస్యంగా ఈ నెల 28న విడుదల కానుంది. ''ఓ మంచి సినిమా మరింత మంది ప్రేక్షకులకు చేరువ కావాలనే ఉద్దేశంతోనే మా సినిమా రిలీజ్‌ను ఈ నెల 22 నుంచి 28కి వాయిదా వేశాం. అయితే ఇప్పటికే పెయిడ్ ప్రీమియర్స్ వేశాం. పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది'' అని పేర్కొన్నారు నిర్మాతలు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
22-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
423	169
77,156	23,350

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,953	▽	23
డోజోన్స్	43,798	△	390
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,144	△	64
డాక్స్	19,146	△	141
షాంఘై	3,370	△	2
నికాయ్	38,026	▽	326

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్)	75,860
బంగారం (22 క్యారట్)	72,250
వెండి (కేజీ)	1,01,000

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటం	84.10	85.03
£	బ్రిటన్ పౌండ్	ఎకటం	105.81	108.63
€	యూరో	ఎకటం	87.89	90.49
¥	జపాన్ ఎన్ (100)	ఎకటం	53.86	55.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకటం	54.01	56.20
S$	సింగపూర్ డాలర్	ఎకటం	60.41	65.89
SAR	సౌదీ రియాల్	ఛాయవిటకి	21.58	23.12
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయవిటకి	22.10	23.88
¥	చైనా యువాన్	ఛాయవిటకి	10.76	12.59

బీఎస్‌ఎన్‌ఎల్‌కు కొత్తగా 8.5 లక్షల మంది..



- మూడు టెల్కోలకు కోటి మంది దూరం
- ట్రాయ్ సెప్టెంబర్ గణాంకాల్లో వెల్లడి

న్యూఢిల్లీ: ప్రైవేట్ టెలికం సంస్థలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా 2024 సెప్టెంబర్‌లో కోటి మందికిపైగా వైర్‌లెస్ చందాదారులను కోల్పోయాయి. ప్రభుత్వ రంగ బీఎస్‌ఎన్‌ఎల్ సుమారు 8.5 లక్షల మంది కొత్త కస్టమర్లను దక్కించుకుంది. ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబర్ మాసంలో రిలయన్స్ జియోకు 79.69 లక్షల మంది, భారతీ ఎయిర్‌టెల్ 14.34 లక్షలు, వొడాఫోన్ ఐడియాకు 15.53 లక్షల మంది దూరమయ్యారు. సెప్టెంబర్ చివరినాటికి మొత్తం వైర్‌లెస్ చందాదార్ల సంఖ్య 0.87 శాతం పడిపోయి 115.37 కోట్లకు వచ్చి చేరింది. ఇందులో రిలయన్స్ జియోకు 46.37 కోట్లు, భారతీ ఎయిర్‌టెల్ 38.34 కోట్లు, వొడాఫోన్ ఐడియా 21.24 కోట్లు, బీఎస్‌ఎన్‌ఎల్‌కు 9.18 కోట్ల మంది ఉన్నారు. వైర్‌లెస్ వినియోగదార్లు నగరాల్లో 0.80 శాతం, గ్రామాల్లో 0.95 శాతం తగ్గారు. వైర్డ్, వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ చందాదార్ల సంఖ్య 0.51% క్షీణించి 94.44 కోట్లు నమోదైంది. ఇందులో రిలయన్స్ జియోకు 47.7 కోట్లు, భారతీ ఎయిర్‌టెల్ 28.5 కోట్లు, వొడాఫోన్ ఐడియా 12.6 కోట్లు, బీఎస్‌ఎన్‌ఎల్‌కు 3.7 కోట్ల మంది ఉన్నారు.

మార్కెట్ వాటా పొందేందుకు..

జూలైలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా మొబైల్ టారిఫ్‌లను 10–27 శాతం వరకు పెంచాయి. అయితే ప్రత్యర్థుల బాటను అనుసరించకపోగా.. సమీప భవిష్యత్తులో టారిఫ్‌ల పెంపుదలని ఉండబోదని బీఎస్‌ఎన్‌ఎల్ సీఎండీ రాబర్ట్ రవి గత నెలలో స్పష్టం చేయడం గమనార్హం. వినియోగదార్లను ఆకర్షించడానికి, మార్కెట్ వాటాను తిరిగి పొందేందుకు బీఎస్‌ఎన్‌ఎల్ ఇటీవల స్పామ్ బ్లాకర్స్, ఆటోమేటెడ్ సిమ్ కియోస్క్, డైరెక్ట్–టు–డివైస్ తదితర సేవలను ప్రారంభించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
- ఢిల్లీ ఖాన్ మార్కెట్.. చాలా కాస్ట్‌లీ
- ఆర్‌క్యాప్ కొనుగోలు రేసులో హిందుజా

జోయాలుక్కాస్ 'వివాహ ఉత్సవ్' ఆఫర్లు

హైదరాబాద్: పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోయాలుక్కాస్ 'వివాహ ఉత్సవ్' ఆఫర్లు ప్రకటించింది. ఇందులో భాగంగా లక్ష రూపాయల విలువైన బంగారు ఆభరణాల కొనుగోలుపై 10 గ్రాముల వెండి బార్‌ను ఉచితంగా ఇస్తుంది. డైమండ్లు, అన్ కట్ డైమండ్లు, ప్రెషస్ స్టోన్లపై ఫ్లాట్ 25% తగ్గింపు ఇస్తుంది. ఈ ప్రత్యేక ఆఫర్లు అన్ని జోయాలుక్కాస్ షోరూంల్లో డిసెంబర్ 1 వరకు అందుబాటులో ఉంటాయి.

రూపాయి మరో కొత్త ఆల్‌టైం కనిష్టానికి..



డాలర్ మారకంలో రూపాయి విలువ 8 పైసలు నష్టపోయి సరికొత్త కనిష్ట స్థాయి 84.50 వద్ద స్థిరపడింది. ఉక్రెయిన్ రష్యా యుద్ధ ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరడంతో డాలర్ ఇండెక్స్(106.65) బలోపేతం మన కరెన్సీపై ఒత్తిడి పెంచిందని ఫారెక్స్ నిపుణులు తెలిపారు. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 84.41 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 84.51 వద్ద కనిష్టాన్ని తాకింది. క్రూడాయిల్ ధరలు పెరగడం, విదేశీ ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున పెట్టుబడులు ఉపసంహరించుకోవడం, దేశీయ ఈక్విటీ మార్కెట్ పతనం తదితర అంశాలూ ప్రతికూల ప్రభావాన్ని చూపాయి.

23,350 దిగువకు నిఫ్టీ

సెన్సెక్స్‌కు 423 పాయింట్ల నష్టం



ముంబై: అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీపై అమెరికాలో అవినీతి అభియోగాలు నమోదైనట్లు వార్తలు రావడంతో మార్కెట్ నష్టాలతో ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్లు వరుస విక్రయాలు, ఆసియా, యూరప్ మార్కెట్లలో బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 423 పాయింట్లు నష్టపోయి 77,156 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 169 పాయింట్లు కోల్పోయి 23,350 వద్ద నిలిచింది.

- సూచీల పతనంతో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.5.27 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయి రూ.425 లక్షల కోట్లకు దిగివచ్చింది.

అదానీ గ్రూప్ షేర్ల పతనం...

సౌర విద్యుత్ ప్రాజెక్టులు దక్కించుకునేందుకు అదానీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్‌లు భారత్ అధికారులకు రూ.2,200 కోట్ల లంచాలు ఇచ్చేందుకు ప్రయత్నించారని అమెరికాలోని న్యూయార్క్ కోర్టులో అభియోగాల నమోదుతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా క్షీణించాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 23%, అదానీ పోర్ట్స్ 14%, అదానీ గ్రీన్ ఎనర్జీ 19%, అదానీ గ్రీన్ సొల్యూషన్స్ 20%, అదానీ పవర్, 10%, అదానీ టోటల్ గ్యాస్ 10.50%, అదానీ విల్మార్ 10%, ఏసీసీ 8%, అంబుజా సిమెంట్స్ 13%, ఎన్‌డీటీవీ అర శాతం చొప్పున నష్టపోయాయి. షేర్ల భారీ పతనంతో గ్రూప్‌లో 10 కంపెనీల మార్కెట్ విలువ రూ.2.19 లక్షల కోట్లు హరించుకుపోయింది.

అదానీ ప్రకంపనలు

- అమెరికాలో లంచం, మోసం నేరారోపణలు
- భారత్‌లో ప్రాజెక్టుల కోసం లంచాలిచ్చినట్లు అభియోగాలు
- గౌతమ్ అదానీతో పాటు మరో ఏడుగురిపై కేసులు నమోదు
- ఖండించిన అదానీ గ్రూప్



న్యూయార్క్/న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఉదంతం నుంచి కోలుకుని, క్రమంగా పుంజుకున్న అదానీ గ్రూప్‌నకు మళ్లీ షాక్ తగిలింది. భారత్‌లో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్‌లు పొందేందుకు దాదాపు రూ. 2,200 కోట్లు (సుమారు 265 మిలియన్ డాలర్లు) లంచాలు ఇచ్చినట్లు అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. గ్రూప్ అధినేత గౌతమ్ అదానీతో పాటు మరో ఏడుగురిపై మోసం, లంచం, అవినీతి కేసులు నమోదయ్యాయి. వీరిలో ఆయన సోదరుడి కుమారుడు సాగర్ కూడా ఉన్నారు. అధిక ధరకు సౌర విద్యుత్ కొనుగోలు చేసేలా రెండు రాష్ట్రాల అధికారులకు లంచాలిచ్చినట్లు, తద్వారా 20 ఏళ్ల పాటు 2 బిలియన్ డాలర్ల మేర లాభం పొందేందుకు అదానీ తదితరులు పథకం వేసినట్లు పిటిషన్‌లో అమెరికన్ ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. వివరాల్లోకి వెడితే .. స్థానికంగా తయారైన సోలార్ సెల్స్, మాడ్యులర్ ప్లాంట్లను ఉపయోగించి ఉత్పత్తి చేసిన 8 గిగావాట్ల సౌర విద్యుత్‌ను రెండు రాష్ట్రాలకు సరఫరా చేసే కాంట్రాక్టులను అదానీ గ్రూప్ 2021లో దక్కించుకుంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వాల నిర్దేశిత ధర అంచనాలను అందుకోలేకపోయినా, లంచాలను ఆఫర్ చేసి కాంట్రాక్టులను పొందిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అదానీపై న్యూయార్క్ కోర్టులో అమెరికా న్యాయ శాఖ, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్‌ఈసీ) రెండు కేసులు వేశాయి. మొదటి దానిలో గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా ఏడుగురిపై న్యాయ శాఖ లంచం అభియోగాలు మోపింది. మరోవైపు, సెక్యూరిటీస్ చట్టాల్లో భాగమైన యాంటీ-ఫ్రాడ్ నిబంధనలను ఉల్లంఘించారంటూ గౌతమ్ అదానీ, సాగర్‌తో పాటు అజూర్ పవర్ మాజీ అధికార్ల మీద ఎస్ఈసీ ఆరోపణలు చేసింది.

ప్రాసిక్యూటర్ల కథనం ప్రకారం కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఈసీఐ) నుంచి 4 గిగావాట్ల ప్రాజెక్టును న్యూఢిల్లీ సంస్థ అజూర్ పవర్ దక్కించుకుంది. అయితే, అది లంచాల్లో తన వాటాను చెల్లించలేకపోవడంతో ఆ సంస్థ పొందిన కాంట్రాక్టుల్లో కొంత భాగాన్ని ఎస్‌ఈసీఐ ద్వారా అదానీ గ్రూప్ దక్కించుకుంది. అదానీ గ్రూప్ షేర్లలో అవకతవకలు జరుగుతున్నాయంటూ 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలు చేయడంలో గతేడాది గ్రూప్ సంస్థల మార్కెట్ విలువ భారీగా పతనమై, ఏకంగా 150 బిలియన్ డాలర్లు కరిగిపోయిన సంగతి తెలిసిందే.

కెన్యా డీల్స్ రద్దు..

అమెరికాలో చోటు చేసుకున్న పరిణామాలు అదానీ గ్రూప్‌పై ప్రభావం చూపుతున్నాయి. తమ దేశంలో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ల ఏర్పాటు కోసం అదానీ గ్రూప్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నట్లు కెన్యా అధ్యక్షుడు విలియం రుటో తెలిపారు. గ్రూప్ కంపెనీల తదుపరి రుణ సమీకరణలకు సంబంధించి తాజా పరిణామాలు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని మూడీస్ రేటింగ్స్ తెలిపింది.

జరిగిందిక్కడ.. కేసు అక్కడ.. ఎందుకంటే..

2020–2024 మధ్యలో అదానీ గ్రూప్ అమెరికా డాలర్ మారకంలో అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల నుంచి 2 బిలియన్ డాలర్లు సమీకరించింది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల గ్యారంటీతో బిలియన్ డాలర్ల పైగా విలువ చేసే సెక్యూరిటీలను జారీ చేసింది. భారత్‌లో కాంట్రాక్టులను పొందేందుకు లంచాల విషయాన్ని వెల్లడించకుండా, అమెరికన్ ఇన్వెస్టర్లకు సెక్యూరిటీలను విక్రయించిందని తాజా కేసుల్లో ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అమెరికా చట్టాల ప్రకారం తమ దేశ ఇన్వెస్టర్లు లేదా మార్కెట్లతో సంబంధాలున్న విదేశీ సంస్థలపై అవినీతి ఆరోపణలేమైనా వస్తే విచారణ చేసే అధికారాలు అక్కడి న్యాయస్థానాలకు ఉంటాయి. దానికి అనుగుణంగానే అదానీ గ్రూప్‌పై అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. అమెరికన్ ఇన్వెస్టర్లను అడ్డం పెట్టుకుని భారీ విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకునేందుకు అదానీ, ఇతర ప్రతివాదులు పథకం రచించినట్లు అటార్నీ బ్రియాన్ పీస్ వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో గౌతమ్ అదానీ సహా అదానీ ఎనర్జీ అధికారులు సాగర్ అదానీ (ఈడీ), వినీత్ ఎస్ జైన్ (సీఈవో), అలాగే అజూర్ పవర్ గ్లోబల్ మాజీ అధికారులు సిరిల్ కబానెస్.. రంజిత్ గుప్తా.. రూపేష్ అగర్వాల్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులపై(సౌరభ్ అగర్వాల్, దీపక్ మల్హోత్రా) అభియోగాలు నమోదయ్యాయి.

నిరాధార ఆరోపణలు...

తమపై వచ్చిన అభియోగాలను అదానీ గ్రూప్ ఖండించింది. ఇవన్నీ నిరాధారమైనవని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. కేసుల విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. తాజా పరిణామాల నేపథ్యంలో అదానీ గ్రీన్ ఎనర్జీ జారీ చేసిన 600 మిలియన్ డాలర్ల బాండ్ ఇష్యూని ఉపసంహరిస్తున్నట్లు తెలిపింది. అభియోగాలు వెల్లడి కావడానికి కొద్ది గంటల ముందే బాండ్ ఇష్యూ మూడు రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ కావడం గమనార్హం. అయినప్పటికీ తాజా పరిణామాలను దృష్టిలో పెట్టుకుని అమెరిన్ డాలర్ల మారకంలోని బాండ్ ఇష్యూపై ముందుకెళ్లరాదని నిర్ణయించుకున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు అదానీ గ్రీన్ ఎనర్జీ తెలిపింది. మరోవైపు, ఈ వ్యవహారంలో తమ ప్రమేయమేమీ లేదని ఎస్ఈసీఐ సీఎండీ ఆర్‌పీ గుప్తా స్పష్టం చేశారు. అదానీ కేసుల్లో ఎక్కడా తమ సంస్థ ప్రస్తావన లేదని ఆయన పేర్కొన్నారు.



సాక్షి స్పోర్ట్స్

52 ఆస్ట్రేలియా గడ్డపై ఆస్ట్రేలియాతో భారత జట్టు ఇప్పటి వరకు 52 టెస్టులు ఆడింది. ఇందులో 9 టెస్టుల్లో గెలిచింది. 30 టెస్టుల్లో ఓడిపోయింది. 13 టెస్టులు 'డ్రా'గా ముగిశాయి.

4 ఆస్ట్రేలియాలో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య 5 టెస్టు మ్యాచ్‌ల సిరీస్ జరగనుండటం ఇది నాలుగోసారి. గతంలో 1947లో, 1977లో, 1991లో రెండు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌లతో కూడిన టెస్టు సిరీస్‌ను నిర్వహించారు. ఐదు టెస్టులతో కూడిన మూడు సిరీస్‌లలోనూ ఆస్ట్రేలియా జట్టే విజేతగా నిలవడం గమనార్హం.

ఎవరిదో శుభారంభం!

నేటి నుంచి ఆస్ట్రేలియాతో భారత్ తొలి టెస్టు

ఒత్తిడిలో టీమిండియా ● ఆత్మవిశ్వాసంతో ఆసీస్

ఉదయం గం. 7:50 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో, డిస్నీ-హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'తో ఆస్ట్రేలియా కెప్టెన్ కమిన్స్, భారత సారథి బుమ్రా

క్రీడాభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సమయం వచ్చేసింది. నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' సిరీస్ ప్రారంభం కానుంది. గత రెండు పర్యాయాలు ఆస్ట్రేలియా పర్యటనలో అదరగొట్టిన టీమిండియా ఈసారీ గెలిస్తే అరుదైన 'హ్యాట్రిక్' నమోదు చేస్తుంది. 136 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై ఆస్ట్రేలియాను వరుసగా మూడు సిరీస్‌లలో ఓడించిన తొలి జట్టుగా భారత్ నిలుస్తుంది. 1888లో ఇంగ్లండ్ జట్టు మాత్రమే వరుసగా మూడు సిరీస్‌లలో ఆస్ట్రేలియాను వారి దేశంలోనే ఓడించింది. ఆ తర్వాత ఇన్నేళ్లకు భారత జట్టుకు ఈ అవకాశం లభిస్తోంది. అయితే ఈసారి భారత జట్టుకు పెద్దగా సానుకూల పరిస్థితులు కనిపించడం లేదు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో క్లీన్ స్వీప్ కావడం... తొలి మ్యాచ్‌కు రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో లేకపోవడం... గాయంతో యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ వైదొలగడం... పుజారా, రహానే వంటి టెస్టు స్పెషలిస్టులు లేకపోవడం... కోహ్లి, కేఎల్ రాహుల్ ఆటలో నిలకడలేమి... వెరసి భారత జట్టు ప్రదర్శన ఎలా ఉంటుందో అంచనా వేసే పరిస్థితి లేదు. గత రెండు పర్యాయాల్లో భారత జట్టు చేతిలో సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా ఈసారి మాత్రం అదరగొట్టే ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉంది. భారత్‌పై తొలి టెస్టు నుంచే ఒత్తిడి పెంచి ఈ సుదీర్ఘ సిరీస్‌లో శుభారంభం చేయాలనే లక్ష్యంతో కమిన్స్ బృందం ఉంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ప్రవేశ పెట్టినప్పటి నుంచి రెండుసార్లు ఫైనల్ చేరిన టీమిండియా ... ముచ్చటగా మూడోసారి తుదిపోరుకు అర్హత సాధించాలంటే ఈ సిరీస్‌ను 4–0తో గెలవాల్సి ఉంటుంది. సొంతగడ్డపై ప్రత్యర్థి కోసం పన్నిన స్పిన్ ఉచ్చులో చిక్కి కివీస్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు... పేస్‌కు సహకరించే ఆస్ట్రేలియా గడ్డపై ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందో చూడాలి!

> భారత్‌తో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' ఎంతో ప్రత్యేకమైంది. ఈసారి ఐదు మ్యాచ్‌లు ఉండటంతో దీని ప్రాధాన్యత మరింత ఎక్కువ. తొలి టెస్టు సమయంలోనే ఐపీఎల్ వేలం జరగనున్నప్పటికీ... ఆటగాళ్ల ఏకాగ్రత దెబ్బతింటుందని అనుకోవడం లేదు. వేలంలో చాలా మంది ఆసీస్ ఆటగాళ్లు ఉన్నారు. అయితే అందులో ప్లేయర్లు చేయాడానికి ఏమీ ఉండదని అందరికీ తెలుసు. స్వదేశంలో ఆడేటప్పుడు అంచనాల ఒత్తిడి ఉండటం సహజమే. భారత్ కఠిన ప్రత్యర్థి. వారిని ఎదుర్కొనేందుకు మేం బాగా సిద్ధమయ్యాం. ఐపీఎల్ సందర్భంగా భారత యువ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డితో డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నా. బంతిని స్వింగ్ చేయడంతో పాటు బ్యాటింగ్‌లో రాణించే సత్తా అతడిలో ఉంది. –ప్యాట్ కమిన్స్, ఆస్ట్రేలియా కెప్టెన్

> కెప్టెన్సీని పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తా. దాని కోసం సదా సిద్ధంగా ఉంటా. చిన్నప్పటి నుంచి సవాళ్లను ఎదుర్కోవడం అలవాటే. గతంలో నాయకత్వం చేసిన అనుభవం ఉంది. అయితే ఇది ఒక్క మ్యాచ్‌కే... రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ రెండో టెస్టు నుంచి బాధ్యతలు తీసుకుంటాడు. ఎవరి శైలి వారికి ఉంటుంది. రోహిత్, కోహ్లిని అనుకరించాలని చూడను. దేశానికి సారథ్యం వహించడం కంటే గొప్ప గౌరవం మరొకటి ఉండదు. నితీశ్ కుమార్ రెడ్డిలో ప్రతిభకు కొదవలేదు. మేనేజ్‌మెంట్‌కు అతడిపై విశ్వాసం ఉంది. కోహ్లి బ్యాటింగ్‌పై వ్యాఖ్యలు చేయను. అతడి సారథ్యంలోనే జట్టులోకి వచ్చా. జట్టులో అతడి ప్రాధాన్యత ఏంటో అందరికీ తెలుసు. –బుమ్రా, భారత కెప్టెన్



కోహ్లి, రాహుల్

పెర్త్: పోరాటతత్వానికి పెట్టింది పేరైన ఆస్ట్రేలియాతో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' సమరానికి భారత జట్టు సిద్ధమైంది. ఆనవాయితీకి భిన్నంగా ఈసారి సిరీస్‌లో ఐదు టెస్టులు నిర్వహించనుండగా... శుక్రవారం నుంచి పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఈ సిరీస్ విజయం ఇరు జట్లకు అత్యవసరం కావడంతో హోరాహోరీ పోరు సాగడం ఖాయం. గత రెండు ఆసీస్ పర్యటనల్లో (2018–19, 2020–21) సమష్టి ప్రదర్శనతో సత్తా చాటి ట్రోఫీ గెలుచుకున్న టీమిండియా... వరుసగా మూడోసారి అదే ఫలితాన్ని పునరావృతం చేయాలని చూస్తోంది. ఇటీవల సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో 0–3తో సిరీస్ కోల్పోయిన భారత జట్టు ఒత్తిడిలో కనిపిస్తోంది. గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం భారత జట్టుకు ఇదే తొలి విదేశీ టెస్టు సిరీస్ కాగా... అతడితో పాటు సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లికి ఈ పర్యటన మరింత కీలకం కానుంది. గత ఆసీస్ పర్యటనలో రాణించిన పుజారా, రహానే, షమీ, శార్దుల్ ఠాకూర్ వంటి ఆటగాళ్లు ఇప్పుడు జట్టులో లేకపోగా... యువ ఆటగాళ్లకు ఈ సిరీస్ పరీక్ష కానుంది. మరోవైపు సొంతగడ్డపై ఆసీస్ మెరుగైన సాధనతో సిద్ధంగా ఉంది.

నితీశ్ రెడ్డి అరంగేట్రం!

ఆస్ట్రేలియా పర్యటనలో రాణిస్తే అందరి దృష్టిని ఆకర్షిస్తారు. కెరీర్ తొలి నాళ్లలో సచిన్ టెండూల్కర్ 'వాకా' పిచ్‌పై శతకంతోనే మరింత పేరు ప్రఖ్యాతలు సాధించగా... 2014 ఆసీస్ టూర్‌లో కోహ్లి నాలుగు శతకాలతో చెలరేగి 'కింగ్' అనిపించుకున్నాడు. యావత్ ప్రపంచ దృష్టి సారించే ఆస్ట్రేలియా పర్యటన ద్వారా పుజారా, రిషభ్ పంత్ సాధించిన గుర్తింపు తక్కువేమీ కాదు. అలాగే ఇక్కడ విఫలం కావడంతోనే కెరీర్‌కు ముగింపు పలికిన ప్లేయర్లకూ కొదవలేదు. గతంలో దిలీప్ వెంగ్‌సర్కార్, కృష్ణమాచారి శ్రీకాంత్ ఇలాగే జట్టుకు దూరమయ్యారు. ఇప్పుడు కోహ్లి, రోహిత్, అశ్విన్ విషయంలోనూ ఇలాంటి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

24న రోహిత్ శర్మ రాక...

వ్యక్తిగత కారణాలరీత్యా ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు దూరమైన భారత రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ ఈనెల 24న జట్టుతో చేరనున్నాడు. రోహిత్ గైర్హాజరీలో తొలి టెస్టులో బుమ్రా జట్టును నడిపించనుండగా... మొదటి టెస్టు మూడో రోజు రోహిత్ టీమిండియాతో కలుస్తాడని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెల 6 నుంచి అడిలైడ్ వేదికగా ప్రారంభం కానున్న రెండో టెస్టుకు (డే అండ్ నైట్) రోహిత్ అందుబాటులో ఉండనున్నాడు.

సాధారణంగా భారత్, ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందు కనిపించే మాటల యుద్ధం ఈసారి పెద్దగా తెరపైకి రాకపోగా... తొలి టెస్టు సమయంలోనే ఐపీఎల్ వేలం జరగనుండటం... ఆసీస్ సీనియర్ల నోటికి తాళాలు వేసినట్లు కనిపిస్తోంది. తుది జట్టు ఎంపిక విషయంలో భారత జట్టుకు ఇబ్బందులు తప్పడం లేదు. రోహిత్ స్థానంలో కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్ ఆరంభించనుండగా... గాయంతో దూరమైన గిల్ స్థానాన్ని దేవదత్ పడిక్కల్ భర్తీ చేయనున్నాడు. కోహ్లి, పంత్‌తో కలిసి ధ్రువ్ జురేల్ మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయనున్నాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా నితీశ్ కుమార్ రెడ్డి, ఏకైక స్పిన్నర్‌గా అశ్విన్‌కు జట్టులో స్థానం పక్కా కాగా... తాత్కాలిక కెప్టెన్ బుమ్రా పేస్ దళాన్ని నడిపించనున్నాడు. సిరాజ్, ఆకాశ్‌దీప్, ప్రసిధ్, హర్షిత్‌లలో ఇద్దరికి తుది జట్టులో చోటు దక్కవచ్చు.

స్మిత్ అచ్చొచ్చిన స్థానంలోనే...

డేవిడ్ వార్నర్ రిటైర్మెంట్ అనంతరం సరైన ఓపెనర్ లేక ఇబ్బంది పడుతున్న ఆస్ట్రేలియా జట్టు పలు ప్రయోగాలు చేసి విఫలమైంది. టీమిండియాతో సిరీస్‌కు ముందు ఆసీస్‌కు ఆ సమస్య తీరినట్లే అనిపిస్తోంది. ఇటీవల భారత్ 'ఎ'తో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా 'ఎ'జట్టుకు సారథ్యం వహించిన నాథన్ మెక్‌స్వీనీ ఈ సిరీస్‌లో ఉస్మాన్ ఖ్వాజాతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. దీంతో స్మిత్ తనకు అచ్చొచ్చిన నాలుగో స్థానంలోనే బరిలోకి దిగనున్నాడు. లబుషేన్, ట్రావిస్ హెడ్, మిషెల్ మార్ష్, అలెక్స్ క్యారీలతో ఆసీస్ మిడిలార్డర్ పటిష్టంగా కనిపిస్తోంది. పెర్త్ పిచ్‌పై మెరుగైన గణాంకాలు ఉన్న నాథన్ లయన్ స్పిన్ బాధ్యతలు మోయనుండగా... కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్ భారత టాపార్డర్‌ను ఇబ్బంది పెట్టడానికి అస్త్రశస్త్రాలతో సిద్ధమయ్యారు.

తుది జట్లు (అంచనా)

భారత్: బుమ్రా (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, పడిక్కల్, కోహ్లి, పంత్, జురేల్, అశ్విన్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా/ప్రసిధ్ కృష్ణ, సిరాజ్/ఆకాశ్‌దీప్.

ఆస్ట్రేలియా: కమిన్స్ (కెప్టెన్), ఉస్మాన్ ఖ్వాజా, మెక్‌స్వీనీ, లబుషేన్, స్మిత్, హెడ్, మార్ష్, క్యారీ, స్టార్క్, లయన్, హాజల్‌వుడ్.

పిచ్, వాతావరణం

పెర్త్ పిచ్ పేస్‌కు, బౌన్స్‌కు ప్రసిద్ధి. మ్యాచ్‌కు రెండు రోజుల ముందు అకాల వర్షం కారణంగా పిచ్‌ను పూర్తిగా సిద్ధం చేయలేకపోయామని క్యూరేటర్ ఐజాక్ మెక్‌డొనాల్డ్ వెల్లడించగా... రెండు రోజులుగా బాగా ఎండ కాయడంతో వికెట్ పూర్వ స్థితికి చేరింది. పచ్చికతో కూడిన పిచ్‌పై తొలి రోజు ఆట కీలకం కానుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

నీ హైట్ ఏం'టీ'?

ప్రపంచంలోనే అత్యంత పొడవైన మహిళ, ప్రపంచంలోనే అత్యంత పొట్టి మహిళ తొలిసారిగా కలుసుకున్నారు. గిన్నిస్ ప్రపంచ రికార్డుల 20వ వార్షికోత్సవం సందర్భంగా లండన్‌లోని సావోయ్ హోటల్‌లో



వీళ్లిద్దరూ కలిసి టీ తాగుతూ సరదాగా మాట్లాడుకున్నారు. టర్కీలో వెబ్ డెవలపర్ అయిన 27 ఏళ్ల రుమేసా గెల్గి ప్రపంచంలోనే అత్యంత పొడవైన మహిళగా రికార్డులకెక్కారు. ఈమె ఎత్తు ఏకంగా 7 అడుగుల ఒక అంగుళం. ఇక భారత్‌కు చెందిన 30 ఏళ్ల జ్యోతి ఆమ్గే అత్యంత పొట్టి మహిళ. ఆమ్గే ఎత్తు కేవలం 2 అడుగుల 1 అంగుళం. యూఎస్ టీవీ సిరీస్ అమెరికన్ హారర్ స్టోరీలో 'మా పెటిట్' పాత్ర పోషించిన ఆమ్గేకు అకోండ్రోప్లాసియా(మరుగుజ్జుతనం వచ్చే జన్యుపరమైన వ్యాధి)తో బాధపడుతున్నారు. గెల్గికి వీవర్ సిండ్రోమ్ అనే అరుదైన వ్యాధి ఉంది. ఇది వేగంగా పెరగడానికి, వైకల్యాలకు కారణమవుతుంది. ఇలాంటివి ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకూ 27 కేసులు నిర్ధారణ కాగా, టర్కీలో మాత్రం మొట్టమొదటిది. ఎముకల్లో సాంద్రత తగ్గి ఎక్కువ సేపు నిలబడలేరు. నడవలేరు. అందుకే గెల్గి వీల్ చైర్‌ను మాత్రమే ఉపయోగిస్తారు. వాకర్‌ను ఉపయోగించి కొద్ది సేపు నిలబడగలరు. ఈ సందర్భంగా వీరిని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఐకాన్స్‌గా పేర్కొంటూ సంస్థ ప్రతినిధులు సత్కరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఆదిలాబాద్‌లో పెద్దపులి హల్‌చల్

రాంపూర్‌లో ఆవుపై దాడి

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలాల్లో గత నాలుగు రోజులుగా పెద్దపులి హల్‌చల్ చేస్తోంది. గత రెండ్రోజులుగా నార్నూర్ మండలం చోర్గావ్ గ్రామంలో తిష్టవేసి ఆవును తింటున్న దృశ్యం అటవీశాఖ అధికారులు అమర్చిన కెమెరాకు చిక్కింది. దీంతో చోర్గావ్, సుంగాపూర్, బాబేఝరి, మంజ్రి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గురువారం గాదిగూడ మండలం ఖడ్కి గ్రామం మీదుగా బుడుకుంగూడ, సావురి గ్రామం మీదుగా రాంపూర్ చేరుకుంది. వేకువజామున గిరిజన రైతు ప్రకాశ్‌కు చెందిన ఆవుపై దాడి చేసింది. కుటుంబ సభ్యులు అప్రమత్తమై చప్పుడు చేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఇదేరోజు మధ్యాహ్నం నార్నూర్ మండలం తాడిహత్నూర్ గ్రామ శివారులో పత్తి ఏరుతున్న మహిళలకు పులి కనిపించడంతో భయంతో పరుగులు తీశారు. అక్కడి నుంచి గంగాపూర్, మాన్కాపూర్ వైపు పులి వెళ్లిందని ప్రచారం జరగడంతో మాన్కాపూర్, రాజులగూడ, నార్నూర్, మహగావ్, నాగల్‌కొండ, భీంపూర్ గ్రామాల ప్రజలు అప్రమత్తం అయ్యారు. వ్యవసాయ పనులకు వెళ్లిన వారంతా మధ్యాహ్నం ఇంటిబాట పట్టారు. ఎఫ్ఎస్‌వో సుదర్శన్ ఆధ్వర్యంలో అటవీ అధికారులు బృందాలుగా విడిపోయి పులి జాడకోసం గాలిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



చోర్గావ్ గ్రామం వద్ద ఆవును తింటూ కెమెరాకు చిక్కిన పెద్దపులి

మళ్లీ పురుగుల అన్నమే!

- మాగనూర్ ప్రభుత్వ స్కూల్‌లో మారని తీరు
- ఫుడ్ పాయిజన్ అయిన మరుసటి రోజే పురుగుల అన్నం
- విద్యార్థుల ఆందోళన.. అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- డీఈఓ, ఎంఈఓ, ఇన్‌చార్జి హెచ్‌ఎంలపై సస్పెన్షన్ వేటు
- ఆర్డీఓ, ఎంపీడీఓ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు



ఆందోళనకు దిగిన మాగనూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

నారాయణపేట/జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మధ్యాహ్న భోజనం విషతుల్యమై ఒకేసారి వంద మంది విద్యార్థులు ఆస్పత్రిపాలైనా అధికారుల తీరు ఏమాత్రం మారలేదు. నారాయణపేట జిల్లా మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం కూడా అదే పురుగుల అన్నం వడ్డించారు. బుధవారం ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రుల్లో చేరిన విద్యార్థులు ఇంకా పూర్తిగా కోలుకోకముందే.. ఆ మరుసటి రోజే మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చాయి. గురువారం ఉదయం నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్వయంగా పాఠశాలను సందర్శించి వంట గది, స్టాక్ రూమ్‌లను పరిశీలించి.. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో వేర్వేరుగా మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా వండించా లని డీఈఓ అబ్దుల్ ఘనీ, ఆర్డీఓ రాంచందర్ నాయక్, ఎంపీడీఓ రహమత్ ఉద్దీన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమను ఆదేశించారు. దీంతో మాగనూర్‌లోని ఎస్సీ విద్యార్థుల వసతి గృహం నుంచి వంట మనుషులను పిలిపించి.. అన్నం, సాంబార్, కూరలు వండించి విద్యార్థులకు వడ్డించారు. ఆ అన్నంలో కూడా పురుగులు రావడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కలెక్టర్.. అదనపు కలెక్టర్ బేన్‌షాలం (రెవెన్యూ)ను పాఠశాలకు పంపారు. పురుగుల అన్నం వడ్డించింది వాస్తవమేనని అదనపు కలెక్టర్ నిర్ధారించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన కలెక్టర్.. డీఈఓ అబ్దుల్‌ఘనీపై సస్పెన్షన్ వేటు వేశారు. అంతకు ముందే ఎంఈఓ హెచ్‌ఎం మురళీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాబురెడ్డిని సస్పెండ్ చేశారు.ఆర్డీఓ రాంచందర్ నాయక్, ఎంపీడీఓ రహమత్ ఉద్దీన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వంట ఏజెన్సీ నిర్వాహకులను విధుల నుంచి తొలగించారు.

విద్యార్థులకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శ

ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రిపాలైన విద్యార్థులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్ గురువారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో కలిసి మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను కలిసి ఘటన వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ నాశనమైందని ఆరోపించారు. విషాహారం తిని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు ఇక్కడ కూడా పురుగులు ఉన్న టిఫిన్ పెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు.

సైబర్ నేరగాళ్ల 'పెళ్లి పిలుపులు'!

- ఆహ్వాన పత్రిక పేరుతో వాట్సాప్‌లో లింకులు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: సీజన్‌కు అనుగుణంగా సైబర్ కేటుగాళ్లు కొత్త పంథాలో మోసాలకు తెరదీస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఇదే అంశాన్ని వారికి అనుగుణంగా మల్చుకుని కొత్త దందా మొదలుపెట్టారు. వాట్సాప్ మెసేజ్‌లలో పెళ్లి పత్రికల పేరుతో ఏపీకే (ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ) ఫైల్స్‌ను క్రియేట్ చేసి పంపుతున్నట్టు పోలీసులు హెచ్చరించారు. తెలియని ఫోన్ నంబర్ల నుంచి ఆహ్వాన పత్రికల పేరిట ఇలాంటి మెసేజ్‌లు వస్తే వాటిలోని లింక్‌లపై క్లిక్ చేయవద్దని వారు సూచిస్తున్నారు. ఇలాంటి ఫైల్ ఓపెన్ చేయగానే సైబర్ నేరగాళ్లకు చెందిన సాఫ్ట్‌వేర్ మన ఫోన్లో ఇన్‌స్టాల్ అవడంతోపాటు మన వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, కాంటాక్ట్ నంబర్ల జాబితా సైబర్ నేరగాళ్లకు చేరుతుంది. దీంతో ఫోన్‌ను హ్యాక్ చేసి వారి చేతుల్లోకి తీసుకుంటారని, తర్వాత మన బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కొల్లగొట్టడం..డబ్బుల కోసం డిమాండ్ చేయడం వంటి ప్రమాదాలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. వాట్సాప్‌తో పాటు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌ల ఖాతాల నుంచి వచ్చే ఆహ్వాన పత్రికలు, వీడియోలు, డాక్యుమెంట్లు, లింకులు, ఏపీకే ఫైల్స్ వేటిపైనా క్లిక్ చేయవద్దని సూచించారు. ఒక వేళ పొరపాటున క్లిక్ చేస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని వారు తెలిపారు.

వసతి గృహాల్లో ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ శరత్

సాక్షి, హైదరాబాద్: వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ శరత్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపల్స్, వసతిగృహ సంక్షేమాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థులకు అందించే ఆహారంపైన ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పిల్లలకు సురక్షితమైన వేడి ఆహార పదార్థాలను వడ్డించాలని, సరుకుల కొనుగోలు నుంచి ఆహారం వండి వడ్డించే వరకు ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడొద్దన్నారు. గురుకులం హెల్త్ కమాండ్ సెంటర్ ద్వారా క్షేత్ర స్థాయి పనితీరు తరచూ పరిశీలిస్తామన్నారు. అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ప్రశ్న.. పాఠమయ్యేదెప్పుడు?

ఇప్పటికీ పాఠాలకెక్కని వెయ్యి ఉరుల చరిత్ర

గ్రూప్‌-3లో రాంజీగోండుపై ప్రశ్న



నిర్మల్‌లో రాం జీ, కుమురం భీం విగ్రహాలు

నిర్మల్‌: దేశచరిత్రలోనే అత్యంత దారుణమైన ఘటనగా జలియన్‌వాలాబాగ్‌ ఊచకోతకు పేరుంది. జనరల్‌ డయ్యర్‌ చేసిన ఈ నరమేథాన్ని దేశం ఇప్పటికీ గుర్తుపెట్టుకుంది. కారణం మన చరిత్రపుటల్లో ఈ ఘటనకు..కారకులకు..అమరులకు చోటిచ్చారు కనుక. కానీ.. జలియన్‌వాలాబాగ్‌ ఘటన కంటే దాదాపు 60 ఏళ్లకిందట అంతకంటే దారుణమైన మారణహోమం మనరాష్ట్రంలోనే చోటుచేసుకుంది. ఒకేసారి వెయ్యిమందిని అత్యంత కిరాతకంగా కాళ్లూచేతులు విరగ్గొట్టి, ఒకే మర్రిచెట్టుకు ఉరితీసి చంపేశారు. ఈ దారుణ మారణకాండ గురించి దేశానికి కాదు.. కనీసం ఆ జిల్లాలోనే ఇప్పటికీ చాలామందికి తెలియదంటే అతిశయోక్తి కాదు. మరో దారుణమేమంటే.. అసలు ఎక్కడా.. ఏ చరిత్రపుటల్లో.. ఏ పుస్తకంలో.. ఏ పాఠంలో.. చెప్పని ఆ చారిత్రక ఘటన గురించి ఇటీవల నిర్వహించిన గ్రూప్‌-3 పరీక్షలో ఓ ప్రశ్నగా అడిగారు. తెలంగాణ చరిత్రను ఆసాంతం చదివిన వారికి ఎక్కడో ఓ చోట రాసిన విషయం గుర్తుంటే తప్ప.. సమాధానం ఇవ్వలేరు. వెయ్యిమంది వీరుల త్యాగం పాఠ్యాంశంగా అందించాలన్న డిమాండ్‌ ఉంది.

ఏంటా ప్రశ్న...


తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ ఇటీవల నిర్వహించిన గ్రూప్‌-3 పరీక్షలో రాంజీగోండుకు సంబంధించి అడిగారు. రెండవ పేపర్‌లో 18వ శతాబ్దంనాటి రాంజీగోండు తన బృందంతో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని ఆసిఫాబాద్‌ ప్రాంతం నుంచి నిర్మల్‌ వరకు తన ప్రాబల్యాన్ని పెంచుకొని, బ్రిటిష్‌ వారికి



వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం, చివరకు వెయ్యిమంది సైన్యంతో కలిసి ఉరికొయ్యలకు బలికావడం తదితర అంశాలపై ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు చాలామంది సరైన సమాధానాలు రాయలేకపోయామని చెప్పారు. ఇందుకు కారణం రాంజీగోండు, వెయ్యి ఉరుల మర్రి ఘటన గురించి చిన్నప్పటి నుంచి ఏ పాఠ్యపుస్తకంలో చదవకపోవడమే.

ఎక్కడ ఆ ఘటన.. ఎవరా రాంజీ !

1857లో జరిగిన ప్రథమ స్వాతంత్య్ర సంగ్రామ సమయంలోనే వెలుగులోకి వచ్చిన ఆదివాసీ వీరుడు రాంజీగోండు. గోండురాజుల వంశానికి చెందిన రాంజీ అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్, గోండ్వానా రాజ్యంలో చెల్లాచెదురుగా ఉన్న వారందరినీ ఏకం చేశాడు. పరాయిదేశం నుంచి వచ్చి భరతమాతను బంధించిన ఆంగ్లేయులపై, స్వదేశంలో ఉంటూ వారికి తొత్తులుగా ఉన్న నిజాం రాజులపైనా పోరాడాలని పిలుపునిచ్చాడు. ఇందుకు గోదావరి తీరంలో చుట్టూ దట్టమైన అడవులు, గుట్టలతో ఉన్న నిర్మల్‌ ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. ప్రథమ సంగ్రామంలో పాల్గొన్న రొహిల్లాలు.. ఈ ఆదివాసీ వీరులకు తోడుకావడంతో నెలల తరబడి ఆంగ్లేయులను ముప్పతిప్పలు పెట్టారు. తమ వద్ద సరైన బలగాలు, మందుగుండు సామగ్రి, ఆయుధాలు లేకున్నా.. రాంజీ సారథ్యంలో గెరిల్లా తరహా పోరు సల్పారు. కొరకరాని కొయ్యగా మారిన గోండువీరులను శత్రువులు దొంగదెబ్బ తీశారు. రాంజీ సహా వెయ్యిమంది వీరులను బంధించారు. మరోసారి ఇలాంటి తిరుగుబాటు చేయడానికి కూడా ఎవరూ సాహసించొద్దని ఆ వీరులను అత్యంత దారుణంగా హింసించారు.



తెలంగాణతల్లి రూపశిల్పి బీవీఆర్‌చారి గీసిన వెయ్యిఉరుల మర్రిచిత్రం

ఒకే మర్రిచెట్టుకు.. వెయ్యిమంది

1860, ఏప్రిల్‌ 9న నిర్మల్‌ నుంచి ఎల్లపెల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న పెద్ద మర్రిచెట్టుకు ఈ వెయ్యిమంది వీరులను ఒకేసారి ఉరితీశారు. అలా వారంతా మాతృభూమి కోసం ఉరికొయ్యలను ముద్దాడారు. ఇంతటి పోరాటాన్ని సాగించిన రాంజీగోండు, వెయ్యిమంది వీరుల చరిత్ర దశాబ్దాలపాటు కనీసం బయటకు రాలేదు. ఇప్పటికీ ఈ దారుణ మారణకాండ గురించి ఎక్కడా చరిత్రలో, పాఠ్య పుస్తకాల్లోకి ఎక్కలేదు. 2021 సెప్టెంబర్‌ 17న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా నిర్మల్‌ వచ్చి వెయ్యిమంది అమరులకు నివాళులర్పించారు. అయితే ఇప్పటికీ నిర్మల్‌లో వారి స్మారకార్థం ఎలాంటి చర్యలు చేపట్టలేదు.



నిర్మల్‌ జిల్లాకేంద్రంలో వెయ్యిమంది వీరుల స్మారకస్థూపం

ముందుతరాలకు తెలిసేలా..



నిర్మల్‌ జిల్లాకేంద్రంలో ఎప్పుడో 1857-60లోనే జరిగిన వెయ్యి ఉరులమర్రి ఘటనను ఇప్పటికీ బయటకు తీయకపోవడం దారుణం. ఇలాంటి ఘటనను ముందుతరాలకు తెలిపేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

-థోంటి శ్రీనివాస్, చరిత్రకారుడు

పాఠ్యాంశంగా పెడితే...



వెయ్యి ఉరుల మర్రి ఘటన గురించి పాఠ్యాంశంగా పెట్టడంతోపాటు విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిన అవసరముంది. అప్పుడే ఇలాంటి ఘటనలపై అడిగే ప్రశ్నలకు సమాధానాలివ్వగలుగుతారు.

- డాక్టర్ కట్కం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్

పార్టీలో మహిళలకు ప్రాధాన్యం

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌



సాక్షి, హైదరాబాద్‌: కాంగ్రెస్‌ పార్టీలో మహిళలకు తగిన ప్రాధాన్యం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ స్పష్టం చేశారు. కష్టపడిన ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని, మహిళా కాంగ్రెస్‌ నేతలకు ప్రభుత్వ పదవుల్లో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అధ్యక్షతన గురువారం రాష్ట్ర కార్యవర్గ భేటీ జరిగింది. సమావేశంలో మహేశ్‌గౌడ్‌ మాట్లాడుతూ పలువురు మహిళా నేతలకు ఇప్పటికే కార్పొరేషన్‌ చైర్మన్‌ పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, మార్కెట్‌ కమిటీల్లో మహిళలకు తగిన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షులు పాల్గొన్నారు.

'మొసలి కన్నీళ్లు కార్చడం ఎబ్బెట్టుగా ఉంది'

సాక్షి, హైదరాబాద్‌: అక్రమ సంపాదన కోసం మద్యం ఒప్పందాలు కుదుర్చుకుని.. ఎన్నో కుటుంబాలను విచ్ఛిన్నం చేసిన వారు మొసలి కన్నీళ్లు కార్చడం ఎబ్బెట్టుగా ఉందని బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్‌ శిల్పారెడ్డి వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీని ఉద్దేశించి గురువారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన ట్వీట్‌పై ఎక్స్‌ వేదికపై శిల్పారెడ్డి స్పందించారు. 'పొంతన లేని కేసుల మధ్య పోలిక పెట్టి మీ తప్పును కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నం స్పష్టంగా అర్థమవుతోంది'.. అని విమర్శించారు. 'మోదీ ప్రభుత్వం చట్టప్రకారం నడుచుకుంటుంది. తప్పు చేసిన వాళ్లకు శిక్ష తప్పదు. ఇంకెప్పుడు బీఆర్‌ఎస్‌ దేశాన్ని అవమానించడం మానుకుంటుంది? కవితక్కా... జైల్లో ఏమీ నేర్చుకోలేదా?' అని శిల్పారెడ్డి ఎద్దేవా చేశారు.

27, 28 తేదీల్లో 'మత్తు' నిరోధక వ్యూహాలపై శిక్షణ

సాక్షి, హైదరాబాద్‌: యువతలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై పలు యూనివర్సిటీలు, ప్రొఫెషనల్‌ కళాశాలల సిబ్బందికి తెలంగాణ యాంటీ నార్కోటిక్స్‌ బ్యూరో ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈనెల 27, 28 తేదీల్లో జూబ్లీహిల్స్‌లోని డాక్టర్‌ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

టెట్‌కు 2.75 లక్షల దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్‌: ఉపాధ్యాయ అర్హత పరీక్ష 'టెట్‌'గడువు ముగిసే నాటికి మొత్తం 2,75,773 దరఖాస్తులు వచ్చినట్టు విద్యాశాఖ వెల్లడించింది. ఇందులో పేపర్‌-1కు 94,335, పేపర్‌-2కు 1,81,438 దరఖాస్తులు వచ్చాయని తెలిపింది.



ఫోరెన్సిక్‌ సైన్స్‌ ల్యాబొరేటరీ పనితీరు భేష్‌

కేంద్ర మంత్రి బండి సంజయ్‌

సాక్షి, హైదరాబాద్‌: దేశంలో ఎక్కడ ఎలాంటి నేరాలు జరిగినా నిందితులను పట్టుకునేందుకు దోహదపడే వ్యవస్థ సెంట్రల్‌ ఫోరెన్సిక్‌ సైన్స్‌ ల్యాబొరేటరీ (సీఎఫ్‌ఎస్‌ఎల్‌) అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ చెప్పారు. హత్యలు, అత్యాచారాలు, దొంగతనాలతోపాటు నార్కోటిక్, సైబర్, మనీ లాండరింగ్‌ నేరాలకు పాల్పడిన నిందితులను గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో సీఎఫ్‌ఎస్‌ఎల్‌ను తీర్చిదిద్దిందన్నారు. గురువారం ఆయన రామంతాపూర్‌లోని సెంట్రల్‌ ఫోరెన్సిక్‌ సైన్స్‌ ల్యాబొరేటరీ (సీఎఫ్‌ఎస్‌ఎల్‌), నేషనల్‌ సైన్స్‌ ఫోరెన్సిక్‌ ల్యాబొరేటరీ (ఎన్‌ఎస్‌ఎఫ్‌ఎల్‌), సెంట్రల్‌ డిటెక్టివ్‌ ట్రైనింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌ (సీడీటీఐ) సంస్థలను బండి సంజయ్‌ సందర్శించారు. క్లిష్టమైన కేసుల పరిష్కారంలో అనుసరిస్తున్న విధానాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. దక్షిణ భారత దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఈ సంస్థలు హైదరాబాద్‌లో ఉండటం గర్వకారణమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ పాల్గొన్నారు.

త్వరలో నాయకత్వ మార్పు

బీజేపీ నేత ప్రభాకర్‌ జోస్యం

సాక్షి, హైదరాబాద్‌: మహారాష్ట్ర, జార్ఖండ్‌ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక.. తెలంగాణ కాంగ్రెస్‌ ప్రభుత్వంలో నాయకత్వ మార్పు తథ్యమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ జోస్యం చెప్పారు. అందుకే తన పదవిని కాపాడుకునేందుకు.. సోనియా గాంధీని ప్రసన్నం చేసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నానారకాలుగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. సోనియా దేవతని.. ఆమె కాళ్లు కడిగి నీళ్లు నెత్తిమీద జల్లుకోవాలని.. రాహులే దేశానికి సర్వస్వమని భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ నిత్యం కాంగ్రెస్‌ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకోవడం, కప్పం కట్టడంతోనే రేవంత్‌ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తమ భూములను ఎక్కడ గుంజుకుంటుందో, ఇల్లు కూలగొడుతుందో అనే భయంతో ప్రజలు ఉన్నారన్నారు. .





జాతీయవాద మేధావుల సమ్మేళనం లోక్‌మంథన్‌-2024లో భాగంగా హైదరాబాద్‌లోని శిల్పారామంలో ప్రజ్ఞా ప్రవాహ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు రోజుల ఎగ్జిబిషన్‌లో ఓ కళాకృతిని ఆసక్తిగా చూస్తున్న విద్యార్థినులు. (ఇన్‌సెట్‌లో) ఎగ్జిబిషన్‌ సందర్శనకు వచ్చిన చిన్నారులు

వాటా ప్రకారం అక్రెడిటేషన్లు ఇవ్వాలి

- మీడియా అకాడమీ చైర్మన్‌కు మహిళా జర్నలిస్టుల వినతి

సాక్షి, హైదరాబాద్‌: మహిళా జర్నలిస్టులకు తమ వాటా ప్రకారం అక్రెడిటేషన్లు ఇచ్చే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని, మీడియా సంస్థల్లో వృత్తి పరంగా మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్‌ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) మహిళా సంక్షేమ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం బీఆర్‌కేఆర్‌ భవన్‌లో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌ కె.శ్రీనివాస్‌రెడ్డిని మహిళా సంక్షేమ కమిటీ ప్రతినిధులు కళ్యాణం రాజేశ్వరి, అత్తలూరి అరుణ, అజిత, వంగ యశోద, సూర్యకుమారి, ప్రతిభ, సాజిదా బేగం తదితరులు కలసి వినతిపత్రం సమర్పించారు. ప్రతీ మీడియా సంస్థలో మహిళలకు 33 శాతం అక్రెడిటేషన్లు ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పటికీ పలు మీడియా సంస్థలు దానిని అమలు చేయడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రతి మీడియా సంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అది కూడా అమలు కావడం లేదని వారు విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మహిళా జర్నలిస్టుల భద్రత, ఇతర సమస్యల పరిష్కారానికి మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ఎస్‌హెచ్‌జీ మహిళలు సంఘటితశక్తిగా ఎదగాలి

- సెర్ప్‌ సీఈవో దివ్య దేవరాజన్‌

సాక్షి, హైదరాబాద్‌: స్వయం సహాయక సంఘాల్లోని (ఎస్‌హెచ్‌జీ) మహిళలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా నిజమైన సంఘటితశక్తిగా ఎదగాలని సెర్ప్‌ సీఈవో దివ్య దేవరాజన్‌ కోరారు. యూసుఫ్‌గూడలోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఫర్‌ మైక్రో, స్మాల్‌ మీడియం ఎంటర్‌ప్రైజెస్‌ ప్రాంగణంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌ మహిళా అభివృద్ధి సొసైటీ (ఏపీ మాస్‌) ఆధ్వర్యంలో స్వయం సహాయక సమాఖ్యల జాతీయ సమ్మేళనం ప్రారంభమైంది. ఈ సందర్భంగా దేవరాజన్‌ మాట్లాడుతూ పిల్లలకు పోషకాహారం అందించడంపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. కాగా సదస్సు శుక్రవారం కూడా జరగనుంది. సమ్మేళనానికి తెలంగాణ, ఏపీతో సహా 22 రాష్ట్రాల నుంచి 200 మంది ఎస్‌హెచ్‌జీ ప్రతినిధులు, అభివృద్ధిరంగ నిపుణులు, బ్యాంకర్లు, ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఎస్‌హెచ్‌జీ సమాఖ్యలు, ఫార్మర్‌ ప్రొడ్యూసర్‌ ఆర్గనైజేషన్స్‌ బలోపేతం, సుస్థిర అభివృద్ధి దాయక పారిశ్రామిక, వ్యాపార సంస్థలుగా రూపొందడం'అనే అంశంపై ఏపీ మాస్‌ సీఈవో సీఎస్‌ రెడ్డి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉత్తమ ప్రదర్శన, పనితీరును కనబరిచిన స్వయంసహాయక సంఘాలు, డ్వాక్రా గ్రూపులకు శుక్రవారం జాతీయ పురస్కారాలను అందజేయనున్నారు.

ఒకే తొడిమకు 8 మిరప కాయలు

చిల్పూరు: మిరప మొక్క ఒకే తొడిమకు 8 కాయలు కాసింది. జనగామ జిల్లా చిల్పూర్‌ మండలం ఫత్తేపూర్‌ జీపీ పరిధి శ్రీ బండలగట్టు శివగంగేశ్వరి ఆలయ నిర్మాణదాత, అర్చకుడు వేల్పుల లక్ష్మీగట్టయ్య రోజు మాదిరిగానే గురువారం మొక్కలకు నీరు పోశారు. ఈ సందర్భంగా అక్కడి మిరప చెట్టును పరిశీలించగా.. ఒకే తొడిమకు ఎనిమిది కాయలు కనిపించాయి. కాగా ఆ చెట్టుకు భక్తులు పూజలు చేశారు.



సచివాలయంలో పచ్చదనం

సాక్షి, హైదరాబాద్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ తెలంగాణ సచివాలయంలోని అన్ని ఫ్లోర్లలో పచ్చదనం ఉండేలా అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చర్యలు తీసుకుంటున్నారు. సచివాలయానికి వచ్చే సందర్శకులకు ఆహ్లాదం పంచేలా.. ముఖ్యమంత్రి, మంత్రులు, ఆయా పేషీల ముందు మొక్కలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా గురువారం మంత్రి కొండా సురేఖ కార్యాలయం, పేషీ ముందు హెచ్‌ఎండీఏ అధికారులు పలు రకాల మొక్కలను ఏర్పాటు చేశారు.



అటవీ అగ్నిప్రమాదాల నివారణలో ఎన్‌డీఆర్‌ఎఫ్‌ భాగస్వామ్యం

సాక్షి, హైదరాబాద్‌: తమ దళాలు కూడా అట వీ అగ్నిప్రమాద నివారణ చర్యల్లో భాగస్వా మ్యం అవుతున్నాయని ఎన్‌డీఆర్‌ఎఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ జనరల్‌ నరేంద్రసింగ్‌ బుందేలా వెల్లడించారు. ఇందుకోసం ఎన్డీఆర్‌ఎఫ్‌ ప్రత్యేకంగా మూడు దళాలను ఏర్పాటు చేసిందని, విజయవాడ కేంద్రంగా ఒక దళం పనిచేస్తున్నదని తెలిపారు. కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ ఐజీ రాజేశ్‌ మాట్లాడుతూ, దేశం మొత్తంగా చూస్తే గతేడాది ఉత్తరాఖండ్‌ రాష్ట్రంలో ఎక్కువగా ఈ ప్రమాదాలు జరిగినట్లుగా తెలిపారు. అటవీ అగ్నిప్రమాదాలు- నివారణ చర్యలు -అందు కు ఉపయోగించే పరికరాలు(రీ డిజైనింగ్‌ ఆఫ్‌ ఫారెస్ట్‌-ఫైర్‌ ఫైటింగ్‌ టూల్స్, ఎక్విప్‌మెంట్‌) అంశంపై ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఫారెస్ట్‌ మేనేజ్‌మెంట్‌ (ఐఐఎఫ్‌ఎం) ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన అటవీ శాఖ అధికారుల రెండు రోజుల వర్క్‌షాప్‌ గురువారం ఇక్కడ ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా అటవీప్రాంతాల్లో అగ్నిప్రమాదాల తీరు తెన్నులపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పీసీసీఎఫ్‌ ఆర్‌ఎం డోబ్రియాల్‌ మాట్లాడుతూ, అటవీ ప్రాంతాల్లో మానవ తప్పిదాలతోనే అధికశాతం అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

మీడియా పాయింట్

స్టీల్ ప్లాంట్‌పై సర్కారుకు స్పష్టత లేదు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



సాక్షి,అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో ప్రభుత్వం చెబుతున్న సమాధానంపై స్పష్టత లేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆక్షేపించారు. గురువారం ఆమె అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ప్రైవేటీకరణ లేదంటూనే కూటమి ప్రభుత్వం అడుగులు మాత్రం అటువైపే పడుతున్నాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల జీతాలు కూడా నిలిపివేశారని, గతంలో 4,000 మంది ఉద్యోగులను తొలగించాలని చూస్తే వారు తిరగబడటంతో వారి నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని చెప్పారు. 500 మందిని డిప్యూటేషన్ పై పంపాలని చూస్తున్నారని.. కొంతమందిని వీఆర్ కు వెళ్లాలని ప్రతిపాదన చేశారని తెలిపారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కూటమి ప్రభుత్వ ఎంపీలపై ఆధారపడి ఉంది కాబట్టి కేంద్రానికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ డెడ్ లైన్ పెడితే ఈ విషయంలో కేంద్రం కచ్చితంగా వెనక్కి తగ్గుతుందని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో వెనక్కి తగ్గకపోతే మద్దతు తాముఉపసంహరించుకుంటామని చంద్రబాబు, పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు.

పనివేళల పెంపు ఏకపక్ష నిర్ణయం



రాష్ట్రంలో పాఠశాలల పనివేళ లు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులను, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలను సంప్రదించకుండా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుంది. 9 నుంచి 4 గంటల వరకు ఉండే పాఠశాలల పనివేళల సమయం చక్కగా ఉండేది. ఇప్పుడు 5 గంటల వరకు పెంచడం వల్ల చాలామంది విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి. దూరప్రాంతాల నుండి స్కూళ్లకు వచ్చే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం పై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. ప్రభుత్వం నిర్ణయంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా గందరగోళానికి గురవుతున్నారు. – ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

సీఎంకు కృతజ్ఞతలు



కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై సీఎం చంద్రబాబుకు రాయలసీమ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం. గత ప్రభుత్వంలో రాయలసీమకు ఏ ఒక్క మంచి పని చేసింది లేదు. గత ముఖ్యమంత్రి రాయలసీమ ప్రజల మనోభావాలు పట్టించుకున్నది లేదు. జిల్లాలను, జోన్లను విభజించి ప్రజల మధ్య విద్వేషాలు రగిలించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాయలసీమకు మంచి రోజులు వచ్చాయి. ప్రజల అభీష్టానికి అనుగుణంగా సీఎం చంద్రబాబు నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్నారు.

– మంత్రి రాంప్రసాద్ రెడ్డి

సీమ ప్రజల మనోభావాలకు పెద్దపీట



కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ లకు రాయలసీమ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం. రాయలసీమ ప్రజల మనోభావాలకు పెద్దపీట వేస్తూ హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. సీమ ప్రజలకు అన్ని విధాలుగా అన్యాయం చేసి జగన్ రాయలసీమ ద్రోహిగా నిలిచారు. కానీ సీమ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేసుకుంటూ ఎన్డీఏ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. – మంత్రి ఎస్. సవిత

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని కోరాం. గ్రూప్ 1, గ్రూప్ 2, పోలీసులు, అధ్యాపకులు, లైబ్రరీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరాం. ఏపీపీఎస్సీని మరింత పటిష్టం చేయాలని కోరుతూ వాయిదా తీర్మానం ఇచ్చాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై సభలో చర్చ జరిగింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం మొదటిదోషి. గత, ప్రస్తుత ప్రభుత్వాలు కూడా ఈ విషయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములే. విశాఖ ఉక్కును అమ్మేస్తారా? ప్రైవేటీకరణ చేసేస్తారా? అని అడిగాం. ప్రైవేటీకరణ చేసే ఉద్దేశం లేదని సభలో మంత్రి స్పష్టత ఇచ్చారు. ప్రజలు, రైతుల భూ సర్వేలకు సంబంధించి జరిగిన, జరుగుతున్న అవకతవకలను సరిచేయాలని కోరాం. –ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు

సమానాభివృద్ధే లక్ష్యం



గతంలో వైఎస్ జగన్ ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ, ప్రజల మధ్య గొడవలు క్రియేట్ చేసే విధంగా 3 రాజధానులు ప్రకటించి ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. సీఎం చంద్రబాబు పరిశ్రమలతో పాటు హంద్రీనీవా విషయంలో, హైకోర్టు బెంచ్ విషయంలో చెప్పిన విధముగా రాయలసీమ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేర్చే క్రమంలో హైకోర్టు బెంచ్ ని ఏర్పాటు చేసే దిశగా తీర్మానం చేయడం రాయలసీమ ప్రజా ప్రతినిధులుగా మేమంతా హర్షం వ్యక్తం చేస్తున్నాం. – ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు

ప్రభుత్వ డాక్టర్లకు భద్రత కల్పించాలి



రాష్ట్ర శాసన మండలిలో వలంటీర్లపై చర్చకు అనుమతించాలని కౌన్సిల్ చైర్మన్ వారిని కోరగా వారు అందుకు అంగీకరించలేదు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లు, సిబ్బందికి తగిన భద్రత కరువైంది. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లు, ఇతర సిబ్బందికి తగిన భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది.

– ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

అబద్ధమని నిరూపిస్తే రాజీనామా



మండలిలో టూరిజంకు సంబంధించి చర్చ జరిగింది. కొత్త టూరిజం పాలసీ ద్వారా ఓబెరాయ్ తదితర మల్టీ నేషనల్ కంపెనీలకు భూములు ఇస్తామని మంత్రి చెప్పారు. మరి ఎన్నికల హామీల్లో భాగంగా చెప్పిన 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అంశాలను ఏం చేస్తారని మేము అడిగాం. ఏ ఏ ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయో పరిశీలన చేయాలని కోరాం. టెంపుల్, అడ్వెంచర్, ఎకో టూరిజంలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరాం. టెంపుల్ టూరిజంలో రాష్ట్రానికి చెందిన నిరుద్యోగ ఎంటర్ ప్రెన్యూర్స్ కు అవకాశం ఇవ్వాలని అడిగాం. జామైల్ అటవీ భూములకు సంబంధించి జరిగిన టెండర్లలో రూ.200 కోట్ల స్కామ్ జరిగింది. ఇది అబద్ధమని నిరూపిస్తే నా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తాను.

– ఎమ్మెల్సీ తూమాటి


100 మీటర్ల లోపే మద్యం దుకాణాలా?



మండలిలో నూతన మద్యం పాలసీపై చర్చ జరిగింది. జాతీయ రహదారులకు 200 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలని ప్రభుత్వాన్ని కోరాం. గతంలో 100 మీటర్ల దూరం అమలు జరిగింది. కానీ కొన్నిచోట్ల ఆ 100 మీటర్లకు లోపే మద్యం దుకాణాలు పెడుతున్నారు. దీనితో డ్రైవర్లు మద్యానికి ఆకర్షితులై రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. బడులు, గుడులు దగ్గర కూడా కొత్త మద్యం దుకాణాలు పెడుతున్నారు. వీటిని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయాలని అంటున్నారు. టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేయాలని మేము ప్రభుత్వాన్ని కోరాం.

– ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

గ్రానైట్ క్వారీల్లో రాబందులు



విలువ రూ.20 కోట్లు..

బాపట్ల జిల్లా బల్లికురవలో ఆక్రమణల పర్వం

- మాజీ మంత్రి క్వారీలో మంత్రి అనుచరుల అక్రమ తవ్వకాలు
- ప్రతీకారంతో మైనింగ్ మొదలు పెట్టినట్లు సమాచారం
- మంత్రి కబ్జా పర్వంపై ప్రభుత్వ పెద్దల ఆరా
- ఇప్పటిదాకా 4 వేల మీటర్ల తవ్వకాలు
- మంత్రిగారి అక్రమ తవ్వకాలపై టీడీపీలో తీవ్ర చర్చ
- మంత్రి కావడంతో భయంతో మిన్నకుండి పోయిన మాజీ మంత్రి
- వేధింపులతో కారణంతో కూటమిలో చేరే ప్రయత్నం
- దానిని కూడా మంత్రి అడ్డుకుంటున్నారని ప్రచారం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లాలోని బల్లికురవ ప్రాంతంలో గ్రానైట్ క్వారీల్లో ఆక్రమణల పర్వం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. కూటమి అధికారంలోకి రాగానే టీడీపీకి చెందిన కొందరు గ్రానైట్ క్వారీల యజమానులు అధికారాన్ని అడ్డుపెట్టి పక్కనున్న క్వారీలను కబ్జాచేసి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రి.. ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ మంత్రి క్వారీపై కన్నేసి అక్రమ తవ్వకాలకు పాల్పడటం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. మంత్రిగారి కబ్జాతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న మాజీమంత్రి తన క్వారీ ఆక్రమణ వ్యవహారాన్ని బహిర్గంచేసి సన్నిహితులవద్ద వాపోతున్నారు. అంతేకాక క్వారీని కాపాడుకునేందుకు ఏకంగా తానున్న పార్టీని వదలి టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ వ్యవహారం అటు అధికార పార్టీ పెద్దల వద్దకు సైతం చేరడం మరింత చర్చనీయాంశమైంది.

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రి అధికారాన్ని అడ్డుపెట్టి తన క్వారీల చుట్టుప్రక్కల ఉన్న గ్రానైట్ క్వారీలను కబళిస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ మండలం మల్లాయిపాలెం వద్ద మంత్రిగారి గ్రానైట్ క్వారీ పక్కనే ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మాజీమంత్రి క్వారీ ఉంది. ఎన్నికల ఫలితాలు వెలువడే నాటికి మాజీ మంత్రి ప్రతిపక్ష పార్టీలో ఉండటంతో ఇదే అవకాశంగా మంత్రి ఆయన క్వారీపై కన్నేసి క్వారీలో చొరబడి అక్రమ తవ్వకాలు మొదలుపెట్టారు. ముఖ్యమంత్రి సామాజికవర్గానికి చెందిన మంత్రి కావడంతో తన క్వారీని చెరబట్టినా మాజీ మంత్రి నిస్సహాయ స్థితిలో ఉండి పోయారు. దీంతో మంత్రి అనుచరులు తవ్వకాలు వేగవంతం చేశారు. గడచిన ఐదు నెలల్లో రూ.20 కోట్ల విలువైన 4 వేల మీటర్ల రాయిని తవ్వితీసి అమ్మకానికి పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికీ మాజీమంత్రి క్వారీలో అక్రమతవ్వకాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని మాజీమంత్రి తన పరిచయస్తులందరి వద్ద మొరపెట్టుకున్నారు. ఆయనకూడా గతంలో టీడీపీ నుంచే మంత్రిగా పనిచేయడంతో ఆ పార్టీలో ఉన్న తన సన్నిహిత నేతలకూ మంత్రి ఆగడాలను వివరించినట్లు తెలుస్తోంది.

ప్రతీకారంతోనే తవ్వకాలు..

గత ప్రభుత్వంలో మాజీమంత్రి తమ క్వారీని ఆక్రమించి అక్రమంగా తవ్వకాలు జరిపారని, అందుకు ప్రతిగా ఇప్పుడు సదరు మాజీమంత్రి క్వారీని ఆక్రమించి గ్రానైట్ తవ్వుకుంటున్నామని మంత్రి అనుచరులు ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రిగారి దోపిడీని నిలువరించలేక మాజీ మంత్రి తానున్న ప్రతిపక్ష పార్టీని వీడి టీడీపీలో చేరేందుకు ప్రయత్నించగా మంత్రి అడ్డుకున్నట్లు సమాచారం. దీంతో మాజీ మంత్రి ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ద్వారా టీడీపీలో చేరేందుకు పావులు కదిపారు. చంద్రబాబును కలువడంతో పాటు ఇటీవల సంభవించిన వరదల నేపథ్యంలో ముఖ్యమంత్రికి తనవంతుగా విరాళాలు సైతం ఇచ్చారు. దీంతో త్వరలోనే మాజీ మంత్రి టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రిగా తన ప్రమేయం లేకుండా మాజీ మంత్రిని సీఎం వద్దకు ఎలా తీసుకవస్తావంటూ మంత్రి టీడీపీ ఎమ్మెల్యేను నిలదీసినట్లు తెలుస్తోంది. మాజీ మంత్రిని టీడీపీలోకి రాకుండా అడ్డుకునేందుకు మంత్రికి పలు కారణాలున్నట్లు అధికార పార్టీలో చర్చసాగుతోంది. మంత్రి రాజకీయ ప్రత్యర్థులకు మాజీ మంత్రి సన్నిహితంగా ఉండటం, ఆయనను పార్టీలోకి రాకుండా అడ్డుకొని గ్రానైట్ క్వారీని వశం చేసుకోవడంతోపాటు ఆర్థికంగా బలవంతుడైన మాజీమంత్రి టీడీపీలో చేరితే భవిష్యత్తులో ప్రకాశం జిల్లాలోని దర్శి సీటు ప్రస్తుతం మంత్రి సోదరి నుంచి చేజారే అవకాశం ఉండడంతో మాజీ మంత్రిని టీడీపీలో చేరకుండా మంత్రి అడ్డుకుంటున్నట్లు సమాచారం. రాజకీయాల సంగతి దేవుడెరుగు ఉన్న గ్రానైట్ క్వారీని మంత్రి కబంధ హస్తాల నుంచి కాపాడుకునేందుకు వీలయినంత త్వరగా టీడీపీలో చేరడమే ఏకైక మార్గమని భావిస్తున్న మాజీ మంత్రి... ఆ దిశగా ప్రయత్నాలు వేగవంతం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మంత్రి గ్రానైట్ క్వారీ అక్రమ తవ్వకాలపై ప్రభుత్వ పెద్దలు ఆరా తీసినట్లు తెలుస్తోంది.

మానవ హక్కులను హరిస్తూ.. అక్రమ కేసులతో వేధిస్తూ..



సోషల్ మీడియా యాక్టివిస్టులపై కూటమి ప్రభుత్వ దాష్టీకం

- ఒక్కొక్కరిపై లెక్కకుమించి అక్రమ కేసులు
- పలు పోలీస్‌స్టేషన్లు, జైళ్లు చుట్టూ తిప్పుతూ వేధింపులు
- అక్రమ నిర్బంధాలపై కోర్టును ఆశ్రయిస్తే మరింతగా కక్షసాధింపు
- ప్రభుత్వ కుట్రకు కొమ్ముకాస్తూ పేట్రేగిపోతున్న పోలీసులు
- ఇదీ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ దమననీతి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ అధికారిక గూండాగిరి వెర్రితలలు వేస్తోంది. సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులతో రోజురోజుకీ మరింతగా పేట్రేగిపోతోంది. ఉగ్రవాదులపట్ల కూడా వ్యవహరించనంత కాఠిన్యంతో పోలీసులు కక్షపూరితంగా వ్యవహరిస్తూ మానవ హక్కులను నిర్భీతిగా కాలరాస్తున్నారు. ఒక్కొక్కరిపై నాలుగైదు అక్రమ కేసులు బనాయిస్తూ అరెస్టుచేస్తున్న పోలీసులు వారు రిమాండ్‌లో ఉండగానే వారికి తెలియకుండానే మరిన్ని కేసులు పెడుతున్నారు. అరెస్టయిన వారిని రాష్ట్రంలోని జైళ్లకు తిప్పుతూ వారి కుటుంబ సభ్యులను కూడా కలవనీయకుండా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వ కుట్రలో భాగస్వామిగా మారిన పోలీసు వ్యవస్థ కూడా రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ.. పౌర హక్కులను మంటగలుపుతూ పేట్రేగిపోతోంది. ఇక అక్రమ నిర్బంధాలను సవాల్‌చేస్తూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేస్తుంటే పోలీసులు మరింతగా చెలరేగిపోతున్నారు. వారిపై మరిన్ని అక్రమ కేసులు బనాయించి బెంబేలెత్తిస్తుండటం ప్రభుత్వ నియంతృత్వానికి పరాకాష్టగా నిలుస్తోంది. న్యాయ వ్యవస్థ ఆదేశాల స్ఫూర్తిని సైతం ఉల్లంఘిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న అరాచకం ఎలా ఉందంటే..

ఎడాపెడా అక్రమ కేసులు..

చంద్రబాబు ప్రభుత్వం సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఎడాపెడా అక్రమ కేసులు నమోదు చేస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తోంది. ఇప్పటివరకు ఏకంగా 178 అక్రమ కేసులు నమోదు చేసినట్లు లెక్కతేలగా.. వాటికి అదనంగా గత రెండ్రోజుల్లోనే మరో 100 వరకు అక్రమ కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఓ కేసులో అరెస్టుచేసిన సోషల్ మీడియా యాక్టివిస్టు రిమాండ్‌లో ఉండగానే ఆయనపై మరిన్ని అక్రమ కేసులు నమోదు చేస్తోంది. ఇలా ఒకొక్కరిపై కనీసం నాలుగైదు అక్రమ కేసులు నమోదు చేస్తోంది. ఓ కేసులో బెయిల్‌పై బయటకు రాగానే మరో కేసులో అరెస్టుచేసి మరో జైలుకు తరలిస్తోంది. దీంతో అసలు ఎవరిపై ఎన్ని కేసులు నమోదు చేశారన్న కనీస సమాచారం కూడా తెలియనివ్వకుండా పోలీసులు బరితెగించి వేధిస్తున్నారు. అరెస్టు చేసినవారి సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్న రాజ్యాంగపరమైన బాధ్యతను కూడా పోలీసులు బేఖాతరు చేస్తున్నారు. దీంతో తమ వారిని అదుపులోకి తీసుకుంది పోలీసులో, ప్రైవేటు గూండాలో తెలీక వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వారి ఆచూకి కోసం పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు.



హైకోర్టును ఆశ్రయిస్తే మరిన్ని కేసులు..

ఇక సోషల్ మీడియా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేస్తూ పైశాచికంగా వ్యవహరిస్తుండడంతో వారి ఆచూకి కోసం కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలు చేస్తూ తమ వారి ఆచూకీ చెప్పాలని వేడుకుంటున్నారు. దీంతో చంద్రబాబు ప్రభుత్వం మరింతగా పేట్రేగిపోతోంది. ఎవరి ఆచూకీ కోసం హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలు చేశారో వారిని విడుదల చేస్తూనే ఆ వెంటనే వారిపై ఐదారు అక్రమ కేసులు బనాయిస్తూ వేధిస్తోంది.

ఇంటూరి ఎక్కడో?

తీవ్ర ఆందోళనలో కుటుంబ సభ్యులు

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు ఇంటూరి రవికిరణ్‌ను అక్రమ కేసులో అరెస్టుచేసి చిత్రహింసలకు గురిచేసినా ప్రభుత్వ కక్ష చల్లారలేదు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో ఆయన్ని రాజమహేంద్రవరం జైలుకు తరలించిన పోలీసులు.. ఆ తరువాత కూడా వేధిస్తుండడం విస్మయం కలిగిస్తోంది. రవికిరణ్‌ను కలిసేందుకు ఆయన సతీమణి విశాఖ నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వచ్చారు. కానీ, ఆయన్ని విశాఖ జైలుకు తరలించినట్లు అక్కడి జైలు అధికారులు చెప్పారు. దాంతో ఆమె విశాఖ జైలుకు వెళ్లారు.కానీ, తన భర్తను కలిసేందుకు ఆమెకు అవకాశమివ్వలేదు. రెండ్రోజులు ప్రయత్నించిన మీదట జైలు అధికారులు అంగీకరించడంతో ఆమె జైలుకు వెళ్లారు. తీరా ఆమె వెళ్లేసరికి రవికిరణ్‌ను విజయనగరం జైలుకు తీసుకుపోయారు. అక్కడికి వెళ్తే అక్కడా లేరని.. శ్రీకాకుళం జైలుకు తరలించారని చెప్పారు. తీరా ఆమె గురువారం శ్రీకాకుళం జైలుకు వెళ్లేసరికి అక్కడ నుంచి పల్నాడు జిల్లా మాచర్లకు తరలించేశారు. ఇక రవికిరణ్‌ను శుక్రవారం మరో జైలుకు తరలిస్తారని తెలుస్తోంది. ఇలా రవికిరణ్‌ను ఆయన కుటుంబీకులు కలవనీయకుండా పోలీసులు చేస్తున్నారు.

మహిళ పట్లా అత్యంత కర్కశంగా..

సుధారాణిని వేధిస్తున్న ప్రభుత్వం

మహిళ అనే కనీస కనికరం కూడా లేకుండా సోషల్ మీడియా యాక్టివిస్ట్ అయిన సుధారాణిపట్ల కూడా కక్షతో అత్యంత కర్కశంగా వ్యవహరిస్తుండటం చంద్రబాబు ప్రభుత్వ రాక్షసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. ఏడేళ్లలోపు జైలుశిక్ష పడే అవకాశమున్న కేసుల్లో రిమాండ్ విధించకుండా వెంటనే బెయిల్ మంజూరు చేయాలి. సుధారాణిపై నమోదైన కేసులన్నీ ఇలాంటివే. కానీ, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచే సమయంలో వివిధ సెక్షన్లు జోడిస్తూ పోలీసులు కనికట్టు చేశారు. సుధారాణి, ఆమె భర్త వెంకట్రామిరెడ్డిలను అరెస్టుచేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. సుధారాణి ఇద్దరు పిల్లలు తల్లిని చూడాలని ఏడుస్తుండటంతో ఆమె తండ్రి వారిని తీసుకుని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వచ్చారు. వారు వచ్చేసరికే ఆమెను విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు. తీరా విశాఖపట్నం సెంట్రల్ జైలుకు వెళ్లేసరికి అక్కడి నుంచి శ్రీకాకుళం జైలుకు తీసుకుపోయారు. ఆమె తండ్రి తన ఇద్దరు మనవలతో కలిసి ఎంతో వ్యయ ప్రయాసలు పడి గురువారం శ్రీకాకుళం వెళ్లేసరికి ఆమెను గుంటూరు జైలుకు తరలించేశారు. అక్కడి నుంచి ఆమెను ఒంగోలు జైలుకు తీసుకుపోయారు. ఇక సుధారాణి భర్త వెంకట్రామిరెడ్డి ఎక్కడ ఉన్నారన్నది అంతుచిక్కడంలేదు.

రాజమహేంద్రవరం టు బి.కొత్తకోట..

శ్రీనాథ్‌రెడ్డి పట్ల ప్రభుత్వ వేధింపులు

అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాకకు చెందిన శ్రీనాథ్ రెడ్డిపట్ల కూడా ప్రభుత్వం అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తోంది. ఆయన్నిసోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని అక్రమంగా అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అనంతరం ఆయనపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు పెట్టారు. ఆయన్ని అదుపులోకి తీసుకున్నట్లుగానీ అరెస్టు చేసినట్లుగానీ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదు. శ్రీనాథ్‌రెడ్డిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయన ఎక్కడున్నారనే విషయం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వెళ్లారు. కానీ, ఆయన్ని అప్పటికే శ్రీకాకుళం జైలుకు తరలించేశారు. దాంతో ఆయన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం వెళ్లారు. తీరా వారు అక్కడికి వెళ్లేసరికి.. శ్రీనాథ్‌రెడ్డికి శ్రీకాకుళం నుంచి ఏకంగా 900 కి.మీ.దూరంలో ఉన్న అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోటకు తరలించారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు హతాశులయ్యారు.

క్లుప్తంగా...

కమిషన్ నివేదిక త్వరగా వచ్చేలా చూడాలి

మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి



నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ నివేదికను గడువు కంటే ముందే ఇచ్చేలా చొరవ తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తరువాతే రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని సీఎం చెప్పడాన్ని ఆయన స్వాగతించారు. కమిషన్ నివేదిక త్వరగా వచ్చినట్లయితే నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మాల ప్రజాప్రతినిధుల సూచనల మేరకు ఏబీసీడీ నాలుగు గ్రూపులుగా కాకుండా 3 గ్రూపులుగా కుదించాలని చెప్పడం తమకు అభ్యంతరం లేదని...కానీ ఏబీసీడీలో నుంచి డీని తొలగించి ఆ గ్రూపులోని వారిని సీ గ్రూపులో కలిపేందుకు మాదిగలుగా తాము ఒప్పుకోబోమని స్పష్టం చేశారు.

వర్గీకరణ పేరుతో చిచ్చుపెడుతున్నారు

అఖిల భారత మాల సంఘాల జేఏసీ



నెహ్రూనగర్: మాల, మాదిగలు మధ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ పేరుతో చిచ్చుపెడుతున్నాయని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవిప్రసాద్ మండిపడ్డారు. గురువారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం వర్గీకరణ పేరుతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు నిలుపుదల చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. వర్గీకరణ చేయాలని చూస్తే సహించేదని లేదని హెచ్చరించారు. క్రిమిలేయర్ విధానాన్ని ఎస్సీలకు వర్తింపజేయడాన్ని తామ వ్యతిరేకిస్తున్నామన్నారు.

ఇంటి వద్దే గంజాయి పెంపకం

ఒకరి అరెస్ట్..మరొకరు పరారీ

గంగవరం: ఇంటి వద్ద గంజాయి మొక్కలు పెంచి విక్రయాలు చేపడుతుండగా..చిత్తూరు జిల్లా గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్, పోలీసులు, తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది కలిసి గురువారం తనిఖీలు చేసి ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. గంగవరం మండలంలోని సామరాజుపల్లిలో హరికృష్ణ తన ఇంటి వద్దే గంజాయి పెంచుతూ అప్పుడప్పుడూ గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నాడు. ఈ సమాచారం మేరకు..రెవెన్యూ సిబ్బందితో కలిసి పోలీసులు సామరాజుపల్లిలో హరికృష్ణ ఇంటి వద్ద సోదాలు చేయగా..కిలో గంజాయి, కొన్ని మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. హరికృష్ణను అదుపులోకి తీసుకుని, కిలో గంజాయి, మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.

వలంటీర్లను ముంచిన 'కూటమి' : ఈదర గోపీచంద్

నరసరావుపేట: వలంటీర్లు కూడా మనుషులేనని, వారిని కొనసాగించడమే కాదు, రూ.10 వేలకు జీతం పెంచి ఇస్తానని చంద్రబాబు ప్రకటించి, ఇప్పడు తూచ్ అదేం లేదంటూ నట్టేట వారిని ముంచారని సోషల్ యాక్టివిస్ట్, రచయిత ఈదర గోపీచంద్ మండిపడ్డారు. 2.5 లక్షల మందికి పైగా ఉన్న నిరుద్యోగ యువత న్యాయబద్ధమైన ఆశలపై సీఎం చంద్రబాబు నీళ్లుజల్లారని గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. వలంటీర్ల వ్యవస్థను నాశనం చేయడాన్ని పరిశీలిస్తే.. వినాశకాలే విపరీత బుద్ధి అన్న చందంగా చంద్రబాబు పాలనకు వినాశ హేతువు కాగలదని హెచ్చరించారు. వలంటీర్లు నిరుత్సాహ పడకుండా, కూటమి ఇచ్చిన హామీలు అమలుకై తమ పోరాటాన్ని కొనసాగించాలని కోరారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. బుధవారం అర్ధరాత్రి వరకు 59,231 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.08 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

త్రికోటేశ్వరుడి సేవలో విదుశేఖర భారతి



నరసరావుపేట రూరల్ : ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని గురువారం శ్రీశృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీ విదుశేఖర భారతీస్వామి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న స్వామికి అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. త్రికోటేశ్వరుని మూలవిరాట్‌కు స్వహస్తాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

వైభవంగా శ్రీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట




తాడేపల్లిగూడెం రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలంలోని కడియద్ద చెరువు గట్టున కోటి రూపాయల వ్యయంతో పునర్నిర్మించిన శ్రీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి హోమాలతో మొదలుపెట్టిన ప్రతిష్ఠా మహోత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి. రాత్రి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కళ్యాణం జరిగింది.

విద్యా సమాచారం

24న సాహిత్యంపై సదస్సు

కడప కల్చరల్ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెల సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 138వ సదస్సును ఈ నెల 24వ తేది ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఈ సదస్సులో 'మధురాంతకం రాజారాం జీవితం-సాహిత్యం' అనే అంశంపై కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ కె.ఎస్.సుందరేశ్వర రావు ప్రసంగిస్తారన్నారు.

జ్ఞానాంబికలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



మదనపల్లె: పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 115 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆల్సెక్ టెక్నాలజీస్ సంస్థ డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తే 30మంది బిజినెస్ ప్రాసెస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి ఒకొక్కరికి రూ.2.16లక్షల వార్షిక వేతనం లభిస్తుందన్నారు. అలాగే డీఎస్‌టీ టెక్నాలజీస్ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 85 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి ఒకొక్కరికి వార్షిక వేతనం రూ.2.04లక్షలు ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సురభిరమాదేవి, అధ్యాపకులు అభినందించారు.

డ్రోన్ తయారీపై ఎంఓయూ

తిరుపతి సిటీ: డ్రోన్ వ్యవస్థపై శిక్షణ, తయారీ, పరిశోధనలపై ఎస్వీయూ పలు సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. వర్సిటీ వీసీ చాంబర్‌లో గురువారం ఆయన రిజిస్ట్రార్ భూపతినాయుడితో కలసి పలు సంస్థల ప్రతినిధులతో చర్చించి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యాపరమైన పరిశోధన, ఆవిష్కరణలు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, డ్రోన్ల తయారీ, మహిళల కోసం డ్రోన్ దీదీ వంటి కార్యక్రమాల్లో బలమైన సహకారం కోసం డ్రోన్ వ్యవస్థలకు సంబంధించిన పలు సంస్థలతో వర్సిటీ ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామమన్నారు.

‘దేవుడ దేవుడా తిరుమల దేవుడా... చూడర చూడరా కళ్లు విప్పి చూడరా...’ అంటూ ‘చంద్రముఖి’ సినిమాలో జోరుగా స్టెప్పులేశారు రజనీ కాంత్. ఆ పాటలో ‘రిపీట్టే’ అని ఉంటుంది. 38 ఏళ్ల తర్వాత రజనీకాంత్–సత్యరాజ్ కాంబినేషన్ రిపీట్ అవుతోంది. ఇలా లాంగ్ గ్యాప్‌తో ‘రిపీట్టే’ అంటూ స్క్రీన్ షేర్ చేసుకుంటున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

రిపీట్టే


చిరంజీవి


త్రిష


సూర్య


రజనీకాంత్, సత్యరాజ్


అర్చన, రాజేంద్ర ప్రసాద్


మాధవన్, సిద్ధార్థ్


మోహన్ లాల్, మమ్ముట్టి

పద్దెనిమిదేళ్ల తర్వాత...

హీరో చిరంజీవి, హీరోయిన్ త్రిషల జోడీ పద్దెనిమిదేళ్ల తర్వాత రిపీట్ అవుతోంది. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించిన ‘స్టాలిన్’ సినిమాలో వీరిద్దరూ తొలిసారి జంటగా నటించారు. 2006లో విడుదలైన ఈ మూవీ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రం విడుదలైన పద్దెనిమిదేళ్ల తర్వాత చిరంజీవి, త్రిష రెండోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. ‘విశ్వంభర’ సినిమాలో వీరు జంటగా నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా ఈ మూవీ రూపొందుతోంది. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తున్నారని సమాచారం. ఈ సినిమాతో సంక్రాంతి బరిలోకి దిగాలనుకున్నారు చిరంజీవి. 2025 జనవరి 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు కూడా. అయితే చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ హీరోగా రూపొందిన ‘గేమ్ చేంజర్’ కోసం ‘విశ్వంభర’ విడుదలని వాయిదా వేశారు. ఇక ‘విశ్వంభర’ వేసవిలో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ‘విశ్వంభర’ యూనిట్ జపాన్‌లో ఉంది. అక్కడ చిరంజీవి–త్రిషపై ఓ పాట చిత్రీకరిస్తున్నారు.

* * *

38 ఏళ్ల తర్వాత...

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘కూలీ’. కమల్‌హాసన్‌తో ‘విక్రమ్’ వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తెరకెక్కించిన లోకేశ్ కనగరాజ్ ‘కూలీ’కి దర్శకుడు. ఈ సినిమాలో సత్యరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

దాదాపు 38 ఏళ్ల తర్వాత రజనీకాంత్–సత్యరాజ్ కలిసి నటిస్తుండటం విశేషం. 1986లో వచ్చిన ‘మిస్టర్ భరత్’లో సత్యరాజ్ తండ్రి పాత్ర చేయగా, రజనీకాంత్ ఆయన కొడుకుగా నటించారు. అయితే కావేరీ జలాల వివాదం సందర్భంగా రజనీకాంత్‌పై సత్యరాజ్ చేసిన వ్యాఖ్యలతో ఇద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. ఈ కారణంగా అప్పటి నుంచి వీరిద్దరూ కలిసి నటించలేదు. రజనీకాంత్ హీరోగా నటించిన ‘శివాజీ’ (2007) చిత్రంలో సత్యరాజ్‌ని విలన్‌గా తీసుకోవాలకున్నారు దర్శకుడు శంకర్. అయితే సత్యరాజ్ ఆ అవకాశాన్ని తిరస్కరించడంతో ఆ పాత్రని సుమన్ చేశారని కోలీవుడ్ టాక్. తాజాగా ‘కూలీ’ సినిమా కోసం రజనీకాంత్–సత్యరాజ్‌లను ఒప్పించారు లోకేశ్ కనగరాజ్. ఈ మూవీలో రజనీ స్నేహితుడిగా ఆయన కనిపించనున్నారు. ఈ చిత్రంలో తెలుగు స్టార్ నాగార్జున, కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే. కళానిధి మారన్ నిర్మిస్తున్న ‘కూలీ’ వచ్చే ఏడాది విడుదల కానుంది.

* * *

ఇరవై ఏళ్ల తర్వాత...

మలయాళ చిత్ర పరిశ్రమలో హిట్ జోడీగా పేరొందిన మోహన్‌లాల్, శోభన మరోసారి కలిసి నటిస్తున్నారు. అది కూడా దాదాపు ఇరవైఏళ్ల తర్వాత కావడం విశేషం. మోహన్‌లాల్ హీరోగా తరుణ్ మూర్తి దర్శకత్వంలో ‘ఎల్ 360’ (వర్కింగ్ టైటిల్) సినిమా రూపొందుతోంది. ఎమ్. రంజిత్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శోభన కథానాయికగా నటిస్తున్నారు. 1985లో వచ్చిన ‘అవిడతే పోలే ఇవిడెయుమ్’ సినిమాలో తొలిసారి కలిసి నటించారు మోహన్‌లాల్, శోభన. ఆ తర్వాత ఈ ఇద్దరూ యాభైకి పైగా సినిమాల్లో నటించారు. వీరిద్దరూ చివరిగా నటించిన చిత్రం ‘తేన్మావిన్ కొంబాట్’ 1994లో విడుదలైంది. ఆ తర్వాత స్క్రీన్ షేర్ చేసుకోని వీరు (‘సాగర్ ఆలియాస్ జాకీ రీ లోడెడ్’ సినిమాలో మోహన్‌లాల్ హీరోగా నటించగా, శోభన అతిథి పాత్ర చేశారు) ఇరవై ఏళ్ల తర్వాత ‘ఎల్ 360’ కోసం మరోసారి తెరని పంచుకుంటున్నారు. కాగా ఇది వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న 56వ సినిమా కావడం విశేషం.

* * *

పాన్ ఇండియా సినిమా కోసం

మలయాళ స్టార్స్ మమ్ముట్టి, మోహన్‌లాల్‌ల కాంబినేషన్ ఓ పాన్ ఇండియా సినిమాకి కుదిరింది. వీరిద్దరి కాంబినేషన్‌లో దాదాపు యాభైకి పైగా సినిమాలు వచ్చాయి. అయితే జోషి దర్శకత్వం వహించిన ‘ట్వంటీ 20’ (2008) చిత్రం తర్వాత మోహన్‌లాల్, మమ్ముట్టి కలిసి ఓ ఫుల్ లెంగ్త్ మూవీ చేయలేదు. అయితే మమ్ముట్టి హీరోగా నటించిన ‘కాథల్ కదన్ను ఒరు మాతుకుట్టి’ (2013) చిత్రంలో మోహన్‌లాల్ ఓ అతిథి పాత్ర చేశారు. కాగా పదహారేళ్ల తర్వాత వీరిద్దరూ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మహేశ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆంటో జోసెఫ్ నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం శ్రీలంకలో ఘనంగా ప్రారంభమైంది. ‘‘మలయాళ సినిమా చరిత్రను తిరగ రాయడానికి సిద్ధంగా ఉన్న క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఇది. శ్రీలంక, అబుదాబీ, అజర్‌బైజాన్, లండన్, థాయ్‌ల్యాండ్, విశాఖపట్నం, హైదరాబాద్, ఢల్లీ, కొచ్చితో సహా పలు ప్రాంతాల్లో 150 రోజుల పాటు ఈ మూవీ షూటింగ్ జరపనున్నాం’’ అని పేర్కొన్నారు మేకర్స్.

* * *

38 ఏళ్ల తర్వాత...

హీరో రాజేంద్ర ప్రసాద్, డైరెక్టర్ వంశీ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాల్లో ‘లేడీస్ టైలర్’కి ప్రత్యేక స్థానం ఉంది. ఈ చిత్రంలో ఆయనకు జోడీగా అర్చన నటించారు. 1986లో విడుదలైన ఈ సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. ఆ సినిమా తర్వాత వీరిద్దరూ కలిసి నటించలేదు. దాదాపు 38 ఏళ్ల తర్వాత ‘షష్ఠిపూర్తి’ సినిమా కోసం రాజేంద్ర ప్రసాద్, అర్చన కలిశారు. పవన్ ప్రభ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్, అర్చన జోడీగా నటిస్తున్నారు. రూపేష్, ఆకాంక్షా సింగ్ మరో జంటగా నటిస్తున్నప్పటికీ ఈ కథ రాజేంద్రప్రసాద్, అర్చన చుట్టూనే తిరుగుతుందట. రాజేంద్రప్రసాద్ భార్యగా అర్చన నటిస్తున్నారు. ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో షష్ఠిపూర్తి కథాంశంతో ఈ మూవీ సాగుతుంది. రూపేష్ నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఇదిలా ఉంటే ‘లేడీస్ టైలర్’ సినిమాకు సంగీతం అందించిన ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజాయే ‘షష్ఠిపూర్తి’కి కూడా స్వరాలు సమకూర్చడం విశేషం.

* * *

పంతొమ్మిదేళ్ల తర్వాత...

తమిళ చిత్ర పరిశ్రమలో హీరో సూర్య, హీరోయిన్ త్రిషలది హిట్ జోడీ. వీరి కాంబినేషన్‌లో ఇప్పటికే మూడు సినిమాలు రాగా తాజాగా నాలుగో సినిమా రానుందని టాక్. సూర్య హీరోగా ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో మైథలాజికల్ నేపథ్యంలో ఓ చిత్రం రూపొందనుంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం త్రిషను సంప్రదించారట ఆర్‌జే బాలాజీ. కథ, తన పాత్ర నచ్చడంతో ఆమె కూడా ఈ మూవీలో నటించేందుకు ఆసక్తిగా ఉన్నారని కోలీవుడ్ టాక్. ‘మౌనం పేసియదే’ (2002), ‘ఆయుద ఎళుత్తు’ (2004), ‘ఆరు’ (2005) వంటి చిత్రాల్లో నటించారు సూర్య, త్రిష. తాజాగా నాలుగోసారి ఆర్‌జే బాలాజీ సినిమా కోసం వీరిద్దరూ తెరని పంచుకోనున్నారట. ఈ వార్త నిజం అయితే 19 సంవత్సరాల తర్వాత వీరి జోడీ రిపీట్ అవుతుంది.

* * *

టెస్ట్ మ్యాచ్‌కి సిద్ధం

హీరోలు మాధవన్–సిద్ధార్థ్ క్రికెట్‌లో టెస్ట్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ ఇద్దరూ హీరోలుగా నటించిన తాజా చిత్రం ‘ది టెస్ట్’. నయనతార హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో మీరా జాస్మిన్ ఓ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం కాగా, సింగర్ శక్తిశ్రీ గోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఇదిలా ఉంటే దాదాపు 20 ఏళ్ల తర్వాత మాధవన్–సిద్ధార్థ్ ఈ సినిమాలో కలిసి నటించారు. సూర్య, మాధవన్, సిద్ధార్థ్ హీరోలుగా మణిరత్నం దర్శకత్వం వహించిన చిత్రం ‘యువ’ (2004). ఆ సినిమా తర్వాత మాధవన్–సిద్ధార్థ్ కలిసి నటించిన చిత్రం ‘ది టెస్ట్’. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడ్డ ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్‌ని మేకర్స్ ప్రకటించలేదు. అయితే 2025 ఫిబ్రవరిలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని కోలీవుడ్ టాక్.

– డేరంగుల జగన్


శ్రీలీల, అల్లు అర్జున్

సాంగ్‌తో సమాప్తం!

‘పుష్ప2: ది రూల్’ సినిమా చిత్రీకరణ పూర్తి కావొచ్చింది. హీరో అల్లుఅర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ‘పుష్ప 2: ది రూల్’. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 5న విడుదల కానుంది. ఇక ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఓ ప్రముఖ స్టూడియోలో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఈ పాటతో ‘పుష్ప2: ది రూల్’ సినిమా షూటింగ్ అంతా పూర్తవుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఇలా ఓ సాంగ్‌తో ‘పుష్ప 2: ది రూల్’ సినిమా షూటింగ్ అంతా సమాప్తం కానుంది. ఇక గతవారం అల్లు అర్జున్ – శ్రీలీల కాంబినేషన్‌లో ‘కిస్సిక్’ అనే స్పెషల్‌సాంగ్‌ను చిత్రీకరించిన సంగతి తెలిసిందే. ఈ పాట లిరికల్ వీడియోను ఈ నెల 24న చెన్నైలో జరిగే ఈవెంట్‌లో రిలీజ్ చేయనున్నారు. ‘పుష్ప2: ది రూల్’ సినిమాలో ఫాహద్ ఫాజిల్, అనసూయ, సునీల్, జగపతిబాబు, డాలీ ధనంజయ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ డైరెక్టర్. తమన్ ఈ సినిమాకు కొంత బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇక అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లోనే 2021లో వచ్చిన ‘పుష్ప: ది రైజ్’ సినిమాకు సీక్వెల్‌గా ‘పుష్ప2: ది రూల్’ సినిమా తెరకెక్కిన సంగతి తెలిసిందే.


సాయిపల్లవి, నాగచైతన్య

సముద్రం సాక్షిగా...

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన లవ్ అండ్ యాక్షన్ డ్రామా ‘తండేల్’. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలోని డి మచ్చిలేశం గ్రామంలో జరిగిన వాస్తవ సంఘటనల స్ఫూర్తితో చందు మొండేటి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. గురువారం ‘తండేల్’ సినిమాలోని ‘బుజ్జి తల్లి...’ పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ‘‘సముద్రం సాక్షిగా ఓ యదార్థ ప్రేమకథ’’ అని కనిపించి... ‘గాలిలో ఊగిసలాడే దీపంలా... ఊగిసలాడే నీ ఊసందంక నా ప్రాణం...’ అంటూ మొదలై, ‘బుజ్జితల్లి...’ అంటూ సాగుతుంది పాట. శ్రీమణి సాహిత్యం అందించగా, జావేద్ అలీ ఈ పాటను పాడారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్


నయనతార

ప్రేమిస్తున్నట్లు నన్ను నమ్మించాడు

ప్రేమ విషయంలో తన ఊహాగానాలు తారుమారయ్యాయని హీరోయిన్ నయనతార భావోద్వేగానికి గురయ్యారు. ఇంతకీ విషయం ఏంటంటే... నయనతార వ్యక్తిగత జీవితం, సినీ జీవితం, పెళ్లి వంటి అంశాల ఆధారంగా ‘నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్’ డాక్యుమెంటరీ రూపొందిన సంగతి తెలిసిందే. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ డాక్యుమెంటరీ ఈ నెల 18 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. కాగా తన జీవితంలోని కొన్ని ఆసక్తికరమైన విషయాలను ఈ డాక్యుమెంటరీ వేదికగా నయనతార పంచుకున్నారు. సినిమా సెట్స్‌లో నయనతార మొబైల్ ఫోన్ మోగితే, ఆమె చాలా డల్ అయిపోయేవారు అంటూ నాగార్జున ఈ డాక్యుమెంటరీలో మాట్లాడారు. ఈ విషయంపై నయనతార స్పందించారు. ‘‘నిజానికి ప్రేమ అనేది నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. నేనొక వ్యక్తిని మనస్ఫూర్తిగా నమ్మాను. తను నన్ను ప్రేమిస్తున్నాడని అనుకున్నాను. నన్ను అలా నమ్మించాడు. రిలేషన్‌షిప్‌లో అబ్బాయి – అమ్మాయిల మధ్య ఏదైనా జరిగితే, ఎక్కువగా అమ్మాయిల గురించే మాట్లాడుకుంటారు. తప్పంతా అమ్మాయిలదే అన్నట్లు వార్తలు రాస్తారు. ఎవరూ మగాళ్లను అడగరు’’ అంటూ ఒకింత భావోద్వేగంతో మాట్లాడారు నయనతార. అయితే తనని నమ్మించిన వ్యక్తి పేరుని మాత్రం నయనతార వెల్లడించలేదు.

బిగ్ బాస్ ఈ వారం విశ్లేషణ



పార్టిసిపెంట్స్ ఫ్యామిలీ ప్యాక్ వీక్

అప్పట్లో ఓ సినిమాలో ఓ విలన్ అంటాడు, నాకు నా శత్రువే కాదు, శత్రువు కుటుంబ సభ్యులు కూడా అవసరం. అలానే బిగ్ బాస్ హౌస్‌లో పార్టిసిపెంట్స్ మాత్రమే కాదు, వారికి సంబంధించిన కుటుంబ సభ్యులను కూడా తన షోలో వినియోగించుకున్నాడు బిగ్ బాస్. హౌస్‌లోని పార్టిసిపెంట్స్ కుటుంబసభ్యులను మాంచి డ్రామా రూపంలో దశల వారీగా పార్టిసిపెంట్స్‌కు కల్పించి, వారి మధ్య జరిగిన భావావేశాలను ప్రేక్షకులకు యధావిధిగా వండి వార్చాడు సదరు బిగ్ బాస్. కుటుంబ సభ్యులను పార్టిసిపెంట్స్ కలవడంలో పెద్ద వింతేమీ లేదు కానీ ఆ పార్టిసిపెంట్స్‌తో హౌస్‌లో జరుగుతున్న విషయాలను బాహాటంగానే కుటుంబ సభ్యులు చర్చించడం అటు పార్టిసిపెంట్స్‌కు ఇటు ప్రేక్షకులకు చిన్న పాటి ఇబ్బంది కలిగింది. ముఖ్యంగా యష్మి, ప్రేరణ, నిఖిల్, విష్ణు తదితర పార్టిసిపెంట్స్ తమ కుటుంబ సభ్యులను కలవడంలో పడ్డ ఆనందం కన్నా ఆ తరువాత వాళ్లతో మాట్లాడినపుడు ఎక్కువగా ఇబ్బంది పడ్డారని చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా హౌస్‌లో జరిగే ప్రేమాయణాల నుండి గిల్లి కజ్జాల వరకు తమ కుటుంబ సభ్యులతో మాట్లాడటం చాలా ఎబ్బెట్టుగా ఉంది. అంతేనా... ప్రేక్షకులకు ఇంత చిన్న మసాలా అయితే ఎలా సరిపోతుంది అనుకున్న బిగ్ బాస్ ఒక పార్టిసిపెంట్‌ను వారమంతా ఏడిపించి వారం చివర్లో వాళ్ల ఫ్యామిలీని కలిపించి ప్రేక్షకులకు ఓ మాంచి మసాలానే చూపించాడు. ఆ పార్టిసిపెంటే టేస్టీ తేజ. ఓ రకంగా చెప్పాలంటే ఈ వారమంతా ఎపిసోడ్లలో ఈ తేజ ఏడుపునే అమ్ముకున్నాడు బిగ్ బాస్. అంతేనా... అదే తేజను ఎలిమినేషన్లో పెట్టి నాటకీయంగా నో ఎలిమినేషన్ అని ఈ వారానికి తేజ కథ సుఖాంతం చేశాడు. ఒక్క విషయం మాత్రం అటు ప్రేక్షకులు ఇటు పార్టిసిపెంట్స్ గుర్తు పెట్టుకోవాలి. అదేంటంటే బిగ్ బాస్ కార్యక్రమాన్ని చూడడం లేదా పార్టిసిపేట్ చేయడమంటే కాస్త గుండె దిటవుతో ఉండాలి. ఎందుకంటే బిగ్ బాస్ తన కార్యక్రమాన్ని నార్మల్ ప్యాక్‌లో చేయడు ఫ్యామిలీ ప్యాక్ తప్ప.

– ఇంటూరు హరికృష్ణ

బిజినెస్ రీల్

వివో నుంచి వై300 స్మార్ట్‌ఫోన్

ధర రూ. 21,999 నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వివో తాజాగా వై300ను ఆవిష్కరించింది. దీని ధర రూ. 21,999 నుంచి ప్రారంభమవుతుంది. 8 జీబీ+128 జీబీ అలాగే 8 జీబీ+256 జీబీ వేరియంట్లలో లభిస్తుంది. 6.67 అంగుళాల డిస్‌ప్లే, 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్882 మెయిన్ కెమెరా, 32 ఎంపీ ఫ్రంట్ పోర్ట్రెయిట్ కెమెరా, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ తదితర ఫీచర్లు ఇందులో ఉంటాయి. నవంబర్ 26 నుంచి వివో ఇండియా ఈ–స్టోర్‌తో పాటు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర ఈకామర్స్ సైట్ల ద్వారా కూడా కొనుగోలు చేయొచ్చు. ఎస్‌బీఐ కార్డ్, బీవోబీ కార్డ్ మొదలైన వాటిపై రూ. 2,000 వరకు క్యాష్‌బ్యాక్ వంటివి ఆఫర్లు పొందవచ్చు. తమ వై సిరీస్ స్మార్ట్‌ఫోన్లకు బాలీవుడ్ నటి సుహానా ఖాన్ ప్రచారకర్తగా వ్యవహరిస్తారని సంస్థ తెలిపింది.

మంగోల్ రిఫైనరీకి మేఘా వెసెల్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ సంస్థ మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) మంగోలియాలో నిర్మిస్తున్న మంగోల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీకి కీలక పరికరాలైన వెసెల్స్ (ఫ్లషింగ్ ఆయిల్ డ్రమ్) ఎగుమతి ప్రారంభించింది. వీటిని ఎంఈఐఎల్ సొంత యూనిట్లలో తయారు చేస్తోంది. మంగోలియాలో ఇదే తొలి చమురు శుద్ధి కేంద్రం. ఈ రిఫైనరీలోని నాలుగు ప్యాకేజీలకుగాను మూడింటి పనులను దక్కించుకుని అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నట్లు ఎంఈఐఎల్ డైరెక్టర్ పి.దొరయ్య గురువారం తెలిపారు.

బీఈఎంఎల్‌కు రూ.247 కోట్ల కాంట్రాక్ట్

న్యూఢిల్లీ: భారీ యంత్రాల తయారీలో ఉన్న ప్రభుత్వ రంగ బీఈఎంఎల్ (గతంలో భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్) తాజాగా సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ నుంచి కాంట్రాక్ట్ దక్కించుకుంది. డీల్ విలువ రూ.247 కోట్లు. ఇందులో భాగంగా మైనింగ్‌లో ఉపయోగించే బీహెచ్60ఎం రకం 48 రేర్ డంప్ ట్రక్స్‌ను బీఈఎంఎల్ సరఫరా చేయనుంది. విడిభాగాలు, విక్రయానంత సేవలు సైతం అందించనుంది. 360 డిగ్రీ కెమెరా, అగ్ని ప్రమాదాన్ని అణిచివేసే వ్యవస్థ, ఆటోమేటిక్ లూబ్రికేషన్ సిస్టమ్ వంటి ఫీచర్లతో బీహెచ్60ఎం ట్రక్ తయారైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-11-2024

విశాఖ	565-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	580-00
విజయవాడ	580-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	565-00
వరంగల్	567-00
రిటైల్ ధర	6.25

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
POWERGRID	325.3	3.25
ULTRACEMCO	10,952.65	1.7
HINDALCO	647.65	1.2
APOLLOHOSP	6,745.95	0.88
GRASIM	2,530.20	0.88

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,160.00	-23.44
ADANIPORTS	1,119.05	-13.23
SBILIFE	1,475.00	-3.15
SBIN	780.9	-2.75
NTPC	357.5	-2.51

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,061
ఎన్‌ఎస్‌ఈ	1,01,780
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,19,314
ఎఫ్‌ఐఐ	- 5,321
డీఐఐ	+ 4,200

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.52	$ 68.75
బ్రెంట్	73.81	$ 72.81

ట్రంప్ హయాంలో భారత్‌కు ఇం'ధనం'

- ఈ సమయంలో చమురు ధరలు తక్కువగా ఉంటాయని అంచనా
- ఎకానమీకి సానుకూలమన్న సీఈఏ



ముంబై: భారత్‌కు సంబంధించి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధికి కీలకమైన ఇంధన ధరలు అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలో తక్కువ స్థాయిలో ఉండే అవకాశం ఉందని చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ (సీఈఏ) జీ అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. ఇది దేశ ఎకానమీకి సానుకూల అంశమని విశ్లేషించారు. అయితే ఆహార ద్రవ్యోల్బణంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అక్టోబర్‌లో 14 నెలల గరిష్ట స్థాయి 6.2 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం పెరగడంపై ఆయన మాట్లాడుతూ టమోటా, ఉల్లి, ఆలూ ధరల పెరుగుదల దీనికి కారణమని పేర్కొన్నారు. బ్యాంకింగ్ దిగ్గజం– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వార్షిక బ్యాంకింగ్, ఆర్థిక సదస్సును ఉద్దేశించి సీఈఏ చేసిన ప్రసంగంలో కొన్ని ముఖ్యాంశాలు...

- రాబోయే 25 సంవత్సరాలలో భారతదేశం అధిక వేగంతో అభివృద్ధి చెందాలంటే ఇంధన ధరలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది.
- పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన లక్ష్య సాధనలు ముఖ్యమైనవి అయినప్పటికీ, అంతకుముందు ఆర్థిక వృద్ధిని సృష్టించడం చాలా అవసరం. ఇంకా చెప్పాలంటే, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల సాధనకు ముందు ఆర్థికవృద్ధి సాధన చాలా కీలకాంశం.
- ట్రంప్ పరిపాలనలో అమెరికాకు భారత్ చేసే వస్తు, సేవల ఎగుమతులకు కొన్ని సవాళ్లు తప్పవు. అయితే అమెరికా ఎటువంటి విధానాలు అవలంభించినప్పటికీ పలు మార్కెట్లకు ఎగుమతులు విస్తరిస్తున్నందున భారత్ ఆర్థికాభివృద్ధిలో ఈ విభాగం కీలక పాత్రను పోషిస్తుంది.
- అధిక వడ్డీరేట్లు ఎకానమీ వృద్ధికి అవరోధంగా మారతాయన్న ఆందోళన విషయానికి వస్తే, అటువంటి అధ్యయనం ఇంకా చేపట్టవలసి ఉంది. దాని గురించి నేను ఇప్పుడు వ్యాఖ్యానించలేను. (ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య మంత్రి పియూష్ గోయెల్‌లు ఆర్‌బీఐ బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపోను –ప్రస్తుతం 6.5 శాతం – తగ్గించాలని సూచిస్తున్న నేపథ్యంలో నాగేశ్వరన్ తాజా వ్యాఖ్యలు చేయడం గమనార్హం)
- 1980 వరకూ ఆధిపత్యం చెలాయించిన '''కొరత దశ' నుంచి భారత్ కార్పొరేట్ రంగం బయటపడి, 'మైండ్‌సెట్ షిఫ్ట్' చేయడం ద్వారా తమ ఆశయాలను విస్తరించుకోవాల్సిన అవసరం ఉంది.

బలహీన రూపాయితో ప్రయోజనం పొందాలని చూడద్దు: కార్పొరేట్లకు విజ్ఞప్తి

కాగా, బలహీన రూపాయిలో ప్రయోజనం పొందాలని చూడవద్దని కార్పొరేట్లకు నాగేశ్వరన్ మరో కార్యక్రమంలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎగుమతుల విషయాన్ని ప్రస్తావిస్తూ, బలహీన రూపాయి ఎగుమతుల రంగానికి మంచిదే కావచ్చుకానీ, ఇదే కారణంగా ఈ విభాగం పురోగతిని ఆశించడం తగదని ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్టడీస్ ఇన్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌ఐడీ) నిర్వహించిన ఒక కార్యక్రమంలో అభిప్రాయపడ్డారు. అభివృద్ధి అనేది విధానపరమైన అంశంగా ఉండాలన్నారు. ఉత్పాదకత, పరిశోధన, అభివృద్ధి, నాణ్యత, పెట్టుబడి వంటి అంశాలు విధానపరమైన పురోగతిలో భాగంగా ఉండాలి తప్ప, 'రూపాయి బలహీనత' వంటి ప్రత్యామ్నాయ అంశాలపై ఆధారపడి ఉండరాదని స్పష్టం చేశారు.

ఎకానమీకి ప్రైవేటు వినియోగం దన్ను

- రిజర్వ్ బ్యాంక్ బులెటిన్ భరోసా
- మధ్యకాలిక ఆర్థిక అవుట్‌లుక్ పటిష్టంగా ఉందని విశ్లేషణ



పండుగల సీజన్ నేపథ్యంలో మూడవ త్రైమాకంలో (అక్టోబర్–డిసెంబర్) ప్రైవేట్ వినియోగం, డిమాండ్ ఊపందుకుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బులెటిన్ పేర్కొంది. దీనితోపాటు ఎకానమీ ఫండమెంటల్స్ పటిష్టంగా ఉందని వివరించింది. వ్యవసాయ రంగం సానుకూలంగా ఉందని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో దేశ మధ్యకాలిక ఆర్థిక అవుట్‌లుక్ బుల్లిష్‌గా ఉందని 'స్టేట్ ఆఫ్ ది ఎకానమీ' శీర్షికన విడుదలైన నవంబర్ బులెటిన్ తెలిపింది. 2024 నాల్గవ త్రైమాసికంలో (అక్టోబర్–నవంబర్–డిసెంబర్) ప్రపంచ ఎకానమీ సవాళ్లతో కొనసాగిందని బులెటిన్ వివరిస్తూ, భౌగోళిక ఉద్రిక్తతలు, రక్షణాత్మక వాణిజ్య విధానాలు దీనికి కారణంగా పేర్కొంది. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర నేతృత్వంలోని బృందం ఈ కథనాన్ని రూపొందించింది. అయితే బులెటిన్‌లోని అంశాలు ఆర్‌బీఐ అభిప్రాయాలుగా పరిగణించకూడదన్న సంగతి తెలిసిందే. బులెటిన్‌లోని మరికొన్ని విశేషాలు ఇలా..

- రికార్డు ఖరీఫ్ ఆహార ఉత్పత్తి అంచనాలు, అలాగే ఆశాజనకంగా ఉన్న రబీ పంట అవకాశాలు వ్యవసాయ రంగానికి సానుకూల అంశాలు. ఇవి రైతుల ఆదాయాన్ని, గ్రామీణ డిమాండ్‌ను పెంచుతుందన్న సానుకూల అంచనాలు ఉన్నాయి.
- వ్యవస్థాపరంగా వ్యవసాయ ఉత్పత్తుల ఖచ్చితమైన అంచనాకు పలు శాస్త్రీయ విధానాలు దోహదపడుతున్నాయి. డిజిటల్ క్రాప్ సర్వేలు, డ్రోన్‌ల వినియోగం వంటి అంశాలను ఇక్కడ ప్రస్తావించుకోవచ్చు. వాస్తవ ప్రాతిపదికన, సమయానుకూల అంచనాలకు దోహదపడే అంశాలు ఇవి. చురుకైన సరఫరా నిర్వహణకూ ఆయా చొరవలు దోహదపడతాయి.
- పారిశ్రామిక, తయారీ, నిర్మాణ రంగాల్లో క్రియాశీలత కొనసాగుతుంది. రవాణా అలాగే అభివృద్ధి చెందుతున్న సాంప్రదాయ ఇంధన వనరుల విభాగాల్లో భారీ ఉపాధి అవకాశాలు ఉన్నాయి.
- భారీగా పురోగమిస్తున్న రంగాల్లో సేవలు ఒకటి. ఉపాధి కల్పన, వినియోగం, వ్యాపార విశ్వాస పునరుద్ధరణకు ఈ విభాగం దోహదపడుతుంది.
- అంతర్జాతీయ అనిశ్చితి, ఒడిదుడుకులు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల విషయంలో బాండ్, ఈక్విటీ మార్కెట్‌లలో ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులకు ఢోకాలేని పరిస్థితి ఉంది. కార్పొరేట్ బాండ్ జారీలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)లు మెరుగుపడే అవకాశాలు ఉండడం దీనికి కారణం.
- మాల్స్‌లో కొనుగోళ్లు తక్కువగా ఉన్నప్పటికీ, జనరేషన్ 'జడ్' దృష్టిని ఆకర్షించడానికి వివిధ రకాల మార్కెటింగ్ వ్యూహాలు, బ్రాండ్ రీకాల్ కార్యక్రమాలతో ఈ–కామర్స్ అభివృద్ధి చెందుతోంది. ఈ కామర్స్ కంపెనీలకు గ్రామీణ ప్రాంతాలు కూడా చక్కటి మార్కెట్‌గా అవతరిస్తుండడం విశేషం.
- ఎఫ్‌ఎంసీజీ, ఆటో కంపెనీలు డిమాండ్‌ను పునరుద్ధరించడానికి ప్రకటన ఖర్చులను పెంచుతున్నాయి.

క్యూ2లో వృద్ధి రేటు మందగించవచ్చు: అజయ్ సేథ్



ఇదిలావుండగా, ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో (జూలై–సెప్టెంబర్) స్థూల దేశీయోత్పత్తి తగ్గే అవకాశం ఉందని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ అంచనా వేశారు. అయితే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు ఆర్థిక సర్వేకు అనుగుణంగా 6.5 శాతం నుంచి 7 శాతం శ్రేణిలోనే ఉండే అవకాశం ఉందని అన్నారు. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో వృద్ధి రేటు 6.7 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మూలధన వ్యయం రూ.11.11 లక్షల కోట్లుగా అంచనావేయగా, ఈ లక్ష్యాన్ని పూర్తిగా చేరుకోలేకపోవచ్చని ఫిక్కీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో అభిప్రాయపడ్డారు. అయితే 2023–24లో మూలధన వ్యయాల కన్నా (రూ.9.5 లక్షల కోట్లు) కొంత ఎక్కువగా నమోదయ్యే వీలుందన్నారు. 2024–25 తొలి ఆరు నెలల్లో మూలధన వ్యయం బడ్జెట్ అంచనాల్లో (రూ.11.11 లక్షల కోట్లు) 37.3 శాతంగా ఉంటే, 2023–24 ఇదే కాలంలో ఇది 49 శాతంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. గత ఏడాది కూడా మూలధన వ్యయాలు లక్ష్యంలో (రూ.10 లక్షల కోట్లు) 95 శాతంగా నమోదయిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆహార ద్రవ్యోల్బణం కొంత ఆందోళన కలిగించే అంశమన్నారు. 2023–24లో ఎకానమీ వృద్ధి రేటు 8.2 శాతం. 2024–25 ఆర్థిక సంవత్సరం దేశ ఎకానమీ వృద్ధి రేటు అంచనాను 7.2 శాతంగా ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాలసీ అంచనా.

6.5 శాతానికి పరిమితం కావచ్చు: ఇక్రా




భారీ వర్షాలు, బలహీనమైన కార్పొరేట్ పనితీరు కారణంగా సెప్టెంబర్ త్రైమాసికంలో భారత్ జీడీపీ వృద్ధి రేటు 6.5 శాతానికి తగ్గే అవకాశం ఉందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. అయితే ఆర్థిక సంవత్సరం మొత్తంలో వృద్ధి రేటు 7 శాతంగా ఉంటుందన్న తమ అంచనాల్లో ఎటువంటి మార్పూ లేదని ఇక్రా స్పష్టం చేసింది. ఆర్థిక సంవత్సరం రెండవ అర్ధ భాగంలో (అక్టోబర్–మార్చి) ఎకానమీ క్రియాశీలత పుంజుకుందని ఏజెన్సీ తన తాజా నివేదికలో పేర్కొంది. అర్బన్ డిమాండ్ తగ్గిందని, ఈ పరిస్థితుల్లో వృద్ధి మందగమనంలోకి జారుతోందని వ్యక్తమయిన ఆందోళనల నేపథ్యంలో ఇక్రా తాజా నివేదిక విడుదల కావడం గమనార్హం. ''ప్రభుత్వ వ్యయాలు, ఖరీఫ్ విత్తన సాగు సానుకూల ధోరణులను కనబరిచినప్పటికీ, పారిశ్రామిక రంగం ముఖ్యంగా మైనింగ్, విద్యుత్ రంగాలు మందగించే అవకాశం ఉంది'' అని నివేదిక పేర్కొంది. సేవల రంగం దన్ను కూడా ఎకానమీకి ఉంటుందని ఇక్రా చీఫ్ ఎకనమిస్ట్ అదితీ నయ్యర్ అభిప్రాయపడ్డారు.

ఆర్థికాభివృద్ధికి 'ధరల స్థిరత్వమే' పునాది

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

ముంబై: ధరల స్థిరత్వమే ఎకానమీ స్థిరమైన వృద్ధికి పునాదిగా పనిచేస్తుందని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని కేంద్రం నిర్దేశిస్తున్న విధంగా 4 శాతానికి తగ్గించడమే సెంట్రల్ బ్యాంక్ లక్ష్యమని ఆయన అన్నారు. భారత్ రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో ఆందోళనకరంగా 14 నెలల గరిష్ట స్థాయిలో 6.2 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయిన నేపథ్యంలో గవర్నర్ తాజా వ్యాఖ్యలు చేశారు. గ్లోబల్ సౌత్ దేశాల సెంట్రల్ బ్యాంకుల ఉన్నత స్థాయి విధాన సదస్సులో ఆయన 'సమతౌల్య ద్రవ్యోల్బణం, వృద్ధి: ద్రవ్య పరపతి విధానానికి మార్గదర్శకత్వం' అనే అంశంపై ఆయన చేసిన ప్రసంగంలో కొన్ని ముఖ్యాంశాలు...

- దేశ ఎకానమీ ఫండమెంటల్స్ పటిష్టంగా ఉండడం.. 4 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం లక్ష్య సాధనపై ఆర్‌బీఐ గురి తప్పకుండా చూస్తోంది.
- సుస్థిర ద్రవ్యోల్బణం అటు ప్రజలు, ఇటు ఎకానమీ ప్రయోజనాలకు పరిరక్షిస్తుంది. ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి, పెట్టుబడులకు తగిన వాతావరణాన్ని నెలకొల్పడానికి దోహదపడే అంశమిది.
- గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభ పరిస్థితులను తట్టుకుని తన స్థిర స్థానాన్ని నిలబెట్టుకోగలుగుతోంది. అయినప్పటికీ, ఇప్పటికీ అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి.
- అనిశ్చితితో కూడిన ఈ వాతావరణంలో ద్రవ్య, పరపతి విధాన రూపకల్పన.. స్పీడ్ బ్రేకర్లతో కూడిన పొగమంచు మార్గంలో కారును నడపడం లాంటిది. ఇవి డ్రైవర్ సహనం, నైపుణ్యాన్ని పరీక్షించే కీలక సమయం.
- ప్రస్తుతం ఎన్నో సవాళ్లు సెంట్రల్ బ్యాంకులకు ఎదురవుతున్నాయి. విధాన నిర్ణేతలు పలు కీలక పరీక్షలను ఎదుర్కొనాల్సి వస్తోంది. మన కాలపు చరిత్రను వ్రాసినప్పుడు, గత కొన్ని సంవత్సరాల అనుభవాలు, అభ్యాసాలు అందులో భాగంగా ఉంటాయి. భవిష్యత్ సెంట్రల్ బ్యాంకింగ్ పరిణామంలో తాజా పరిణామాలు ఒక మలుపుగా మారుతాయి.
- గ్లోబల్ సౌత్ దేశాలకు స్థిరమైన వృద్ధి, ధరలు, ఆర్థిక స్థిరత్వాలను కొనసాగించడం సవాలు.



- కోరుకున్న ఫలితాలను సాధించేందుకు సెంట్రల్ బ్యాంకులు ఎంతో వివేకంతో వ్యవహరించాల్సిన పరిస్థితి ఉంది. ఈ మేరకు ద్రవ్య, ఆర్థిక, నిర్మాణాత్మక విధానాలను అవలంబించాలి. మరింత దృఢమైన, వాస్తవిక, అతి క్రియాశీల పాలసీ ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందించాలి.

రేటు తగ్గింపు ఉండకపోవచ్చు...

ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2% అటు ఇటుగా 4% వద్ద ఉండాలి. అంటే ఎగువదిశగా 6 % పైకి పెరగకూడదు. అక్టోబర్‌లో నమోదయిన తీవ్ర ద్రవ్యోల్బణం గణాంకాల నేపథ్యంలో ఆర్‌బీఐ సమీప భవిష్యత్‌లో వడ్డీరేట్ల తగ్గుదలకు సంకేతాలు ఇవ్వకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం 6.5 శాతంగా ఉన్న రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు) తగ్గే అవకాశాలు లేవని వారు విశ్లేషిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి రిటైల్ ద్రవ్యోల్బణం 6% దిగువన కొనసాగింది. రిటైల్ ద్రవ్యోల్బణంలో ఆహార ద్రవ్యోల్బణం సమీక్షా నెల్లో ఏకంగా 10.87 శాతంగా నమోదయ్యింది.

ఆర్‌క్యాప్ కొనుగోలు రేసులో హిందుజా

డీపీఐఐటీ తాజాగా గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కుకున్న రిలయన్స్ క్యాపిటల్(ఆర్‌క్యాప్) కొనుగోలు రేసులో హిందుజా గ్రూప్‌నకు వెసులుబాటు లభించింది. పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ(డీపీఐఐటీ) తాజాగా హిందుజా గ్రూప్ సంస్థ ఐఐహెచ్‌ఎల్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇండస్ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్(ఐఐహెచ్‌ఎల్)లోని కొంత మంది వాటాదారులు చైనా అధీనంలోని హాంకాంగ్ నివాసితులు కావడంతో డీపీఐఐటీ అనుమతి తప్పనిసరి అయ్యింది. కాగా.. సరిహద్దు(చైనా, బంగ్లాదేశ్ తదితర) దేశాల పౌరులు ఎవరైనా దేశీ సంస్థకు యజమాని అయితే.. స్థానికంగా పెట్టుబడుల కోసం ప్రభుత్వ అనుమతిని తీసుకోవలసి ఉంటుంది. వెరసి ఆర్‌క్యాప్ కొనుగోలుకి మారిషస్ సంస్థ ఐఐహెచ్‌ఎల్ రుణ పరిష్కార(రిజల్యూషన్) ప్రణాళికకు దారి ఏర్పాటుకానుంది. ఇప్పటికే రూ. 9,861 కోట్ల విలువైన రిజల్యూషన్ ప్రణాళిక ద్వారా ఐఐహెచ్‌ఎల్ బిడ్డింగ్‌లో గెలుపొందింది. ఈ ప్రణాళికను 2024 ఫిబ్రవరి 27న ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ అనుమతించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా రుణదాతల కమిటీ 99.96 శాతం వోటింగ్‌తో మద్దతు పలికింది. దీనిలో భాగంగా డీపీఐఐటీ తాజాగా అనుమతించింది.

సీ2సీ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ @ 214-226

- 22–26 మధ్య పబ్లిక్ ఇష్యూ
- రూ. 99 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: రక్షణ రంగ సొల్యూషన్ల కంపెనీ సీ2సీ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ షేరుకి 214–226 ధరల శ్రేణిలో పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇష్యూ రేపు(22న) ప్రారంభమై మంగళవారం(26న) ముగియనుంది. ఐపీవోలో భాగంగా 43.83 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా రూ. 99 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. చిన్న కంపెనీలకు ఏర్పాటైన ఎన్‌ఎస్‌ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా సీ2సీ అడ్వాన్స్‌డ్ లిస్టకానుంది. ఇన్వెస్టర్లు కనీసం 600 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఇష్యూ నిధులను పెట్టుబడి వ్యయాలకు వెచ్చించనుంది. ప్రస్తుత ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేయడంతోపాటు బెంగళూరులో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. అంతేకాకుండా దుబాయ్‌లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను నెలకొల్పనుంది. జులై–సెప్టెంబర్ కాలంలో రూ. 43 కోట్ల ఆదాయం, రూ. 9.7 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ఐపీవోకు సీల్ హెచ్ఆర్ సర్వీసెస్

టెక్నాలజీ ఆధారిత మానవ వనరుల సొల్యూషన్లు అందించే సీఐఈఎల్(సీల్) హెచ్ఆర్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 335 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 47.4 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లకు 87 శాతం వాటా ఉంది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థలలో అదనపు వాటాల కొనుగోలుకి, ఇతర సంస్థల కొనుగోళ్లు, కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ ఐపీవో బాట

సెబీకి ప్రాథమిక పత్రాల దాఖలు

న్యూఢిల్లీ: ఆటోమోటివ్ విడిభాగాల కంపెనీ బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. వీటి ప్రకారం మొత్తం రూ. 2,150 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 2,150 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. అయితే ఐపీవోకంటే ముందుగా షేర్ల జారీ ద్వారా రూ. 430 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. దీంతో ఐపీవో పరిమాణం ఆమేర తగ్గే అవకాశముంది. ఇష్యూ నిధుల్లో రూ. 1,618 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. 2024 జూన్‌కల్లా కంపెనీ రుణ భారం రూ. 2,463 కోట్లుగా నమోదైంది. కంపెనీ ప్రధానంగా ఆటో రంగంలో వినియోగించే వివిధ రక్షణాత్మక కీలక వ్యవస్థల అభివృద్ధి, తయారీలో ఉంది. కంపెనీ గతేడాది(2023–24) ఆదాయం 14 శాతం ఎగసి రూ. 7,484 కోట్లను తాకగా.. రూ. 311 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్–జూన్)లో రూ. 1,781 కోట్ల టర్నోవర్, దాదాపు రూ. 72 కోట్ల నికర లాభం సాధించింది.

ఢిల్లీ ఖాన్ మార్కెట్.. చాలా కాస్ట్‌లీ

- అంతర్జాతీయంగా 22వ స్థానం
- ప్రముఖ రిటైల్ లొకేషన్‌గా గుర్తింపు
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఖాన్ మార్కెట్ మరోసారి అంతర్జాతీయ గుర్తింపు పొందింది. అత్యంత ఖరీదైన రిటైల్ ప్రాంతాల్లో ప్రపంచంలో 22వ స్థానంలో నిలిచింది. ఇక్కడ ఒక చదరపు అడుగు రిటైల్ స్థలానికి వార్షికంగా చెల్లించాల్సిన అద్దె 229 డాలర్లు (రూ.19,000). ఈ వివరాలను కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ 'మెయిన్ స్ట్రీట్స్ అక్రాస్ ద వరల్డ్ 2024' పేరుతో విడుదల చేసింది. 2,047 డాలర్ల వార్షిక అద్దెతో ఇటలీలోని మిలాన్‌లో 'మాంటే నెపోలియన్' ప్రపంచంలోనే ఖరీదైన రిటైల్ మార్కెట్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పలు నగరాల్లోని 138 అత్యుత్తమ ప్రాంతాలను ఈ నివేదిక పరిగణనలోకి తీసుకుంది. ప్రతీ మార్కెట్‌లోని అత్యంత ఖరీదైన రిటైల్ షాపింగ్‌ల కేంద్రాన్ని జాబితాలోకి తీసుకుంది. ఖాన్ మార్కెట్ దేశంలోనే అత్యంత ఖరీదైన రిటైల్ వ్యాపార సంస్థల కేంద్రంగా నిలిచింది. వార్షికంగా ఇక్కడి అద్దె 7 శాతం పెరిగింది.

సంపన్నుల షాపింగ్ కేంద్రం..

ఖాన్ మార్కెట్ అంతర్జాతీయంగా ప్రముఖ రిటైల్ కేంద్రాల్లో ఒకటిగా నిలవడం భారత దేశ రిటైల్ రంగం బలాన్ని తెలియజేస్తోందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ రిటైల్ హెడ్, ఎండీ సౌరభ్ షట్‌దాల్ పేర్కొన్నారు. ప్రీమియం బ్రాండ్లు, బోతిక్‌లతో సంపన్న షాపర్లను ఖాన్ మార్కెట్ ఆకర్షిస్తున్నట్టు చెప్పారు. సదరు ప్రాంతంలో రిటైల్ వాణిజ్య స్థలాల లభ్యత తక్కువగా ఉండడంతో, పోటీ పెరిగి అద్దెలు పెరిగేందుకు దారితీస్తున్నట్టు పేర్కొన్నారు. అంతేకాదు దేశవ్యాప్తంగానూ ప్రముఖ రిటైల్ మార్కెట్లలో షాపింగ్ స్థలాల సరఫరా అంతగా లేదని, అదే సమయంలో బలమైన డిమాండ్ తోడు కావడంతో అద్దెల్లో పటిష్ట వృద్ధి కనిపిస్తున్నట్టు చెప్పారు. ఆర్థికంగా బలమైన వృద్ధి, వినియోగదారుల ప్రాధాన్యతలు విస్తరిస్తుండడంతో దేశ రిటైల్ రంగం స్థిరమైన విజయ బాటలో కొనసాగుతున్నట్టు షట్‌దాల్ వివరించారు.

టాప్–10 రిటైల్ లొకేషన్లు

న్యూయార్క్‌లోని 'ఫిఫ్త్ అవెన్యూ' 2,000 డాలర్ల వార్షిక అద్దెతో మాంటే నెపోలియన్ తర్వాత రెండో స్థానంలో నిలిచింది. 1,762 డాలర్ల వార్షిక అద్దెతో లండన్‌లోని న్యూబాండ్ స్ట్రీట్ మూడో స్థానంలో ఉంది. హాంగ్‌కాంగ్‌లోని సిమ్‌షాసుయ్ 1,607 డాలర్లు, ప్యారిస్‌లోని అవెన్యూ డెస్ చాంప్స్ 1,282 డాలర్లు, టోక్యోలోని గింజా 1,186 డాలర్లు, జ్యూరిస్‌లోని బాన్‌హోఫ్‌స్ట్రాస్సే 981 డాలర్లు, సిడ్నీలోని పిట్‌స్ట్రీట్‌మాల్ 802 డాలర్లు, సియోల్‌లోని మయాంగ్‌డాంగ్ 688 డాలర్లు, వియన్నాలోని ఖోల్‌మార్కెట్ 553 డాలర్ల అద్దెతో వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి.



సాకేత్ జోడీ శుభారంభం

సాక్షి, హైదరాబాద్: యోకోహామ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని శుభారంభం చేశాడు. పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. జపాన్‌లో గురువారం జరిగిన తొలి రౌండ్‌లో సాకేత్ (భారత్)–బెంజమిన్ హసన్ (లెబనాన్) ద్వయం 6–3, 6–2తో రియుకి మత్సుదా–రియో నొగుచి (జపాన్) జోడీపై విజయం సాధించింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సాకేత్–హసన్ ఏడు ఏస్‌లు సంధించడంతోపాటు ఒక డబుల్ ఫాల్ట్ చేశారు. ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసి తమ సర్వీస్‌ను ఒకసారి చేజార్చుకున్నారు.

రిత్విక్ జంట ముందుకు



సాక్షి, హైదరాబాద్: రొవరెటో ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రిత్విక్–శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీ 6–3, 6–2తో ఫిలిపో రొమానో–స్టెఫానో ట్రవాగ్లియా (ఇటలీ) జంటపై విజయం సాధించింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రిత్విక్–బాలాజీ జోడీ ఎనిమిది ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ మాత్రమే చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి జంట సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

సాత్విక్–చిరాగ్ జోడీ జోరు

క్వార్టర్ ఫైనల్లో భారత ద్వయం
- సింధు, మాళవిక, అనుపమ నిష్క్రమణ
- గాయత్రి–ట్రెసా ద్వయం ఓటమి


సాత్విక్, చిరాగ్

షెన్‌జెన్: పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఆడుతున్న తొలి టోర్నమెంట్ చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. డిఫెండింగ్ చాంపియన్ జోడీగా ఈ టోర్నీలో ఆడుతున్న సాత్విక్–చిరాగ్ ద్వయం కష్టపడి గెలిచి ముందంజ వేసింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 9వ ర్యాంక్ జంట సాత్విక్–చిరాగ్ 21–19, 21–15తో ప్రపంచ 15వ ర్యాంక్ ద్వయం రస్మస్ జార్–ఫ్రెడెరిక్ సొగార్డ్ (డెన్మార్క్)పై గెలిచింది. 44 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీకి గట్టిపోటీనే ఎదురైంది. తొలి గేమ్ చివర్లో సాత్విక్–చిరాగ్ పైచేయి సాధించారు. రెండో గేమ్‌లో స్కోరు 13–12 వద్ద భారత జంట వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 17–12తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో రెండో గేమ్‌నూ సొంతం చేసుకొని విజయాన్ని ఖరారు చేసుకుంది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంక్ జోడీ కిమ్ అస్ట్రప్–ఆండెర్స్ స్కారప్ రస్ముసేన్ (డెన్మార్క్)తో సాత్విక్–చిరాగ్ ద్వయం తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో భారత జంట 3–6తో వెనుకబడి ఉండటం గమనార్హం.

లక్ష్య సేన్ ముందంజ

పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. రస్మస్ గెమ్కే (డెన్మార్క్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 21–16, 21–18తో అలవోకగా గెలిచాడు. 46 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌లో దూకుడుగా ఆడాడు. 13–6తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రస్మస్ వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి ఆధిక్యాన్ని 13–10కి తగ్గించాడు. ఈ దశలో లక్ష్య సేన్ నిలకడగా రాణించి తొలి గేమ్‌ను దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో లక్ష్య సేన్‌కు గట్టిపోటీ ఎదురైంది. పలుమార్లు ఇద్దరి స్కోర్లు సమమయ్యాయి. అయితే కీలకదశలో లక్ష్య సేన్ పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఆడుతున్న నాలుగో టోర్నీలో లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్ చేరుకోవడం గమనార్హం. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 3వ ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సన్ (డెన్మార్క్)తో లక్ష్య సేన్ ఆడతాడు. ముఖాముఖి రికార్డులో లక్ష్య సేన్ 2–4తో వెనుకంజలో ఉన్నాడు.

ముగ్గురికీ నిరాశ

మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. భారత స్టార్ పీవీ సింధు, రైజింగ్ స్టార్స్ మాళవిక బన్సోద్, అనుపమ ఉపాధ్యాయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలయ్యారు. ప్రపంచ 19వ ర్యాంకర్ సింధు 16–21, 21–17, 21–23తో యో జియా మిన్ (సింగపూర్) చేతిలో పరాజయం చవిచూసింది. గతంలో జియా మిన్‌తో ఆడిన ఐదుసార్లూ నెగ్గిన సింధుకు ఆరోసారి మాత్రం చుక్కెదురైంది. నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు ఒకదశలో 13–9తో ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో జియో మిన్ వరుసగా ఆరు పాయింట్లు గెలిచి 15–13తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత ఇద్దరూ ప్రతి పాయింట్‌కు నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. చివరకు జియా మిన్ కొట్టిన బాడీ స్మాష్‌కు సింధు జవాబివ్వలేకపోవడంతో ఆమె ఓటమి ఖరారైంది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మాళవిక 9–21, 9–21తో సుపనిద (థాయ్‌లాండ్) చేతిలో, అనుపమ 7–21, 14–21తో నత్సుకి నిదైరా (జపాన్) చేతిలో ఓడిపోయారు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 16–21, 11–21తో రెండో సీడ్ లియు షెంగ్ షు–టాన్ నింగ్ (చైనా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ ఫెంగ్ యాన్ జె–హువాంగ్ డాంగ్ పింగ్ (చైనా) జోడీకి సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జంట 'వాకోవర్' ఇచ్చింది.


లక్ష్య సేన్


సింధు



బిగ్‌బాష్ లీగ్‌కు యస్తిక దూరం

గాయంతో టోర్నీ మధ్యలోనే తప్పుకున్న భారత కీపర్

మెల్‌బోర్న్: ఉమెన్ బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో మెల్‌బోర్న్ స్టార్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత వికెట్ కీపర్ యస్తిక భాటియా అనూహ్యంగా గాయంతో తప్పుకుంది. ఆమె మణికట్టుకు ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. ఈ సీజన్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడిన యస్తిక టోర్నీలోని మిగతా మ్యాచ్‌లకు దూరమైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లోనే గాయపడినా... ఆదివారం మెల్‌బోర్న్ స్టార్స్ తర్వాతి మ్యాచ్‌లోనూ ఆమె బరిలోకి దిగింది. అయితే పరిస్థితి ఇబ్బందికరంగా మారడంతో బుధవారం యస్తిక స్థానంలో సోఫీ రీడ్ తుది జట్టులోకి వచ్చింది. 6 ఇన్నింగ్స్‌లలో కలిపి యస్తిక ఒక అర్ధ సెంచరీ సహా 154 పరుగులు చేసింది. గాయం తీవ్రతపై మరింత స్పష్టత కోసం యస్తిక భారత్‌కు తిరిగి రానుంది. వచ్చే నెల 5 నుంచి ఆస్ట్రేలియాలోనే జరిగే మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొనే భారత జట్టులో భాగంగా ఉన్న యస్తిక ఆలోపు కోలుకుంటుందా లేదా అనేది చూడాలి. ఇటీవలే మోకాలి గాయంతో ఐదు నెలల పాటు ఆటకు దూరమైన యస్తిక స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌తో పునరాగమనం చేసింది.

ట్వీట్‌లకు, పోస్ట్‌లకు లెబ్రాన్ జేమ్స్ విరామం



లాస్ ఏంజెలిస్ (అమెరికా): విఖ్యాత బాస్కెట్‌బాల్ ప్లేయర్ లెబ్రాన్ జేమ్స్ ట్వీట్లు, పోస్ట్‌లకు విరామం ఇస్తానని ప్రకటించి తన అభిమానులను కాస్త నిరాశపరిచాడు. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ)లో ఆల్‌టైమ్ బెస్ట్ స్కోరర్‌గా కొనసాగుతున్న అతనికి ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (పాత ట్విట్టర్)లో కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. జేమ్స్ ఆకస్మిక నిర్ణయానికి కారణం లేకపోలేదు. సమాజానికి తన సైలెన్స్‌తో సందేశం ఇవ్వడానికే సోషల్ మీడియాకు తాత్కాలిక విరామం ప్రకటించాడు. అతని సహచరుడు కెవిన్ డ్యురంట్ మేనేజర్ రిచ్ క్లీమన్ ఇటీవల సోషల్ మీడియాలో పెరిగిపోతున్న అసత్య, ప్రతికూల వార్తలు మన కళ్లను గుడ్డిగా నమ్మేలా చేయడంపై ప్రముఖంగా ప్రస్తావించాడు. దీన్ని ఉటంకిస్తూ... వైరల్ అవుతున్న వార్తల్లో 'రియల్' కనిపించకపోవడం తనని కూడా కదిలించేలా చేసిందని, అందుకే ఈ విరామం అని లెబ్రాన్ జేమ్స్ చెప్పాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో 159 మిలియన్ల (15 కోట్ల 90 లక్షల మంది), 'ఎక్స్'లో 52.9 మిలియన్ల (5 కోట్ల 20 లక్షల 90 వేల మంది) అభిమానులు లెబ్రాన్‌ను సోషల్ మీడియాలో అనుసరిస్తారు. అతని ట్వీట్‌కు జై కొడతారు... పోస్ట్ పెడితే పండగ చేసుకుంటారు. ఇప్పుడు వీళ్లందరూ తమ సూపర్‌స్టార్ ముచ్చట్లు లేక వెలవెలబోనున్నారు. ఎన్‌బీఏలో జేమ్స్ జగద్విఖ్యాత బాస్కెట్‌బాలర్. త్వరలోనే 40వ పడిలో అడుగిడబోతున్నా... ఈ వెటరన్ స్టార్‌కు ఆటపై పస, ధ్యాస ఏమాత్రం తగ్గలేదు. ఎన్‌బీఏలో నాలుగుసార్లు, ఒలింపిక్స్‌లో మూడుసార్లు చాంపియన్‌గా నిలిచిన జట్టులో సభ్యుడైన లెబ్రాన్ లాస్ ఏంజెలిస్ లేకర్స్‌కు ఆడుతున్నాడు.

సెమీస్‌లో రిషబ్ జోడీ

కాలాబురాగి (కర్ణాటక): అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) కాలాబురాగి ఓపెన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ రిషబ్ అగర్వాల్ సింగిల్స్ విభాగంలో రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. డబుల్స్ విభాగంలో సహచరుడు కబీర్ హన్స్‌తో కలిసి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. సింగిల్స్ రెండో రౌండ్‌లో రిషబ్ 2–6, 1–6తో మాక్సిమ్ జుకోవ్ (రష్యా) చేతిలో ఓడిపోయాడు. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రిషబ్–కబీర్ (భారత్) ద్వయం 7–5, 6–3తో భారత్‌కే చెందిన మనీశ్ సురేశ్ కుమార్–పరీక్షిత్ సోమాని జంటపై గెలిచింది.



తెలుగు టైటాన్స్‌దే పైచేయి

31–29తో వారియర్స్‌పై గెలుపు


వారియర్స్ రెయిడర్‌ను పట్టేసిన టైటాన్స్ ఆటగాళ్లు

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ 'హ్యాట్రిక్' విజయాలతో పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. గురువారం జరిగిన పోరులో టైటాన్స్ 31–29తో బెంగాల్ వారియర్స్‌పై నెగ్గింది. కెప్టెన్ విజయ్ మలిక్ (14 పాయింట్లు) అద్భుతంగా రాణించాడు. మ్యాచ్ కీలక దశలో రెయిడింగ్‌కు వెళ్లిన విజయ్ మూడు పాయింట్లు తెచ్చిపెట్టడం టైటాన్స్ విజయానికి కారణమైంది. డిఫెన్స్‌లోనూ తెలుగు జట్టు ప్రత్యర్థిపై పైచేయి సాధించేలా చేసింది. ఆల్‌రౌండర్ శంకర్ గడాయ్, డిఫెండర్ అంకిత్, రెయిడర్ మన్‌జీత్ తలా 3 పాయింట్లు సాధించారు. వారియర్స్ తరఫున రెయిడర్ ప్రణయ్ రాణే (9) అదరగొట్టాడు. తొలి అర్ధభాగాన్ని 19–9తో టైటాన్స్ ముగించగా... ద్వితీయార్ధంలో ప్రణయ్ క్రమంగా తెచ్చిపెట్టిన పాయింట్లతో రేసులోకి వచ్చింది. మిగతా వారిలో హేమరాజ్, విశ్వాస్ చెరో 4 పాయింట్లు చేశారు. అయితే తెలుగు కెప్టెన్ విజయ్ మలిక్ చేసిన పోరాటంతో విజయం దక్కింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 32–26తో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. స్టీలర్స్ జట్టులో రెయిడర్ వినయ్ (12) ఆకట్టుకున్నాడు. మిగతా వారిలో ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా 4, రెయిడర్ శివమ్ 5, డిఫెండర్ సంజయ్ 4 పాయింట్లు చేశారు. బుల్స్ జట్టులో ఒక్క అక్షిత్ (7) మాత్రమే నిలకడగా స్కోరు చేశాడు. స్టార్ రెయిడర్, కెప్టెన్ ప్రదీప్ నర్వాల్ (1) ఆకట్టుకోలేకపోయాడు. నితిన్ రావల్ (4), జై భగవాన్ (3) మెరుగ్గా ఆడారు. ఇప్పటివరకు 12 మ్యాచ్‌లాడిన హరియాణా 9 విజయాలతో టాప్‌లో నిలువగా, 12 మ్యాచ్‌ల్లో ఎనిమిది గెలిచిన టైటాన్స్ రెండో స్థానంలో ఉంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్‌తో యూపీ యోధాస్ (రాత్రి 8 గంటలకు), జైపూర్ పింక్ పాంథర్స్‌తో దబంగ్ ఢిల్లీ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

ట్రయాథ్లాన్ దిగ్గజం అలిస్టర్ బ్రౌన్‌లీ వీడ్కోలు



లండన్: మూడు క్రీడాంశాల సమాహారమైన ట్రయాథ్లాన్‌లో (1500 మీటర్ల స్విమ్మింగ్, 40 కిలోమీటర్ల సైక్లింగ్, 10 కిలోమీటర్ల రన్నింగ్) తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న బ్రిటన్ స్టార్, రెండు వరుస ఒలింపిక్స్ చాంపియన్ అలిస్టర్ బ్రౌన్‌లీ తన కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. అతను లండన్ (2012), రియో (2016) ఒలింపిక్స్ క్రీడల్లో బంగారు పతకాలు గెలుపొందాడు. అంతకుముందు ఈ స్టార్ 2009, 2011లలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌ల్లోనూ చాంపియన్‌గా నిలిచాడు. మరో నాలుగుసార్లు యూరోపియన్ చాంపియన్‌గా ఘనత వహించాడు. తన విజయవంతమైన కెరీర్‌కు బైబై చెప్పేందుకు ఇదే సరైన సమయమన్నాడు. 'ఎక్స్'లో తన రిటైర్మెంట్‌ను ప్రకటించిన అతను 'ఈ అధ్యాయాన్ని ఇంతటితో ముగిస్తున్నాను. ప్రొఫెషనల్ కెరీర్‌లో ఎన్నో విజయాలు చవిచూసిన నాకు ఇప్పుడీ క్షణాలు ఓ వైపు ఉత్సాహాన్ని మరోవైపు ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి' అని ట్వీట్ చేశాడు. ఇప్పుడు సరికొత్త సవాళ్లపై దృష్టి పెడతానని చెప్పాడు. 36 ఏళ్ల వయసులో మళ్లీ స్టార్ట్ లైన్ వద్ద నిల్చోలేనని, ఇందుకోసం శ్రమించలేనని అన్నాడు. 2012, 2016... ఈ రెండుసార్లు అతని సోదరుడు జొనాథన్ (జానీ) బ్రౌన్‌లీ కూడా పతకాలు నెగ్గడం మరో విశేషం! లండన్‌లో కాంస్యం నెగ్గిన జానీ... రియోలో రజతం గెలిచాడు.



'బిల్లీ జీన్ కింగ్ కప్' చాంపియన్ ఇటలీ

మలాగా (స్పెయిన్): మహిళల ప్రపంచ టీమ్ టెన్నిస్ టోర్నమెంట్ 'బిల్లీ జీన్ కింగ్ కప్'లో ఇటలీ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో ఇటలీ 2–0తో స్లొవేకియా జట్టును ఓడించింది. తొలి మ్యాచ్‌లో లూసియా బ్రాంజెట్టి 6–2, 6–4తో విక్టోరియా రుంకకోవాను ఓడించగా... రెండో మ్యాచ్‌లో జాస్మిన్ పావోలిని 6–2, 6–1తో రెబెకా స్రామ్‌కోవాపై నెగ్గడంతో ఇటలీ విజయం ఖరారైంది. ఓవరాల్‌గా ఇటలీకిది ఐదో బిల్లీ జీన్ కింగ్ కప్ టైటిల్. ఆ జట్టు చివరిసారి 2013లో ఈ టైటిల్‌ను సాధించింది. 2013లో విజేత జట్టులో సభ్యురాలిగా ఉన్న సారా ఎరాని ఈసారీ జట్టులో ఉండటం విశేషం. ప్రపంచ నాలుగో ర్యాంకర్ జాస్మిన్ ప్రదర్శన ఇటలీ విజయంలో ముఖ్యపాత్ర పోషించింది. ఈ ఏడాది జాస్మిన్ అద్భుతంగా రాణించింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో... వింబుల్డన్ టోర్నీలో సింగిల్స్‌లో ఆమె రన్నరప్‌గా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ డబుల్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించింది.

ఆ 457 మంది పేర్లు చకచకా...

- ఐపీఎల్ వేలం ప్రక్రియ
- ఆక్షనర్‌గా మల్లికా సాగర్


రికీ భుయ్
మల్లికా సాగర్

ముంబై: ఐపీఎల్–2025 సీజన్ కోసం ఈ నెల 24, 25 తేదీల్లో సౌదీ అరేబియాలోని జిద్దా నగరంలో వేలం జరగనుంది. వేలంలో మొత్తం 574 మంది ఆటగాళ్లు అందుబాటులో ఉన్నారు. అయితే ఇంత మంది పేర్లను ఒక్కొక్కరిగా పిలిచి వేలం ప్రక్రియ కొనసాగించడం చాలా సుదీర్ఘంగా, కష్టతరంగా మారే అవకాశం ఉంది. దాంతో బీసీసీఐ 'యాక్సిలరేటెడ్ ఆక్షన్' అంటూ వేలాన్ని వేగంగా ముగించేందుకు సిద్ధమైంది. వేలంలో మొదటి 116 మంది కోసం మాత్రమే ఫ్రాంచైజీలు ముందుగా పోటీ పడతాయి. వరుసగా అంతర్జాతీయ క్రికెట్ ఆడిన మార్క్యూ ప్లేయర్లు, స్పెషలిస్ట్ బ్యాటర్లు, ఆల్‌రౌండర్లు, వికెట్‌కీపర్ బ్యాటర్లు, పేస్ బౌలర్లు, స్పిన్ బౌలర్లు... ఇలా వేలం సాగుతుంది. ఈ వరుసలో చివరగా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించని అన్‌క్యాప్డ్ ప్లేయర్లు వస్తారు. వీరి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. దాంతో 117 నుంచి 574 నంబర్ వరకు ఉన్న ఆటగాళ్లను ఎంచుకునే విషయంలో ఫ్రాంచైజీలకు ముందే ఒక అవకాశం ఇస్తున్నారు. తాము కోరుకుంటున్న ఆటగాళ్ల పేర్లను తొలి రోజు వేలం ముగిసిన తర్వాత రాత్రి 10 గంటల వరకు అందించాలి. వీరి పేర్లనే వేలంలో ప్రకటిస్తారు. అనంతరం అప్పటి వరకు అమ్ముడుపోని ఆటగాళ్లలో ఇంకా ఎవరినైనా తీసుకోవాలనే ఆలోచన ఉంటే వారి పేర్లను కూడా ఈ 'యాక్సిలరేటెడ్ ఆక్షన్'లో చెప్పాల్సి ఉంటుంది. దీని వల్ల సమయం ఆదా అవుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ జాబితాలో 117వ ఆటగాడిగా ఆంధ్ర క్రికెటర్ రికీ భుయ్ ఉండగా... మిగిలిన వారిలో మొయిన్ అలీ, టిమ్ డేవిడ్, స్పెన్సర్ జాన్సన్, ఉమ్రాన్ మలిక్, ముస్తఫిజుర్, సాంట్నర్, నబీ, స్టీవ్ స్మిత్, సర్ఫరాజ్ ఖాన్, జేమ్స్ అండర్సన్ తదితర గుర్తింపు పొందిన ఆటగాళ్లు ఉన్నారు. ఈ వేలం ప్రక్రియను ప్రముఖ ఆక్షనీర్ మల్లికా సాగర్ నిర్వహించనుంది. గత ఏడాది కూడా ఆమెనే ఆక్షనర్‌గా వ్యవహరించింది. మరోవైపు భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే పెర్త్ టెస్టు మూడో, నాలుగో రోజుల్లో ఈ వేలం నిర్వహించడంపై కాస్త చర్చ జరిగింది. అయితే సమయం భిన్నంగా ఉండటం వల్ల ఆటగాళ్లు, అభిమానులు కూడా పూర్తి స్థాయిలో వేలం ప్రక్రియను అనుసరించవచ్చు. భారత కాలమానం ప్రకారం టెస్టు ఆట మధ్యాహ్నం గం. 2:50 నిమిషాలకు ముగుస్తుంది. వేలం మధ్యాహ్నం గం. 3:30 నిమిషాలకు ప్రారంభం కానుంది.


ఐస్‌ల్యాండ్‌లోని రెక్‌జేన్స్ ద్వీపకల్ప ప్రాంతంలో అగ్నిపర్వతం బద్దలై లావా సమీప ప్రాంతాలను చుట్టుముడుతున్న దృశ్యం


గురువారం లెబనాన్‌లోని దహియే పట్టణంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి తర్వాత ఘటనాస్థలి నుంచి వెలువడుతున్న పొగ


బుధవారం అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం వీడ్ పట్టణంలో భారీగా కురిసిన మంచులో కూరుకుపోయిన ట్రాక్టర్

హస్తినలో మొదలైన ఎన్నికల హడావుడి

అసెంబ్లీ ఎన్నికల కార్యాచరణను ప్రారంభించిన బీజేపీ, ఆప్

- 11 మందితో అప్పుడే ఆప్ తొలిజాబితా
- సన్నాహాల్లో వెనుబడినట్లు కనిపిస్తున్న కాంగ్రెస్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుతం మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు ముగియడంతో క్రమంగా వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఇప్పటికే తమ ఎన్నికల కసరత్తును బీజేపీ, ఆప్ పార్టీలు ముమ్మరం చేసి దాడి, ఎదురుదాడులను మొదలు పెట్టాయి. ఆప్ నేత కైలాశ్ గహ్లోత్ బీజేపీలో చేరిన తర్వాత రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావడానికి ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్వయంగా రంగంలోకి దిగి పలు ప్రాంతాల్లో ఢిల్లీ ప్రజలతో సంప్రదింపులు జరుపుతుండగా, మరోవైపు బీజేపీ తమ ఢిల్లీ నేతలను క్రియాశీలం చేసింది. గురువారం 11 మందితో ఆప్ తొలిజాబితాను సైతం విడుదల చేసింది.

పోటీపోటీగా ఆప్, బీజేపీ..

వచ్చే ఏడాది జరుగనున్న ఎన్నికల కార్యాచరణ ప్రణాళిక, వ్యూహాల అమలులో ఆప్, బీజేపీలు పోటీ పడుతున్నాయి. ఢిల్లీ లిక్కర్ పాలసీలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాలతో పాటు మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ అరెస్టులపై తీవ్ర స్థాయిలో పోరాటం చేసిన బీజేపీ, అనంతరం సైతం ఏమాత్రం తగ్గకుండా అంతకంతకూ పెరుగుతున్న యమునా నది కాలుష్యం, పెరిగిన వాయు కాలుష్యం, తాగునీటి ఎద్దడి, ముంపు ప్రాంతాల్లో బాధితులకు అందని సహకారం వంటి అంశాలపై గడిచిన నాలుగు నెలలుగా తన పోరాటాన్ని ఉధృతం చేసింది. ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై గడిచిన వారం రోజులుగా పోస్టర్ వార్‌తో పాటు వీధి పోరాటాలు చేస్తోంది. ఇక ఈడీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలను అడ్డుపెట్టుకొని బీజేపీ శిఖండి రాజకీయాలు చేస్తోందని ఆప్ ఎదురుదాడి చేస్తోంది. ప్రజా ప్రభుత్వానికి అధికారాలు ఇవ్వకుండా.. లెఫ్టినెంట్ గవర్నర్‌కు అసాధారణ అధికారాలు కట్టబెట్టి, సమస్యలను జటిలం చేస్తోందని ఆప్ సైతం తీవ్ర స్థాయిలో స్పందిస్తోంది. ఈ పరిణామాలు ఓ పక్క జరుగుతున్న సమయంలోనే ఆప్ కీలక నేత, మాజీ మంత్రి కైలాశ గహ్లోత్ బీజేపీలో చేరారు. దీనికి బదులుగా బీజేపీ మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝూని తన పార్టీలో చేర్చుకుంది ఆప్. ఈడీ కేసుల భయంతోనే గహ్లోత్ పార్టీ మారారని ఆప్ ఆరోపిస్తే, కేజ్రీవాల్‌కు రాజకీయ ఆశయాలు పెరగడం వల్లే ఆయన పార్టీ మారారని బీజేపీ ప్రత్యారోపణలకు దిగింది. ఇక మరోపక్క ఎన్నికల అభ్యర్థులను త్వరగా ఖరారు చేసేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీరేందర్ సచ్‌దేవా ఇప్పటికే పార్టీ స్టీరింగ్ కమిటీ, మెనిఫెస్టోకమిటీతో భేటీలు జరుపగా, ఆప్ అధినేత కేజ్రీవాల్ వీధి సభలతో ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తం 70 స్థానాలకు గానూ 2015లో 67, 2020లో 62 స్థానాలు గెలిచిన ఆప్ తిరిగి 60కి పైగా స్థానాలను గెలిచే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

పొత్తు లేదు.. కాంగ్రెస్‌తో పోరే

ఇక ఢిల్లీ ఎన్నికల సన్నాహాల్లో పూర్తిగా వెనుకబడ్డ కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఒంటరిగానే పోటీ చేసే అవకాశాలున్నాయి. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌తో కలిసి పోటీ చేసినా రెండు పార్టీలు ఏడింటిలో ఒక్క సీటును గెలుచుకోలేకపోయాయి. ఆప్ నాలుగు, కాంగ్రెస్ మూడు స్థానాల్లో పోటీచేసి అన్నిచోట్ల పరాజయం పాలయ్యాయి. అనంతరం జరిగిన హరియాణా ఎన్నికల్లో ఆప్‌తో పొత్తు ఉంటుందని భావించినా, సీట్ల సర్దుబాటు కుదరక రెండు పార్టీలు ఒంటరిగానే పోటీ చేశాయి. వచ్చే ఎన్నికల్లోనూ రెండు పార్టీలు విడివిడిగానే కొట్లాడుతాయని ఇప్పటికే సంకేతాలు వెళ్లడంతో కాంగ్రెస్ ఆప్ ప్రభుత్వంపై పోరాటం మొదలు పెట్టింది. ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు సందీప్ దీక్షిత్‌లు న్యాయ్ యాత్రల ద్వారా ప్రజల్లోకి వెళ్లి ఆప్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆప్ తొలి జాబితా విడుదల

ఆరుగురు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారే

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ అప్పుడే సిద్ధమైంది. 2025, ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలకు ముందుగానే తమ అభ్యర్థులను ప్రకటించింది. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి 11మంది అభ్యర్థులతో తొలి జాబితాను జాతీయ ప్రధాన కార్యదర్శి సందీప్ పాఠక్ గురువారం విడుదల చేశారు. ఛత్తర్‌పూర్ అభ్యర్థిగా బ్రహ్మసింగ్ తన్వర్, బదార్‌పూర్ అభ్యర్థిగా రామ్‌సింగ్ నేతాజీ, లక్ష్మీనగర్ అభ్యర్థిగా బీబీ త్యాగి, సీలంపూర్ అభ్యర్థిగా చౌదరి జుబీర్ అహ్మద్, సీమాపురి అభ్యర్థిగా వీర్ సింగ్ ధింగాన్, రోహ్తాస్ నగర్ అభ్యర్థిగా సరితా సింగ్, ఘోండా అభ్యర్థిగా గౌరవ్ శర్మ, విశ్వాస్‌నగర్ అభ్యర్థిగా దీపక్ సింగ్లా, కర్వాల్‌నగర్ అభ్యర్థిగా మనోజ్ త్యాగి, కిరారీ అభ్యర్థిగా అనిల్‌ఝా, మటియాలా అభ్యర్థిగా సోమేశ్ షోకీన్‌ల పేర్లను అధిష్టానం ఖరారు చేసింది. 11మంది అభ్యర్థుల జాబితాలో ఆరుగురు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారే ఉన్నారు. వీరిలో ముగ్గురు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్ నుంచి వచ్చినవారు కావడం గమనార్హం. ఛత్తర్‌పూర్, కిరాడీ అభ్యర్థులుగా ఖరారైన బ్రహ్మసింగ్ తన్వర్, అనిల్ ఝాలు బీజేపీ మాజీ ఎమ్మెల్యేలు. వీరు ఈ ఏడాది ఆ పార్టీకి రాజీనామా చేసి ఆప్‌లో చేశారు. వీరు ఇరువురూ రెండుసార్లు ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్లుగా కూడా గెలిచారు. ఇక, దీపక్ సింఘ్లా కిందటి ఎన్నికల్లో బీజేపీ నేత ఓమ్ ప్రకాశ్ శర్మ చేతిలో ఓటమిపాలయ్యారు. సరితా సింగ్ ఆప్ విద్యార్థి విభాగం ఛత్ర యువ సంఘర్షణ సమితి అధ్యక్షురాలు. రోహతాస్ నగర్ నుంచి గతంలో గెలిచారు.

యుద్ధం ఆపేస్తేనే ఒప్పందం

యుద్ధం ముగియకుండా ఖైదీల మార్పిడిని నిరాకరించిన హమాస్

జెరూసలేం: గాజా స్ట్రిప్‌లో యుద్ధం ముగిసే వరకు ఇజ్రాయెల్‌తో బందీల మార్పిడి ఒప్పందం ఉండదని హమాస్ స్పష్టం చేసింది. యుద్ధం ముగియకుండా, ఖైదీల మార్పిడి జరగదని హమాస్ తాత్కాలిక చీఫ్ ఖలీల్ అల్ హయా బుధవారం పేర్కొన్నారు. దురాక్రమణకు ముగింపు పలకకుండా బందీలను ఎందుకు వదిలేస్తామనిఆయన ప్రశ్నించారు. యుద్ధం మధ్యలో ఉండగా తమ వద్ద ఉన్న బలాన్ని మతి స్థిమితం లేని వ్యక్తి కూడా వదులుకోడని వ్యాఖ్యానించారు. సంప్రతింపులను పునరుద్ధరించడానికి కొన్ని దేశాలు, మధ్యవర్తులతో చర్చలు జరుగుతున్నాయని, తాము ఆ ప్రయత్నాలను కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. యుద్ధం ఆపడానికి ఆక్రమించినవారు నిబద్ధతతో ఉన్నారా? లేదా అనేది ముఖ్యమని హయా చెప్పారు. చర్చలను బలహీనపరిచే వ్యక్తి నెతన్యాహు అని రుజువవుతోందన్నారు. మరోవైపు బేషరతుగా శాశ్వత కాల్పుల విరమణకు పిలుపునిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని అమెరికా బుధవారం వీటో చేసింది. కాల్పుల విరమణలో భాగంగా ఇజ్రాయెల్ బందీలను తక్షణమే విడుదల చేయాలని స్పష్టంగా కోరే తీర్మానానికి మాత్రమే అమెరికా మద్దతు ఇస్తుందని ఐరాసలో అమెరికా రాయబారి స్పష్టంచేశారు. ఒప్పందానికి ఇరుపక్షాలు సుముఖత చూపకపోతే మధ్యవర్తిత్వ ప్రయత్నాలను నిలిపివేస్తామని హమాస్, ఇజ్రాయెల్‌కు తెలియజేశామని కాల్పుల విరమణ మధ్యవర్తి అయిన ఖతార్ ప్రకటించింది.

ఈజిప్టు ప్రతిపాదనను స్వాగతించిన హమాస్

గాజా స్ట్రిప్‌ను నడపడానికి అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ ప్రత్యర్థి ఫతా ఉద్యమంతో కలిసి ఒక పరిపాలనా కమిటీని ఏర్పాటు చేయాలని ఈజిప్టు చేసిన ప్రతిపాదనను హమాస్ స్వాగతించింది. యుద్ధం ముగిశాక గాజాను ఈ కమిటీ నడిపించి, సమస్యలను పరిష్కరిస్తుందని హయా చెప్పారు. అయితే ఒప్పందం ఇంకా ఖరారు కాలేదన్నారు. యుద్ధం తరువాత గాజాను పాలించడంలో హమాస్ పాత్రను ఇజ్రాయెల్ తిరస్కరించింది.

దోహాలోని హమాస్ రాజకీయ కార్యాలయాన్ని శాశ్వతంగా మూసివేయలేదని ఖతార్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మజీద్ అల్ అన్సారీ నవంబర్ 19న ప్రకటించారు. గాజా యుద్ధాన్ని ముగించడానికి మధ్యవర్తిత్వ ప్రయత్నాలను సులభతరం చేయడానికి హమాస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు అల్ అన్సారీ చెప్పారు. అయితే హమాస్‌ను బహిష్కరించాలని ఖతార్‌ను అమెరికా కోరిందని, దోహా ఈ సందేశాన్ని హమాస్‌కు చేరవేసిందని వార్తలు వచ్చాయి.

కేజ్రీవాల్ విచారణపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆయనను విచారించకుండా స్టే ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. కేజ్రీవాల్‌పై కింది కోర్టులో విచారణ కొనసాగించవచ్చని తేల్చిచెప్పింది. ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోవడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మనోజ్‌కుమార్ ఓహ్రీ గురువారం విచారణ చేపట్టారు. తనను విచారించేందుకు ట్రయల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వును కొట్టివేయాలని కేజ్రీవాల్ తన పిటిషన్‌లో కోరారు. నేరం జరిగినప్పుడు తాను ప్రజా ప్రతినిధిగా పని చేస్తున్నానని, తనను విచారించే విషయంలో ఈడీ అధికారులు నిబంధనలు పాటించలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ఈడీకి నోటీసు జారీ చేశారు. కేజ్రీవాల్ వాదనపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. తదుపరి విచారణను డిసెంబర్ 20వ తేదీకి వాయిదా వేశారు. మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌కు ఈ ఏడాది జూలై 12న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. సీబీఐ కేసులో ఆయన సెప్టెంబర్ 13న బెయిల్‌పై విడుదలయ్యారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో 16 బిల్లులు

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 16 బిల్లులు ప్రవేశపెట్టనుంది. కీలకమైన వక్ఫ్ సవరణ బిల్లు సైతం ఇందులో ఉంది. ఐదు నూతన బిల్లులు పార్లమెంట్ ముందుకు రానున్నాయి. శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయి. డిసెంబర్ 20న ముగుస్తాయి. వక్ఫ్ సవరణ బిల్లుపై కేంద్రం నియమించిన జాయింట్ కమిటీ తమ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించనుంది. పంజాబ్ న్యాయస్థానాల(సవరణ) బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ఇండియన్ పోర్ట్స్ బిల్లు, ముసల్మాన్ వక్ఫ్(రద్దు) బిల్లుపై పార్లమెంట్ ముందుకు రాబోతున్నాయి.

44 వేలు దాటిన మరణాలు

దియర్ అల్-బలాహ్ (గాజా స్ట్రిప్): ఇజ్రాయెల్‌తో 13 నెలలుగా సాగుతున్న యుద్ధంలో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 44,000 దాటిందని గాజా ఆరోగ్యశాఖ అధికారులు గురువారం వెల్లడించారు. ఇందులో సాధారణ పౌరులు ఎంతమంది, హమాస్‌కు చెందిన వారెందరు అనేది గాజా ఆరోగ్యశాఖ ప్రత్యేకంగా లెక్కించదు. కాకపోతే మృతుల్లో సగం కంటే ఎక్కువమంది మహిళలు, చిన్నారులు ఉన్నట్లు తెలిపింది. ఇజ్రాయెల్‌తో యుద్ధం మొదలైనప్పటి నుంచి 44,056 మంది పాలస్తీనియన్లు మరణించారని, 1,04,268 గాయపడ్డారని ఆరోగ్యశాఖ తెలిపింది. వాస్తవ మృతుల సంఖ్య ఇంకా అధికంగా ఉండొచ్చని, మెడికోలు చేరుకోలేని ప్రదేశాల్లో శిథిలాల కింద చిక్కుకొని అనేక మంది మరణించారని వెల్లడించింది. మరోవైపు 17 వేల మంది పైచిలుకు హమాస్ మిలిటెంట్లను మట్టుబెట్టామని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. గత ఏడాది అక్టోబరు ఏడో తేదీన దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ ఆకస్మిక దాడితో యుద్ధం ప్రారంభమైన విషయం తెలిసిందే. హమాస్ జరిపిన ఈ మెరుపుదాడిలో 1,200 మరణించగా, 250 మంది ఇజ్రాయెల్ పౌరులను బందీలుగా పట్టుకున్నారు.

జార్ఖండ్‌లో బస్సు బోల్తా.. ఏడుగురి మృతి

హజారీబాగ్: కోల్‌కతా నుంచి పట్నా వెళుతున్న బస్సు జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో గురువారం బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు మరణించారు. గోర్హార్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ మూలమలుపులో బస్సు అదుపు తప్పి బోల్తా పడిందని పోలీసులు తెలిపారు. 'ఇప్పటికైతే ఏడుగురు మరణించినట్లు ధ్రువీకరిస్తూ సమాచారం అందింది. మరింత మంది బస్సులో చిక్కుకొని ఉండొచ్చు' అని హజారీబాగ్ ఎస్పీ అరవింద్‌కుమార్ సింగ్ వెల్లడించారు. కోల్‌కతా నుంచి పట్నా వెళుతున్న ఈ బస్సులో ప్రయాణ సమయంలో మొత్తం 50 మంది ప్రయాణికులు ఉన్నారని తెలిపారు.


ఎన్నికల తలనొప్పి తగ్గాక కేశసంరక్షణపై దృష్టిపెట్టిన జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దంపతులు. గురువారం 'ఎక్స్' ఖాతాలో సోరెన్ ఈ ఫొటో పోస్ట్‌చేశారు. రాంచీలోని సొంతింట్లో హేమంత్ సోరెన్‌కు భార్య కల్పన మాలిష్ చేస్తుండగా, కల్పనకు ఇంకొకరు మాలిష్ చేస్తున్న దృశ్యమిది

వక్ఫ్ సవరణ బిల్లుపై ముసాయిదా నివేదిక సిద్ధం

- ఈ నెల 29న ముగియనున్న జాయింట్ కమిటీ గడువు
- గడువు పెంచాలని విపక్ష సభ్యుల డిమాండ్

న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లుపై జాయింట్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ తమ ముసాయిదా నివేదికను సిద్ధం చేసింది. ఈ విషయాన్ని కమిటీ చైర్మన్ జగదాంబికా పాల్ వెల్లడించారు. జాయింట్ కమిటీ గురువారం సమావేశమైంది. బిల్లుపై ఆరు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. వక్ఫ్ చట్టానికి ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలు సమర్థనీయమే అంటూ కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ వివరణ ఇచ్చింది. కమిటీ గడువు ఈ నెల 29న ముగియనున్న నేపథ్యంలో ఇదే చివరి భేటీ అని జగదాంబికా పాల్ చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుపై మరింత విస్తృతస్థాయిలో సంప్రదంపులు జరపాల్సి ఉందని, కమిటీ గడువు పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై చైర్మన్ జగదాంబికా పాల్ సానుకూలంగా స్పందించలేదు. తమ సిఫార్సులను క్లాజ్‌ల వారీగా బహిర్గతం చేస్తామని చెప్పారు. బిల్లు విషయంలో భాగస్వామ్య పక్షాలతో పూర్తిస్థాయిలో సంప్రదింపులు జరిపామని, అందరి అభిప్రాయాలు తెలుసుకున్నామని వెల్లడించారు. మరోవైపు కమిటీ గడువు పెంపు విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ప్రతిపక్ష సభ్యులు భావిస్తున్నారు. ఈ నెల 25న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవాలని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీల నేతలు నిర్ణయించారు. అయితే, కమిటీ గడువును స్వల్పంగా పెంచే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వక్ఫ్ సవరణ బిల్లుపై జాయింట్ కమిటీ నివేదికను పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో లోక్‌సభలో తొలిరోజే ప్రవేశపెట్టనున్నారు. వక్ఫ్ చట్టానికి సవరణలు చేస్తూ కేంద్రం తీసుకొచ్చిన బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. వారి అభ్యంతరాల నేపథ్యంలో బిల్లును క్షుణ్నంగా పరిశీలించి, సిఫార్సులు చేయడానికి అధికార, ప్రతిపక్ష సభ్యులతో జాయింట్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

అటార్నీ జనరల్‌గా ప్రమాణం చేయబోను

ప్రకటించిన మ్యాట్ గెయిట్జ్

వాషింగ్టన్: అమెరికా తదుపరి అటార్నీ జనరల్‌గా డొనాల్డ్ ట్రంప్ ఎంపికచేసిన రిపబ్లికన్ నేత మ్యాట్ గెయిట్జ్ తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. 2017–2020కాలంలో పలు డ్రగ్స్–సెక్స్ పార్టీలు నిర్వహించాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న 42 ఏళ్ల మ్యాట్ అత్యంత కీలకమైన పదవికి అనర్హుడంటూ ఇంటాబయటా విమర్శలు వెల్లువెత్తడంతో ఆయనే స్వయంగా తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. అటార్నీ జనరల్‌గా ట్రంప్ ఎంపికచేయగా పదవి చేపట్టకముందే గెయిట్జ్ యూటర్న్ తీసుకోవడం గమనార్హం. ''ట్రంప్ రెండోదఫా సుపరిపాలనకు నా నియామకం పెద్ద అవరోధంగా మారకూడదు. ట్రంప్ ప్రభుత్వం కొలువుతీరిన మొదటి రోజు నుంచే అద్భుతంగా పాలించాలి. అందుకే నేను ఉపసంహరణకే మొగ్గుచూపా' అని గెయిట్జ్ గురువారం ప్రకటించారు. సెనేట్‌లోని సొంత రిపబ్లికన్ పార్టీ సభ్యులే గెయిట్జ్‌కు మద్దతు పలకలేదని తెలుస్తోంది. తీరా సెనేట్‌లో ఓటింగ్‌వేళ మెజారిటీ ఓట్లు పడకపోతే అవమానభారంతో వెనుతిరిగే బదులు ముందే తప్పుకుంటే మంచిదని గెయిట్జ్ భావించారని అమెరికా మీడియాలో వార్తలొచ్చాయి. అమెరికా పార్లమెంట్ దిగువసభలో సభ్యుడైన గెయిట్జ్ ఇటీవల అటార్నీ జనరల్‌గా నామినేషనల్ సాధించడంతో గత వారమే తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. గెయిట్జ్‌పై వచ్చిన ఆరోపణలపై ఇప్పటికే పార్లమెంట్ ఎథిక్స్ కమిటీ విచారించి నివేదిక సిద్ధంచేసింది. గతంలో డ్రగ్స్–సెక్స్ పార్టీలో 17 ఏళ్ల టీనేజీ బాలికతో శృంగారం జరిపాడని గెయిట్జ్‌పై ఆరోపణలున్నాయి. వీటిని ఆయన కొట్టిపారేశారు. అనూహ్య పరిణామాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వంలో నూతన అటార్నీ జనరల్‌గా ట్రంప్ ఎవరిని ఎంపికచేస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది. మెరుపువేగంతో నూతన నియామకాలు చేపట్టేబదులు ట్రంప్ సంయమనంతో సత్ప్రవర్తన గల నేతలనే కీలక పదవులకు ఎంపిక చేస్తే మంచిదని సెనేట్‌లో రిపబ్లికన్ సభ్యుడు సింథియా లూమిస్ అన్నారు.

కసబ్‌కూ న్యాయ అవకాశం ఇచ్చాం

యాసిన్ మాలిక్ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ముంబైలో మారణహోమానికి పాల్పడిన పాకిస్తాన్ ఉగ్రవాది అజ్మల్ కసబ్‌కూ గతంలో న్యాయ అవకాశం ఇచ్చామని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 1989లో జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ముఫ్తీ మొహమ్మద్ సయీద్ కుమార్తె రూబియాను అపహరించిన కేసులో నిందితుడు, కశ్మీర్ వేర్పాటువాది యాసిన్ మాలిక్‌ను జమ్మూ స్పెషల్ టాడా కోర్టు స్వయంగా హాజరుకావాలని గతంలో ఆదేశించింది. అయితే ఇప్పటికే ఉగ్రవాదులకు నిధులు సమకూర్చిన కేసులో జీవితఖైదు పడి ఢిల్లీ తిహార్ జైలులో ఉన్న మాలిక్‌ను కశ్మీర్ కోర్టుకు తీసుకొస్తే కొత్త సమస్యలొస్తాయని సీబీఐ వాదించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు పై వ్యాఖ్యలు చేసింది. కోర్టులో హాజరుపరచాలంటూ 2022 సెప్టెంబర్ 20న జమ్మూ స్పెషల్ టాడా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్‌చేసింది. ఈ కేసును జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్



అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారించింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ''భద్రతా కారణాలు, సాక్షుల రక్షణ దృష్ట్యా ఉగ్రవాది మాలిక్‌ను అంతదూరం తీసుకెళితే చాలా ఇబ్బందులొస్తాయి. ఉద్దేశపూర్వకంగా అతను ఏ లాయర్‌ను నియమించుకోవట్లేదు. నేరుగా కోర్టుకు వస్తానంటూ నాటకాలాడుతున్నాడు. కోర్టుకు తీసుకురావడానికి అతను సాధారణ నేరస్తుడు కాడు. నిషేధిత జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్‌కు గతంలో చీఫ్‌గా ఉన్నాడు. లష్కరే తోయిబా ఉగ్రసంస్థ వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌తో సత్సంబంధాలు కొనసాగించాడు. ఉగ్రకార్యకలాపాల్లో ఒక వేదికపై ప్రసంగించాడు''అంటూ పాత ఫొటోలను మెహతా చూపించారు. దీంతో కోర్టు కలగజేసుకుంది. ''తిహార్ జైలు నుంచే కశ్మీర్ కోర్టులో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా హాజరుపరిచేంత ఇంటర్నెట్ స్పీడ్ సౌకర్యం, కనెక్టివిటీ కశ్మీర్‌లో కష్టం. అలాంటప్పుడు అతడిని న్యాయమూర్తి క్రాస్–ఎగ్జామిన్ ఎలా చేయగలరు?. జమ్మూ జడ్జీనే ఢిల్లీకొచ్చి జైలులో విచారించమని అడగమంటారా?. జైలు ప్రాంగణంలో అందుకు అవకాశం ఉందో ఓసారి పరిశీలించండి. ఒకవేళ అలా చేయాలంటే ఈ కేసులో మిగతా అందరు నిందితుల వాదనలు విన్నాక తగు ఆదేశాలిస్తాం. అయినా భారత్‌లో న్యాయ అవకాశం గతంలో అజ్మల్ కసబ్‌కూ ఇచ్చాం కదా. మాలిక్ కేసులో మిగతా నిందితులూ స్పందించేలా మీ పిటిషన్‌లో మార్పులు చేయండి'అని మెహతాకు కోర్టు సూచించింది. కేసు తదుపరి విచారణను ఈనెల 28వ తేదీకి వాయిదావేసింది. ఈ కేసులో సాక్షిగా ఉన్న రూబియా సయీద్ ప్రస్తుతం తమిళనాడులో ఉంటున్నారు.

రాష్ట్ర విధాన పరిషత్ బిల్లును తిరస్కరిస్తే..

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

విధాన సభ ఒక బిల్లును ఆమోదించి విధాన పరిషత్‌కు పంపితే ఎగువ సభ దానిపై మూడు నెలల్లోగా తన అభిప్రాయాన్ని తెలపాలి. ఒకవేళ విధాన పరిషత్ ఆ బిల్లును తిరస్కరిస్తే, విధాన సభ రెండోసారి ఆ బిల్లును ఆమోదించి, ఎగువ సభ ఆమోదం కోసం మళ్లీ పంపవచ్చు. ఈసారి ఎగువ సభ నెల రోజుల్లోగా తన అభిప్రాయం తెలపాలి. ఆ తర్వాత ఎగువసభ అభిప్రాయంతో నిమిత్తం లేకుండా బిల్లు ఆమోదం పొందినట్లు పరిగణిస్తారు.



రాష్ట్ర శాసనసభ

శాసనసభ్యుల అనర్హతలు

ఆర్టికల్ 191 ప్రకారం రాష్ట్ర శాసనసభ్యుల సభ్యత్వం ఈ కింది సందర్భాల్లో రద్దవుతుంది.

- ఎన్నికైన తర్వాత ప్రభుత్వంలోని లాభదాయక పదవుల్లో కొనసాగినప్పుడు.
- మానసిక స్థిమితం కోల్పోయినట్లు సంబంధిత కోర్టు ధ్రువీకరించినప్పుడు.
- దివాలా తీసినట్లు కోర్టు ధ్రువీకరిస్తే.
- విదేశీ పౌరసత్వాన్ని పొందినప్పుడు లేదా ఇతర దేశాల పట్ల విధేయత ప్రకటించిన సందర్భంలో.
- పార్టీ ఫిరాయింపులకు పాల్పడినప్పుడు
- సభాధ్యక్షుల అనుమతి లేకుండా వరుసగా 60 రోజులు శాసనసభా సమావేశాలకు గైర్హాజరు అయినప్పుడు.
- పార్లమెంటు నిర్ణయించిన ఇతర సందర్భాల్లోనూ సభ్యత్వం రద్దవుతుంది.

ఆర్టికల్ 192 ప్రకారం శాసనసభ్యుల అనర్హతను గవర్నర్ నిర్ణయిస్తారు. కేంద్ర ఎన్నికల సంఘం సలహా మేరకు శాసనసభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చు. గవర్నర్‌దే తుది నిర్ణయం. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఆయా సభాధ్యక్షులు సంబంధిత పార్టీ అధ్యక్షుడి సలహా మేరకు శాసనసభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చు. శాసనసభ్యులు తమ రాజీనామాను లిఖిత పూర్వకంగా ఆయా సభాధ్యక్షులకు వ్యక్తిగతంగా సమర్పించాలి.

పదవీ ప్రమాణ స్వీకారం

శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం గురించి ఆర్టికల్ 188 తెలుపుతుంది. విధాన సభ సభ్యులు, విధాన పరిషత్ సభ్యులతో రాష్ట్ర గవర్నర్ లేదా ఆయన నియమించిన ప్రతినిధి ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

ఈ వివరాలను మూడో షెడ్యూల్‌లో పొందుపరిచారు.

జీతభత్యాలు

శాసనసభ్యుల జీతభత్యాలను శాసనసభ ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. వీరి జీతాలను రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. పదవీ విరమణ తర్వాత పెన్షన్ సౌకర్యం ఉంటుంది.

శాసన నిర్మాణ ప్రక్రియ

శాసన నిర్మాణ ప్రక్రియ పార్లమెంటు శాసన నిర్మాణ ప్రక్రియను పోలి ఉంటుంది. సాధారణ బిల్లుల విషయంలో పార్లమెంటులో రాజ్యసభకు లోక్‌సభతో సమానమైన అధికారాలు ఉంటాయి. కానీ రాష్ట్ర శాసనసభలో దిగువ సభ అయిన విధానసభకు ఆధిపత్యం ఉంటుంది. విధానసభ నిర్ణయమే అంతిమంగా చెల్లుబాటు అవుతుంది.

ఆర్టికల్ 196 ప్రకారం సాధారణ బిల్లులను ఉభయ సభల్లో ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.

ఎగువసభ ఒక సాధారణ బిల్లును గరిష్ఠంగా నాలుగు నెలల వరకు వాయిదా వేయవచ్చు. కానీ అంతిమంగా విధాన సభ నిర్ణయమే చెల్లుబాటు అవుతుంది. ఉభయ సభల మధ్య బిల్లు విషయంలో వివాదం తలెత్తితే సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. ఒకవేళ బిల్లు ఎగువ సభలో ప్రవేశపెట్టి, ఆమోదించిన తరువాత దాన్ని దిగువ సభ ఆమోదానికి పంపితే, విధాన సభ ఆ బిల్లును తిరస్కరిస్తే బిల్లు వీగిపోతుంది. దీన్నిబట్టి విధాన పరిషత్‌కు సాధారణ బిల్లు విషయంలో కూడా విధాన సభతో సమాన అధికారాలు లేవని అర్థమవుతోంది. ఎగువ సభ బిల్లును వాయిదా వేస్తుందే కానీ అడ్డుకోలేదు. ఆర్థిక, ద్రవ్య బిల్లుల విషయంలో కూడా విధాన సభదే అంతిమ అధికారం.

సభాధ్యక్షులు

(స్పీకర్, డిప్యూటీ స్పీకర్, చైర్మన్, డిప్యూటీ చైర్మన్)

శాసనసభలో ఉభయ సభలకు వేర్వేరుగా సభాధ్యక్షులు ఉంటారు. సభా కార్యక్రమాల నిర్వహణలో వీరు కీలక పాత్ర వహిస్తారు.

స్పీకర్/డిప్యూటీ స్పీకర్

రాష్ట్ర విధాన సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవుల గురించి ఆర్టికల్ 178 తెలుపుతుంది. విధాన సభ సభ్యులే వీరిని ఎన్నుకుంటారు, తొలగిస్తారు. స్పీకర్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యే వ్యక్తి విధాన సభలో సభ్యుడై ఉండాలి. ఆర్టికల్ 179 ప్రకారం స్పీకర్ తన రాజీనామాను డిప్యూటీ స్పీకర్‌కు, డిప్యూటీ స్పీకర్ తన రాజీనామాను స్పీకర్‌కు సమర్పించాలి. రాష్ట్ర విధాన సభ రద్దయినా, తిరిగి నూతన విధాన సభ ఏర్పడే వరకు స్పీకర్ తన పదవిలో కొనసాగుతాడు. ఆర్టికల్ 186 ప్రకారం స్పీకర్, డిప్యూటీ స్పీకర్, విధాన సభ చైర్మన్, డిప్యూటీ చైర్మన్ల జీతభత్యాలను శాసనసభ నిర్ణయిస్తుంది. ఈ అంశాలను రాజ్యాంగంలోని రెండో షెడ్యూల్‌లో పేర్కొన్నారు. వీరి జీతభత్యాలను రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు.

స్పీకర్ అధికారాలు, విధులు

లోక్‌సభ స్పీకర్‌కు ఉన్న అధికారాలు, విధులే రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు కూడా ఉంటాయి. ఆర్టికల్ 181 ప్రకారం స్పీకర్ శాసనసభకు అధ్యక్షత వహించి, సభా కార్యక్రమాలు నిర్వహిస్తాడు. సభలో సభ్యుల ప్రవర్తన, ఇతర ప్రక్రియలను నియంత్రిస్తాడు. సభా కార్యక్రమాలను వాయిదా వేస్తాడు. వివిధ కమిటీలకు చైర్మన్‌లను నియమిస్తాడు. సభావ్యవహారాల కమిటీ, రూల్స్ కమిటీల చైర్మన్‌గా వ్యవహరిస్తాడు. ఒక బిల్లు ద్రవ్య బిల్లా, సాధారణ బిల్లా అనే అంశాన్ని స్పీకర్ ధ్రువీకరిస్తారు. ఈ విషయంలో స్పీకర్‌దే తుది నిర్ణయం.

స్పీకర్‌కు నిర్ణయాత్మక ఓటు ఉంటుంది. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం సభ్యులను అనర్హులుగా ప్రకటించే అధికారం స్పీకర్‌కు ఉంది. సభలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను ఏ న్యాయ స్థానంలోనూ ప్రశ్నించరాదు.

విధాన పరిషత్ చైర్మన్/డిప్యూటీ చైర్మన్

విధాన పరిషత్ చైర్మన్, డిప్యూటీ చైర్మన్ పదవుల గురించి ఆర్టికల్ 182 తెలుపుతుంది. వీరిని విధాన పరిషత్ సభ్యులే ఎన్నుకుంటారు, తొలగిస్తారు. చైర్మన్ తన రాజీనామా పత్రాన్ని డిప్యూటీ చైర్మన్‌కు, డిప్యూటీ చైర్మన్ తన రాజీనామాను చైర్మన్‌కు సమర్పించాలి.

అధికారాలు, విధులు

విధానసభ స్పీకర్‌కు ఉండే అధికారాలు, విధులే పరిషత్ చైర్మన్‌కు ఉంటాయి. సభకు అధ్యక్షత వహించడం, కార్యక్రమాల నిర్వహణ, సభ్యుల క్రమశిక్షణ నియంత్రణ, కార్యక్రమాల వాయిదా, నిర్ణయాత్మక ఓటు హక్కు కలిగి ఉండటం మొదలైనవాటిని ఉదాహరణగా పేర్కొనవచ్చు. ద్రవ్యబిల్లు విషయంలో విధాన సభ స్పీకర్‌కు ప్రత్యేక అధికారం ఉంటుంది. పరిషత్ చైర్మన్‌కు అలాంటి అధికారాలు లేవు.

వివరణ: రాష్ట్ర శాసనసభలోని ప్రక్రియలు, పద్ధతులు, ఇతర వ్యవహారాలు పార్లమెంటు ప్రక్రియతో సమానంగా ఉంటాయి. కోరం, ప్రశ్నోత్తరాలు, తీర్మానాలు, ప్రతిపాదనలు, తదితర విషయాల్లో శాసనసభకు, పార్లమెంటుకు తేడాల్లేవు.

శాసనసభలో అధికార భాష

ఆర్టికల్ 210 ప్రకారం శాసనసభ కార్యక్రమాలను హిందీ లేదా ఆంగ్ల భాష మాధ్యమంలో నిర్వహిస్తారు. అయితే సభాధ్యక్షుల అనుమతితో సభ్యులు మాతృభాషలో కూడా మాట్లాడవచ్చు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల శాసనసభ సభ్యులు ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఉర్దూ భాషల్లో ప్రసంగించవచ్చు.

శాసనసభ కమిటీలు: కమిటీల గురించి రాజ్యాంగంలో ప్రత్యక్ష ప్రస్తావన లేదు. అయితే ఆర్టికల్ 194లో పరోక్షంగా ప్రస్తావించారు. పార్లమెంటులో మాదిరిగానే రాష్ట్ర శాసనసభలో కూడా కమిటీలు ఉంటాయి. కమిటీల నిర్మాణం, సభ్యుల సంఖ్య, విధులను రాష్ట్ర శాసన సభ ఒక చట్టం ప్రకారం నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ కమిటీల విధులకు సంబంధించి సవరణ చేయాలని ప్రతిపాదించారు.

శాసన నిర్మాణం- పార్లమెంట్, రాష్ట్ర శాసన సభ-పోలికలు, తేడాలు

పార్లమెంటు	రాష్ట్ర శాసన సభ
సాధారణ బిల్లులను ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.	సాధారణ బిల్లులను ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.
ఒక బిల్లు చట్టంగా మారడానికి మూడు దశలుంటాయి.	ఒక బిల్లు చట్టంగా మారడానికి మూడు దశలు ఉంటాయి.
సాధారణ బిల్లు విషయంలో ఉభయ సభల మధ్య ప్రతిష్టంభన ఏర్పడితే సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తారు.	ఈ విషయంలో ఉభయసభల మధ్య సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. దిగువ సభ నిర్ణయమే చెల్లుబాటవుతుంది.
ఒక సభ ఆమోదం పొందిన బిల్లు మరో సభకు వచ్చినప్పుడు, ఆ సభ ఆరు నెలల వరకు ఆ బిల్లును వాయిదా వేయవచ్చు.	విధాన సభ ఆమోదం పొందిన బిల్లు పరిషత్ ఆమోదానికి వచ్చినప్పుడు, ఆ బిల్లును గరిష్ఠంగా నాలుగు నెలల వరకు వాయిదా వేయవచ్చు.
సాధారణ బిల్లు విషయంలో పార్లమెంట్ ఉభయ సభలకు సమాన అధికారాలు ఉంటాయి.	సాధారణ బిల్లు విషయంలోనూ విధాన సభ నిర్ణయమే అంతిమంగా చెల్లుబాటు అవుతుంది.
ద్రవ్య బిల్లు విషయంలో లోక్ సభదే అంతిమ నిర్ణయం.	ద్రవ్యబిల్లు విషయంలో విధాన సభదే అంతిమ నిర్ణయం.
ద్రవ్య బిల్లుపై రాజ్యసభలో చర్చించవచ్చు. ఓటింగ్ అధికారం లేదు. రాజ్యసభ 14 రోజుల్లోగా ద్రవ్య బిల్లుపై తన నిర్ణయాన్ని తెలపాలి.	ద్రవ్యబిల్లుపై విధాన పరిషత్‌లో చర్చించవచ్చు. ఓటింగ్ అధికారం లేదు. విధాన పరిషత్ 14 రోజుల్లోగా ద్రవ్యబిల్లుపై తన నిర్ణయాన్ని తెలపాలి.
రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్ ఏ సభలోనైనా ప్రతిపాదించవచ్చు.	రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రతిపాదించే అధికారం శాసన సభకు లేదు. కానీ పార్లమెంటు ఆమోదించిన కొన్ని రాజ్యాంగ సవరణలను శాసనసభల అంగీకారం కోసం నివేదిస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. గవర్నర్‌ను అభిశంసించే అధికారం ఎవరికి ఉంటుంది?
   ఎ) పార్లమెంట్ బి) రాష్ట్ర అసెంబ్లీ
   సి) సుప్రీంకోర్టు డి) ఎవరూ కాదు
2. కింది ఏ రాష్ట్రానికి ఇప్పటి వరకు మహిళ ముఖ్యమంత్రిగా పని చేయలేదు?
   ఎ) కర్ణాటక బి) కేరళ సి) ఏపీ డి) పైవన్నీ
3. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులను ఎవరు నియమిస్తారు?
   ఎ) గవర్నర్ బి) ముఖ్యమంత్రి
   సి) రాష్ట్రపతి డి) యూపీఎస్సీ

సమాధానాలు: 1) డి; 2) డి; 3) ఎ.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది?
   ఎ) విధాన సభ్యుల సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్‌కు 10వ స్థానం
   బి) విధాన సభ్యుల సంఖ్యాపరంగా తెలంగాణకు 14వ స్థానం
   సి) విధాన పరిషత్ సభ్యుల సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్‌కు 5వ స్థానం
   డి) పైవన్నీ
2. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ పదవీకాలాన్ని ఎన్ని పర్యాయాలు పొడిగించారు?
   ఎ) ఒక పర్యాయం
   బి) రెండు పర్యాయాలు
   సి) మూడు పర్యాయాలు డి) పైవేవీ కాదు
3. రాష్ట్ర విధాన పరిషత్ బిల్లును తిరస్కరిస్తే జరిగే పరిణామం?
   ఎ) బిల్లు వీగిపోతుంది
   బి) సంయుక్త సమావేశం ఉంటుంది
   సి) విధాన సభ నిర్ణయం నెగ్గుతుంది
   డి) గవర్నర్ విచక్షణ అధికారంపై ఆధారపడి ఉంటుంది.
4. రాష్ట్ర ఎగువ సభ ఉనికి ఎవరి విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది?
   ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
   సి) రాష్ట్ర దిగువ సభ డి) పైవేవీ కాదు
5. దేశంలో మొదటి దళిత ముఖ్యమంత్రి?
   ఎ) జగ్జీవన్‌రామ్-ఉత్తరప్రదేశ్
   బి) కాన్షీరామ్-బిహార్
   సి) దామోదరం సంజీవయ్య-ఆంధ్రప్రదేశ్
   డి) మాయావతి-ఉత్తరప్రదేశ్
6. రాష్ట్ర విధానసభ స్పీకర్ రాజీనామా లేఖను ఎవరికి అందజేయాలి?
   ఎ) రాష్ట్రపతి బి) గవర్నర్
   సి) ముఖ్యమంత్రి డి) డిప్యూటీ స్పీకర్

సమాధానాలు:
1) డి; 2) ఎ; 3) సి; 4) సి; 5) సి; 6) డి.

కవిని బ్రహ్మతో పోల్చి చెప్పిన ఆలంకారికుడు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు - కంటెంట్ (ఎస్ఏ)

సాహిత్య విమర్శ- కవి - కావ్యం

సాహిత్య విమర్శ: 'మృశ్' అనే ధాతువుకు 'వి' అనే ఉపసర్గ చేరి 'విమర్శ' అనే పదం ఏర్పడింది. విమర్శ అనే పదానికి పరిశీలించడం, పరీక్షించడం, పరామర్శించడం, ఆలోచించడం, చర్చించడం అనే అర్థాలున్నాయి. ఒకరు చేసిన పనిలో బాగోగులను ఇంకొకరు వివేచించి తెలపడాన్ని 'విమర్శ' అంటారు. ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగు సాహిత్యంలో ప్రవేశించిన నూతన ప్రక్రియల్లో 'సాహిత్య విమర్శ' ఒకటి. ఒక గ్రంథంలోని లోపాలోపాలను, ఔచిత్య, అనౌచిత్యాలను, భావ గంభీరతను అలంకార రచనా పాటవాన్ని, ధ్వని విశేషాల్ని, శయ్యా సౌభాగ్యాన్ని, వస్తు నిర్మాణ సౌష్టవాన్ని, పాత్ర పోషణ, రస పోషణ, సన్నివేశ కల్పనలను, ఆ గ్రంథానికి సంబంధించిన సర్వ విషయాలను కూలంకషంగా చర్చించి సాహిత్యంలో ఆ గ్రంథానికి ఉన్న స్థానాన్ని నిర్ణయించడాన్ని సాహిత్య విమర్శగా పేర్కొనవచ్చు.

- ఆచార్య సి. నారాయణరెడ్డి కవిత్వానికి, విమర్శకు ఉన్న భేదాన్ని కవితా స్ఫోరకంగా 'కప్పి ఉంచితే కవిత్వం/విప్పి చెబితే విమర్శ' అన్నారు.
- పాశ్చాత్య విమర్శకులు విమర్శ స్వరూపాన్ని వివరించారు.
- టి.ఎస్. ఇలియట్ 'విమర్శ కవి మీద కాకుండా కవిత్వంపై ఉండాల'న్నారు. బెన్‌జాన్సన్.. 'విమర్శకుడు దోషాల్ని చెప్పడమే కాకుండా,దోష రహితంగా ఎలా ఉండాలో' చెప్పాలన్నారు.
- డ్రైడెన్ 'సాహిత్యానికి ప్రామాణికమైన చక్కని పరిష్కారం' విమర్శ అన్నారు. విమర్శ పరిధిని, విమర్శకుడి విధులను సీన్స్ వివరించారు. సాహిత్య విమర్శ పరమావధి పొగడ్త, తెగడ్తలు కాదని అది నిర్వహించాల్సిన విధులు నాలుగున్నాయని ఆయన తెలిపారు. అవి..
  1) తారతమ్య పరిశీలన
  2) స్థిరమైన సిద్ధాంత ప్రతిపాదన
  3) వివేచనతో కూడిన ఉపదేశం
  4) నిజాయితీతో కూడిన ప్రశంస.

  హడ్సన్ విమర్శ విధులను వివరిస్తూ...
  'Criticism may be regarded as having two different functions that of interpretation and that of Judgement' అని అన్నారు. విమర్శ సూత్రాలను కావ్యంతో సమన్వయించి విశ్లేషించడం, సాహిత్యంలో ఆ గ్రంథ స్థానాన్ని నిర్ధారించడమేనని హడ్సన్ అన్నారు.

విమర్శకుడి లక్షణాల్లో ప్రధానమైంది రాగద్వేషాలకు అతీతమైన సహృదయం. అందుకు..

- బహుముఖ ప్రజ్ఞాశాలి కావాలి.
- తులనాత్మక అధ్యయనం ఉండాలి.
- ఆకర్షణీయమైన భాషా శైలి కావాలి.
- విమర్శ పాఠకుడికి మార్గదర్శకంగా, ప్రయోజనాత్మకంగా ఉండాలి.

విమర్శ పరిణామం: పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో విమర్శ ప్రక్రియ తెలుగులో ప్రవేశించింది. 19వ శతాబ్ది చివరలో తెలుగు సాహితీ ప్రక్రియలన్నింటినీ స్పృశించి సుసంపన్నం చేసిన కందుకూరి వీరేశలింగం.. కొక్కొండ వేంకటరత్నం పంతులు రాసిన 'విగ్రహ తంత్రం'పై 'విగ్రహతంత్ర విమర్శనం' (1876) అనే విమర్శ గ్రంథం రాసి 'వివేక వర్ధిని' పత్రికలో ప్రచురించారు. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి కందుకూరి నవల 'రాజశేఖర చరిత్ర'పై 'వివేక చంద్రికా దర్శనం' పేరుతో విమర్శ వ్యాసం రాశారు. వీరేశలింగం క్షీణ యుగాన్ని విమర్శిస్తూ 'సరస్వతీ నారద విలాపం' పేరుతో పద్య గ్రంథం రాశారు. వీటిని తెలుగు సాహిత్య విమర్శకు నేపథ్యాలుగా భావించవచ్చు.

20వ శతాబ్దిలో కట్టమంచి రామలింగారెడ్డి రాసిన 'కవిత్వతత్త్వ విచారం' (1914)ను తెలుగులో సమగ్రమైన తొలి విమర్శ గ్రంథంగా విమర్శకులు నిర్ధారించారు. కట్టమంచి పాశ్చాత్య విమర్శ ప్రమాణాలను ప్రాచీన కావ్యానుశీలనలో ప్రయోగించి విమర్శకు రూపురేఖలు దిద్దారు. కావ్య నిర్మాణ శిల్పాన్ని వివేచించే వివేకాన్ని తెలుగు విమర్శకు నేర్పారు. తెలుగు సాహిత్యానికి కట్టమంచి సృజనాత్మక విమర్శను చవి చూపించారనే విషయం నిర్వివాదం. ఆయన ఒరవడితో బుర్రా శేషగిరి రావు, బసవరాజు అప్పారావు వంటి వారు ఆంగ్ల విమర్శ పద్ధతుల ఆధారంగా విమర్శ గ్రంథాలు రాశారు. దువ్వూరి రామిరెడ్డి ఆంగ్ల కవుల రమణీయక దృక్పథంతో తెలుగు కవిత్వాన్ని విశ్లేషించారు. డా॥ జి.వి. కృష్ణారావు, సర్దేశాయి తిరుమలరావు, గుంటూరు శేషేంద్రశర్మ, ఆర్.యస్.సుదర్శనం వంటి వారు పాశ్చాత్య విమర్శ దృక్పథంతో విమర్శలు సాగించారు. ఆచార్య సి. నారాయణరెడ్డి, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం, కొడవటిగంటి కుటుంబ రావు, రాచమల్లు రామచంద్రారెడ్డి వంటివారు ప్రసిద్ధ విమర్శ గ్రంథాలు రాశారు. ఆధునిక విమర్శకుల్లో ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, ఆచార్య కాత్యాయినీ విద్మహే వంటి వారు విమర్శ ప్రక్రియలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు అందుకున్నారు. విమర్శ పద్ధతులను స్థూలంగా ప్రాచీన విమర్శ పద్ధతి, ఆధునిక విమర్శ పద్ధతి అని వర్గీకరించారు. ప్రాచీన విమర్శ పద్ధతిని అస్వతంత్ర విమర్శ పద్ధతి, స్వతంత్ర విమర్శ పద్ధతి అని రెండుగా విభజించారు. అస్వతంత్ర విమర్శకు ప్రాచీన విమర్శ, సంప్రదాయక విమర్శ, ఆలంకారిక విమర్శ, నిబద్ధ విమర్శ అనే పేర్లున్నాయి. ఆంగ్లంలో దీన్ని 'డెటికేటివ్ క్రిటిసిజమ్', 'జ్యుడీషియల్ క్రిటిసిజమ్' అని పిలుస్తారు. ఆత్మాశ్రయ ధోరణిలో సాగే ఈ విమర్శ పద్ధతిలో పక్షపాత ధోరణి ఉన్నందున దీన్ని ప్రామాణిక విమర్శగా పరిగణించేందుకు వీలు లేదు. ఆధునిక విమర్శ పద్ధతుల్లో అనేక పద్ధతులున్నాయి. వాటిలో గ్రంథ పరిష్కార విమర్శ, ఆలంకారిక విమర్శ, పౌరాణిక విమర్శ, చారిత్రక విమర్శ, సాంఘిక విమర్శ, నైతిక విమర్శ, కళా విమర్శ, కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ, మనో వైజ్ఞానిక విమర్శ, మార్క్సిస్టు విమర్శ, అభిరుచి విమర్శ, సాంకేతిక విమర్శ, శైలీ విమర్శ, ప్రకృతి వాద విమర్శ, ప్రతీక వాద విమర్శ వంటి పద్ధతులున్నాయి. వీటిలో కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ పద్ధతిలో సిద్ధాంత గ్రంథ రచనలు సాగుతున్నాయి. ప్రక్రియను అనుసరించి విమర్శ పద్ధతులను విమర్శకులు పాటిస్తున్నారు.

కవి

వేదాల్లో కవిని భగవత్ స్వరూపుడిగా భావించారు. పరమాత్మ సాక్షాత్కారం పొందే రుషులను కవి శబ్దంతో సంబోధించారు. భవిష్యత్తును దర్శించగల 'క్రాంత దర్శనత్వం' కవికి ఉండాలనే లక్ష్యంతో 'కవయః క్రాంత దర్శనః' అనే నానుడి ప్రసిద్ధమైంది. ప్రాచీన కవులంతా యజ్ఞం చేసి రుషిత్వాన్ని పొంది క్రాంత దర్శనంపై కవిత్వ రచనకు పూనుకున్నారు. కవితాను దర్శించిన విషయాన్ని వర్ణనా నిపుణతతో పాఠకులకు ఆహ్లాదం కలిగేలా వర్ణిస్తాడు. భట్టతౌతుడు అనే ఆలంకారికుడు కవి తాను దర్శించిన విషయాన్ని వర్ణించినందునే లోకం లో ప్రసిద్ధి పొందుతున్నాడని చెప్పారు. మమ్మటుడు కవిలో కొత్త వర్ణనా నైపుణ్యాన్ని ప్రశంసించారు. ఆనంద వర్ధనుడు కవిని బ్రహ్మతో పోల్చి చెప్పారు.

కవికి ఉండాల్సిన లక్షణాలు

- క్రాంత దర్శనత్వం
- వర్ణనా నిపుణత్వం
- రసభావ ప్రతిపాదక విశ్లేషణాశక్తి
- మనీషా సంపన్నత

మొదలైన లక్షణాలుండాలని ఆలంకారికుల అభిమతం.

కావ్య హేతువులు: కవితా కళా ప్రావీణ్యానికి మూడు ప్రధానమైన హేతువులుండాలని తొలిసారిగా 'భామహుడు' అనే ఆలంకారికుడు పేర్కొన్నారు. వీటినే కావ్య హేతువులు, కావ్య సామగ్రి, సాధన సామగ్రి పేర్లతో పిలుస్తారు.

1) ప్రతిభ 2) వ్యుత్పత్తి
3) అభ్యాసం అనేవి భామహుడు పేర్కొన్న కావ్య హేతువులు.

ఆంగ్ల విమర్శకులు
1) Emotion (భావావేశం)
2) Imagination (భావన)
3) Thought (ఆలోచన)
4) Form (రూపం)
అనే నాలుగింటిని కావ్య హేతువులుగా పేర్కొన్నారు.

1. **ప్రతిభ:** కావ్యహేతువుల్లో ప్రధానమైంది ప్రతిభ. సాధారణార్థంలో ప్రతిభను మేధస్సు అంటారు. 'మమ్మటుడు' దీన్ని 'శక్తి' అన్నారు. దండి 'జన్మతః సంక్రమించే నైసర్గిక లక్షణం'గా పేర్కొన్నారు. అభినవ గుప్తుడు 'అపూర్వ వస్తు నిర్మాణ ప్రజ్ఞ'గా చెప్పారు. రాజశేఖరుడు 'కావ్య మీమాంస' గ్రంథంలో ప్రతిభను రెండు విధాలుగా పేర్కొన్నారు. కవితా ప్రతిభను 'కారయిత్రి'గా ఉటంకించారు. సహృదయ ఆస్వాదనా లక్షణాన్ని 'భావయిత్రి' అన్నారు. విమర్శకుడికి ఉండాల్సిన ప్రతిభ.. 'భావయిత్రి'. జగన్నాథ పండితరాయలు ప్రతిభను 'అదృష్ట జన్యం, అభ్యాస జన్యం' అని రెండు విధాలుగా వర్గీకరించారు. పుట్టుకతో సంక్రమించే ప్రతిభా లక్షణం 'అదృష్ట జన్యం'. అవిరళ కృషి, అభ్యాసాదులతో సాధించేది 'అభ్యాస జన్యం'. భామహుడు 'నవనవోన్మేష ప్రజ్ఞ'గా ప్రతిభను వర్ణించారు.
2. **వ్యుత్పత్తి:** ప్రతిభకు వికాసం కలిగించే సంస్కార హేతువు 'వ్యుత్పత్తి'. సాధారణార్థంలో 'వ్యుత్పత్తి' అంటే పాండిత్యం. లోకశాస్త్ర కార్యాదుల పఠనం వల్ల కలిగేది పాండిత్యమని ఆలంకారికుల అభిప్రాయం. లక్షణ గ్రంథాలు, పూర్వ కవులు, సమకాలీన రచయితల గ్రంథాలు చదివి పరిజ్ఞానాన్ని పొందడం వ్యుత్పత్తిలో భాగం.
3. **అభ్యాసం:** ఏదైనా ఒక కళను లేదా విద్యను మెరుగుపర్చుకునేందుకు చేసే సాధన అభ్యాసం. 'అభ్యాసం కూసువిద్య' అనే లోకోక్తి అభ్యాస ప్రాధాన్యాన్ని వివరిస్తుంది. దండి 'నిరంతర అభ్యాసాన్ని ఆనందమయమైన అభియోగం' అన్నారు. ప్రతిభను అభ్యాసం వల్ల పెంపొందించుకోవచ్చు. ఉపేక్షా భావంతో క్షీణింపజేయవచ్చు అనడం సముచితం. కావ్య హేతువుల్లో 'ప్రతిభ' ఉత్కర్షను విమర్శకులంతా పేర్కొన్నారు. వ్యుత్పత్తి అభ్యాసాలు ప్రతిభకు సంస్కార హేతువులే. ప్రతిభ లేని వ్యుత్పత్తి, అభ్యాసాలు వ్యర్థాలని వాగ్భటుడి వంటి ఆలంకారికులు పేర్కొన్నారు. రాజశేఖరుడు.. ప్రతిభ, వ్యుత్పత్తులు రెండూ కవికి శ్రేయోదాయకాలు అని పేర్కొన్నారు. వ్యుత్పత్తి కావ్య రచనకు తల్లి వంటిదన్నారు. ప్రతిభ లోపాన్ని వ్యుత్పత్తి కొంత మేరకు పూరించగలదని ఆయన అంటారు. మంగళుడు కూడా ప్రతిభా వ్యుత్పత్తుల సాన్నిహిత్యాన్ని వివరించారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రామాయణ కల్పవృక్షంలో 'కవి ప్రతిభలోన నుండు కావ్య గత శతాశముల యందు తొంబదిపాళ్లు' అని ప్రతిభ ఉత్కర్షను పేర్కొన్నారు. ఉత్తమ కావ్యరచనకు ప్రతిభావంతమైన కవికి కావ్య హేతువులన్నీ ఉపాదేయాలే.

గత డీఎస్సీలో అడిగిన ప్రశ్నలు

1. పరామర్శించడం, ఆలోచించడం, చర్చించడం అనే మాటలు ఈ ప్రక్రియకు చెందినవి?
   1) కావ్యాత్మ 2) విమర్శ
   3) ఇతిహాసం 4) రసం
2. విమర్శ దృక్పథానికి మార్గదర్శకంగా కట్టమంచి రామలింగారెడ్డి రచించిన గ్రంథం?
   1) అలంకారతత్వం
   2) కవిత్వ తత్వ విచారం
   3) కవిత్వ తత్వ విచార విమర్శనం
   4) తెలుగులో కవితా విప్లవాల స్వరూపం
3. 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు' గ్రంథకర్త?
   1) వేదుల సుబ్రహ్మణ్యం
   2) ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం
   3) డా॥ జి.వి. కృష్ణారావు
   4) నాళం కృష్ణారావు

సమాధానాలు
1) 2; 2) 2; 3) 2.

మాదిరి ప్రశ్నలు

1. 'కప్పి ఉంచితే కవిత్వం/ విప్పి చెబితే విమర్శ' అని పేర్కొన్నవారు?
   1) ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం
   2) ఆచార్య ఎస్వీ. జోగారావు
   3) ఆచార్య సి. నారాయణరెడ్డి
   4) శేషేంద్రశర్మ
2. విమర్శ సూత్రాలతో కావ్యాన్ని సమన్వయించడం, సాహిత్యంలో ఆ గ్రంథ స్థానాన్ని నిర్ణయించడం అనే రెండు విధులను విమర్శ నిర్వర్తించాలన్న విమర్శకుడు?
   1) జాన్సన్ 2) హడ్సన్
   3) బెన్ జాన్సన్ 4) మాథ్యూ ఆర్నాల్డ్
3. 'సాహిత్యానికి ప్రామాణికమైన చక్కని పరిష్కారం విమర్శ' - అని చెప్పిన విమర్శకుడు?
   1) డ్రైడెన్ 2) సీన్స్
   3) మిల్టన్ 4) కోలిరాడ్జి
4. సహృదయ విమర్శకుడి లక్షణం?
   1) రాగద్వేషాలకు అతీతమైన హృదయం
   2) బహుముఖ ప్రజ్ఞ
   3) ఆకర్షణీయమైన భాషాశైలి
   4) అన్నీ
5. 'విగ్రహతంత్ర విమర్శనం' గ్రంథకర్త?
   1) కొక్కొండ వేంకటరత్నం పంతులు
   2) కందుకూరి వీరేశలింగం
   3) బుర్రా శేషగిరిరావు
   4) బసవరాజు అప్పారావు
6. అస్వతంత్ర విమర్శకు మరోపేరు?
   1) ప్రాచీన విమర్శ
   2) సంప్రదాయక విమర్శ
   3) ఆలంకారిక విమర్శ 4) అన్నీ
7. విశ్వవిద్యాలయాల పరిశోధనల్లో పాటించే విమర్శ పద్ధతి?
   1) స్వతంత్ర విమర్శ పద్ధతి
   2) ఆలంకారిక విమర్శ
   3) కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ
   4) మార్క్సిస్టు విమర్శ
8. 'కవిశబ్దం' వేదాల్లో ఈ విధంగా వాడారు?
   1) ఆలంకారికుడు 2) తపస్వి
   3) రుషి 4) పరమాత్మ

సమాధానాలు
1) 3; 2) 2; 3) 1; 4) 4;
5) 2; 6) 4; 7) 3; 8) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
మెంటల్ ఎబిలిటీ

క్యాలెండర్

క్యాలెండర్ చాప్టర్ నుంచి ప్రతి పోటీ పరీక్షలో 2 - 5 వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

గమనిక: ఈ చాప్టర్‌లోని ప్రశ్నలు సాధించాలంటే బేసి రోజులను గుర్తించడం తెలిస్తే చాలు.

బేసి దినాలు గుర్తించడం

క్యాలెండర్‌లో రెండు రకాల సంవత్సరాలుంటాయి.

- సాధారణ సంవత్సరంలో 365 రోజులు అంటే 52 వారాలు + 1 రోజు. ఆ మిగిలిన ఒక రోజునే 'బేసిదినం' అంటాం.
  గమనిక: ఆదివారం నుంచి శనివారం వరకు ఏడు రోజులు ఉంటాయి. కాబట్టి ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చిన శేషాన్ని 'బేసి దినాలు'గా గుర్తించాలి.
- లీపు సంవత్సరంలో 366 రోజులు అంటే 52 వారాలు + 2 బేసి దినాలు ఉంటాయి.
  గమనిక: లీపు సంవత్సరంలో ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.

లీపు సంవత్సరాన్ని గుర్తించడం

- ఇచ్చిన ఏడాదిలోని చివరి రెండు అంకెల(అంటే ఒకట్లు, పదుల స్థానం)ను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లేకపోతే సాధారణ సంవత్సరం.

శతాబ్దంలోని లీపు సంవత్సరం గుర్తించడం

- శతాబ్దాలన్నీ లీపు సంవత్సరాలు కావు. ఏదైనా ఒక శతాబ్దాన్ని 400 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం.
  ఉదా: 400, 800, 1200, 1600, 2000 లీపు సంవత్సరాలు. కానీ 500, 600, 1100, 1500, 1700, 1800, 1900 లీపు సంవత్సరాలు కావు.

శతాబ్దం చివరి రోజు వచ్చే వారాలను కనుక్కోవడం

- వంద సంవత్సరాల్లో ఐదు బేసిదినాలు ఉంటాయి. అంటే 76 సాధారణ సంవత్సరాలు + 24 లీపు సంవత్సరాలు ఉంటాయి.
  76×1 బేసిదినం + 24×2 బేసిదినాలు
  = 76+48 = 124 రోజులు.
  124 రోజులను 7తో భాగిస్తే 5 శేషం వస్తుంది. కాబట్టి 100 ఏళ్లలో ఐదు బేసి దినాలు ఉంటాయి. అంటే ఆ రోజు శుక్రవారం.
  200 ఏళ్లలో 5×2 = 10ని 7తో భాగిస్తే 3 బేసి దినాలు అంటే బుధవారం.
  300 సంవత్సరాల్లో 5×3=15ను 7తో భాగిస్తే 1 బేసిదినం అంటే సోమవారం. 400 సంవత్సరాల్లో 0 బేసిదినాలు అంటే ఆదివారం.
  శతాబ్దం చివరి రోజున శుక్రవారం, బుధవారం, సోమవారం, ఆదివారం వస్తాయి.

క్యాలెండర్ చాప్టర్ నుంచి ముఖ్యంగా అడిగే ప్రశ్నలు



- ఒక సంవత్సరం ఇచ్చినప్పుడు దానికి సమానమైన సంవత్సరం మళ్లీ ఎప్పుడు పునరావృతమవుతుంది.
- తేదీని ఇస్తే వారాన్ని, వారాన్ని ఇస్తే తేదీని కనుక్కోవడం.
- ఒక లీపు సంవత్సరం ఇచ్చినప్పుడు అలాంటి లీపు సంవత్సరం మళ్లీ ఎప్పుడొస్తుందో గుర్తించడం.
- ఒక సంవత్సరం, తేదీ, వారం ఇచ్చినప్పుడు, మరో ఏడాదిలో అదే తేదీ లేదా వారం ఎప్పుడొస్తుందో కనుక్కోవడం.

లీపు సంవత్సరంలో జనవరి, జూలై..
సాధారణ సంవత్సరంలో జనవరి అక్టోబర్ నెలలకు ఒకే విధమైన క్యాలెండర్ ఉంటుంది.
కింద ఇచ్చిన కోడ్స్ సహాయంతో క్యాలెండర్ సమస్యలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.
గమనిక: బేసి దినాలను కోడ్స్‌గా రాశాం.

శతాబ్దం - కోడ్

1600-1699→6	2000-2099→6
1700-1799→4	2100-2199→4
1800-1899→2	2200-2299→2
1900-1999→0	2300-2399→0

వారం - కోడ్

ఆదివారం - 0	గురువారం - 4
సోమవారం - 1	శుక్రవారం - 5
మంగళవారం - 2	శనివారం - 6
బుధవారం - 3	

నెల - కోడ్

జనవరి - 0	జూలై - 6
ఫిబ్రవరి - 3	ఆగష్టు - 2
మార్చి - 3	సెప్టెంబర్ - 5
ఏప్రిల్ - 6	అక్టోబర్ - 0
మే - 1	నవంబర్ - 3
జూన్ - 4	డిసెంబర్ - 5

వీటిని జ్ఞాపకం ఉంచుకోవడానికి టిప్స్

- శతాబ్దపు కోడ్‌లను గమనిస్తే 6, 4, 2, 0 పునరావృతం అవుతున్నాయి.
- నెలకోడ్‌లను 12 అంకెల మొబైల్ నెంబర్‌గా గుర్తుపెట్టుకోవాలి.
  అది 033 614, 625 035

ఒక తేదీ ఇచ్చి అది ఏ వారమో గుర్తించడానికి కోడ్

తేది + నెలకోడ్ + సంవత్సరం
+ లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్
ఉదా: 22-04-1984 ఏ వారం అవుతుంది?
సాధన: పైన ఇచ్చిన కోడ్ ప్రకారం అన్నింటిని కూడాలి.
22 + 6 + 84 + 21 + 0 = 133
133ను 7తో భాగిస్తే శేషం సున్నా.
అంటే కోడ్ ప్రకారం ఆదివారం అవుతుంది.
తేది = 22, ఏప్రిల్ నెలకోడ్ = 6,
సంవత్సరం = 84,
లీపు సంవత్సరాలు 84/4 = 21
శతాబ్దం కోడ్ = 0
అన్నింటిని కూడితే 133 వస్తుంది.

పై విధంగా ప్రాక్టీస్ చేస్తే తక్కువ సమయంలో కచ్చితత్వంతో సమాధానాన్ని గుర్తించగలం.

సమానమైన క్యాలెండర్‌ను గుర్తించడం

ఉదా:
1. 2003 లాంటి క్యాలెండర్ మళ్లీ ఏ సంవత్సరంలో పునరావృతం అవుతుంది? (ఎస్ఐ-2012)
   ఎ) 2006 బి) 2013
   సి) 2012 డి) 2014
   జవాబు (డి)

సాధన: ఇచ్చిన సంవత్సరం నుంచి బేసి దినాలను లెక్కిస్తూ పోతే ఎక్కడైతే బేసి దినాల మొత్తం 7 అవుతుందో అది సమానమైన క్యాలెండర్ అవుతుంది. ఒకవేళ బేసిదినాల మొత్తం 7 కాకపోతే 14 వరకు లెక్కించాలి.
2003-1, 2004-2
(లీపు సంవత్సరం)
2005-1, 2006-1
2007-1, 2008-2
(లీపు సంవత్సరం)
2007 వరకు బేసిదినాల మొత్తం = 6
2008 వరకు = 8
కాబట్టి 14 వచ్చే వరకు చూద్దాం.
2009-1 2010-1
2011-1 2012-2
2013-1
2013 వరకు బేసి దినాల మొత్తం = 14
కాబట్టి 2014 జవాబు అవుతుంది.
అంటే 2003 లాంటి క్యాలెండర్ 2014లో వస్తుంది.

తేలిక పద్ధతి:

కోడ్: 6 11 11
స్టెప్1: ముందుగా ఇచ్చిన సంవత్సరానికి ముందు, వెనుక లీపు సంవత్సరాలను గుర్తించాలి.

2000	2001	2002	2003	2004
	+	+	+	
	6	11	11	
			2014	

స్టెప్ 2: వాటికి మధ్య ఉన్న సంవత్సరాలకు 6, 11, 11లను కలిపితే వాటికి సమాన క్యాలెండర్ వస్తుంది.
స్టెప్ 3: మన ప్రశ్నలోని 2003కు 11ను కలిపితే 2014 సమాధానం వచ్చింది.
గమనిక: అడిగిన ప్రశ్నలోని సంవత్సరం లీపు సంవత్సరం అయితే + 28తో కూడాలి.
ఉదా: 2000 లాంటి లీపు సంవత్సరం 2028లో వస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. 12 ఫిబ్రవరి, 1991 ఏ వారం అవుతుంది?
   ఎ) సోమవారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) గురువారం
   సాధన: తేది + నెలకోడ్ + సం. + లీపు సం. + శతాబ్దం కోడ్‌ను ఉపయోగించాలి.
   12 + 3 + 91 + 22 + 0 = 128
   (91/4 = 22 లీపు సంవత్సరాలు)
   128ను 7తో భాగిస్తే శేషం 2.
   కాబట్టి మంగళవారం అవుతుంది.
2. కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?
   ఎ) 1500 బి) 1700 సి) 1800 డి) 1600
   సాధన: ఇచ్చినవన్నీ శతాబ్దాలు కాబట్టి శతాబ్దాన్ని 400తో భాగించాలి. అప్పుడు శేషం సున్నా వస్తే అది లీపు సంవత్సరం అవుతుంది.
   400)1600(4
   1600
   0
   శేషం సున్నా
   కాబట్టి 1600 మాత్రమే లీపు సంవత్సరం.
3. 1992లో మొదటిరోజు ఏ వారం?
   ఎ) మంగళవారం బి) బుధవారం
   సి) గురువారం డి) నిర్ణయించలేం
   సాధన:
   1992లో మొదటిరోజు అంటే జనవరి 1
   కోడ్ ప్రకారం
   1 + 0 + 92 + 23 + 0 = 116
   116ను 7 తో భాగిస్తే శేషం 4.
   అంటే గురువారం అవుతుంది.
4. మొదటి శతాబ్దంలోని జనవరి 1 ఏ రోజు అవుతుంది?
   ఎ) మంగళవారం బి) సోమవారం
   సి) బుధవారం డి) గురువారం
   సాధన: క్యాలెండర్‌లోని మొత్తం సమస్యలు, కోడ్‌లు వీటన్నింటినీ 1 - జనవరి - 01 సంవత్సరం సోమవారం నుంచి మొదలైనట్లుగానే తీసుకున్నారు.
   గమనిక: క్యాలెండర్‌లో మొదటి ఆదివారం 7వ తేది అవుతుంది.
   కాబట్టి 1 - జనవరి - 01న సోమవారం అవుతుంది.
   కోడ్ ప్రకారం తేదీ + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్
   1 + 0 + 1 + 0 + 6 = 8
   8ను 7తో భాగిస్తే శేషం 1.
   అంటే సోమవారం అవుతుంది.
5. ఒక సంవత్సరంలో ఎన్ని నెలలు సమాన క్యాలెండర్ కలిగి ఉంటాయి?
   ఎ) జనవరి, జూన్ బి) జనవరి, ఏప్రిల్
   సి) జనవరి, మార్చి డి) నిర్ణయించలేం
   సాధన: జవాబు నిర్ణయించలేం (డి)
   ఎందుకంటే ఒక సంవత్సరం అని అడిగారు. కానీ అది సాధారణ సంవత్సరమా లీపు సంవత్సరమా ఇవ్వలేదు.
6. 11 - జనవరి - 1996 రోజు ఏ వారం అవుతుంది?
   ఎ) బుధవారం బి) గురువారం
   సి) శుక్రవారం డి) శనివారం
   సాధన: కోడ్ ప్రకారం
   11 + 0 + 96 + 24 + 0 = 131
   131ను 7తో భాగిస్తే శేషం 5 అంటే శుక్రవారం.
   కానీ ఇచ్చిన ప్రశ్నలో 1996 లీపు సంవత్సరం. 1996లో జనవరి నెలలోని తేది అడిగారు. ఇది మార్చి నెలకు ముందు కాబట్టి 131-1 = 130ను 7తో భాగించాలి.
   అప్పుడు శేషం = 4 అంటే గురువారం అవుతుంది.
   శుక్రవారం అనేది తప్పు జవాబు.
   గమనిక: ఇచ్చిన ప్రశ్న లీపు సంవత్సరంలోని జనవరి లేదా ఫిబ్రవరిలో ఉంటే బేసిదినాల నుంచి 1ని తీసివేసి మిగిలిన దినాలను 7తో భాగించాలి.
7. 1 మార్చి 1996 రోజు ఏ వారం?
   సాధన:
   1 + 3 + 96 + 24 + 0 = 124
   124ను 7తో భాగిస్తే 5 శేషం అంటే శుక్రవారం 1996 లీపు సంవత్సరం అయినప్పటికీ బేసి దినాల నుంచి '1' తీసివేయలేదు. ఎందుకంటే కనుక్కోవాల్సింది మార్చి నెలలోని తేది.
   ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. కాబట్టి జనవరి, ఫిబ్రవరిలో అడిగిన ప్రశ్నకు బేసి దినాల నుంచి '1' తీసివేయాలి.
8. 2001 జనవరి 1 సోమవారం అయితే ఈ సంవత్సరంలో చివరిరోజు ఏ వారం?
   ఎ) సోమవారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) గురువారం
   సాధన: 2001 సాధారణ సంవత్సరం
   = 52 వారాలు + 1 బేసి దినం కాబట్టి సోమవారమే అవుతుంది.
9. మన మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?
   ఎ) శుక్రవారం బి) శనివారం
   సి) గురువారం డి) మంగళవారం
   సాధన:
   మన మొదటి రిపబ్లిక్ డే 26 జనవరి 1950
   కోడ్ ప్రకారం 26 + 0 + 50 + 12 + 0 = 88
   88ను 7తో భాగిస్తే శేషం 4 వస్తుంది.
   అంటే గురువారం అవుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఒకవేళ జనవరి 1, 2007 సోమవారం అయితే జనవరి 1, 2008 ఏ రోజు అవుతుంది? (గ్రూప్-2, 2008)
   ఎ) ఆదివారం బి) సోమవారం
   సి) బుధవారం డి) మంగళవారం
   సమాధానం: డి
2. భారత స్వాతంత్ర్య దినోత్సవం 1996లో శుక్రవారం అయితే 2000 సంవత్సరంలో ఏ వారం అవుతుంది? (వీఆర్‌వో-2012)
   ఎ) బుధవారం బి) గురువారం
   సి) శుక్రవారం డి) శనివారం
   సమాధానం: ఎ

Although it might be possible



BANK EXAMS
GENERAL ENGLISH

Model Questions

Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. This chapter briefly survey (1)/ the current (2)/ state of (3)/ European politics. (4) No error (5)
2. We surveyed 3000 smokers (1)/ and find that over (2)/ three quarters (3)/ would like to give up. (4) No error (5)
3. The police officer (1)/ was suspended (2)/ while the complaint (3)/ was investigating. (4) No error (5)
4. A number of doctors (1)/ came under (2)/ suspicion of (3)/ unethical behaviors. (4) No error (5)
5. Our staff will done (1)/ their best to make (2)/ sure you (3)/ enjoy your visit. (4) No error (5)
6. She longed to find somebody (1)/ who understand her problems, (2)/ and in him (3)/ she had found such a person. (4) No error (5)
7. Her version of events (1)/ is subtly different (2)/ for what (3)/ actually happened. (4) No error (5)
8. I tried to discuss it (1)/ with her but succeeded only (2)/ in making (3)/ her angry. (4) No error (5)
9. He's been hit (1)/ by a succession (2)/ of injuries (3)/ from he joined the team. (4) No error (5)
10. Development (1)/ on this issue (2)/ will be dealing within (3)/ a subsequent report. (4) No error (5)

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. He suffered a _____ defeat in the election.
    1) thunder 2) applaud
    3) stunning 4) super
    5) blast
12. The new manager has strengthened the _____ by bringing in several _____ players.
    1) coach; youngest
    2) players; young
    3) match; youth
    4) team; promise
    5) side; younger
13. The author _____ the different strands of the plot together in the _____ chapter.
    1) knits; late
    2) stitch; conclusion
    3) draws; final
    4) put; terminal 5) makes; end
14. I wanted to _____ in India on the way to Australia.
    1) steps 2) stop of
    3) stop over 4) stop on
    5) stop out
15. I have lost my key and I haven't got a _____
    1) space 2) room
    3) place 4) spare
    5) scope

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. Dry ice was manufactured in 1925.
B. Since it evaporates instead of melting, it is cleaner to use.
C. Dry ice is made by freezing a gas called carbon dioxide.
D. Can you imagine ice that does not melt and is not wet? Then you can imagine dry ice.
E. It is more practical than ordinary ice because it takes up less space and is 142 degrees colder.
F. Dry ice is quite different from ordinary ice, which is simply frozen water.

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) F
20. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F

Directions (Q. No. 21-25): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. This smart washing machine will dispense an <u>larger part</u> of water for the load.
    1) great load
    2) maximum portion
    3) optimal amount 4) major part
    5) No correction required
22. How many countries have <u>signing</u> to the Kyoto protocol on climate change?
    1) sign for 2) signed up
    3) signed for 4) signed at
    5) No correction required
23. This mark <u>is signifying</u> that the products conform to an approved standard.
    1) was signifying
    2) is significant 3) signifies 4) significantly
    5) No correction required
24. More than 70,000 shopkeepers have been forced to <u>put upon</u> the shutter in the past year.
    1) put on 2) put of 3) put in
    4) put up
    5) No correction required
25. The movie <u>is now shown</u> at all major movie theatres.
    1) is showing
    2) is being showing
    3) is now showing
    4) was showing
    5) No correction required

Directions (Q. No. 26-35): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Over one hundred years ago, the news that gold _______ (26) discovered in California electrified the ______ (27) nation. Immediately, thousands of men ______ (28) West with but one concern- to get to California before the next fellow. Everyone was ______ (29) that he would find gold and become ______ (30). ______ (31) did the travelers know about the hardships and inconveniences they would have to _______ (32): desert heat, mountain cold, miles of mud, raging rivers. ______ (33), they would be menaced by hostile Indians, ferocious beasts, starvation and disease. How many people _______ (34) in the gold rush nobody knows; what is known is that thousands of the more self-reliant travelers did get to their ______ (35), did find gold, and did become wealthy. In five years, the population of California rose from 5000 to 100000.

26. 1) had been 2) has been
    3) have been 4) will be
    5) would be
27. 1) complete 2) entire
    3) pure 4) colossal 5) absolute
28. 1) run 2) flow 3) rushed
    4) flown 5) fly
29. 1) secure 2) in no doubt
    3) unsure 4) confident 5) safe
30. 1) well 2) rolling
    3) steep 4) flush 5) wealthy
31. 1) Little 2) Few 3) Many
    4) Much 5) Modest
32. 1) continue 2) endure
    3) last 4) carry 5) go
33. 1) Also 2) Beside
    3) Besides 4) Above
    5) Beyond
34. 1) die 2) dye 3) dying
    4) died 5) will die
35. 1) end 2) target 3) purpose
    4) intention 5) destination

Directions (Q. No. 36-45): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Sedimentation is the tendency for particles in suspension to settle out of the fluid in which they are entrained, and come to rest against a barrier. This is due to their ____ (36) through the fluid in response to the forces acting on them: these forces can be ____ (37) to gravity, centrifugal acceleration or electromagnetism. In geology sedimentation is ____ (38) used as the polar opposite of erosion, i.e., the terminal end of sediment transport. In that _____ (39) it includes the termination of transport by saltation or true bed load transport. Settling is the falling of suspended particles through the liquid, whereas sedimentation is the ____ (40) of the settling process.

Sedimentation _____ (41) pertain to objects of various sizes, ranging from large rocks in flowing water to suspensions of dust and pollen particles to cellular suspensions to solutions of single molecules such _____ (42) proteins and peptides. Even ___ (43) molecules supply a sufficiently strong force to produce significant sedimentation.

The term is typically used in geology, to describe the deposition of sediment which ____ (44) in the formation of sedimentary rock, and in various chemical and environmental fields to describe the motions _____ (45) often-smaller particles and molecules.

36. 1) motion 2) proposal
    3) suggestion 4) submission
    5) imply
37. 1) for 2) due 3) from
    4) according 5) along

Key

1) 1; 2) 2; 3) 4; 4) 4; 5) 1; 6) 2; 7) 3; 8) 2; 9) 4; 10) 3; 11) 3; 12) 5; 13) 3; 14) 3; 15) 1; 16) 2; 17) 4; 18) 1; 19) 4; 20) 3; 21) 3; 22) 2; 23) 3; 24) 4; 25) 3; 26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5; 31) 1; 32) 2; 33) 3; 34) 4; 35) 5; 36) 1; 37) 2;